www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం | 24-3-2018 పేజీలు: 20 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 253 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 10.06 తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర మ. 3.42 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా. 11.38-1.09; దుర్ముహూర్తం: ఉ. 6.20-7.57; అమృతఘడియలు: ఉ. 7.22-8.53, తె. 4.55 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.24 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

జూ. ప్రపంచకప్‌లో వివాన్‌కు రెండు పతకాలు



సిడ్నీ: భారత జూనియర్ షూటర్ వివాన్ కపూర్ ప్రపంచ కప్‌లో అదరగొట్టాడు. సిడ్నీలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో వ్యక్తిగత ట్రాప్, టీమ్ ఈవెంట్‌లోనూ సత్తాచాటి రెండు కాంస్యాలు సాధించాడు. వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో వివాన్ 40 పాయింట్లకు 30 స్కోరు చేసి కాంస్యం అందుకున్నాడు. పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో వివాన్, లక్షయ్, అలీ అమాన్ ఎలాహితో కూడిన భారత జట్టు మూడోస్థానం దక్కించుకొంది.




ఆసియా బిలియర్డ్స్ ఫైనల్లో పంకజ్

యాంగాన్ (మయన్మార్): భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీ మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. ఆసియా బిలియర్డ్స్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పంకజ్.. ఫేవరెట్ హోదాకు న్యాయం చేస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 5-1 స్కోరు తేడాతో భారత్‌కే చెందిన ధ్వజ్ హారియాపై విజయం సాధించాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో స్థానిక ఫేవరెట్ ఆంగ్ తేను 5-1తో చిత్తుచేసి పంకజ్ సెమీస్ చేరాడు. మహిళల విభాగంలో భారత్‌కు చెందిన కీరత్ భండాల్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. సెమీస్‌లో కీరత్ 0-3తో థాయ్‌లాండ్ క్రీడాకారిణి సిరిపరన్ నునత్‌కమాజన్ చేతిలో ఓడిపోయింది.

దీపిక, కోహ్లి నటించడం 'కుదరదు'

రూ.11 కోట్ల డీల్‌ను వదులుకున్న ఆర్‌సీబీ





ముంబై: క్రికెట్ సెన్సేషన్ విరాట్ కోహ్లి.. బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకోన్ కలిసి ఓ యాడ్‌లో కనిపిస్తే చూడాలని ఎవరనుకోరు? ఐపీఎల్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కూడా ఇదేవిధంగా భావించి ఓ ప్రకటన షూట్ చేయాలని అనుకుంది. కానీ అలా జరిగే అవకాశం లేదని తర్వాత తేలడంతో ఆ భారీ డీల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది.. ఐపీఎల్‌కు ముందు ప్రముఖ ట్రావెలింగ్ సంస్థ గోఐబీబో.కామ్‌తో ఒప్పందానికి ఆర్‌సీబీ సంప్రదింపులు జరిపింది. దీనికి తగ్గట్టుగా ఆ సంస్థ అంబాసిడర్‌గా ఉన్న దీపికా పదుకోన్, కోహ్లి మధ్య ఓ యాడ్ షూట్ చేద్దామని కూడా అనుకున్నారు. అయితే కోహ్లి, ఆర్‌సీబీ మధ్య ఉన్న కాంట్రాక్ట్ ఇందుకు అడ్డు తగిలింది. ఇతర సెలెబ్రిటీలతో కలిసి అతడు వ్యాపార ప్రకటనల్లో కనిపించకూడదనేది ఆ నియమం. దీంతో ఈ నిబంధన వారికే బెడిసికొట్టడంతో రూ.11 కోట్ల విలువైన స్పాన్సర్‌షిప్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అయితే దీపికాతో కలిసి నటించనని కోహ్లి చెప్పినట్టు కథనాలు వెలువడ్డాయి.

నేను సంతకం చేయను..

ప్రియా గుప్తా నియామకంపై అమితాబ్ చౌధరి



న్యూఢిల్లీ: పరిపాలకుల కమిటీ (సీఓఏ), బీసీసీఐ మధ్య మరోసారి వివాదం రాజుకునేలా కనిపిస్తోంది. నూతన జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)గా ప్రియాగుప్తా నియామకంపై బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌధురి అభ్యంతరం వ్యక్తం చేస్తుండడమే దీనికి కారణం. ఆమె అపాయింట్‌మెంట్ లెటర్‌పై సంతకం పెట్టేది లేదని ఆయన తేల్చి చెప్పాడు. గతంలో ఓ పత్రికలో పనిచేసినప్పుడు బాలీవుడ్ నటి దీపికా పదుకోన్‌పై ప్రియా అసభ్యకరంగా కథనాన్ని రాసిందని ఆయన గుర్తు చేశాడు. అలాగే ఇంతటి అత్యున్నత పదవిని నిర్వహించే సామర్థ్యం ఆమెకు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. అసలు బీసీసీఐలాంటి పాపులర్ సంస్థకు మార్కెటింగ్ పదవి అవసరమా? అని కూడా ఆయన ప్రశ్నించాడు. ఈమేరకు బోర్డు సీఈవో రాహుల్ జోహ్రి, సీఓఏ, ఇతర బీసీసీఐ అధికారులకు ఈమెయిల్ పంపాడు. జస్టిస్ లోధా ప్యానెల్ కూడా ఈ పదవిని ప్రతిపాదించలేదని తెలిపాడు ఏడాదికి రూ.1.65 కోట్ల వేతనంతో ఆమెను సీఓఏ నియమించగా ప్రొటోకాల్ ప్రకారం అపాయింట్‌మెంట్ లేఖలపై కార్యదర్శి సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే గత వారం సీఓఏ విడుదల చేసిన మార్గదర్శకాలతో గుప్తా నియామకంపై సీఈవో జోహ్రి, లేక జీఎం (క్రికెట్ ఆపరేషన్స్) సాబా కరీంలలో ఒకరు సంతకం చేసినా సరిపోతుంది. 2014లో దీపికా 'క్లీవేజ్ షో' గురించి టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రియా గుప్తా రాసిన ఆర్టికల్ సంచలనం సృష్టించింది. దీనికి దీపికా కూడా అప్పట్లో ఘాటుగానే బదులిచ్చింది. 'మహిళను కాబట్టే తనకు వక్షోజాలు ఉన్నాయని, నీకేమైనా సమస్యా? సినిమాల్లో పాత్రను బట్టి మేం నటిస్తాం' అంటూ కౌంటరిచ్చింది. దీనికి బదులుగా దీపికా ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టే వస్త్రధారణ చేస్తుందని ప్రియా గుప్తా మరో కథనం రాసింది.



వీర్‌ధవళ్ ఖడే

ఈతలో మోతెక్కిస్తాడా!

గత వైభవానికి తహతహ • 'కామన్వెల్త్' తొలిమెట్టు అంటున్న స్విమ్మర్ ఖడే

యుక్త వయస్సులో అంతర్జాతీయ ఖ్యాతి..దానితోపాటు లభించే ఆర్థిక ప్రయోజనాలతో ఒక్కసారిగా మారే జీవితం..వీటన్నింటికీ పొంగిపోకుండా ఆటపైనే మనసు నిలిపి కెరీర్‌లో మరింత దూసుకుపోయేవారు కొందరైతే..ఆ పేరు ప్రతిష్ఠలతో వచ్చే సౌకర్యాలను అనుభవిస్తూ కెరీర్‌ను విస్మరించేవారు మరికొందరు. రెండో కోవకు చెందినవాడు స్విమ్మర్ వీర్‌ధవళ్ ఖడే.16 ఏళ్ల ప్రాయంలోనే ఒలింపిక్స్‌లో తలపడి ఆపై లభించిన విజయాలతో గర్వం తలకెక్కి కెరీర్‌లో వెనుకపడి.. తర్వాత తప్పుతెలుసుకొని ఇప్పుడు కామన్వెల్త్ క్రీడలతో పునర్ వైభవానికి తహతహలాడుతున్నాడు ఈ స్విమ్మర్.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వీర్‌ధవళ్ ఖడే.. 16 ఏళ్ల వయస్సులో 2008 బీజింగ్ ఒలింపిక్స్ బరిలోకి దిగినప్పుడు దేశం దృష్టంతా అతడిపై నిలిచింది. అత్యంత పిన్నవయస్సులో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత స్విమ్మర్‌గా అతడు రికార్డు నెలకొల్పడమే దానికి కారణం. ఆ విశ్వక్రీడల్లో పురుషుల 50మీ., 100 మీ., 200 మీ. ఫ్రీస్టయిల్‌లో తలపడిన ధవళ్.. 100 మీ.లలో జాతీయ రికార్డు బద్ధలుగొట్టి ఔరా అనిపించాడు. అయితే ఆ మూడు ఈవెంట్లలో అతడు సెమీఫైనల్స్‌కు కూడా అర్హత సాధించలేదనుకోండి! ఇకపోతే ఖడే ఇటీవల సింగపూర్ జాతీయ వయో పరిమిత స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నప్పుడు సింగపూర్, ఇండోనేసియా స్విమ్మర్లు అతడిని కోచ్‌గా భావించారు. కారణం.. 2010 ఆసియా క్రీడల తర్వాత ధవళ్ కొన్ని ఏళ్లపాటు అంతర్జాతీయ పోటీల్లో తలపడకపోవడమే. అందువల్ల పలువురు అంతర్జాతీయ స్వి మ్మర్లకు అతడెవరో తెలియకపోవడంలో వింతేమీ లేదు. 'గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు నన్ను నేను పరీక్షించుకోవడానికి సింగపూర్ పోటీల్లో పాల్గొన్నా. అక్కడ రెండు పతకాలు గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది' అని ధవళ్ చెప్పాడు.

ఆసియాడ్ కాంస్యంతో సత్తా..

బీజింగ్ ఒలింపిక్స్‌తో ఒక్కసారి వెలుగులోకి వచ్చిన ధవళ్..ఆ తర్వాత రెండు సంవత్సరాలకు గ్వాంగ్ ఝౌ (చైనా)లో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్య పతకంతో సత్తా చాటాడు. ఆపై అతడి ప్రతిభ మసకబారడంతో 2012 ఒలింపిక్స్, 2014 కామన్వెల్త్, 2016 రియో ఒలింపిక్స్‌ను మిస్సయ్యాడు. 'నాకు ఎదురైన అనుభవాలు మరే భారత స్విమ్మర్‌కు ఎదురైఉండవు. 2008 ఒలింపిక్స్ క్వాలిఫై అయినప్పటి క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తు. ఓ స్విమ్మర్‌కు కావాల్సిన ఆహారం సమకూర్చుకోలేని దయనీయస్థితిలో ఉన్నా. బిస్కెట్లతో కడుపు నింపుకొని పోటీలు గెలిచిన సందర్భాలున్నాయి. వాటన్నింటినీ మనోధైర్యంతో ఎదుర్కొని సత్తా చాటా. ఒలింపిక్స్ తర్వాత పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఇక 2010 ఆసియాడ్‌లో పతకం గెలవడంతో పరిస్థితి బాగా మెరుగైంది. ఆ తర్వాత ఏడాదికి అర్జున అవార్డు కూడా లభించింది' వీర్‌ధవళ్ వివరించాడు.

విజయ 'గర్వం'..

ఆ తర్వాత ఖడే కెరీర్‌లో తిరోగమనం ప్రారంభమైంది. అందుకు విజయగర్వమే కారణమని చెప్పాడు. '2010 నుంచి 2017 వరకూ నా ప్రతిభ దిగజారింది. కొద్దిపాటి విజయాలు దక్కగానే కొందరికి గర్వం తలకెక్కుతుంది. నాకూ అదే జరిగింది' అని అంగీకరించాడు. అతడి ప్రతిభకు మెచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం ఖడేకు తహసీల్దార్ ఉద్యోగం ఇచ్చింది. ఆ ఉద్యోగ బాధ్యతలు కూడా తాను కెరీర్ నుంచి దృష్టి మళ్లించడానికి కారణమయ్యాయని వివరించాడు. 'పని ఒత్తిడి బాగా ఉండేది. దాంతో ఉదయాన్నే లేచి స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కు వెళ్లలేకపోయా. ఫలితంగా 20 కేజీల బరువు పెరిగా. అలా కెరీర్‌లో వెనుకబడ్డా' అని ధవళ్ వివరించాడు. '2010 ఆసియాడ్‌లో కాంస్య నెగ్గాక తదుపరి ఆసియా గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలవాలని లక్ష్యంగా పెట్టుకొన్నా. కానీ అది జరగలేదు. 2014లో ఎన్నికల విధులతో తీరకలేకుండా గడపాల్సి వచ్చింది' అని వివరించాడు. ఇక తన స్విమ్మింగ్ కెరీర్ ముగిసిందని ఖడే భావిస్తున్న తరుణంలో అతడికి ముంబై బదిలీ అయింది. దాంతో మళ్లీ కెరీర్ కొనసాగించాలని నిర్ణయించుకొన్నాడు. 'ముంబై వెళ్లాక రోజుకు రెండుసార్లు ఆరు గంటలపాటు స్విమ్మింగ్ సాధన చేయడంతోపాటు జిమ్‌లో రెండు గంటలు తీవ్రంగా కష్టించా. ఫలితంగా నా శరీరాకృతి మునుపటి స్థాయికి వచ్చింది. అలా మళ్లీ కెరీర్ దారిలో పడింది' అని ఖడే వెల్లడించాడు. కెరీర్ తిరిగి గాడినపడుతున్న తరుణంలో కుటుంబంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. తండ్రి మరణించడంతో ఖడే విషాదంలో మునిగిపోయాడు. 'నన్ను ఓ క్రీడాకారుడిగా చూడాలనుకున్న తపనతో ఐదేళ్ల వయస్సప్పుడు స్విమ్మింగ్‌లో చేర్పించారు. కెరీర్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు ఎంతో బాధపడ్డారు. స్విమ్మర్‌గా నేను మళ్లీ పేరు ప్రఖ్యాతులు గడించాలని భావించారు' అని ధవళ్ వేదనతో చెప్పాడు. ఇక.. గోల్డ్‌కోస్ట్‌లో 50 మీ., ఫ్రీస్టయిల్, 50మీ., బటర్‌ఫ్లైలో బరిలోకి దిగుతున్న వీర్..అక్కడ తన అవకాశాలపై వాస్తవ దృక్పథంతో ఉన్నాడు. పోటీ చాలా తీవ్రంగా ఉన్నా తన శక్తిమేర రాణిస్తానన్నాడు.



ఇంగ్లండ్ ఘన విజయం

• ఆసీస్ చిత్తు • టీ20 ముక్కోణపు సిరీస్




నటాలి

ముంబై: మహిళల టీ20 ముక్కోణపు సిరీస్‌లో ఇంగ్లండ్ గ్రాండ్‌గా బోణీ చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. నటాలి స్కివర్ (68), టామీ బ్యూమంట్ (58) అజేయ అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఆసీస్ నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ మరో 18 బంతులు మిగిలుండగానే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. కెప్టెన్ రేచల్ హేన్స్ (65) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఓపెనర్ అలెస్సా హీలే (31), గార్డెనర్ (21) సహకారం అందించారు. ఇంగ్లండ్ బౌలర్లు జెన్నీ గన్ (3/26) మూడు వికెట్లు పడగొట్టగా.. నటాలి స్కివర్ (2/29)కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో ఓపెనర్లు డానియల్ వయాట్ (18), బ్రయోని స్మిత్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన బ్యూమంట్, స్కివర్ ధాటిగా ఆడడంతో ఇంగ్లండ్ గెలుపు దిశగా సాగింది. వీరు 3 వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదు నమోదు చేశారు.

వణికించిన బౌలర్లు

ఆస్ట్రేలియా 245/9 | మధ్యాహ్నం 2 గం. నుంచి సోనీ సిక్స్‌లో


మోర్కెల్ (4/87)

కేప్‌టౌన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో దక్షిణాఫ్రికా బౌలర్లు ఆధిక్యం ప్రదర్శించారు. మోర్నీ మోర్కెల్ (4/87), రబాడ (3/81) చెలరేగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 9 వికెట్లకు 245 పరుగులు చేసింది. ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ (77) ఆరంభంలో రాణించగా చివర్లో లియోన్ (47) పోరాడాడు. ఫిలాండర్‌కు రెండు వికెట్లు దక్కాయి. మోర్కెల్ తన కెరీర్‌లో 300 వికెట్లు పడగొట్టిన ఐదో ప్రొటీస్ బౌలర్‌గా నిలిచాడు. అంతకుముందు సఫారీ జట్టు 97.5 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయ్యింది. టెస్టుల్లో.. ఓపెనర్ ఎల్గర్ (141 నాటౌట్) అజేయంగా నిలవడం ఇది మూడోసారి. దీంతో డెస్మండ్ హేన్స్ (విండీస్) రికార్డును సమం చేశాడు. అలాగే ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఐదు క్యాచ్‌లు అందుకోవడంతో వికెట్ కీపర్ కాకుండా ఓ ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అతడికంటే ముందు పది మంది కూడా ఐదు క్యాచ్‌లు అందుకున్నారు.



వార్నర్‌పై ప్రేక్షకుడి దుర్భాషలు..

కేప్‌టౌన్: క్వింటన్ డికాక్‌తో ఘర్షణ తర్వాత దక్షిణాఫ్రికాలో ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ టార్గెట్‌గా మారాడు. మూడో టెస్టు సందర్భంగా ఓ ప్రేక్షకుడు.. వెంటపడి మరీ వార్నర్‌ను దుర్భాషలాడాడు. రబాడ బౌలింగ్‌లో వరుసగా 4,4,6,4 బాదిన తర్వాత వార్నర్ అవుటై డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తుండగా.. అతడిని వెంబడించిన ఆ ప్రేక్షకుడు మెట్లు ఎక్కుతుండగా ఫెన్సింగ్ అవతల నుంచి వార్నర్‌ను పిలిచి తిట్లు లంకించుకున్నాడు. దీంతో ఆగ్రహించిన వార్నర్ కూడా అతడితో గొడవకు దిగాడు. పరిస్థితి గమనించిన భద్రతాధికారులు వెంటనే అక్కడకు చేరుకుని ఆ ప్రేక్షకుడిని అదుపులోకి తీసుకున్నారు. డర్బన్‌లో జరిగిన టెస్టులో సౌతాఫ్రికా కీపర్ క్వింటన్ డికాక్, వార్నర్ మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే.

విలియమ్సన్ రికార్డు శతకం

న్యూజిలాండ్ 229/4 | ఉ. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ -1లో


విలియమ్సన్ (102)

ఆక్లాండ్: కెప్టెన్ కేన్ విలియమ్సన్ (220 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 102) న్యూజిలాండ్ తరపున చరిత్ర సృష్టించాడు. అత్యధిక సెంచరీలు (18) సాధించిన తొలి బ్యాట్స్‌మన్‌గా నిలుస్తూ.. తను మార్టిన్ క్రో, రాస్ టేలర్‌లను అధిగమించాడు. అయితే ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ డే అండ్ నైట్ టెస్టుకు రెండో రోజు ఆటకు వర్షంతో అంతరాయం కలిగింది. దీంతో 23.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట ముగిసే సమయానికి కివీస్ 92.1 ఓవర్లలో నాలుగు వికెట్లకు 229 పరుగులు చేసింది. విలియమ్సన్ సెంచరీ కాగానే వర్షం గంటసేపు అంతరాయం కలిగించింది. ఆ తర్వాత అతను వెంటనే అవుట్ కాగా రెండోసారి కూడా భారీ వర్షంతో ఆటంకం ఏర్పడింది. నాలుగు గంటల అనంతరం అంపైర్లు ఆటను రద్దు చేశారు. నికోల్స్ (49 బ్యాటింగ్), వాట్లింగ్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అండర్సన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఆతిథ్య జట్టు 171 పరుగుల ఆధిక్యంలో ఉంది.

సన్‌రైజర్స్ ఆన్‌లైన్ టిక్కెట్ల అమ్మకం షురూ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మ్యాచ్‌ల ఆన్‌లైన్ టిక్కెట్ల అమ్మకం శుక్రవారం మొదలైంది. ముందస్తుగా కొనుగోలు చేయాలనుకున్నవారు తమ వెబ్‌సైట్ www.sunrisershyderabad.inకు వెళ్లి నచ్చిన మ్యాచ్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చంటూ సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ట్విట్టర్‌లో ప్రకటించింది. సన్‌రైజర్స్ తమ తొలిమ్యాచ్‌ను ఉప్పల్ వేదికగా ఏప్రిల్ 9న రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. టిక్కెట్ కనీస ధర రూ. 500 కాగా, గరిష్ఠంగా రూ. 3,906 నిర్ణయించారు. మిగతా స్టాండ్స్ టిక్కెట్ల ధరలు రూ. 781, రూ. 976, రూ. 1,171, రూ. 2,734, రూ. 3,906తో అందుబాటులో ఉన్నాయి.



కామన్వెల్త్ నుంచి సౌమ్యజిత్ అవుట్

న్యూఢిల్లీ: అత్యాచార కేసు ఎదుర్కొంటున్న టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సౌమ్యజిత్ ఘోష్‌ను కామన్వెల్త్ బృందం నుంచి తప్పించారు. అతడిపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేశారు. 'సౌమ్యజిత్‌పై తాత్కాలిక సస్పెన్షన్ విధించాం. పోలీసు దర్యాప్తు, కోర్టు తీర్పు తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామ'ని భారత టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (టీటీఎఫ్ఐ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

సౌత్‌జోన్ మహిళల

చాంపియన్ ఆంధ్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సౌత్‌జోన్ అంతర్‌రాష్ట్ర మహిళల అండర్-23 టీ20 లీగ్‌లో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. ఆంధ్ర 20 పాయింట్లతో టాపర్‌గా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కేరళ (16 పాయింట్లు) రన్నరప్ ట్రోఫీ దక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 33 రన్స్‌తో గోవాపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. ఝాన్సీ లక్ష్మి 43, పద్మజ 20 పరుగులతో రాణించారు. అనంతరం గోవా 17.5 ఓవర్లలో 77 రన్స్‌కే కుప్పకూలింది. సంజులా నాయక్ (30) టాప్ స్కోరర్. పద్మజ 3 వికెట్లు పడగొట్టింది. కాగా, మరో మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్లతో తమిళనాడుపై నెగ్గింది. తొలుత రచన (3/6), శ్రావణి (3/9) దెబ్బకు.. తమిళనాడు 19.5 ఓవర్లలో 57 రన్స్‌కే ఆలౌటైంది. అనూష (30) రాణించింది. తర్వాత త్రిష (22), మహేశ్వరి (21 బంతుల్లో ఫోర్‌తో 19 నాటౌట్) రాణించడంతో హైదరాబాద్ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అలవోకగా గెలిచింది. మరో మ్యాచ్‌లో కేరళ 5 వికెట్లతో కర్ణాటకను ఓడించింది. కర్ణాటక 82/7 స్కోరు చేయగా.. కేరళ 16 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి గెలుపు వాకిట నిలిచింది.

వరల్డ్‌కప్‌కు అఫ్ఘాన్ క్వాలిఫై



హరారే : అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రంలో ఎన్నో సంచనాలు సృష్టించిన ఆఫ్ఘానిస్థాన్ మరోసారి సత్తా చాటింది. ఐసీసీ క్వాలిఫయింగ్ టోర్నీ ఆఖరి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఐదు వికెట్లతో ఐర్లాండ్‌ను ఓడించి వన్డే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. వాస్తవంగా... అఫ్ఘాన్ ప్రపంచకప్‌కు క్వాలిఫై కావడం అద్భుతమనే చెప్పాలి. గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌ల్లో ఒక్క దానిలోనూ గెలవని అఫ్ఘానిస్థాన్ సున్నా పాయింట్లతో సూపర్ సిక్స్‌లో ప్రవేశించింది. అయితే, సూపర్ సిక్స్‌లో విండీస్, ఐర్లాండ్, జింబాబ్వేపై విజయం సాధించడంతోపాటు ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా అఫ్ఘాన్ జట్టు వరల్డ్ కప్ కలను సాకారం చేశాయి. శుక్రవారం ఐర్లండ్‌తో మ్యాచ్‌లో షహజాద్ (54) ధాటి బ్యాటింగ్‌కు గుల్బదిన్ నయీబ్ (45), అస్ఘర్ (39 నాటౌట్) సమయోచిత ఇన్నింగ్స్ తోడవడంతో 210 లక్ష్యాన్ని ఆ జట్టు సునాయాసంగా ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్..ఓవర్లలో 7 వికెట్లకు 209 రన్స్ చేసింది.

పాపం జింబాబ్వే..

జింబాబ్వే జట్టు 1979 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌నకు దూరమైంది. వర్షం బారిన పడిన గురువారంనాటి సూపర్ సిక్స్ మ్యాచ్ చివరి ఓవర్ వరకూ ఉత్కంఠ భరితంగా సాగింది. అయితే యూఏఈ మూడు పరుగుల (డక్‌వర్త్ లూయిస్ నిబంధనతో) తేడాతో ఆతిథ్య జింబాబ్వేను కంగుతినిపించింది.



www.andhrajyothy.com

నిజామాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి



శనివారం | 24-3-2018 | పేజీలు: 20 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 253 |

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

ఇక కాంగ్రెస్ అవిశ్వాసం

- 27న చేపట్టాలని మల్లికార్జున్ ఖర్గే నోటీసు
- టీడీపీ, వైసీపీలో కలిస్తే మొత్తం 73 మంది
- లోక్‌సభ అవిశ్వాసం చేపట్టక తప్పదు
- ఆరో రోజూ టీడీపీ తీర్మానం బుట్టదాఖలు
- సభలో టీఆర్ఎస్, అన్నాడీఎంకే నిరసనలు
- మద్దతిచ్చే వారిని లెక్కించలేనన్న స్పీకర్


రాజ్యసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్య వేదికను చుట్టుముట్టిన సభ్యులు

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి మండలిపై విశ్వాసం లేదంటూ కాంగ్రెస్ పార్టీ కూడా మోదీ సర్కారుపై యుద్ధం ప్రకటించింది. ఇప్పటివరకూ టీడీపీ, వైసీపీ మాత్రమే అవిశ్వాస నోటీసులు ఇవ్వగా అనూహ్యంగా కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కూడా 27వ తేదీ కోసం నోటీసు ఇచ్చారు. కేంద్రంపై పోరు సాగించేందుకు మొత్తం మూడు పార్టీలు రంగంలోకి దిగాయి. సభలో కాంగ్రెస్‌కు 48 మంది,

మిగతా 6వ పేజీలో...



ఆప్‌కు లాభం

20 మంది ఎమ్మెల్యేల అనర్హతపై ఊరట

- కేంద్రం నోటిఫికేషన్‌ను రద్దు చేసిన ఢిల్లీ హైకోర్టు
- ఈసీ సహజ న్యాయ సూత్రాలు పాటించలేదు
- మళ్లీ విచారించాలి.. లాభదాయక పదవులపై తీర్పు
- మౌఖిక విచారణలో ఎమ్మెల్యేల వాదన వినలేదు
- ఈసీ సిఫారసులు చట్టాన్ని నీరుగార్చేవే: హైకోర్టు

15

దక్షిణాది సమరం!

- పన్నుల పంపకంలో కేంద్రం వివక్ష
- 2011 లెక్కల ప్రకారం పంపిణీ
- తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు
- గొంతు కలిపిన కర్ణాటక, కేరళ
- దక్షిణాది భేటీకి కేరళ పిలుపు
- సంసిద్ధత వ్యక్తం చేసిన రాష్ట్రాలు







గెలుపు గులాబీ


కొత్తగా ఎన్నికైన పార్టీ రాజ్యసభ సభ్యులతో ముఖ్యమంత్రి కేసీఆర్

పెద్దల సభకు మరో ముగ్గురు

- రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం
- మూడింటికి మూడు స్థానాలూ క్లీన్‌స్వీప్
- పది ఓట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి
- ఓటింగ్‌కు దూరంగా బీజేపీ, టీడీపీ, సీపీఎం
- టీఆర్ఎస్‌కే కాంగ్రెస్ ఫిరాయింపుదార్ల ఓట్లు
- ఈసీ, స్పీకర్‌లకు కాంగ్రెస్ ఫిర్యాదు
- చూపించి వేసిన మాధవరెడ్డి ఓటు చెల్లలేదు


హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. మూడింటికి మూడు స్థానాలనూ కైవసం చేసుకుంది. అధికారంలోకి వచ్చింది మొదలు కీలకమైన అన్ని ఎన్నికల్లోనూ ప్రదర్శించిన ఆధిపత్యాన్ని రాజ్యసభ ఎన్నికల్లోనూ కొనసాగించింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి మరోసారి చేదు అనుభవమే మిగిలింది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకూ శుక్రవారం అసెంబ్లీలో పోలింగ్ జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొత్తం 108 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, వాటిలో 107 ఓట్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయి. కాంగ్రెస్ అనుబంధ సభ్యుడు దొంతి మాధవ రెడ్డి ఓటు చెల్లుబాటు కాలేదు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం ఆయన స్వతంత్ర ఎమ్మెల్యే. కానీ, మాధవరెడ్డి తన ఓటును కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌కు చూపించిన కారణంగా ఆయన ఓటు చెల్లుబాటు కాదని ఎన్నికల కమిషన్ తేల్చి చెప్పింది. మిగిలిన వాటిలో, టీఆర్ఎస్ అభ్యర్థులు బండ ప్రకాశ్‌కు 33, జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు 32, బడుగుల లింగయ్య యాదవ్‌కు

మిగతా 6వ పేజీలో...

బీజేపీ ప్రతీకారం

- యూపీలో బీఎస్పీ అభ్యర్థిని ఓడించిన కమలం
- క్రాస్ ఓటింగ్.. చివరి క్షణం దాకా హైడ్రామా
- కౌంటింగ్ రెండు గంటల పాటు నిలిపివేత
- అవకతవకలు లేవని తేల్చిన ఎన్నికల సంఘం
- ఆరు రాష్ట్రాల్లో సజావుగా ముగిసిన ఎన్నికలు
- ఎగువ సభకు మొత్తం 59 మంది ఎన్నిక

15





చేనేత రుణాలు 2010 నుంచి

మాఫీ

- చెల్లించిన వారికీ లబ్ధి
- గరిష్ఠంగా లక్ష: కేటీఆర్

7

సింగరేణి రిటైర్డ్

ఉద్యోగులకు ఉచిత వైద్యం

సీఎండీ శ్రీధర్ ఉత్తర్వులు

13







అన్నా దీక్ష!

ఏడేళ్ళ తరువాత అదే లోక్‌పాల్ కోసం అన్నా హజారే మళ్ళీ నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నారు. అప్పటిమాదిరిగానే ఇప్పుడు కూడా రామ్‌లీలా మైదానమే వేదిక. ఆర్నెల్ల ముందస్తు హెచ్చరిక ద్వారా లోక్‌పాల్ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని వేగంగా కదిలించగలుగుతానని ఆయన అనుకున్నారు. కానీ, ఇందుకు భిన్నంగా రామ్‌లీలా మైదానానికి దేశవ్యాప్తంగా తరలివస్తున్న కార్యకర్తలను అడ్డుకోవడానికి మాత్రమే ప్రభుత్వం కదిలిందన్నది హజారే ఆరోపణ. రైళ్ళను రద్దుచేయడం, ఢిల్లీ పొరుగు రాష్ట్రాలనుంచి కార్యకర్తలతో వస్తున్న బస్సులను గాలించడం ఇత్యాది విన్యాసాలతో తన సభకు జనం రాకుండా మోదీ చేశారన్నది హజారే అభియోగం. కారణాలు ఏమైనప్పటికీ, ఏడేళ్ళక్రితం నాటి జనసందోహం, మీడియా ప్రతినిధుల హడావుడి, టెలివిజన్ చానెళ్ళ ప్రత్యక్ష ప్రసారాలు ఇప్పుడు లేవు. అన్నా ముందున్న వారి సంఖ్య పదివేలకు మించకపోవచ్చును కానీ, గతంలో మాదిరిగానే ఈ దేశంలో మరో విస్తృతమైన ఉద్యమాన్ని సృష్టించాలన్న బలమైన ఆకాంక్ష, మోదీ ప్రభుత్వంపై విస్పష్టమైన ఆగ్రహం వారి కళ్ళలో కనిపిస్తున్నాయనీ, మరోమారు దేశవ్యాప్త తిరుగుబాటు ఖాయమని కొందరు సంతోషిస్తున్నారు. దీక్షకు కూర్చొనే ముందు హజారే కొద్దినెలలుగా దేశవ్యాప్తంగా పర్యటించి నలభైరెండు సభల్లో మాట్లాడారు. ఏడేళ్ళక్రితం హజారే ప్రతి అడుగునూ, మాటనూ మీడియా వొడిసిపట్టుకుంది. అన్నా ఇప్పటి పర్యటనలేవీ మీడియా అంతగా గుర్తించలేదు. ఇందుకు అసలు కారణం అధికారంలో మోదీ ఉండటమేననీ, మోదీ ప్రభుత్వం వేగంగా పావులు కదిపి మీడియాను నియంత్రించగలిగిందని కొందరి విమర్శ. వీటిని అటుంచితే, అప్పట్లో మాదిరిగా ఒక ఉద్యమఊపు ఇప్పటికైతే ఇంకా రాలేదన్నది నిజం. వేదికమీద ఆయనకు అటూ ఇటూ ఉన్న వారిలో కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఇద్దరు మాజీ లోకాయుక్తలు మాత్రమే ప్రముఖంగా చెప్పుకోవలసినవారు. అన్నా ఉద్యమంతోనే ఎదిగి వచ్చి, ఏడాదికాలంలోనే దూరమై, ఎన్నికల రంగంలోకి దూకి ఢిల్లీకి ముఖ్యమంత్రి అయిన కేజ్రీవాల్ వంటివారు ఇప్పుడు పక్కనలేరు. అన్నా ఇదేదీ లోటుగా అనుకున్నట్టు లేదు. తన కొత్త ఉద్యమం ఎట్టిపరిస్థితుల్లోనూ కేజ్రీవాల్ వంటివారిని సృష్టించకూడదని ఆయన ఎప్పుడో సంకల్పం చెప్పుకున్నారు. అందుకు అనుగుణంగానే, వివిధ రాష్ట్రాలనుంచి ఓ పాతికమందిని ఎంపికచేసి కీలక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భవిష్యత్తులో తాము రాజకీయపార్టీ ఏర్పాటు చేయబోమనీ, ఉన్నవాటిలో చేరబోమని వారితో ప్రమాణపత్రాలు కూడా రాయించుకున్నారు.

ఆర్నెల్లక్రితమే అన్నా తన డిమాండ్లు ప్రభుత్వం ముందుంచారు. నెరవేర్చాలని కోరుతూ లేఖలు రాశారు. మోదీ ప్రభుత్వం లోక్‌పాల్ నియామకం విషయంలో చేస్తున్న తాత్సారం ఆయనకు అగ్రహం కలిగిస్తున్నది. గత అవినీతి వ్యతిరేక ఉద్యమం జన లోక్‌పాల్ లక్ష్యంగానే సాగిన విషయం తెలిసిందే. విపక్షంలో ఉన్న బీజేపీ హజారేకు మద్దతు పలుకుతూ ఆయన ఉద్యమాన్ని అద్భుతంగా ఉపయోగించుకుంది. 2013లో యూపీఏ ప్రభుత్వం లోక్‌పాల్–లోకాయుక్తల చట్టం చేయడం, ఇప్పటివరకూ లోకాయుక్త నియామకం జరగకపోవడం తెలిసిందే. లోక్‌పాల్‌ను నియమించాలంటే పాలకులకు ఎంతో నైతికస్థైర్యం ఉండాలి. ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిత్యమూ డేగకళ్ళతో తమను పరీక్షించే, పర్యవేక్షించే వ్యవస్థలను సృష్టించడానికి పాలకులకు చేతులు రావు. ప్రశాంత్ భూషన్ తన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో సుప్రీంకోర్టును తరుముతున్నందున, న్యాయస్థానం ప్రభుత్వాన్ని పలుమార్లు హెచ్చరించడంతో చివరకు ఇటీవలే ప్రభుత్వం ఇదిగో అదిగో అనడం ఆరంభించింది. గత ఏడాది ఏప్రిల్‌లోనే సుప్రీంకోర్టు శాసించినా ఈ విషయంలో కదలికలేకపోవడంతో చివరకు ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారాస్త్రాన్ని కూడా ప్రయోగించారు. సుప్రీంకోర్టుకు ఏప్రిల్ మొదటివారంలో ప్రభుత్వం ఏం చెప్పుకుంటుందన్నది అటుంచితే, ఈ విషయంలో ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించడం లేదన్నది వాస్తవం. రైతుల సమస్య పరిష్కారం కోసం స్వామినాథన్ కమిటీ సూచనలను అమలు చేయాలని కూడా అన్నా హజారే డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరవరలను నిర్ణయించే సీఏసీపీకి రాజ్యాంగ హోదాను, ప్రత్యేక ప్రతిపత్తిని ఇవ్వాలన్న ఆయన డిమాండ్ అత్యంత ముఖ్యమైనది. ఎన్నికల సంస్కరణలకు సంబంధించి అన్నా ప్రతిపాదిస్తున్న అంశాల్లో అభ్యర్థులను తిరస్కరించే, వెనక్కు పిలిపించే హక్కు కూడా ఉన్నది. ఇప్పుడు అన్నా ఎంతకాలం దీక్షను కొనసాగించగలరన్నది కాక, తన డిమాండ్ల విషయంలో మోదీ ప్రభుత్వాన్ని లవలేశమైనా కదిలించగలరా అన్నది ప్రధానం.

ఫేస్‌బుక్ అంగట్లో అమ్మకానికి ప్రజాస్వామ్యం

మీ స్వభావాన్ని బట్టి మీరు ఏ రాష్ట్రంలో నివసిస్తే బాగుంటుంది? టీవీ సీరియల్ 'డౌన్‌టన్ అబ్బే'లో మీరు ఏ పాత్రలాంటివారు? ఏ జాతి శునకం మీ స్వభావానికి అనుకూలం?... 213కోట్లమందికి పైగా మసలుకొనే ఫేస్‌బుక్ మహారణ్యంలో మీ స్నేహితులో పరిచయస్థులో ఇలాంటి ఆన్‌లైన్ క్విజ్‌లలో తమకు వచ్చి ఫలితాల్ని షేర్ చేయటం మీ కంట పడే ఉంటుంది. ఒక్కోసారి అవి చికాకు పుట్టించేవిగా, అర్థంపర్థంలేనివిగా, సమయం వృథా చేసేవిగా అనిపించవచ్చు. కానీ వాటి ఆకర్షణకు లోబడకుండా నిలదొక్కుకోవటం కష్టమైన పనే. ఎలాగూ ఈ ఫలితాల్ని షేర్ చేసేది మన ఫ్రెండ్స్‌కూ ఫేమిలీకీ మాత్రమే కదా, ఏదో చిన్నపాటి సరదాయే కదా అనుకుంటాం. అవునా, అంతేనా?

కాదు. దీని వెనక పెద్ద మతలబే ఉంది.

ఫేస్‌బుక్ వ్యాపారం చేసేది మీ సమాచారంతోనే. మీ సమాచారాన్ని వర్గీకరించి ప్రకటనకర్తలకు అమ్ముకోవటం ద్వారానే ఆ కంపెనీ కోట్లాది లాభాల్ని గడిస్తుంది. కుటుంబంతోనూ, మిత్రులతోనూ నిరంతరం "కనెక్ట్" అయి ఉండటం అన్న పేరు మీద మీరు వీలైనంత ఎక్కువగా లైక్‌లు, షేర్‌లు, కామెంట్లు చేసేలా అది మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. అయితే దీనంతటి వెనకా ఇంకా పెద్ద కథే నడుస్తుందన్న సంగతి ఒక ఎథికల్ హ్యాకర్‌గా, భద్రతా నిపుణునిగా, సమాచార విశ్లేషకునిగా నాకు తెలుసు. మొత్తం ప్రజాస్వామ్య పునాదులే ప్రమాదంలో పడ్డాయి.

మీ స్వభావం నిరంతరం అంచనాకు గురవుతున్నది. 'డెమోగ్రాఫిక్స్' అనే పదాన్ని చాలామంది వినే ఉంటారు. ప్రకటనకర్తలు తమ వినియోగదారుల్ని అర్థం చేసుకొనేందుకు వారిని వయసుపరంగా, లింగపరంగా, జాతిపరంగా విడదీయటాన్ని డెమోగ్రాఫిక్స్ అంటారు. దీనికి భిన్నమైనవి 'సైకోగ్రాఫిక్స్' (స్వభావ గణాంకాలు). అంటే వినియోగదారుల్ని వారి వ్యక్తిత్వాలు, విలువలు, అభిప్రాయాలు, స్వభావాలు, ఆసక్తులు, జీవనశైలుల వారీగా విడదీయటం. మీరు ఎలాంటివారో, దేనికి ఎలా స్పందిస్తారో ప్రకటనకర్తలు తెలుసుకొనేందుకు ఇవి సాయపడతాయి.

చరిత్రలో ఇప్పటిదాకా డెమోగ్రాఫిక్స్ తెలుసుకోవటం సులువేకానీ, సైకోగ్రాఫిక్స్ తెలుసుకోవటం చాలా కష్టంగా ఉండేది. ఇపుడు ఫేస్‌బుక్ ఈ సమాచారాన్ని తవ్వకొనేందుకు ఒక గనిలా తయారైంది. ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు తమ జీవితాల గురించీ, ఆశల గురించీ సమాచారాన్ని భారీ మొత్తంలో ఈ కంపెనీకి ధారాదత్తం చేస్తున్నారు. ఈ సమాచారాన్ని మంచికి వాడుకుంటే ఏ నష్టమూ లేదు. ఉదాహరణకు మీరు కళ్ళద్దాల గురించి సెర్చ్ చేసినపుడు కళ్ళద్దాల కంపెనీ ప్రకటనలు ఫేస్‌బుక్‌లో మీకు కనిపిస్తే మంచిదే. కానీ మీరు పంచుకొనే సమాచారాన్ని కుట్రపూరితంగా మీ అభిప్రాయాల్ని ప్రభావితం చేసేందుకూ, ఒకేరకమైన అభిప్రాయాలు మాత్రమే ప్రతిధ్వనించే వేర్వేరు గదులుగా సమాజాన్ని ముక్కలు చేసేందుకూ వాడుకుంటే అది ప్రమాదం. ఇలా జరిగేందుకు ఫేస్‌బుక్ అవకాశం కల్పించింది.

ఈ అవినీతి జరిగిన సమయంలో బ్రిటిష్ సంస్థ అయిన 'కేంబ్రిడ్జి అనలిటికా' స్టీవ్ బానన్ ఆధ్వర్యంలో ఉండేది. అప్పట్లో ఆయన అమెరికా అధ్యక్ష పదవి అభ్యర్థి అయిన డొనాల్డ్ ట్రంప్‌కు ముఖ్య సలహాదారు. 2016 అధ్యక్ష పదవి ఎన్నికలకు కొంత కాలం ముందు నుంచీ ఈ సంస్థ ఫేస్‌బుక్ ద్వారా పొందిన సైకోగ్రాఫిక్ సమాచారాన్ని వాడుకుని అమెరికన్ ఓటర్ల స్వభావాన్ని అంచనా వేసేందుకు ప్రయత్నించింది. ఎందుకంటారా? ఆ ఓటర్ల కోసమే ప్రత్యేకించి తయారు చేసిన రాజకీయ సందేశాల్ని వారికి పంపి, వారు ఓటు వేసే తీరును ప్రభావితం చేసేందుకు.

ఒకప్పుడు కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి అయిన క్రిస్టఫర్ వైలీ ఇటీవలే ఈ కుట్రను బట్టబయలు చేసాడు. కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ఫేస్‌బుక్ యూజర్ల నుంచి రాబట్టిన సమాచారం ద్వారా వారి అంతరంగ భయాల్ని లక్ష్యంగా చేసుకొని ప్రచార పద్ధతుల్ని ఎలా మలచిందో అతను బయటపెట్టాడు.

ఇందుకు ఫేస్‌బుక్ ఎలా అనుమతినిచ్చింది?

ఫేస్‌బుక్ మీ సమాచారాన్ని కేవలం అమ్ముకోవటం మాత్రమే చేయదు. 2000వ సంవత్సరం నుంచీ ఫేస్‌బుక్ తన యూజర్లను పరిశోధించాలనుకొనే అకడమిక్ పరిశోధకులకు ఆ అవకాశాన్ని కల్పిస్తోంది. పైకి సులభంగా కనిపించే ప్రశ్నల ద్వారా మీ వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని అంచనాకట్టే పనిలో ఎందరో మనస్తత్వ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు తమ కెరీర్లు చక్కబెట్టుకున్నారు. సోషల్ మీడియా క్విజ్‌లలో కనిపించే ప్రశ్నలలాగానే ఈ ప్రశ్నలు పైకి రాజకీయాలతో ఏ సంబంధమూ లేనట్టుగానే కనిపిస్తాయి. ఇలాగే 2015లో అలెగ్జాండర్ కోగన్ అనే పరిశోధకుడు తన సొంత క్విజ్‌ను ఒకదాన్ని డెవలప్ చేసుకునేందుకు ఫేస్‌బుక్ అనుమతినిచ్చింది. ఇలాంటి చాలా క్విజ్‌ల మాదిరిగానే అతను రూపొందించిన క్విజ్ కూడా ఫేస్‌బుక్‌లో మీరు పంచుకొన్న సమాచారాన్ని, అంటే మీ పేరూ, ప్రొఫైల్ పిక్చరూ, వయస్సూ, పుట్టిన రోజూ; మీ టైమ్‌లైన్‌లో మీరు రాసిన ప్రతి పోస్టూ; మీ మొత్తం ఫ్రెండ్స్ జాబితా; మీ ఫోటోలూ, మీరు ట్యాగ్ చేయబడిన ఫోటోలూ; విద్యార్హతలూ; స్వస్థలమూ, ప్రస్తుత నివాస స్థలమూ; మీరు లైక్ చేసిన ప్రతి పోస్టూ; మీరు వాడుతోన్న డివైజ్, వెబ్ బ్రౌజర్ల వివరాలూ... ఇలా అన్నింటినీ రాబడుతుంది. అలెగ్జాండర్ కోగన్ ఈ సమాచారం మొత్తాన్నీ తీసుకెళ్ళి కేంబ్రిడ్జి అనలిటికాకు అప్పజెప్పాడు. ఇది ఫేస్‌బుక్ నియమావళికి విరుద్ధమే. కానీ ఆ సంస్థకు తన నియమాల్ని అమలుచేయటంలో అంత పట్టింపు లేదు కాబోలు.



మనం ఫేస్‌బుక్‌లో షేర్ చేసే సమాచారం మన ఆశల్నీ భయాల్నీ వెల్లడిస్తుంది. పైకి చాలా అమాయకంగా కనిపించే ఫేస్‌బుక్ క్విజ్‌లు నిజానికి అంత అమాయకమైనవేం కావు. ఫేస్‌బుక్ లాంటి విస్తృతమైన వేదికలు ప్రజల సమాచారాన్ని వాడుకొని, ఓటర్లుగా వారికి ఉండే నిర్ణయాత్మక శక్తిని వారి చేతుల్లోంచి లాక్కొని ఎన్నికల ప్రచారకర్తల చేతుల్లో పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని హత్య చేయటమే. ఫేస్‌బుక్ వాడేవారందరికీ నా సలహా ఏమిటంటే, ఫేస్‌బుక్‌ను కొంత అపనమ్మకంతో వాడటం అన్ని విధాలా శ్రేయస్కరం.

ఈ సమాచారాన్ని విశ్లేషించటం ద్వారా ఏ యూజర్‌కి ఏ అంశంపై ఆసక్తి ఉన్నదో, ఎలాంటి రాజకీయ సందేశాలు వారిని ఆకట్టుకుంటాయో, ఎలాంటి భాష వాడి ఆ సందేశాల్ని రక్తికట్టించాలో, వారిని ప్రేరేపించే విధంగా సందేశాల్ని ఎలా మలచాలో, వాటిని వారి చేత ఎలా షేర్ చేయించాలో కేంబ్రిడ్జి అనలిటికా ఓ అంచనాకి వచ్చింది. షాపింగ్ లిస్ట్‌లాగా ఆ సంస్థ ఓటర్లకు సంబంధించిన ఒక స్వభావాల, లక్షణాల చిట్టాను తయారు చేసింది. ఉదాహరణకి ఈ గుట్టంతా రట్టు చేసిన క్రిస్టఫర్ వైలీకి పరిశోధకుడు అలెగ్జాండర్ కోగన్ పంపిన ఒక మెయిల్ ఇలా సాగుతుంది: "మీరు పైపైన ఒక అంచనాకు రాగలిగేలా ఒక షాపింగ్ లిస్ట్‌ను పంపిస్తున్నాను. ఇవేగాక ఈ క్విజ్‌ల ఆధారంగా మరింత సూక్ష్మమైన అంశాలనూ తెలుసుకోవచ్చు. ప్రస్తుతానికి వీటి ద్వారా మీకు మరింకా ఏం అవసరమో ఒక అంచనా వస్తుంది: విశాల దృక్పథం, జాగరూకత, బహిర్ముఖత్వం, ఒప్పుకునేతత్వం, జీవితంపై సంతృప్తి, ఐక్యూ, రాజకీయ దృక్పథం—సంప్రదాయవాదా? ఉదారవాదా?... ఆసక్తులేమిటి, తుపాకుల్ని ఇష్టపడతాడా?" ఇలా చాలా అంశాల్ని అతను ఒక షాపింగ్ లిస్ట్‌లాగా కేంబ్రిడ్జి అనలిటికాకు పంపాడు.

దీని ఆధారంగా కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ఎంపిక చేసిన కొన్ని వెబ్‌సైట్లను, ప్రకటనలను, బ్లాగులను ఫేస్‌బుక్ యూజర్ల దృష్టిలో పడే విధంగా వారి ముందుకు తీసుకువెళ్ళింది. వైలీ మాటల్లో చెప్పాలంటే: "ఒకసారి వాటిని చూసారంటే, క్లిక్ చేసారంటే, ఇక మాయల లోయలోకి జారిపోయినట్టే". ఇలా ఓటింగ్ తీరును ప్రభావితం చేసే అబద్ధపు వార్తల్ని, తప్పుడు సమాచారాన్ని, పరస్పర విరుద్ధమైన సందేశాల్ని అమెరికన్ ప్రజలపై చల్లారు. ఈ విధంగా ఫేస్‌బుక్ యూజర్లకు స్నేహితులతోను కుటుంబసభ్యులతోను ఉన్న అనుబంధాలు ఆర్థిక, రాజకీయ లబ్ధి కోసం వాడుకోబడ్డాయి.

తన యూజర్ల భద్రతను కాపాడే అవకాశం ఫేస్‌బుక్‌కు ఉంది. కానీ అది ఆ పని చేయలేదు. తన వేదికపై ఆప్‌లు తయారు చేసుకొనేలా డెవలపర్లను ప్రోత్సహించింది. తద్వారా ఈ ఆప్‌లకు భారీ స్థాయిలో యూజర్ల సమాచారాన్ని వాడుకొనేందుకు అవకాశమిచ్చింది. వీరికి వర్తించే నియమాలైతే ఉన్నాయి కానీ, వాటిని అమలుచేసిన దాఖలా లేదు. ఈ ఆప్‌ల ద్వారా జరిగిన చెల్లింపుల్లోంచి 30% ఆదాయాన్ని మాత్రం ఫేస్‌బుక్ దండుకొంది.

'అబ్జర్వర్'కు ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో క్రిస్టొఫర్ వైలీ మాట్లాడుతూ ఇలా అన్నాడు: "రాజకీయాలు సంస్కృతిని బట్టి వుంటాయి. మీరు ప్రజల్ని మారిస్తే సంస్కృతీ మారిపోతుంది." ఇదే పద్ధతిలో కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ప్రజల్ని దారి మళ్ళించింది. ప్రజల సమాచారాన్ని ఫేస్‌బుక్ ద్వారా సేకరించి వారి అభిప్రాయాల్ని, ప్రవర్తనను తనకు అనుకూలమైన దిశకు తిప్పింది. ఇందుకోసం వారు "ఫేక్ న్యూస్" (అబద్ధపు వార్తలు)ను కూడా వాడుకున్నారు. కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి ఒకరు వీటి గురించి ఇలా వ్యాఖ్యానించారు: "జనం వీటిని నమ్మితే చాలు, ఇవి నిజం కానవసరం లేదు."

అమెరికన్ సమాజం దీన్ని ఊహించలేదు. అమెరికన్ వయోజనుల్లో 62% మంది వార్తలు తెలుసుకోవటానికి సోషల్ మీడియా పైనే ఆధారపడతారు. వీరిలో చాలామంది అబద్ధపు వార్తల్ని చదివి అవే నిజమని నమ్మారు. కేంబ్రిడ్జి అనలిటికా పథకం పారింది. ట్రంప్‌కు అనుకూలమైన 115 అబద్ధపు వార్తలు ఫేస్‌బుక్‌లో ఏకంగా 3కోట్ల సార్లు షేర్ అయ్యాయి. నిజానికి ప్రధాన స్రవంతి వార్తల కంటే ఈ అబద్ధపు వార్తలే ఫేస్‌బుక్‌లో ఎక్కువసార్లు షేర్ అయ్యాయి. ప్రజల మానసిక ప్రపంచంపై చేసిన ఈ దాడికి ప్రతిఫలంగా ట్రంప్ ప్రచార నిధుల నుంచి కేంబ్రిడ్జి అనలిటికాకు భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయి.

ఈ సైకోగ్రాఫిక్ అంచనాలతోనూ, ఓటర్లను వ్యక్తిగతస్థాయిలో లక్ష్యం చేసుకొని సాగే ప్రచారంతోనూ అమెరికాలో ప్రజాస్వామిక సంవాదం ఇప్పుడు ఒక కొత్త మలుపు తిరిగింది. ప్రజల ముందు బహిరంగంగా సాగే ప్రచారం ఇప్పుడు గుసగుసల ప్రచారంగా మారింది. ప్రజల ఆశల్ని భయాల్ని గ్రహించి వాటిని రెచ్చగొట్టే విధంగా వారిలో ప్రతి ఒక్కరి చెవుల్లో ఈ రహస్య ప్రచారం సాగింది. ఒక కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి మాటల్లో చెప్పాలంటే: "మనిషిని ముందుకు నడిపించేవి ప్రాథమికంగా అతని ఆశలు, భయాలు... మా ఉద్యోగం ఏమిటంటే, పైకి కనిపించని ఈ ఆశల్ని భయాల్ని అర్థంచేసుకోవటం. ఎన్నికల పోరులో గెలిపించేవి వాస్తవాలు కాదు, భావోద్వేగాలు."

మనం ఫేస్‌బుక్‌లో షేర్ చేసే సమాచారం మన ఆశల్నీ భయాల్నీ వెల్లడిస్తుంది. పైకి చాలా అమాయకంగా కనిపించే ఫేస్‌బుక్ క్విజ్‌లు నిజానికి అంత అమాయకమైనవేం కావు. ఫేస్‌బుక్ లాంటి విస్తృతమైన వేదికలు ప్రజల సమాచారాన్ని వాడుకొని, ఓటర్లుగా వారికి ఉండే నిర్ణయాత్మక శక్తిని వారి చేతుల్లోంచి లాక్కొని ఎన్నికల ప్రచారకర్తల చేతుల్లో పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని హత్య చేయటమే. ఫేస్‌బుక్ వాడేవారందరికీ నా సలహా ఏమిటంటే, ఫేస్‌బుక్‌ను కొంత అపనమ్మకంతో వాడటం అన్ని విధాలా శ్రేయస్కరం.

■ తిమొతీ సమ్మర్స్
మేరీలాండ్ యూనివర్సిటీ

('ది కన్వర్సేషన్')

'మనిషిని పండించేవి పొలాలే'

ఆధునిక హిందీ కవితా ప్రపంచంలోనే కాకుండా భారతీయ సాహిత్యంలోనూ తన కవితలతో ఒక ప్రత్యేకతను చాటిన మహాకవి కేదార్ నాథ్ సింగ్ ఇక లేరు. ఈ నెల 21 వ తేదీ (సోమవారం) రాత్రి అనారోగ్యంతో ఆయన డిల్లీలో మరణించారు. 2013 సంవత్సరానికి గాను దేశంలోనే సర్వోన్నత సాహిత్య గౌరవం, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'భారతీయ జ్ఞానపీఠ్ అవార్డు'ను పొందిన ప్రశస్థ కవి కేదార్ నాథ్ సింగ్. హిందీ సాహిత్యంలో జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందిన వారిలో కేదార్ నాథ్ పదవ వ్యక్తి.

ఈ మహాకవి ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లాలో చకియా గ్రామంలో 1934 లో జులై ఒకటిన జన్మించారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ., పిహెచ్. డి పట్టాలు పొందారు. బలియాలో కొంత కాలం అధ్యాపకుడుగా పనిచేసిన తరువాత న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా కేంద్రంలో ఆచార్యుడిగా, విభాగాధిపతిగా కేదార్‌నాథ్ సింగ్ పని చేసారు. ఆయన సృజనాత్మక సాహిత్య యాత్ర 1950 నుంచే ప్రారంభమైంది. మొదటి కవితా సంకలనం 'అభి బిల్కుల్ అభి' 1960లో అచ్చయింది. తదనంతరం 'జమీన్ పక్ రహీ హై', 'యహాం సే దేఖో', 'అకాల్ మే సారస్', 'బాఘ్', 'ఉత్తర్ కబీర్ ఔర్ అన్య కవితాయే', 'తాల్ స్తాయ్ ఔర్ సైకిల్' ల్లాంటి కవితా సంకలనాలు వారి కలం నుంచి వెలువడ్డాయి.

కేదార్ నాథ్ సింగ్ తన కవితలలో 'మనిషి'ని వెతుకుతారు. 'మనిషి' ని ప్రతిష్టించాలనుకుంటారు. కవిత్వం పదాలలో బందీ అయిందనో లేదా పదాల వ్యాకరణానికి పరిమితమయిందనో కేదార్‌నాథ్ సింగ్ భావించరు . 'భాష వచ్చిన వారు ఎందుకు మౌనంగా ఉన్నారని' ఓ కవితలో ఆయన ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నలో కేదార్ నాథ్ సింగ్ మనిషిలోని జవాబుదారీతనానికి పర్యాయపదంగా భాషను చూస్తారు. భాష మనిషి అస్తిత్వానికి చిహ్నం అని ఆయన భావిస్తారు. అందుకే అందులో ఎలాంటి పొరపాట్లు జరగకూడదు. 'చల్లదనంతో పదాలు మరణించవు, సాహసలేమితో అవి మరణిస్తాయి' అని మరో కవితలో ఆయన అంటారు. పదాలు నిజానికి మనిషికి పర్యాయపదం. మనిషి అంటే ఇక్కడ చైతన్యంతో ఉండే మనిషి. బ్రతికున్న మనిషి. బ్రతుకు ఇక్కట్లను, ప్రకృతి, జీవితంలో సరితూగని సంబంధాల వైరుధ్యాలను ఎదుర్కొనే ధైర్య, సాహసాలు కలిగి ఉండే మనిషి. 'మిత్రులకు చెప్పాను, మౌనంగా ఉంటే ఏమీ లాభం లేదని, పొలాల వైపు పరుగెత్తాను, పదాలు ఎక్కడైనా పండి పోయాయేమోనని' కవి అంటారు. మాట్లాడితేనే భాషకు సార్థకత. మాట్లాడితేనే వ్యక్తుల వ్యక్తిత్వం బయట పడుతుంది. అందుకే కవి పదాల పరిస్థితిని తెలుసుకోవడానికి పొలాల వైపు పరుగెత్తుతారు. పొలాలలో పదాలు పండుతాయని కవి ప్రగాఢ విశ్వాసం. ఇక్కడ కూడ పదాలు మనిషికి పర్యాయపదమే. మనిషిని పండించేవి పొలాలే. పండించి మనిషిని సుదృఢ పరచేవి పొలాలే. కీర్తి, కిరీటాలతో ముంచెత్తేవి పొలాలే. 'పండిన ధాన్యం లోపల పదాలు ఉండే పూర్తి అవకాశం ఉండేది'. ధాన్యం పండడం ఒక జీవన ప్రక్రియ. పదాలు కూడ జీవితాన్ని విస్తరింపజేస్తాయి. అయితే అన్నీ పదాలు కాదు. బ్రతుకు కొలిమిలో, శ్రమ వేడిలో, మట్టి శక్తిలో పండిన పదాలు మాత్రమే జీవితాన్ని విస్తరించగలవు. అలాంటి పదాల రహస్యాన్ని పొందడం కోసం ధాన్యం లోపల ప్రవేశించి అమ్మ గొంతును వినడానికి ఇసురు రాయి క్రిందకు వెళ్ళడానికి కవి ఆతురత పడతారు. కవిత్వం, భాష, జీవితం, మనిషి, మానవీయ పురుషార్థం, ప్రజాస్వామ్య కర్తవ్యం వీటన్నిటినీ ఒకేసారి రంగరించి వ్యక్తం చేయడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ఒక మహాస్వాప్నికుడు, క్రాంతి ద్రష్టకు మాత్రమే అది సాధ్యం.



1934 – 2018

కేదార్‌నాథ్ సింగ్ కవితలు స్పష్టంగా, సరళంగా, సహజంగా మామూలు భాషలో ఉంటాయి, కవితలు ఎంత సహజంగా, సరళంగా ఉంటాయో అంతే లోతైన భావాలను వ్యక్తం చేస్తాయి. మనిషిని ఉన్నతీకరించడంతో బాటు ప్రపంచ సౌందర్యాన్ని మానవీయ కోణంతో ఆవిష్కరించిన మహా కవి; మాటలనే కవితలుగా మలచిన మహా శిల్పి కేదార్‌నాథ్ సింగ్. 'మాట్లాడుతాను, అందుకే రాస్తాను' అని సగర్వంగా ఆయన ప్రకటించారు.

మహోన్నత పోరాటం తరువాత దేశం దాస్య శృంఖలాలను తెంచుకుని స్వాతంత్ర్యం పొందింది. వలసపాలకుల కబంధ హస్తాలనుంచి దేశం విముక్తమయిన చారిత్రక సందర్భంలో ఒక నూతన భవిష్యత్తు నిర్మాణం కోసం సృజనాత్మక ఆలోచనలకు అంకురార్పణ చేయడానికి అన్ని అవకాశాలు ఉన్న సమయంలో కేదార్ నాథ్ సింగ్ యువ గొంతుకతో ఆధునిక హిందీ కవిత్వ రంగంలో ప్రవేశిస్తారు. కొత్త భవిష్యత్తు నిర్మాణం కోసం పరితపిస్తున్న 'మనిషి' ప్రతినిధి అయిన కవి బజారు నుంచి దేశ పటాన్ని కొంటారు. రైతు బిడ్డ అయిన కవి దేశ పటంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెతికినా తన ఇల్లు కనబడదు. 'ప్రపంచపు గొప్ప పటంలో, దొరక లేదు, దొరక లేదు నా ఇల్లు'. మరి ఆ ఇంటి ముంగిట్లో 'అమ్మ రెండు తులసి మొక్కలను పెంచింది, నాన్న ఊడల మర్రి చెట్టును'. ఈ పంక్తులు స్వతంత్ర భారత దేశ వాస్తవికతను ఆవిష్కరిస్తాయి.

స్వతంత్ర భారతదేశపు వైరుధ్యాలతో గతం, భవిష్యత్తు తలపడినప్పుడు ఉద్భవించే ప్రశ్నలు కేవలం వ్యక్తి వరకు పరిమితం కాకుండ మొత్తం సమాజాన్ని కదిలిస్తాయి. సామాజిక బాధ్యతను గుర్తెరిగిన కవి వైరుధ్యాలకు, వ్యక్తిగత పోకడలకు గురవ్వకుండ ప్రజలకు దిక్సూచిగా నిలబడుతాడు. ప్రశ్నిస్తాడు. 'నన్ను నేను ప్రశ్నించుకుంటాను, నదిలో నిలబడిన వంతెన గొప్పదా? లేదా మనుషుల లోపల వ్రేలాడుతున్నది గొప్పదా? ఏది గొప్పది?' కేదార్‌నాథ్ సింగ్ కవితలు అత్యంత స్పష్టంగా, సరళంగా, సహజంగా మామూలు భాషలో ఉంటాయి, కవితలు ఎంత సహజంగా, సరళంగా ఉంటాయో అంతే లోతైన భావాలను వ్యక్తం చేస్తాయి. ఇద్దరు మిత్రులు కలుసుకున్నపుడు పరస్పరం కరచాలనం చేస్తారు. 'అతని చేయిని నా చేతిలోకి తీసుకుని ఆలోచించాను, ఈ ప్రపంచం కూడ అతని చేయిలాగే వెచ్చగ, అందంగా ఉండాలని'. ప్రపంచ సౌందర్యం ఒంటరితనంలో లేదు. మనుషుల పరస్పర కలయికలో ఉంది. కేదార్ నాథ్ సింగ్ తమ రచనల ద్వారా మనిషిని ఉన్నతీకరించడంతో బాటు ప్రపంచ సౌందర్యాన్ని మానవీయ కోణంతో ఆవిష్కరించిన గొప్ప కవి. మాటలనే కవితలుగా మలచిన మహా శిల్పి. 'మాట్లాడుతాను, అందుకే రాస్తాను' అని సగర్వంగా ప్రకటించారు.

■ ఆచార్య వి. కృష్ణ

కరపత్రం

భాషా సంస్కృతలపై సకల జనుల సదస్సు

తెలంగాణ సకల జనుల వేదిక ఆధ్వర్యంలో మార్చి 25 (ఆదివారం)న 'తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతులు, వర్తమానం – కర్తవ్యాలు' అన్న అంశంపై వరంగల్‌లో ఒక రోజు సదస్సు జరుగుతుంది.

ఆదివారం ఉదయం 10–30కి జరిగే ప్రారంభ సభలో డాక్టర్ ఎం. యాదగిరి, ప్రొ. ఎం. వినాయకరెడ్డి, జయధీర్ తిరుమల రావు, గద్దర్, అందెశ్రీ, ప్రొ. లక్ష్మణ్, జూకంటి జగన్నాధం, నల్లెల రాజ్యయ్యలు పాల్గొంటారు.

మధ్యాహ్నం 2–20కి అన్వర్ అధ్యక్షతన జరిగే మొదటి సదస్సులో ఆచార్య జి.రాజయ్య, డా. వి.వీరాచారి, డా. మెట్టు రవీందర్, డా. లచ్చయ్య, నైనాల గోవర్ధన్, అడప రాజులు పాల్గొంటారు.

సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సభలో ఎం. చందర్ రావు, సి.హెచ్. మధు, గాగోజు నాగభూషణం, శెంకేసి శంకరరావు, భూపతి వెంకటేశ్వర్లు, ఏలేశ్వరం వెంకటేశం, ఎన్. వెంకట్ రెడ్డిలు పాల్గొంటారు.

సదస్సు జరుగు స్థలం :

సెమినార్ హాల్, న్యూసైన్స్ పి.జి కాలేజి, హంటర్ రోడ్డు, హన్మకొండ.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన మెయిల్:
editpage@andhrajyothy.com

అభినవ మల్లినాథసూరి

విద్వద్వరేణ్యులు, ఆంధ్రగీర్వాణ భాషాకోవిదులు, ఉభయ వేదాంత సంప్రదాయవేత్తలైన శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారు పవిత్రమై పారాయణయోగ్యమైన శ్రీవైష్ణవ స్తోత్ర గ్రంథాలకు, ముఖ్యంగా శ్రీమద్వేదాంత దేశిక రచిత స్తోత్రాలకు సులభసుందరమూ, మధురమూ అయిన వ్యాఖ్యానాలను తెలుగులో రచించినారు. స్తోత్ర గ్రంథాలకే కాదు, శ్రీమద్వేదాంత దేశికులనుగ్రహించిన సంస్కృత కావ్యాలకూ చక్కని వ్యాఖ్యానాలను సంతరించినారు. యాదవాభ్యుదయం, అచ్యుత శతకం, దయాశతకం మొదలైన సత్కావ్యాలు వారి వ్యాఖ్యానాల మూలంగానే తెలుగులో అందరూ చదివి ఆనందించడానికి అవకాశమేర్పడింది. వారి వ్యాఖ్యానాలన్నింటిలోనూ అతి ప్రసిద్ధమైంది, బృహత్తరమైంది శ్రీరంగనాథ పాదుకా సహస్ర వ్యాఖ్యానం. శ్రీమద్వేదాంత దేశికులు తమ పాండిత్య వైవిధ్యాన్ని, భక్తి పారమ్యాన్ని, పారవశ్యాన్ని శ్రీరంగనాథ పాదుకా సహస్ర స్తోత్ర కావ్యంలో ప్రస్ఫుటం చేసినారు. పాదుకా సహస్రము వంటి గ్రంథాలకు వ్యాఖ్యానం వ్రాయుటకు తగిన విద్వత్తు గలవారు ఈ కాలంలో చాలా అరుదు. దీనికై సంస్కృత వ్యాకరణములోనూ, తర్కమీమాంసా శాస్త్రములలోనూ, మంత్ర శాస్త్రములలోనూ, శ్రుతిస్మృతులలోనూ, పురాణములలోనూ, తమిళ ప్రబంధములలోను కూలంకష పాండిత్యముండవలెను. శ్రీవైష్ణవ సంప్రదాయము చక్కగా తెలిసియుండవలెను. ఇవి యున్ననూ సరళముగా విషయమును వ్యక్తీకరింపగల సామర్థ్యముండవలెను. శ్రీరాఘవాచార్యుల వారి వ్యాఖ్యానమును చూచినచో ఈ లక్షణములన్నియూ, వారిలో సమగ్రంగా నున్నట్లు గోచరించును.

సకలార్థములను కృప చేయు తిరువాయ్ మొళిలో ప్రసిద్ధి పొందిన వ్యాఖ్యానము పేరు భగవద్విషయము. ఈ భగవద్విషయమునకు అనగా వడక్కు తిరువీధి పిళ్ళై కృప చేసిన వ్యాఖ్యానమునకే ఈడు అని నామకరణము. ఆ ఈడునకు అవతారికను రాఘవాచార్యస్వామి వారు విశదముగా, సరళముగా, మనోరంజకముగా తెనుగు వ్యాఖ్యానమును అందించినారు. నాలాయిర ప్రబంధంలో విశిష్టమైన మూడు ప్రబంధాలకు వ్యాఖ్యానాన్ని రచించే ముందు ఆళ్వారులు చేసిన ప్రబంధ రచనల పేర్లు తెలిపి, ఆ తర్వాత ఆయా ప్రబంధాలను వెలయించిన ఆళ్వారుల చరిత్రను సంగ్రహంగా తెలిపి, ఆ ప్రబంధ పరమార్థాన్ని వ్యాఖ్యానం ప్రారంభించడం కంటే, ముందే చెప్పడం ఇందులో వ్యాఖ్యాత అనుసరించారు. ఆయా ప్రబంధాలను సరళసుందరంగా అందించడం, విషయాన్ని విద్యార్థి ఉపయోగంగా చెప్పడం, 'దివ్య ప్రబంధత్రయి'లో రాఘవాచార్యులవారు అనుసరించిన పద్ధతిగా మనం గుర్తించవచ్చు. అమ్మవారి వైభవమును తొలుదొల్తగా, సమగ్రంగా నాలుగు శ్లోకములలోనే ఇమిడించి అందించిన మహోనసదారులు శ్రీయామన మునులు. వారి అతి గంభీరార్థ గర్భితమై వెలయు 'కాన్తా చతుఃశ్లోకీ స్తోత్రము'నకు సరళమై, పూర్వాచార వ్యాఖ్యానములకు మరింత శోభను కూర్చు రీతిని రాఘవాచార్యులవారు తెనుగున వ్యాఖ్యానమును వెలయించినారు. పరాశర భట్టరువారి కృతి 'శ్రీగుణ రత్నకోశం' శ్రీదేవి యొక్క దివ్యగుణాలనే రత్నాలకు పెన్నిధి. ఆ పెన్నిధిని సులభంగా దర్శించుటకు, దానిని తమదిగా చేసికొనుటకు పరితపించే భక్తులకు, పాఠకులకు రాఘవాచార్యులవారు తమయొక్క జ్యోతిష్మతి వ్యాఖ్యానం ద్వారా చక్కగా దర్శనం చేయించి మనలను ధన్యులను చేసినారు. ఆ జగన్మాతకు శ్రీమన్నిగమాంత మహాదేశికులు సమర్పించిన పద్యప్రసూనమాలిక 'శ్రీస్తుతి'. దానికి అర్థతాత్పర్యాలు సమకూరుస్తూ, లలిత విశదంగా, పర్యాప్త విపులంగా, ప్రమాణ పరిమండితంగా శ్రీస్తుతికి మెరుగులు చిమ్ము 'హిరణ్మయీ' వ్యాఖ్యను రాఘవాచార్య స్వామివారు వెలువరించినారు. సంస్కృత సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి పొందిన మహాకావ్యం 'శిశుపాలవధ' మాఘ కావ్యంగా దానికి లోకంలో పేరుంది. ఇందులోని నలభై శ్లోకాలకు 'మాఘ కావ్య వైభవం' అనే పేరుతో రమణీయమైన వ్యాఖ్యానాన్ని స్వాములవారు అందించారు. రాఘవాచార్యులవారి వ్యాఖ్యాన చతురిమను, వారి బహుశాస్త్ర పరిచయాన్ని ఇది ప్రతిబింబింపచేస్తుంది. రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని, అందులోని స్వారస్యాలను, పోతన హృదయాన్ని, భాగవత తత్త్వాన్ని, రచనా వైఖరిని, పదప్రయోజనాలను, శబ్ద సంయోజనను గురించి విపులంగా వ్యాఖ్యానించిన రాఘవాచార్యులవారి 'వైష్ణవీ వ్యాఖ్య' పాఠకుని హృదయ కవాటాలను తెరిచి పలు విశేషాలను దర్శింపజేస్తుంది. 'నారాయణ శతకాన్ని' వ్యాఖ్యానించిన రాఘవాచార్యులుగారు ఇది ప్రాచీనమైన శతకమని, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల కదంబమని, పరబ్రహ్మ తత్త్వాన్ని, దశావతారాల స్వరూప, గుణ విభూతులను ఆవిష్కరించే సప్తశీర్షికల పద్య సమాహారమని, ఇది పోతనగారి రచనే అని విశ్లేషించి, అనవసరమైన అనుమానాలను నివృత్తి చేసినారు.



శ్రీమాన్ రాఘవాచార్యులవారు తమదైన ఒక వ్యాఖ్యాన శైలి ఏర్పరచుకొన్నట్లు కనబడుతుంది. ప్రతీ శ్లోకంలోను ప్రతిపదార్థం, వ్యాకరణ విశేషాలు, అలంకారాలు, వృత్త లక్షణాలు, వ్యుత్పత్తులు, తాము చెప్పిన అర్థాలకు ప్రమాణంగా నిఘంటువులనుండి వాక్యాలు, అక్కడక్కడ కనబడే ఇతరుల రచనలతో పోలికలు, ప్రసంగవశంచేత ఇతర వ్యాఖ్యాతల అభిప్రాయాలు ఇవన్నీ విశదీకరించడంలో, మహాదార్శనికుల రచనలతో సహజంగా, అప్రయత్నంగా ప్రవేశించే కొన్ని సాంప్రదాయిక దార్శనిక విషయాల స్పష్టీకరణము.. ఇదీ వారి వ్యాఖ్యాన పద్ధతి.

సాధారణంగా స్తోత్ర సాహిత్యమంతా దేవతాస్తుతి పరంగానే కనబడుతున్నా, కొన్ని స్తోత్రాలు కావ్యలక్షణాలను కలిగినవి కూడా వున్నాయి. వేద, పురాణేతిహాసాలలోని రహస్యాలు, ధర్మశాస్త్ర విషయాలు, సామాజికాంశాలు, మంత్రశాస్త్ర రహస్యాలు, శబ్దశాస్త్ర మర్మాలు, పూర్వోత్తర మీమాంసా దర్శనము సారములు ఇలా అనేక విషయాలను స్పృశిస్తూ కూడా స్తోత్ర రచనలు సాగాయి. చాలావరకు శ్రీవైష్ణవ సంప్రదాయాచార్యుల స్తోత్రాలు గొప్ప అర్థ గాంభీర్యమును కలిగివున్నాయి. శ్రీదేశికుల స్తోత్రాలకు శ్రీ ఆచార్యులవారు రచించిన వ్యాఖ్యానంలో 'వరదరాజ పంచాశత్'స్తోత్రానికి 'సర్వంకషా' అనే తెలుగు వ్యాఖ్యానాన్ని అనితర సాధ్యంగా రచించి, ఆ రచనలో ఆచార్యులవారు అద్భుతమైన ప్రతిభా వైదుష్యములు కనబరచారు. అలాగే శ్రీవేదాన్త దేశికులు రచించిన 'భగవద్ధ్యాన సోపానమనే' స్తోత్రం పన్నెండు శ్లోకాలు మాత్రమే గలది. నిత్యం అనుసంధానం చేసుకోవడానికి అనువైనది. కాని ఆ స్తోత్రంలోని అంతరార్థాన్ని సరళంగా సమర్థులైన ఆచార్యులు తెలియజేయకపోతే దాని మహత్తు మనకు తెలియదు. కనుక శ్రీమాన్ రాఘవాచార్యుల వారు 'మనోరమ' వ్యాఖ్య ద్వారా మనకు ఆ స్తోత్ర మాహాత్మ్యంతో పాటు శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యాలనూ తెలియజేశారు. గరుత్మంతునికి, గరుడధ్వజుడైన శ్రీమన్నారాయణునికి కూడా అమితానందాన్ని కలిగించే విధంగా గరుడమంత్ర బీజాక్షరాలను గురించి మంత్రోపాసకులైన, మహావిద్వాంసులైన శ్రీమద్వేదాంత దేశికులు ఈ గరుడ దండకాన్ని స్తోత్ర రూపంగా గానం చేశారు. గరుడ దండక వ్యాఖ్యానంలో 'గరుడ పంచాక్షరి' జప విధానాన్ని ఆచార్యులవారు విశదముగా వివరించారు. గరుడ వైభవాన్ని ఆవిష్కరించే వేదవాక్యాలను, పాంచరాత్రాగమంలోని, సంహితలలోని ప్రమాణ వాక్యాలను, శ్రీమద్రామాయణ భారత, భాగవతములలోని ఘట్టాలను ఉదాహరించారు. శ్రీశంకర భగవత్పాదులు రచించిన ప్రౌఢమైన రీతిలో శైలిలో వున్న ఈ 'విష్ణుపాదాది కేశాంత స్తోత్రం'లోని వైశిష్ట్యం సామాన్యమైన సంస్కృత భాషా జ్ఞానం వున్నవాళ్ళకు దుర్గ్రాహ్యమైనది. అనేకమైన అర్థాలంకారాలతో, శబ్దాలంకారాలతో అలంకృతమై అర్థ గాంభీర్యానికి, భావగాంభీర్యానికి నెలవైనది. ఈ స్తోత్రానికి, అత్యద్భుత పాండిత్య పూర్ణమైన విస్తృత వ్యాఖ్యానం రచించి శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యుల వారు భక్తలోకానికి అమూల్యమైన కానుకగా అందించారు.

శ్రీమాన్ రాఘవాచార్యులవారు తమదైన ఒక వ్యాఖ్యాన శైలి ఏర్పరచుకొన్నట్లు కనబడుతుంది. ప్రతీ శ్లోకంలోను ప్రతిపదార్థం, వ్యాకరణ విశేషాలు, అలంకారాలు, వృత్త లక్షణాలు, వ్యుత్పత్తులు, తాము చెప్పిన అర్థాలకు ప్రమాణంగా నిఘంటువులనుండి వాక్యాలు, అక్కడక్కడ కనబడే ఇతరుల రచనలతో పోలికలు, ప్రసంగవశంచేత ఇతర వ్యాఖ్యాతల అభిప్రాయాలు ఇవన్నీ విశదీకరించడంలో, మహాదార్శనికుల రచనలతో సహజంగా, అప్రయత్నంగా ప్రవేశించే కొన్ని సాంప్రదాయిక దార్శనిక విషయాల స్పష్టీకరణము.. ఇదీ వారి వ్యాఖ్యాన పద్ధతి. ఏ శ్లోకం తీసికొన్నా దాని వ్యాఖ్యానంలో ఈ పద్ధతిని చూడవచ్చు. ఇది అతి ప్రశస్తమైన ప్రాచీన సంస్కృతి వ్యాఖ్యా పద్ధతి. అట్లాగే తమ వ్యాఖ్యానానికి వేదాలు, ఇతిహాస పురాణాలు, పూర్వాచార్యుల స్తోత్రాలు, ఆగమాలు, ద్రావిడ వేదాలు (ఆళ్వారుల పాశురాలు) వాటినుండి సందర్భానుగుణంగా ఉదాహరణలు వ్యాఖ్యలు అందించి, వ్యాఖ్యానానికి పరిమళమద్దుతారు. వ్యాఖ్యానాలకు వారు పెట్టే పేర్లు కూడా వారి మనస్సుకు తగ్గట్లు పరిమళిస్తూ, పాఠకహృదయాన్ని రంజింపజేస్తూ, మూలానికి శోభను చేకూరుస్తూ వున్నందువలన తమ వ్యాఖ్యానాలకు 'పరిమళ, మనోరమ, దీపిక, అమృతాస్వాదినీ, చంద్రికా, సంజీవనీ, శ్రేయసీ, బుధరంజనీ, వైష్ణవి, సర్వంకషా'' వంటి పేర్లను బెట్టి తమ వ్యాఖ్యానమెట్టిదో తెలుపకనే తెలిపినారు. విస్తృతంగా వ్యాఖ్యాన రచనలు చేసి తెలుగునాట అపర మల్లినాథసూరిగా కొనియాడబడిన శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారు సంస్కృత సాహిత్యానికి విశేషించి దేశిక సాహిత్యానికి, శ్రీవైష్ణవ సంప్రదాయానికి చేసిన సేవ చిరస్మరణీయమైనది.

■ కె.పి.అశోక్‌కుమార్

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


ధనలక్ష్మి (ఫైల్)

మదిర టౌన్, మార్చి 23: డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ఓ విద్యార్థిని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన బుర్రి ధనలక్ష్మి (20) ఖమ్మం జిల్లా మదిరలో డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాస్తోంది. రోజూ మాదిరిగానే శుక్రవారం బోటనీ పరీక్ష రాసేందుకు ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి మదిరకు వచ్చింది. ఖాజీపేట నుంచి విజయవాడ వెళ్లే పుష్ పుల్ ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైలు స్టేషన్‌లో ఆగేందుకు నిదానంగా వస్తుండగా ఒక్కసారి రైలు కింద పడింది. ఆమె రైలు చక్రాల కింద ఇరుక్కుపోవడంతో రైలును నిలిపివేసి ఆమెను బయటకు తీయగా, అప్పటికే మృతిచెందింది. నర్సింహారావు, కళావతి దంపతుల చిన్న కుమార్తె ధనలక్ష్మి. గురువారం జరిగిన కెమిస్ట్రీ పరీక్ష సరిగా రాయలేదని చెప్పటంతో తండ్రి మందలించాడని, దాంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తల్లి కళావతి తెలిపారు.

ఇంటర్ స్పాట్‌లో తెలుగు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్, మార్చి 23: ఇంటర్ స్థాయిలో తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా ప్రవేశపెడతామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం చివరి నిమిషంలో ఆ ఆలోచనను విరమించుకోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఇంటర్ స్పాట్ కేంద్రం వద్ద తెలుగు అధ్యాపకులు ఆందోళనకు దిగారు. హన్మకొండ ఇంటర్ స్పాట్ వాల్యూవేషన్ కేంద్రం క్యాంపు అధికారి షేక్ అఫ్జల్‌కు నోటీసు అందజేశారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఇంటర్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి ఆందోళన చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుగు అధ్యాపకులు చెప్పారు.

చట్టబద్ధత కోసం పోరాటం

» వర్గీకరణపై వంగపల్లి శ్రీనివాస్
» జగిత్యాలలో డప్పు కళాకారుల ధర్నా


జగిత్యాలలో డప్పు కొడుతూ నిరసన తెలుపుతున్న కళాకారులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేంత వరకు తాము ఆందోళన కార్యక్రమాలను చేపట్టి పోరాడుతామని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఆదేశాలలో భాగంగా చెప్పులు, డప్పులు కుట్టే వారికి రూ.2వేల పింఛన్ చెల్లించాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలనే ప్రధాన డిమాండ్లతో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఒక రోజు దీక్షను చేపట్టారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ వచ్చిన ఆయనకు సుమారు 500 మంది మాదిగలు డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు మాదిగలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. 24 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిల పక్షాన్ని ఢిల్లీకి పంపడంతో పాటు రాష్ట్రంలో చెప్పులు కుట్టే, డప్పులు కొట్టే మాదిగలకు రూ.2 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటు బీజేపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. లేకపోతే తమ డిమాండ్ల సాధనకు దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. డప్పు కళాకారులు శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ తీసిన డప్పు కళాకారులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమకు నెలకు రూ.2 వేల జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. డప్పు కొడుతూ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు.

మాదిగల అభ్యున్నతికి కృషి: ఎంపీ కవిత


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎంపీ కవిత

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాదిగల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా వచ్చిన ఎంపీ కవిత, పూలాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. మాదిగ జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పడానికి ఎమ్మార్పీఎస్ తెలంగాణ శాఖ విశేష కృషి చేస్తోందని కొనియాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. కేసీఆర్ భోళా శంకరుడని, అడిగాన్నే అన్ని వరాలు ఇచ్చేస్తారన్నారు. కొంత ఆలస్యం అవుతున్నా డప్పు, చెప్పు కళాకారుల పింఛన్ విషయం పరిశీలనలో ఉందన్నారు. త్వరలో శుభవార్త వింటారని ఆశిస్తున్నానన్నారు.

కేతేపల్లికి మరో ఉన్నత పదవి
రాజ్యసభకు లింగయ్య యాదవ్ ఎన్నిక


లింగయ్య యాదవ్

కేతేపల్లి, మార్చి 23: టీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా బడుగుల లింగయ్య యాదవ్ గెలుపొందడంతో చట్టసభల్లో నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి మండలానికి ప్రాధాన్యంగల మరో పదవి లభించినట్టయింది. ఇప్పటికే కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన నేతి విద్యాసాగర్ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అదే గ్రామానికి చెందిన పూల రవీందర్ ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామానికి చెందిన బలహీన వర్గాల సీనియర్ నాయకుడు బడుగుల లింగయ్య యాదవ్ శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో లింగయ్య యాదవ్ ఎన్నిక పట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు వైద్యుడు రఘురామ్‌కు అరుదైన గౌరవం

» యూరోపియన్ బ్రెస్ట్ కేన్సర్ కాన్ఫరెన్స్‌లో గెస్ట్ స్పీకర్‌గా ప్రసంగం

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. బార్సిలోనాలో ఈ నెల 21న ప్రారంభమైన యూరోపియన్ బ్రెస్ట్ కేన్సర్ కాన్ఫరెన్స్‌కు ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి గెస్ట్ స్పీకర్‌గా పాల్గొనే అరుదైన అవకాశం ఆయనకు లభించింది. ఈ సందర్భంగా సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రొమ్ము కేన్సర్‌పై పెద్దఎత్తున పింక్ రిబ్బన్ క్యాంపెయిన్ నిర్వహించి, అవగాహన కల్పించినట్లు తెలిపారు. ముందస్తు పరీక్షల ఆవశ్యకతను వివరించడంతో చాలామంది మహిళల ప్రాణాలను కాపాడినట్లు వివరించారు. శనివారంతో ముగియనున్న సదస్సుకు 90దేశాల నుంచి 2,500మంది ప్రతినిధులు హాజరవుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఆరు నెలలుగా వేతనాల్లేవ్ : సండ్ర

» సర్పంచ్‌ల గౌరవవేతనం పెంచాలి: కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ(ఆర్‌డబ్ల్యూఎస్)లోని 4,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని టీడీపీ ఎమ్మెల్యే వెంకట వీరయ్య అన్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న ఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వీరిని మిషన్‌భగీరథలోకి తీసుకోవాలని శాసనసభలో శుక్రవారం పద్దులపై జరిగిన చర్చలో డిమాండ్ చేశారు. మరో ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కరెంటు బిల్లులు కూడా కట్టలేని స్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటికి నిధులు సమకూర్చాలన్నారు. మిషన్ భగీరథ కింద గ్రామాల్లోని పాత లైన్ల రీప్లేసింగ్ జరగడంలేదని, మునిసిపల్ శాఖలో మంత్రికి ఉన్న స్పీడు యంత్రాంగానికి లేదని ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. మెట్రో రైల్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో పెంచినట్లే రాష్ట్రంలోని మిగిలిన మునిసిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామజ్యోతి పథకంపై ప్రభుత్వం హడావుడి చేసిందని, దీనికి సంబంధించిన విధులు, నిధులు ప్రకటించాలన్నారు.

అలా జరిగినప్పుడే బంగారు తెలంగాణ : సోమారపు

» పంచాయతీ కార్యదర్శుల సంఖ్య పెంచాలి: వెంకట్రావు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఎవరూ లేనప్పుడే బంగారు తెలంగాణ సాధించినట్లుగా భావించాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి జరుగుతోందని, భవిష్యత్తులో అందరూ దారిద్ర్య రేఖకు ఎగువనే ఉంటారని పద్దులపై చర్చ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు పెరిగినందున పంచాయతీ కార్యదర్శుల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరముందన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

» మోసగాళ్లను పోలీసులకు పట్టించిన బాధితుడు

రెంజల్, మార్చి 23: స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, రూ.55 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన ముగ్గురు వ్యక్తులను బాధితుడు చాకచక్యంగా పోలీసులకు పట్టిచ్చాడు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట వీరన్నగుట్ట గ్రామానికి చెందిన రాథోడ్ కిరణ్ కుమార్ అనే ఇంజినీరింగ్ డిప్లొమా చేస్తున్న యువకుడు రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-2017 డిసెంబరు నెలలో వరంగల్‌లో నిర్వహించిన 200 మీటర్ల పరుగు పందెం పోటీలో బంగారు పతకం సాధించాడు. కిరణ్‌కుమార్‌కు సంబంధించిన ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్ వరంగల్‌లో నమోదు కావడంతో దాన్ని ఆధారంగా చేసుకున్న వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దేవిలాల్ తండాకు చెందిన ఇసావత్ హరీష్ నాయక్, జి చందు, భానుకుమార్‌లు అతడికి ఫోన్ చేశారు. శ్రీలంకలో పరుగు పందెం పోటీలున్నాయని, మన రాష్ట్రం నుంచి నీకు అవకాశాన్ని కల్పిస్తున్నామని, ఇందుకు 50 వేల రూపాయలు ఖర్చవుతాయని, పోటీల తర్వాత స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని తెలిపారు. దాన్ని నమ్మిన కిరణ్ కుమార్ మొదట 15 వేల రూపాయల్ని ఇచ్చాడు. మరోమారు సదరు వ్యక్తుల బ్యాంకు అకౌంటుకు మరో రూ.15 వేలు పంపించాడు. ఆ తరువాత మరో 25 వేల రుపాయలు సిద్ధం చేసుకోవాలని, త్వరలో శ్రీలంక పంపుతున్నట్లు ఓ నకిలీ పత్రాన్ని సృష్టించి కిరణ్ కుమార్‌కు వాట్సాప్ మెసేజ్ పంపారు. అతడు ఆ సర్టిఫికెట్‌ను నిజామాబాద్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధికారి సాయిలుకు చూపించాడు. అది తప్పుడు పత్రం అని ఆయన నిర్ధారించారు. మోసగాళ్ల ఆట కట్టించడానికి బాధితుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయుడు ఓ వ్యూహం పన్నారు. తమ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు మీకు సన్మానం చేస్తారని, తర్వాత 25 వేల రూపాయలను మీకు అందజేస్తామని నమ్మించి నిందితులను రప్పించారు. గురువారం రాత్రి నిందితులు వీరన్నగుట్ట చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నిందితులు ఈ కార్యక్రమానికి పోలీసులను పిలుస్తామని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ముందే సమాచారం తెలిసిన ఎస్ఐ, ఆ మోసగాళ్లను అదుపులోకి తీసుకున్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

ఆడ శిశువుల అమ్మకం

» రూ. 20 వేలకు కవలల విక్రయం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 23: నవ మాసాలు మోసి జన్మనిచ్చిన కవల పిల్లలను ఆ తల్లి అమ్మకానికి పెట్టింది. ఇద్దరు శిశువులనూ రూ.20 వేలకు విక్రయించింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రకాష్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం డీఎస్పీ శ్రీనివాస్ సంఘటన వివరాలను వెల్లడించారు. జనవరి 11న ఆంగోతు సునీత అనే మహిళ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇద్దరు ఆడ శిశువులకు జన్మనిచ్చింది. అప్పటికే ఆడ పిల్లలున్న సునీత, రామ్ బిక్షపతి దంపతులు ఈ కవల పిల్లలను అమ్మేందుకు సిద్ధపడ్డారు. మిర్యాలగూడ పట్టణవాసి అయిన షేక్ ఇస్మాయిల్, తస్లీం దంపతులు, ఖమ్మం ఖిల్లా బజార్‌కు చెందిన షేక్ నియామతుల్లా, వసీం సుల్తానాలు చెరో పదివేల రూపాయలను ఆడ శిశువుల తల్లిదండ్రులకు చెల్లించి పిల్లలను తీసుకెళ్లారు. ఈనెల 17న ప్రకాష్ నగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఆంగోతు సునీత ఇంటికెళ్లి ఇద్దరు ఆడపిల్లలేరని ప్రశ్నించగా, శిశు గృహకు అప్పగించామని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన ఆమె, విషయాన్ని సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లగా శిశు గృహలో విచారణ చేపట్టారు. ఆడశిశువుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేపట్టిన పోలీసులు ఆడ శిశులను అమ్ముకున్నట్లుగా నిర్ధారించి తల్లిదండ్రుల తోపాటు కొనుగోలు చేసిన దంపతులు, సహకరించిన మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

» రూ.2.60 లక్షల విలువైన విత్తనాలు సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సిరిసిల్ల మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గోదాంను తనిఖీ చేసి రూ. 2.60లక్షల విలువైన 99పత్తి విత్తనాల పాకెట్లు, 100కిలోల పత్తి విత్తనాలను సీజ్‌చేశారు. బైపాస్ రహదారిలోని ఓ గోదాంలో వివిధ కంపెనీల పేరిట లేబుళ్ల కలిగిన నకిలీ విత్తనాలను నిల్వ చేశారు. నకిలీ విత్తనాలు నిల్వచేసిన మానకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన సేల్స్ మేనేజర్ కోట శ్రీనివాస్(36)ను అరెస్ట్ చేశారు. ఇతనికి సహకరించిన మరో వ్యాపారి పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు.

నేడు ఎర్త్ అవర్

» గంటపాటు స్వచ్ఛందంగా విద్యుత్ నిలిపివేత
» ఆదర్శంగా రాజ్‌భవన్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం శనివారం రాత్రి 8.30గంటల నుంచి 9.30గంటల వరకు ఎర్త్ అవర్ నిర్వహించనున్నారు. స్వచ్ఛందంగా ఎవరికివారు తమ ఇళ్లల్లో, కార్యాలయాల్లో గంటపాటు కరెంట్ సరఫరాను నిలిపివేసుకోనున్నారు. ఏటా రాజ్‌భవన్ ఎర్త్ అవర్‌ను పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈసారి కూడా రాజ్‌భవన్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను షట్‌డౌన్ చేస్తారు. ఉద్యోగుల క్వార్టర్లతో పాటు సుధర్మ కార్యాలయ సముదాయం, దర్బార్‌హాలు, నార్త్ బ్లాక్ గెస్ట్‌హౌస్, న్యూగెస్ట్ హౌస్‌లలో విద్యుత్‌ను గంటపాటు నిలిపివేస్తామని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. రాష్ట్రమంతా ఎర్త్ అవర్ పాటించాలనిపలువురు కోరుతున్నారు.

ఎర్త్ అవర్ విశేషాలు..

- వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఎర్త్ అవర్ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. దీన్ని భారత దేశంలో ఎర్త్ హౌస్ ఇండియా సంస్థ ముందుకు తీసుకెళ్తోంది.
- పర్యావరణ పరిరక్షణ కోసం, విద్యుత్ పొదుపు కోసం గంటపాటు స్వచ్ఛందంగా కరెంటును నిలిపివేస్తారు.
- 2007 ఆస్ట్రేలియాలోని సిడ్నీలో తొలిసారిగా ఎర్త్ అవర్‌ను పాటించారు. ఆపై 187 దేశాల్లోని 7వేల నగరాల్లో నిర్వహించారు.
- తెలంగాణలో గంటపాటు ఎర్త్ అవర్‌ను పాటిస్తే... దాదాపు 85 లక్షల యూనిట్ల కరెంట్ అవుతుంది. దీంతో సుమారు రూ.5 కోట్ల దాకా నిధులు ఆదా అవుతాయి.



★ అహం తొలగితేనే పరమాత్మ దర్శనం



ఒకప్పుడు దేవదానవులకు యుద్ధం జరిగింది. దేవతలు గెలిచారు. ఆ విజయానికి కారణం తమ శక్తియుక్తులేనన్న గర్వం వారిలో పెరిగింది. దీన్ని కనిపెట్టిన పరమాత్మ.. భూమ్యాకాశపర్యంతం ఒక దుర్నిరీక్షమైన ప్రకాశంలా అవతరించాడు. దేవతలకు ఆశ్చర్యం వేసింది. ఆ కాంతి ఏమిటా అని ఆలోచించారు. దాన్ని పరిశీలించి రమ్మని అగ్నిహోత్రుణ్ని పంపారు. ఆయన అక్కడికి వెళ్లగానే.. 'నీవు ఎవరు' అనే ప్రశ్న ఆ ప్రకాశం నుంచి వినిపించింది. 'నేను అగ్నిహోత్రుణ్ని. అన్నిటినీ కాల్చేస్తాను' అన్నాడాయన. 'ఏదీ ఆ గడ్డిపోచను కాల్చు చూద్దాం' అన్నదా ప్రకాశం. ఆయన ఎంత ప్రయత్నించినా గడ్డిపోచను కాల్చలేక అవమాన భారంతో వెనుదిరిగాడు. తర్వాత వాయువు వెళ్లి.. గడ్డిపోచను ఇసుమంతైనా కదల్చలేక తిరుగుముఖం పట్టాడు. మూడోమారు ఇంద్రుని వెళ్లిరమ్మన్నారు దేవతలు. అప్పుడాయన.. అగ్నిహోత్రుడికి, వాయుదేవుడికి శృంగభంగం చేసిందంటే ఆ ప్రకాశానికి ఎంత శక్తి ఉన్నదోకదా.. అని ఆయన నడుస్తూ ఆలోచించడం ప్రారంభించాడు. ఆలోచించిన కొద్దీ.. ఆ వెలుగు పరమాత్మ స్వరూపమేనని అర్థమైంది. ఇంద్రుడికి ఆ ఎరుక కల్గగానే ఆ ప్రకాశం అంతరించి పరమ కరుణాస్వరూపిణి అయిన ఉమా దేవి ఆకాశమధ్యంలో గోచరించింది. ఆ తల్లికి చేతులెత్తి నమస్కరించాడు స్వర్గాధిపతి. 'నీవు చూచినది ఆ పరబ్రహ్మ స్వరూపం. ఈ ప్రపంచానికీ సమస్త దేవాసురులకు అన్నిటికీ కారణం ఆయనే. సృష్టిలోని అన్ని రూపాలూ ఆ పరమాత్మవే' అని అంబ అమరేంద్రుడికి బోధించింది. ఈ కథలో.. అగ్నికి, వాయువుకు అవమానం జరిగింది వారి మనసు నొప్పించేందుకు కాదు. అహంభావాన్ని తొలగించడం కోసం. అహంభావం ఉన్నవారికి పరమాత్మ దర్శనం కాదు. ఆ పొర ఎప్పుడైతే తొలగిపోతుందో ఆ క్షణమే పరబ్రహ్మస్వరూపం అవగతమవుతుందని కేనోపనిషత్తులోని ఈ కథ చెబుతుంది.

-చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి

('జగద్గురు బోధలు' నుంచి)

Paramjyothi పరంజ్యోతి

డిగ్రీ సీట్లలో కోత!

- తెలంగాణ ఉన్నత విద్యామండలి కసరత్తు
- సుమారు 60వేల సీట్లు కోత పడే అవకాశం
- 186 కాలేజీల్లో 25% కన్నా తక్కువ సీట్లు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డిగ్రీ సీట్లలో కోత పెట్టేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి లెక్కల్ని తీస్తోంది. 25% కన్నా తక్కువ సీట్లు భర్తీ అయిన కాలేజీల జాబితాను సిద్ధం చేసింది. ఈ లెక్కల ప్రకారం 2017-18 విద్యా సంవత్సరంలో 186 కాలేజీల్లో 25% కన్నా తక్కు సీట్లు భర్తీ అయినట్లు అధికారులు తేల్చారు. 2016-17 విద్యా సంవత్సరంలో 157 కాలేజీల్లో 25% కన్నా తక్కువ అడ్మిషన్లు అయినట్లు గుర్తించారు. 2017-18లో కాకతీయ వర్సిటీ పరిధిలో 25% కన్నా తక్కువ అడ్మిషన్లు గల కాలేజీలు 68 ఉండగా.. ఉస్మానియా పరిధిలో 43 ఉన్నాయి. తాజా లెక్కల ప్రకారం ఈ కాలేజీల్లో 2018-19కి గానూ అడ్మిషన్లు నిరాకరించనున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 60 వేల సీట్లకు కోత పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో మొత్తం 1,092 కాలేజీల్లో 4,10,267 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 2017-18లో కేవలం 1,95,555 సీట్లు భర్తీకాగా.. 2,14,712 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రతి ఏడాది 2లక్షలకు పైగా సీట్లు మిగిలిపోతుండటంతో సీట్లకు కోత పెట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

25 శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు ఉన్న కాలేజీల వివరాలు

యూనివర్సిటీ	2016-17	2017-18
కాకతీయ	68	68
ఉస్మానియా	25	43
శాతవాహన	29	25
పాలమూరు	12	20
తెలంగాణ	09	14
మహాత్మాగాంధీ	14	16
మొత్తం	157	186

ఇక కాంగ్రెస్ అవిశ్వాసం!

(మూడో పేజీ తరువాయి)

టీడీపీకి 16 మంది, వైసీపీకి 9 మంది ఎంపీలున్నారు. బయట పార్టీల మద్దతు లెక్కించాల్సిన పని లేకుండా తీర్మానాన్ని చేపట్టవచ్చు., శుక్రవారం ఆరో రోజూ టీడీపీ, వైసీపీ అవిశ్వాసాన్ని ప్రయోగించినా హౌస్ ఆర్డర్ లేదంటూ స్పీకర్ సుమిత్ర మహాజన్ బుట్టదాఖలు చేశారు. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు ఫ్లకార్డులు పట్టుకుని, కొందరైతే పార్టీ జెండానీ కూడా తీసుకొచ్చి వారి స్థానాల్లోనే నిలబడి నిరసన తెలియజేశారు. వైసీపీ ఎంపీలు వారి స్థానాలకే పరిమితమయ్యారు. పార్టీ విప్ అందకున్న కొత్తపల్లి గీత, బుట్టారేణుక కూడా వెల్‌లోకి వెళ్లకుండా సీట్లకే పరిమితమయ్యారు. భగత్ సింగ్‌కు సభ నివాళి అర్పించిన వెంటనే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. ఆందోళనలతో నిమిషంలోపే సభ వాయిదా పడింది. సభ తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన తర్వాత టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు ఆందోళనలు మరింత పెంచారు. టీడీపీ, వైసీపీల అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ ప్రస్తావించారు. అన్నాడీఎంకే ఎంపీలు 'ఓ' అంటూ అరవడంతోపాటు, నోటిపై అరచేతిని కొట్టుకుంటూ పెద్ద శబ్దం వచ్చేలా గందరగోళం సృష్టించారు. టీఆర్ఎస్ సభ్యులు ఫ్లకార్డులు స్పీకర్‌కు అడ్డుగా పెట్టారు. అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేవారిని లెక్కించలేనంటూ స్పీకర్ నోటీలను తిరస్కరించారు. సభ్యుల కోరిక మేరకు శ్రీరామనవమి సందర్భంగా సోమవారం సభకు సెలవు ప్రకటించారు. మంగళవారం లోక్‌సభ సమావేశం కానుంది. ఆ రోజు కోసం టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ శుక్రవారమే స్పీకర్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసు అందజేశారు. కాగా, టీడీపీ, వైసీపీ అవిశ్వాస తీర్మానాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్, అన్నాడీఎంకే సీనియర్ నేత తంబిదురై స్పష్టం చేశారు.

కొనసాగిన టీఆర్ఎస్ నిరసనలు

సుప్రీంకోర్టు ఆదేశాలు చూపుతూ కేంద్రం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తోందంటూ టీఆర్ఎస్ ఎంపీలు నిరసన పోరు ఉధృతం చేశారు. టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, వినోద్, మల్లారెడ్డి, నగేష్, బాల్కసుమన్, కొండా విశ్వేశ్వరరెడ్డి, బీబీ పాటిల్, బూరా నర్సయ్యగౌడ్, సీతారామ్‌నాయక్, పసునూరి దయాకర్. నగేష్ ఫ్లకార్డులు పట్టుకుని వెల్‌లో ఆందోళనలకు దిగారు. కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుపై అన్నాడీఎంకే ఎంపీలు పోడియం దగ్గర ఆందోళన చేపట్టారు.

కేంద్రం రాయబారం

పార్లమెంటు సమావేశాలను అడ్డుకోవద్దని విపక్షాలకు కేంద్ర మంత్రి విజయ్ గోయల్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాజ్యసభలో కొంతమంది సభ్యులకు వీడ్కోలు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. గ్రాట్యుటీ బిల్లును ఎటువంటి చర్చ జరపకుండానే ఆమోదించినట్లే మరికొన్ని బిల్లులకు కూడా విపక్షాలు ఆమోదం తెలుపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరవధిక వాయిదా ఎందుకు వేయడం లేదని ప్రజలు అడుగుతున్నారు: వెంకయ్య

రాజ్యసభ పనితీరుపై ఛైర్మన్ వెంకయ్య నాయుడు తీవ్ర అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సభ ప్రారంభమైన వెంటనే ఆయన తన అవేదనను వ్యక్తపర్చారు. కానీ దాన్ని కూడా ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా వెంకయ్య నాయుడు కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ... మూడు వారాలుగా సభ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతూనే ఉందన్నారు. "నా సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇలాంటి సంఘటనలు చాలా తక్కువగా చూశాను. అందులో ఇదొకటి. ఛైర్మన్‌గా నేను అన్ని ప్రయత్నాలు చేశాను, కానీ ఫలితం మాత్రం లేదు" అని నిస్సాయత వ్యక్తం చేశారు. కొందరు లేవనెత్తుతున్న అంశాల గురించి తాను అర్థంచేసుకున్నానని, కానీ వారాలు వారాలుగా సభను స్థంభించడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. శ్రేయోభిలాషుల నుంచి తనకు కాల్స్ వస్తున్నాయని, సభను నిరవదికంగా ఎందుకు వాయిదా వేయడం లేదని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. వెంకయ్య మాట్లాడడం ముగియగానే టీడీపీ ఎంపీలు సీఎం రమేశ్, తోటా సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్, గరికపాటి మోహన్ రావు వెల్‌లోకి వచ్చారు. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని పేర్కొని ఉన్న ఫ్లకార్డులను పట్టుకొన్ని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు ఫ్లకార్డు పట్టుకొని వెల్‌లోకి దూసుకొచ్చారు. విజయసాయి రెడ్డి సభలోనే ఉన్నా వెల్‌లోకి రాలేదు.

గెలుపు గులాబీ

(మూడో పేజీ తరువాయి)

32 ఓట్లు పోలవ్వగా, కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు 10 ఓట్లు పోలయ్యాయి. 82 టీఆర్ఎస్, 7 ఎంఐఎం, 1 సీపీఐ, 7 కాంగ్రెస్ ఫిరాయింపుదారుల ఓట్లు టీఆర్ఎస్ అభ్యర్థులకు పడినట్లు తెలుస్తోంది.

మొదటి ఓటు ఈటలది

రాజ్యసభ ఎన్నికల్లో మొదటి ఓటును మంత్రి ఈటల రాజేందర్ వేయగా, రెండో ఓటు మంత్రి మహేందర్ రెడ్డి, మూడో ఓటు మంత్రి హరీశ్ రావు వేశారు. టీఆర్ఎస్‌లో చివరి ఓటును రాజేందర్ రెడ్డి వేయగా.. మొత్తం పోలింగ్‌లో చిట్టచివరి ఓటును కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి 3 గంటల ప్రాంతంలో వేశారు. సీఎం కేసీఆర్ మాత్రం మధ్యాహ్నం వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌లో బీజేపీ, టీడీపీ, సీపీఐ పాల్గొనలేదు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ రెడ్డి సీఎల్పీకి వచ్చినా.. ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ తదితరులు 11 గంటల ప్రాంతంలో ఓటు వేశారు. టీఆర్ఎస్ భవన్ నుంచి ఆ పార్టీ సభ్యులు బస్సులో వచ్చారు. టీఆర్ఎస్ తరపున ప్రతినిధులుగా మందాడి రమేశ్ రెడ్డి, రావుల శ్రవణ్ కుమార్ రెడ్డి, నైనేని రాజేశ్వరరావు వ్యవహరించగా, కాంగ్రెస్ పక్షాన ప్రతినిధులుగా మల్లు రవి, సీతక్క వ్యవహరించారు. ఐదు గంటలకు లెక్కింపు ప్రారంభించాల్సి ఉండగా.. దొంతి మాధవ రెడ్డి ఓటు గురించి ఈసీ వివరణ తీసుకోవడానికి వేచి చూసినందున కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. కాగా, గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

టీఆర్ఎస్ సంబురాలు

రాజ్యసభ ఎన్నికల్లో మూడింటికి మూడు సీట్లను తమ పార్టీ గెలుచుకోవడంతో టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. విజేతలు సంతోష్, ప్రకాశ్, లింగయ్యలకు శుభాకాంక్షలు తెలిపేందుకు టీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు భారీగా అసెంబ్లీకి తరలి వచ్చారు. విజయ ఢంకా మోగించిన ఎంపీలని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, ముఖ్య నాయకులు అభినందనలతో ముంచెత్తారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు. వారికి అభినందనలు తెలిపేందుకు ముదిరాజ్, యాదవ సంఘాల నేతలు భారీగా తరలి వచ్చారు. వారితో కలిసి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కుకు వెళ్లిన ఎంపీలు.. తెలంగాణ అమరుల స్థూపానికి నివాళి అర్పించారు. డప్పు చప్పుళ్లతో కార్యకర్తలు, నేతలు గన్‌పార్క్‌ని హోరెత్తించారు. అనంతరం, బేగంపేటలోని ప్రగతి భవన్‌కి వెళ్లిన ఎంపీలు సీఎం కేసీఆర్‌ని కలిశారు. ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, టీఆర్ఎస్ సభ్యుల విజయంతో తెలంగాణ భవన్‌లో సంబురాలు అంబరాన్నంటాయి. భారీగా బాణసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



సీఎం కేసీఆర్‌తో సంతోష్ కుమార్ ఆలింగనం

ఫిరాయింపుదారులపై ఫిర్యాదు

కాంగ్రెస్ ఫిరాయింపుదారులు ఏడుగురూ టీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేశారు. వారిలో విఠల్ రెడ్డి తన ఓటును సంతోష్‌కు వేయగా మిగిలిన సభ్యులు బండ ప్రకాశ్‌కు వేశారని కాంగ్రెస్ విప్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పార్టీ తరపున తాము విప్ జారీ చేసినా, వారు (కాలె యాదయ్య, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, డీఎస్ రెడ్యానాయక్, కోరం కనకయ్య, పువ్వాడ అజయ్ కుమార్, జి.విఠల్) టీఆర్ఎస్‌కు ఓటు వేశారంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి పోలింగ్ ఏజెంట్ రేగ కాంతారావు ఫిర్యాదు చేశారు. వారి ఓట్లను పరిగణనలోకి తీసుకోవద్దని లేఖలో కోరారు. కాగా, అధికారులు మాత్రం వారి ఓట్లను పరిగణనలోకి తీసుకున్నారు.

నూతన ఎంపీలకు స్పీకర్ శుభాకాంక్షలు

తెలంగాణ నుంచి కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన టీఆర్ఎస్ అభ్యర్థులు సంతోష్, ప్రకాష్, లింగయ్య యాదవ్‌లకు స్పీకర్ మధుసూదనాచారి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తన చాంబర్‌లో నూతన ఎంపీలను అభినందించారు.



రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సంతోష్‌కుమార్‌కు మిఠాయి తినిపిస్తున్న ఈటల రాజేందర్

6కు చేరిన టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల సంఖ్య

రాజ్యసభలో టీఆర్ఎస్ సభ్యుల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటి వరకు ఆ పార్టీ తరఫున కె.కేశవ రావు, డి.శ్రీనివాస్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా, జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్ ఎన్నికయ్యారు. ఉభయ సభల్లోనూ కలిపితే టీఆర్ఎస్ ఎంపీల సంఖ్య 17కు చేరింది. వారిలో లోక్‌సభ సభ్యులు 11 మంది, రాజ్యసభ సభ్యులు ఆరుగురు. టీడీపీ నుంచి గెలిచిన మల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి గెలిచిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైసీపీ నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం టీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. వీరిని కూడా కలిపితే టీఆర్ఎస్ ఎంపీల సంఖ్య 20కి చేరుకుంది.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా

నాపై నమ్మకంతో సీఎం కేసీఆర్ అప్పగించిన కర్తవ్యాన్ని నెరవేరుస్తాను. ఈ అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా విజయం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు.

- సంతోష్‌కుమార్

గొర్రెలు, చేపలే కాదు.. పదవులూ ఇచ్చారు

సీఎం కేసీఆర్ మాకు గొర్రెలు, చేపలతోపాటు రాజకీయ పదవులను కూడా ఇచ్చారు. బలహీన వర్గాలకు చెందిన మాకు రాజ్యసభకు వెళ్లే అవకాశం ఎన్నడూ రాలేదు. అరుదైన అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. పేదవర్గాలంటే ఎన్నడూ కాంగ్రెస్‌కు సానుకూల దృక్పథం లేదు.

- బండ ప్రకాశ్

కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు

బడుగు, బలహీన వర్గాలకు చెందిన మాకు రాజ్యసభకు వెళ్లే అవకాశం లేక లేక వస్తే.. సంఖ్యా బలం లేకున్నా కాంగ్రెస్ అడ్డుకోవాలని చూసింది. పేద వర్గానికి చెందిన బలరాం నాయక్‌ను బరిలో నిలిపి బలహీనవర్గాల మధ్య గొడవ పెట్టించేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు. నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో చూశా. నయా పైసా ఖర్చు లేకుండా మమ్మల్ని కేసీఆర్ రాజ్యసభకు పంపారు.

- లింగయ్యయాదవ్

కాంగ్రెస్.. దుర్మార్గపు, చిల్లర పార్టీ

- ప్రజలు ఆ పార్టీ పని పడతారు: ఈటల

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దుర్మార్గపు, చిల్లర పార్టీ కాంగ్రెస్ అని, రానున్న రోజుల్లో ప్రజలే ఆ పార్టీ పని పడతారని మంత్రి ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఆ పార్టీ పాలనలో ముదిరాజ్, యాదవ సామాజికవర్గాలకు రాజకీయంగా ఏనాడూ ప్రాధాన్యం లభించలేదని, వారికి న్యాయం చేయాలని ప్రకాశ్ ముదిరాజ్, లింగయ్య యాదవ్‌లను సీఎం కేసీఆర్ రాజ్యసభకు పంపాలని భావించారని తెలిపారు. ఆయన నిర్ణయంతో కళ్లు కుట్టిన కాంగ్రెస్.. ఇంగిత జ్ఞానం లేకుండా అభ్యర్థిని బరిలో నిలిపిందన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించిన టీఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఓటరు కాని వ్యక్తిని బరిలో ఎలా నిలుపుతారు?: నాయిని

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మరోసారి తడబడ్డారు. రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఎమ్మెల్యే కాని వ్యక్తిని రాజ్యసభ ఎన్నికల బరిలో ఎలా నిలుపుతారు? కాంగ్రెస్‌ది అసమర్థ నాయకత్వం. ఓటరు కానోన్ని ఎలక్షన్లో నిలబెట్టింది. బలరాం నాయక్ ఓటరు కాదు. ఆయన ఎమ్మెల్యే కాదు. ఆయన్ని ఎన్నికల్లో నిలబెట్టడంలో అర్థం ఏంటి?" అని ప్రశ్నించారు. అనవసరంగా ఓటరు, మెంబరు, ఎమ్మెల్యే కానోన్ని రాజ్యసభకు పోటీ చేయించి అభాసుపాలయ్యారని విమర్శించారు. అయితే, టీఆర్ఎస్ అభ్యర్థులు కూడా ఎమ్మెల్యేలు కాదని విలేకరులు ప్రశ్నించగా.. "మా ముగ్గురు అభ్యర్థులు పార్టీ అభ్యర్థులు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థులు. మాకు బలం ఉంది. ఓటరు కానోడిని నిలబెట్టినా గెలుస్తామనే శక్తి ఉంది. అందుకే నిలబెట్టాం" అని తన వ్యాఖ్యల్ని సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్‌కు ఓటు వేయించుకునే తెలివి లేదు: జగదీశ్‌రెడ్డి

రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు ఎలా వేయించుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఉందని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గెలిచేందుకు అవసరమైన మెజారిటీ లేకపోయినా టీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతోనే అభ్యర్థిని బరిలో నిలిపిందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలు కూడా ఇలాగే ఉంటాయన్నారు.



ఓటుహక్కును వినియోగించుకునేందుకు వస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కేసీఆర్‌వి నీచ రాజకీయాలు

- ఆ ఎమ్మెల్యేలపై వేటు వేయాలి: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాజకీయాల్ని అతి నీచమైన స్థితికి దిగజార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికల్లోనూ అలాగే వ్యవహరించారన్నారు. కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఏడుగురు ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రెడ్యానాయక్, భాస్కర్‌రావు, చిట్టం రామ్మోహన్‌రెడ్డి, కోరం కనకయ్య, విఠల్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేశారన్నారు. ఈ ఓట్లను లెక్కలోకి తీసుకోవద్దని ఈసీ, రిటర్నింగ్ అధికారిని కోరామని చెప్పారు. ఫిరాయింపు చట్టాన్ని ఉల్లంఘించిన ఏడుగురు ఎమ్మెల్యేలపైనా అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని ఉత్తమ్ చెప్పారు. తన ఫిర్యాదుకు సంబంధించి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరగా.. సీఎంతోనో లేదా స్పీకర్‌తోనో ఫోన్‌లో మాట్లాడిన అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచారి ఇవ్వకుండానే పంపించారని, ఇంత దారుణం మరెక్కడా ఉండదన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ నాలుగేళ్లుగా ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆరోపించారు.

లోకం తీరు



భయపడాల్సిన అవసరం ఏమీ లేదు సార్.. అవి మనకు తగిలేవి కాదులేండి !

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.0	13.6
రామగుండం	39.2	19.2
హైదరాబాద్	38.3	21.3
వరంగల్	38.0	20.5
నల్లగొండ	39.8	25.0

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 14గంటలు, దివ్యదర్శనానికి 2గంటల సమయం పడుతోంది. ఆదివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.


- ఆంధ్రజ్యోతి, తిరుమల



ముఖ్యమంత్రి కేసీఆర్ పిలిస్తే.. టీఆర్ఎస్‌లో చేరుతా..

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానిస్తే టీఆర్ఎస్‌లో చేరేందుకు నేను సిద్ధం. నా సేవలు ఎలా ఉపయోగించుకుంటారో ఆయన ఇష్టం. నా జాతి సంక్షేమం కోసం పాటుపడుతున్న కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా.

- సినీనటుడు సుమన్



చైనాతో మనకు మిత్రశత్రుత్వం

భారత్, చైనా స్నేహసంబంధాల నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సి ఉంది. చైనాతో మనకు ఉన్నది మిత్రశత్రుత్వం. విభేదాలను అంగీకరిస్తూనే ఆ దేశంతో కలిసి ముందుకు సాగుతుంటాం.

- భారత రాయబారి సయిద్ అక్బరుద్దీన్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.56	పాత ధర 68.46
కొత్త ధర రూ.76.65	కొత్త ధర 68.66
పెరుగుదల 9 పైసలు	పెరుగుదల 20 పైసలు




యాంటిఆక్సిడెంట్లతో మనోవ్యాధికి చెక్

లండన్, మార్చి 23: కొన్ని రకాల యాంటిఆక్సిడెంట్లు, అమైనో యాసిడ్లకు మనో వ్యాధిని నయం చేసే గుణాలున్నాయని పరిశోధనలో వెల్లడైంది. టారిన్ అనే అమైనో యాసిడ్‌తో పాటు ఎన్ ఎసిటైల్ సిస్టిన్, సి విటమిన్‌లు మనో వ్యాధి చికిత్సకు ఉపయోగపడతాయని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ పరిశోధకులు తెలిపారు. వ్యాధి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు ఈ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఉపశమనం లభిస్తుందని గుర్తించారు.

వ్యాయామం ఆపితే కుంగుబాటే

మెల్‌బోర్న్, మార్చి 23: మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. అయితే వ్యాయామాన్ని మధ్యలో ఆపేస్తే కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉందని పరిశోధనలో వెల్లడైంది. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్ పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. కుంగుబాటుకు దూరంగా ఉండాలంటే వారంలో కనీసం 150 నిమిషాలైనా వ్యాయామం చేయాలని చెబుతున్నారు.



స్వేచ్ఛాపక్షులమవుతాం: రెడ్యానాయక్



హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన తమను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే తమకే మంచిదని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. అప్పుడు తాము స్వేచ్ఛాపక్షులం అవుతామని పేర్కొన్నారు. తాను ఎంపీగా పోటీ చేస్తానని వస్తున్న వార్తల్లోనూ వాస్తవం లేదని, అదంతా ప్రచారమే అని కొట్టిపాడేశారు. 'కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వచ్చామని వివక్ష చూపుతున్నారా?' అని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు చేసిన వ్యాఖ్యలపై రెడ్యానాయక్ స్పందిస్తూ ఆయనకి ఎమ్మెల్యేగా అనుభవం లేకపోవడం వల్లే అలా అని ఉంటారన్నారు.

దేవుడి పేరిటే పట్టాదార్ పాస్‌పుస్తకాలు

మరో 3 వేల ఆలయాలకు 'ధూపదీపం' : ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆలయాలకు సంబంధించిన భూముల యాజమాన్య హక్కు దేవుడికే ఉంటుందని, ఆయా భూముల పట్టాదార్ పాస్‌పుస్తకాలు దేవుడి పేరిటే ఇవ్వనున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా దేవాలయ భూములకు సరిహద్దులు తేల్చాలని, కోర్టుల్లోని కేసులపై దృష్టి సారించాలని, కొత్త ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకాన్ని వర్తింపజేయాలని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, పుట్ట మధు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 12,302 ఆలయాలు ఉండగా, 74,155 ఎకరాలు దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయని తెలిపారు. 6,046 ఆలయాలకు అసెస్‌మెంట్ లేదని, మరో 3,060 ఆలయాలు ట్రస్టుల కింద నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అర్చకులకు 121 పద్దు కింద ట్రెజరీ నుంచి వేతనాలు అందజేస్తున్నామని, భూములపై స్పష్టత రాగానే ఆక్రమణలో ఉన్న వాటిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రంలోని 1,805 ఆలయాల్లో ధూపదీప నైవేద్యం పథకం అమలవుతోందని, కొత్తగా 5,289 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. అర్హత కలిగిన 3వేల ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించామన్నారు.

• వివాదాస్పద భూములపై సర్వే: మహమూద్ అలీ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భూరికార్డుల నవీకరణ, శుద్ధీకరణలో భాగంగా రెండో విడత సర్వేలో వివాదాస్పద భూముల లెక్కలు తేల్చుతామని ఉపముఖ్యమంత్రి ఎండీ మహమూద్‌అలీ ప్రకటించారు. వక్ఫ్, దేవాదాయశాఖ భూములను ఎవరు సాగు చేసుకుంటున్నా, ఆ భూములపై అధికారం దేవుడిదేనని వెల్లడించారు. సదరు భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలను దేవుడి పేరిటే జారీ చేస్తామన్నారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా బెల్లంపల్లిలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూవివాదాలు కొనసాగుతున్నాయని, కాందశీకుల భూములను సాగు చేసుకుంటున్న రైతులకే కట్టబెట్టాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. వెబ్‌ల్యాండ్‌లో లేని భూముల రికార్డుల సంగతేమిటని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, అసైన్డ్ భూములను ఏ మేరకు క్రమబద్ధీకరించనున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. వక్ఫ్ భూములకు సాగుదారుల పేరిట పట్టాలు ఇస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొయినుద్దీన్ ఆరోపించారు.

• మండలానికో అంబులెన్స్ ఇవ్వలేం: లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఒడి పథకం కింద మండలానికో అంబులెన్స్ ఇవ్వలేమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి కె.లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే కోవా లక్ష్మి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 41 వాహనాలను సమకూర్చామని, మంచి ఫలితాలు రావడంతో మిగతా నియోజకవర్గాల్లోనూ అమలు చేస్తున్నామన్నారు. ఫోన్ ద్వారా సేవలు పొందే అవకాశం ఉన్నందున రెండు మండలాలకు ఒక అంబులెన్స్ సరిపోతుందని, మారుమూల ప్రాంతాల్లో మండలానికొకటి ఇస్తామన్నారు.

• ఒకే డిజైన్‌తో 21 గ్రంథాలయ భవనాలు: కడియం

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 21 కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేసే లైబ్రరీ భవనాలను ఒకే డిజైన్‌తో నిర్మించనున్నట్లు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. గ్రంథాలయాల నిర్వహణ, పుస్తక డిపాజిట్ కేంద్రాలు, సిద్దిపేట గ్రంథాలయాల వివరాలు, భవన నిర్మాణాలపై మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, సభ్యులు కర్నె ప్రభాకర్, నారదాసు లక్ష్మణ్, భానుప్రసాద్, పూల రవీందర్ అడిగిన ప్రశ్నలకు ఆయన మండలిలో సమాధానమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 537 శాఖ గ్రంథాలయాలు, 831 పుస్తక డిపాజిట్ కేంద్రాలు పనిస్తున్నాయని చెప్పారు.

• బ్రాహ్మణి, ఇందూ టెక్ భూములు వెనక్కి: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో పరిశ్రమల శాఖ ద్వారా ఇండస్ట్రియల్ పార్కులకు కేటాయించిన భూమిలో 1035 ఎకరాల భూమిని వెనక్కి తీసుకుంటున్నట్లు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. శుక్రవారం మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణి ఇండస్ట్రీకి 250, ఇందూ టెక్ సంస్థకు కేటాయించిన 250 ఎకరాలతో పాటు ఇతర సంస్థలకు కేటాయించిన భూమిని వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. నీరవ్‌మోదీ సంస్థ జేమ్స్ అండ్ జువెల్లర్స్‌కు 95 ఎకరాల భూమి సేల్ డీడ్ చేసినట్లు ఉందని, ఐటీ ఈడీతో మాట్లాడి ఆ భూమిని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 147 ఇండస్ట్రియల్ పార్కులకు 28 వేల ఎకరాలు కేటాయిస్తే.. తెలంగాణ వచ్చాక 53 ఇండస్ట్రియల్ పార్కులకు 40 వేల ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 26 పార్కులకు ఇప్పటికే అనుమతులు ఇచ్చామని వివరించారు.

• సంచార జాతులు కూడా ఎంబీసీల్లోనే: జోగు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 36 కేటగిరీల సంచార జాతి కులాలు ఉన్నాయని, అవన్నీ ఎంబీసీ జాబితాలోకే వస్తాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న వెల్లడించారు. మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. బీసీ కమిషన్ అధ్యయన నివేదిక రాగానే ఎంబీసీ కులాల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

• డిస్కమ్‌లు మూసుకోవాల్సిందే: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తే డిస్కంలను మూసుకోవాల్సి వస్తుందని విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని సభ్యుడు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు.

కొత్తగా 4 వేల పంచాయతీలు

త్వరలో పంచాయతీరాజ్ చట్టం: జూపల్లి

93 శాతం రికార్డుల నవీకరణ: మహమూద్ అలీ

ఇప్ప సారాకు అనుమతి లేదు: పద్మారావు

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 4వేల పంచాయతీలను ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. శాసనసభలో శుక్రవారం పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలవనుందన్నారు. ఇందుకోసం త్వరలో నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని తెస్తామన్నారు. ప్రతి తండాను గ్రామ పంచాయతీగా మారుస్తామన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.18వేల కోట్లు కేటాయించిందని, వీటిలో పంచాయతీరాజ్ రోడ్లకు రూ.8900 కోట్లు ఇస్తామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 7వేల డంపింగ్ యార్డుల పనులు చేపట్టగా, 1700 పూర్తయినట్లు తెలిపారు. రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 3,150 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ.4200 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేల క్వార్టర్లకు రూ.160 కోట్లతో 120 ఫ్లాట్లు నిర్మించామన్నారు. 104 ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో 50 భవనాలు పూర్తయ్యాయని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ మాట్లాడుతూ భూ రికార్డుల నవీకరణ 93% పూర్తయిందన్నారు. రెవెన్యూ శాఖలో 1500 పోస్టుల భర్తీ బాధ్యతను టీఎస్‌పీఎస్సీకి అప్పగించామని, భూరికార్డుల కోసం ధరణి వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్లలో రూ.17 కోట్లతో డ్రైవర్ల శిక్షణ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 97 ఆర్టీసీ డిపోలకు 27 డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ప్రమాదాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్ప సారాకు అనుమతి లేదని, భవిష్యత్తులో ఆలోచిస్తామని తెలిపారు.తెల్ల బెల్లంను సారా తయారీకి ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగూడెంలో ఎక్సైజ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అవసరమైన ప్రతి చోట త్రీ ఫేస్ విద్యుత్తును అందిస్తామని తెలిపారు. ఇళ్లపై ఉండే విద్యుత్తు తీగలను తొలగిస్తున్నామన్నారు. 23,600 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కోర్టు తీర్పు ఉద్యోగులకు అనుకూలంగానే వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

బండారం బయట పెడతా

కేసులేయించింది కాంగ్రెస్ నేతలే.. న్యాయవాదులకు వారే డబ్బులిచ్చారు

నేతల ఖాతాల నుంచే విమాన ఛార్జీలు

చనిపోయిన వారి పేరిటా కేసులు

అన్నింటికీ ఆధారాలు ఉన్నాయి

వాళ్లు సభలో ఉన్నపుడు బయటపెడతా

రైతుల ఆత్మహత్యలు తగ్గాయి

కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రాల్లోనే పెరిగాయి

అసెంబ్లీలో నిప్పులు చెరిగిన హరీశ్



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కోర్టుల్లో కేసులు వేయించడం ద్వారా అడ్డుకుంటున్నది కాంగ్రెస్ నేతలేనని నీటి పారుదల మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అందుకు తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ వారు సభలో లేనందున మరోసారి వారి బండారాన్ని బయట పెడతానని చెప్పారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో హరీశ్ మాట్లాడారు. కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. "దురదృష్టం కాంగ్రెస్ వారు సభలో లేరు. వారి సమక్షంలోనే మాట్లాడదామనుకున్నా. మళ్లీ సభ ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ వారు సభలో ఉన్నప్పుడు మాట్లాడతా. వారి హయాంలో ఏమీ చేయలేదు. ఇప్పుడు మా ప్రభుత్వం చేసే పనులను అడ్డుకుంటున్నారు" అని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులపై కేసులు వేసి, న్యాయవాదులకు లక్షల్లో ఫీజులు ఇచ్చారన్నారు. న్యాయవాదులకు విమాన చార్జీలు కూడా ఆ నేతల బ్యాంకు ఖాతాల నుంచే వెళ్లాయన్నారు. చనిపోయిన వ్యక్తుల పేరిట కేసులు వేశారని వెల్లడించారు. ప్రమాణ పత్రాల్లో ఉన్న వ్యక్తుల మరణ ధ్రువీకరణ పత్రాలు తన దగ్గర ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ సమక్షంలోనే మాట్లాడి, వారిని దోషులుగా నిలబెడతానని చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయిన హర్షవర్ధన్‌రెడ్డి, పవన్ కుమార్, కె.కె.మహేందర్ రెడ్డిలు ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కేసులు వేశారన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు రావద్దనే ఇలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఒకవైపు కేసులు వేసి అడ్డుకుంటూనే మరోవైపు ప్రాజెక్టు కోసం ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన పనులన్నీ పర్సంటేజీల కోసమేనన్నారు. నిర్మాణంలో ఆలస్యం వల్లే ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని చెప్పారు.

జీవనదిగా గోదావరి

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రీ-డిజైన్ కారణంగా 274 కిలోమీటర్ల మేర గోదావరి జీవనదిగా మారుతోందని హరీశ్‌రావు తెలిపారు. సదర్ ఘాట్‌తో 17 కిలోమీటర్లు, ఎల్లంపల్లితో 36 కిలోమీటర్లు, సుందిళ్లతో 31 కిలోమీటర్లు, అన్నారంతో 32 కిలోమీటర్లు, మేడిగడ్డతో 42 కిలోమీటర్లు, తుపాకులగూడెంతో 30 కిలోమీటర్లు, దుమ్ముగూడెంతో 12 కిలోమీటర్లు, ఎస్ఆర్ఎస్‌పీతో 74 కిలోమీటర్ల మేర బ్యాక్ వాటర్ విస్తరించనుందని చెప్పారు. రైతులను బతికించాలనే సోయి కాంగ్రెస్ పార్టీకి లేదని, అనాలోచితంగా ప్రాజెక్టులను ప్రతిపాదించిందని హరీశ్ మండిపడ్డారు. 2007లో ఉదయ సముద్రం ప్రాజె క్టును చేపట్టారని, రూ.197 కోట్లు ఖర్చుపెట్టి మోటార్లు తెచ్చి పడేశారని, సర్జ్‌పూల్, పంప్‌హౌస్ పనులు చేయకుండా కేవలం కమీషన్ల కోసమే పంపులు తెచ్చారన్నారు. తెలంగాణ వచ్చాక వాటిపై రూ.125 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2019 వర్షాకాలానికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి, లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రశ్నోత్తరాల సందర్భంగా చెప్పారు. వేములవాడ గుడి చెరువును నింపి రాజరాజేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు స్నానమాచరించడానికి నీళ్లు అందిస్తామని చెప్పారు. ఈ అంశంపై ఎమ్మెల్యేలు వేముల వీరేశం, భాస్కర్‌రావు, ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి, చెన్నమనేని రమేశ్ మాట్లాడారు.

రైతుల ఆత్మహత్యలు తగ్గాయి

తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గినట్లు కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ ప్రకటించారని హరీశ్ గుర్తుచేశారు. తెలంగాణ కంటే బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో, కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకల్లోనే ఆత్మహత్యలు పెరిగాయన్నారు. తెలంగాణలో 2015లో 1400 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా 2016లో 645 మంది చనిపోయారన్నారు. కాంగ్రెస్ హయాంలోని పెండింగ్ ప్రాజెక్టులను తాము రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, ఎవరెన్ని కేసులు వేసినా కోటి ఎకరాలకు నీరందిస్తామని చెప్పారు.

గురుకులాల్లో 8,434 పోస్టుల భర్తీ

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతి

బడ్జెట్‌లో 2,823 కోట్లు : కడియం

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా మూడేళ్లలోనే 577 గురుకులాలు ఏర్పాటు చేసి సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గురుకులాల్లో వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా గురుకులాల్లో ఖాళీగా ఉన్న 8,434 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. శాసనమండలిలో శుక్రవారం గురుకులాలపై జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో 2,809, ఎస్టీ గురుకులాల్లో 1,027, బీసీ గురుకులాల్లో 2,003, మైనారిటీ గురుకులాల్లో 2,268, విద్యాశాఖ గురుకులాల్లో 327 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. గురుకులాల కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.2,823 కోట్లు కేటాయించామని చెప్పారు. 240 గురుకులాలకు నూతన భవనాల కోసం స్థలం కేటాయించామని, ఒక్కో భవనాన్ని కోటిన్నర రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నాలుగు క్రికెట్ అకాడమీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలు పెంచాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. నూతన విద్యావిధానాలపై అధ్యయనం చేయడానికి త్వరలోనే విదేశాలకు ఒక బృందాన్ని పంపుతామని చెప్పారు. వివిధ శాఖల పరిధిలో నడుస్తున్న స్టడీ సర్కిళ్లన్నింటినీ ఒకే స్టడీ సర్కిల్ పరిధిలోకి తీసుకొచ్చి అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్ ఇప్పించే ప్రతిపాదన పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు సొసైటీల కింద పని చేస్తున్న గురుకులాలను విద్యాశాఖ కిందకు తీసుకురావాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉందని వెల్లడించారు.

చేనేత రుణాలు 2010 నుంచి మాఫీ

ప్రతి కార్మికునికీ గరిష్ఠంగా రూ.లక్ష

రుణాలు చెల్లించిన వారికి తిరిగి చెల్లింపు

8500 మందికి 40 కోట్లతో లబ్ధి: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు శుభవార్త. 2010 నుంచి చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోంది. ఈ మేరకు 2014 జనవరి 1 నుంచి తీసుకున్న రుణాల్లో గరిష్ఠంగా రూ.లక్ష వరకు మాఫీ చేస్తూ ఇంతకుముందు జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం సవరించింది. 2010 ఏప్రిల్ 1 నుంచి తీసుకున్న మూలధన రుణాలను రూ.లక్ష వరకు మాఫీ చేయనున్నట్లు చేనేత శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. గత ప్రభుత్వం కేవలం 2010 మార్చి 31 వరకు మాత్రమే రుణాలు మాఫీ చేసిందని, ఆ తరువాత రుణాలు మాఫీ కాలేదని, ఈ విషయాన్ని పలువురు చేనేతన్నలు తన దృష్టికి తెచ్చారని మంత్రి కేటీఆర్ తెలిపారు. 2010 ఏప్రిల్ 1 నుంచి రుణాలు మాఫీ చేయాలని కోరారన్నారు. ప్రభుత్వ పథకాలకు 2014 జూన్ 2ను కటాఫ్ తేదీగా పరిగణించి నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నామని, చేనేత రుణమాఫీ విషయంలో నేతన్న సంక్షేమం కోసం ప్రత్యేక అంశంగా దీనిని పరిగణించామని వెల్లడించారు. 2010 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31 వరకు తీసుకున్న రుణాల్లో గరిష్ఠంగా రూ.లక్ష వరకు రుణమాఫీ జరుగుతుందని, రుణాలు చెల్లించిన కార్మికులకు సైతం వాటిని ఇస్తామన్నారు. వారి ఖాతాల్లో రూ.లక్ష పరిమితితో చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం 8500 మంది చేనేత కార్మికులు రుణ విముక్తులవుతారని, రూ.40 కోట్ల వరకు ఖర్చవుతుందని వివరించారు.

దేశంలోనే నం.1గా జీహెచ్ఎంసీ

రూ.3వేల కోట్లతో వివిధ దశల్లో అభివృద్ధి పనులు.. స్వర్ణ దేవాలయం తరహాలో చార్మినార్ ఆధునికీకరణ

గండిపేట సహా 35 చెరువుల అభివృద్ధి

బస్తీల్లో ఆస్పత్రులు, 826 ఆధునిక బస్‌స్టేషన్లు

లక్ష 'డబుల్' ఇళ్ల నిర్మాణానికి టెండర్లు

డిసెంబరు నాటికి మెట్రో పనులు పూర్తి

శాసనసభలో మంత్రి కేటీఆర్ వెల్లడి



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌ను దేశంలోనే నంబర్‌వన్ మునిసిపల్ కార్పొరేషన్‌గా నిలబెడతామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. శుక్రవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెర్సల్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో హైదరాబాద్ ఇప్పటికే వరుసగా నాలుగేళ్ల నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు రూ.3 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. చార్మినార్‌ను స్వర్ణ దేవాలయం తరహాలో ఆధునికీకరిస్తున్నట్లు, 826 ఆధునిక బస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సీవరేజ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ఇప్పటికే రూ.230 కోట్లతో పలు నాళాలపై ఉన్న అవరోధాలను తొలగించామని అన్నారు. గండిపేట చెరువును రూ.100 కోట్లతో ఆధునికీకరిస్తామని, మరో 20 చెరువులను రూ.288 కోట్లతో సుందరీకరిస్తామని తెలిపారు. ఓఆర్ఆర్ లోపల గల మరో 15 చెరువులను కూడా సుందరీకరించినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ తరహాలో బస్తీల్లో ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. స్వచ్ఛ తెలంగాణలో భాగంగా జీహెచ్ఎంసీలో 2వేల టిప్పర్లను అందించామని, మరో 600 అందజేస్తామన్నారు.

హైదరాబాద్, వరంగల్‌లో శుద్ధి ప్లాంట్లు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, దీనికి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డుకు గ్రీన్ టాపింగ్ చేస్తామన్నారు. ఘన వ్యర్థాల నివారణ కోసం జపాన్ సాయంతో హైదరాబాద్, వరంగల్ సమీపంలో భారీ శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రికల్ వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు రూ.1000 కోట్ల నిధులు సమీకరించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా నయా పైసా ఖర్చు లేకుండా ఆన్‌లైన్ ద్వారానే గృహ నిర్మాణాలకు 21 రోజుల్లో అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పేదల కోసం లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు, వీటి నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఆగస్టు లేదా సెప్టెంబరు వరకు మూసీనది శుద్ధి, సుందరీకరణ పూర్తవుతుందన్నారు.

మెట్రో సేవలు అద్భుతం..

జీహెచ్ఎంసీకి నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు కృష్ణా, గోదావరి నీటిని కలిపేలా ఇంటర్ కనెక్టెడ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దీంతోపాటే నగర శివార్లలో 10 టీఎంసీల చొప్పున సామర్థ్యం గల రెండు రిజర్వాయర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా కూడా మంచినీళ్లు అందిచనున్నట్లు తెలిపారు. చెన్నైతో పోల్చితే హైదరాబాద్ మెట్రో అద్భుతంగా సేవలందిస్తోందని, ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 50-60 వేల మంది ప్రయాణికులకు సేవలు అందుతున్నాయని వివరించారు. మియాపూర్-ఎల్‌బీనగర్ మార్గాన్ని జూన్ లేదా జూలై లోపు, నాగోల్-హైటెక్‌సిటీ మార్గాన్ని ఆగస్టు లోపు, ఎంజీబీఎస్-జూబ్లీ బస్‌స్టేషన్ మార్గాన్ని డిసెంబరులోపు పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. గతంలో హెచ్ఎండీఏ ఆదాయం చాలా తక్కువగా ఉండేదని, ఇప్పుడు భారీగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2016-17లో రూ.400 ఉందని, అదే 2017-18లో ఏకంగా రూ. 1062 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. ఇక రాష్ట్రంలో 42 శాతానికి పైగా జనాభా పట్టణాల్లోనే ఉన్నారని, ఈ నేపథ్యంలో 15 వేలకు పైగా జనాభా గల మేజర్ గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించామని అన్నారు.


గుడుంబా వృత్తివారికి ఏదీ పునరావాసం?

50 వేల మందిని ఆదుకోవాలి

లేదంటే మళ్లీ అదే వృత్తిలోకి పోయే ప్రమాదం

స్పీకర్ మధుసూదనాచారి హెచ్చరిక

పునరావాస చర్యలపై పెదవి విరుపు



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గుడుంబా వృత్తిలో ఉన్నవారికి పునరావాసం కల్పించే విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పరోక్షంగా తప్పుబట్టారు. పునరావసం కల్పించకపోతే.. వారు మళ్లీ అదే వృత్తిలోకి పోయే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా గుడుంబా విక్రేతలకు పునరావాస కల్పనపై అధికార పార్టీ సభ్యులే కాకుండా స్పీకర్ మధుసూదనాచారి కూడా నిరసన గళం వినిపించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ మంత్రి పద్మారావు ఇచ్చిన సమాధానంపై స్పీకర్ సంతృప్తి చెందలేదు. గుండుంబాపై వివిధ నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితిని ఎమ్మెల్యేల తరఫున మంత్రికి స్పీకర్ వివరించారు. "రాష్ట్రంలో 10 వేల గ్రామాలున్నాయి. గ్రామానికి 5 మంది చొప్పున అనుకున్నా.. 50 వేల మంది గుడుంబా, నాటుసారా తయారీలో ఉన్నారు. ఊర్లన్నీ తిరుగుతూ ఈ వృత్తులను మానుకోవాలని చెప్పాం. మా మాట విని వారంతా తమ వృత్తులను వదులుకున్నారు. వారికి పునరావాసం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది" అని స్పీకర్ వ్యాఖ్యానించారు. దుబ్బాక శాసనసభ్యుడు సోలిపేట రామలింగారెడ్డి మాట్లాడుతూ.. గుడుంబా నిర్మూలన జరిగినా.. వారికి పునరావాస కల్పన పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. "బైండోవర్ అయినవారికే పునరావాసం కల్పిస్తామంటే ఎట్లా? ఆ వృత్తిలో ఉన్నవారందరికీ న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. గుడుంబా తయారీ వృత్తిలో ఉన్నవారికి పునరావాస పథకాన్ని 2015-16 సంవత్సరంలో గుర్తించిన కుటుంబాలకే ఇచ్చారని, 2014 నుంచి ఉన్న కుటుంబాలను గుర్తించలేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. పునరావాస కల్పనను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. "నా నియోజకవర్గంలో ఐదెకరాల స్థలం ఉంది. అక్కడ గుడుంబా వృత్తిదారుల కోసం సర్కారు ఒక పరిశ్రమ పెట్టి పునరావాసం కల్పించాలి" ఆయన కోరారు. మంత్రి పద్మారావు స్పందిస్తూ.. ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గుడుంబా వృత్తిలో ఉన్నవారికి పునరావాసం కింద రూ.2 లక్షల సాయం చేస్తున్నామని వివరించారు. 7,886 మందిని ఈ వృత్తిలో ఉన్నట్టు గుర్తించామని, 6180 మందికి సహాయం చేశాం అని ప్రకటించారు. భూపాలపల్లిలో చాలా కేసులు వచ్చాయని, ఆ కేసుల్లో ఉన్నవారికి పునరావాసం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

విమర్శిస్తే చాలు మైక్ కట్ చేస్తున్నారు!

గతంలో విమర్శలను నవ్వుతూ స్వీకరించేవారు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు విమర్శలు చేస్తే గత ప్రభుత్వాధినేతలు నవ్వుతూ వాటిని స్వీకరించేవారని, ఇప్పుడు విమర్శనాత్మక వ్యాఖ్యలు మొదలు పెట్టగానే మైక్ కట్ చేసున్నారని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో సీపీఎం శాసనసభాపక్ష నేతగా నోముల నర్సింహ్మయ్య ఒక్కరే గంటపాటు మాట్లాడేవారని చెప్పారు. ఇదే సమయంలో అటుగా వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే సండ్ర కూడా కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవించారు. బీజేఎల్పీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ ఎమ్మెల్యేల సమావేశాన్ని కూడా ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తోందన్నారు. సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ గత ఎన్నికల్లోనే బీజేపీ తరఫున పోటీచేసేందుకు ఏర్పాట్లు చేసు కున్నారని, కుటుంబ సభ్యుల ఒత్తిడితో తప్పుకున్నారని చెప్పారు.

ఏం బ్రదర్.. బాగున్నావా!.. కిషన్‌తో జానా


సీఎల్పీనేత జానారెడ్డి శుక్రవారం బీజేఎల్పీ చాంబర్‌కు వచ్చి ఆశ్చర్యపరిచారు. బీజేఎల్పీనేత కిషన్‌రెడ్డి తన కుర్చీలోంచి లేచివచ్చి స్వాగతం పలికారు. ఏం బ్రదర్.. బాగున్నావా..! అంటూ జానా పలకరించగా బాగున్నా అన్నా! అంటూ కిషన్‌రెడ్డి బదులిచ్చారు. కొద్దిసేపటికే జానా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

హిందూమతంలో పుట్టడమే తప్పయింది: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'బడ్జెట్‌లో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తావనే లేదు. ఇతర మతస్థుల విద్యార్థులకు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇచ్చింది. కానీ హిందూ విద్యార్థులకు మాత్రం ఇవ్వడంలేదు. హిందూమతంలో పుట్టడమే విద్యార్థుల తప్పయింది. ఎంతోమంది విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారు' అని టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సమస్యలపై చర్చించి 200 సిఫారసులు చేస్తే అందులో ఏ ఒక్కదానికీ ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. 20 లక్షల జనాభా ఉన్న గౌడ కులస్థులకు రూ.10 కోట్లు కేటాయించడం వల్ల వారికి చాక్లెట్లు కూడా రావన్నారు.

ఈటలది 4వేల కోట్ల అవినీతి అనలేదు: రేవంత్



హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'మంత్రి ఈటల రాజేందర్ అవినీతికి పాల్పడుతున్నారని మాత్రమే నేను ఆరోపించాను. చర్చకు రావాలని సవాల్ చేశాను. అంతేకాని ఆయన రూ.4వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అనలేదు' అని కొడంగల్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఆయనకు ఆ విషయం టీఆర్ఎస్ పార్టీ చెప్పిందో? మరెవరు చెప్పారో?' అని అన్నారు. టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలన్న టీడీఎల్పీ నిర్ణయాన్ని ధిక్కరించారని అన్నారు.

అధ్యక్షా.. విప్ సుధాకర్‌రెడ్డిని నియంత్రించండి: పురాణం



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్ రెడ్డిని నియంత్రించాలని టీఆర్ఎస్ సభ్యుడు పురాణం సతీశ్‌కుమార్ మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌ను కోరారు. శుక్రవారం రెసిడెన్షియల్ పాఠశాలలపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని సతీశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంతలో సుధాకర్‌రెడ్డి కలుగజేసుకొని సాంఘిక సంక్షేమ ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్ కోసం అడగాలని సూచించారు. దీంతో సహనం కోల్పోయిన సతీశ్.. ఆగ్రహంతో 'అధ్యక్షా! ప్రతి అంశంలో సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటున్నారు. ఏం మాట్లాడాలో కూడా ఆయనే చెబుతున్నారు. ఇదేంది అధ్యక్షా! ఆయన్ను నియంత్రించండి' అని విన్నవించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతుండటంతో బీఈడీ కోర్సుకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలంటే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు శిక్షణ తప్పనిసరి. ఇందుకు బాటలు వేస్తున్న కోర్సుల్లో బీఈడీ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) ఒకటి. ప్రైవేట్ రంగంలో మంచి అవకాశాలు లభిస్తుండటం వల్ల కూడా బీఈడీ కోర్సుకు డిమాండ్ పెరిగింది. బీఈడీ కోర్సులో ప్రవేశానికి వీలు కల్పించే ఎడ్‌సెట్ (ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు రెండు తెలుగు రాష్ట్రాల్లో నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..



కెరీర్ గైడ్

ఉపాధ్యాయవృత్తికి తొలి అడుగు..

ఎడ్‌సెట్ విజయం

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాల్లో ముఖ్యమైంది బీఈడీ కోర్సు. దాంతో ఈ కోర్సులో ప్రవేశానికి పోటీ కూడా ఎక్కువగానే ఉంటోంది. ఎడ్‌సెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. నిబంధనల మేరకు గత కొన్నేళ్ల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తుండటం విశేషం. బీఈడీ కోర్సులో తెలుగు, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ మెథడాలజీలు ఉంటాయి. విద్యార్థులు తమ విద్యానేపథ్యం ఆధారంగా మెథడాలజీని ఎంచుకోవాలి.

అర్హత

50 శాతం మార్కులతో (బీసీ / ఎస్సీ / ఎస్టీ విద్యార్థులకు 40 శాతం చాలు) బీఏ / బీఎస్సీ / బీఎస్సీ (హోమ్ సైన్స్) / బీకామ్ / బీసీఏ / బీబీఎం / బీబీఏ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు / తత్సమాన కోర్సులు చేసిన వారు ఎడ్‌సెట్ రాయొచ్చు. బీఈ / బీటెక్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కోర్సులో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లను చదివి ఉండాలి. కనీసం 50 శాతం (తెలంగాణలో 55 శాతం) మార్కులను సాధించాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంచుకున్న మెథడాలజీని బట్టి అర్హత ప్రమాణాలు మారుతుంటాయి. అవి..

- **మ్యాథమెటిక్స్:** బీఏ / బీఎస్సీ (మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌గా) లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా) బీఈ / బీటెక్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లు చదివి ఉండాలి).
- **బయోలాజికల్ సైన్స్:** బోటనీ, జువాలజీ లేదా సంబంధిత లైఫ్ సైన్సెస్ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ / బీఎస్సీ (హోమ్ సైన్స్) లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో బయోలాజికల్ సైన్స్ చదివి ఉండాలి).
- **ఫిజికల్ సైన్స్:** బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ / సంబంధిత మెటీరియల్ సైన్స్ సబ్జెక్ట్‌లతో) / బీసీఏ (ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లు చదివుండాలి).
- **సోషల్ స్టడీస్:** బీఏ / బీకామ్ / బీబీఏం లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో సోషల్ సైన్సెస్ చదివి ఉండాలి).
- **ఇంగ్లీష్:** బీఏ (స్పెషల్ ఇంగ్లీష్) / ఎంఏ (ఇంగ్లీష్).
- **వయసు:** జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.

రాత పరీక్ష ఇలా

మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 120 నిమిషాల్లో జవాబులు గుర్తించాలి. మొత్తం మార్కులు 150. ప్రశ్నపత్రం తెలుగు / ఇంగ్లీష్ / ఉర్దూలో ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
పార్ట్ - ఎ జనరల్ ఇంగ్లీష్	25	25
పార్ట్ - బి జనరల్ నాలెడ్జ్	15	15
టీచింగ్ ఆప్టిట్యూడ్	10	10
సబ్జెక్ట్	100	100
పార్ట్ - ఎ, పార్ట్ - బి అందరికీ కామన్‌గా ఉంటాయి.		

రెండు తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్‌ను కూడా పొందుపరిచారు. రెండు రాష్ట్రాల్లోనూ పరీక్షా విధానం ఒకటే. మెథడాలజీని బట్టి పరీక్షలో అడిగే సబ్జెక్ట్‌లు వేరుగా ఉంటాయి. మ్యాథమెటిక్స్‌ను ఎంచుకున్న విద్యార్థులకు 100 ప్రశ్నలు మ్యాథమెటిక్స్ నుంచి వస్తాయి.

- ఫిజికల్ సైన్స్ విద్యార్థులకు ఫిజిక్స్ నుంచి 50 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు.
- బయోలాజికల్ సైన్సెస్‌లో బోటనీ నుంచి 50 ప్రశ్నలు, జువాలజీ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి.
- సోషల్ స్టడీస్‌లో జాగ్రఫీ నుంచి 35 ప్రశ్నలు, హిస్టరీ నుంచి 30 ప్రశ్నలు, సివిక్స్ నుంచి 15 ప్రశ్నలు, ఎకనామిక్స్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.
- ఇంగ్లీష్ మెథడాలజీని ఎంచుకున్న విద్యార్థులకు 100 ప్రశ్నలు ఇంగ్లీష్ నుంచి వస్తాయి.

సన్నద్ధత ఇలా

పార్ట్ - ఎ:

- **జనరల్ ఇంగ్లీష్:** మెరుగైన ర్యాంక్ సాధించడంలో ఈ విభాగానిది ప్రధాన పాత్ర అని చెప్పొచ్చు. ఇందులో ఆంగ్ల భాషపై విద్యార్థుల కనీస పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా పదో తరగతి స్థాయి ప్రశ్నలు వస్తాయి. కాబట్టి సిలబస్‌ను అనుసరిస్తూ పదో తరగతి వరకు ఉండే ఇంగ్లీష్ గ్రామర్ సంబంధిత అంశాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

పార్ట్ - బి:

- **జనరల్ నాలెడ్జ్:** ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర - సాంకేతిక తదితర రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. ఇందు కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనించాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త పథకాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలను సమగ్రంగా ఫాలో కావాలి.
- పరీక్ష తేదీకి ముందు ఆరు నుంచి ఎనిమిది నెలల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ దేశాలు - వాటి రాజధానులు, కరెన్సీ, భౌగోళిక ప్రాధాన్యం లాంటి అంశాలను చదవాలి. వివిధ దేశాల సంస్కృతి, నాగరికతలను ప్రతిబింబించే ముఖ్యమైన కట్టడాలు, వాటిని నిర్మించిన ప్రదేశాలు, పండగలు, ముఖ్యమైన గ్రంథాలు - రచయితల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి. ఆరు నుంచి పదో తరగతి వరకు సైన్స్, సోషల్ స్టడీస్‌లో ఉండే ప్రాథమిక అంశాలను గుర్తు పెట్టుకోవాలి.
- **భౌతిక, రసాయన శాస్త్రాలు:** ఇందులో అనువర్తనాలకు ప్రాధాన్యం ఉంటుంది. పాఠ్యాంశాల వారీగా ముఖ్యమైన సిద్ధాంతాలు, నిర్వచనాలు, నియమాలను పాయింట్ల రూపంలో రాసుకుని పునశ్చరణ చేసుకోవాలి. ఇంటర్ పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదవాలి. యాంత్రిక శాస్త్రం, విద్యుత్, అయిస్కాంతత్వం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి ఆవకాశం ఉంది. రసాయన శాస్త్రంలో... మూలక, భౌతిక రసాయన శాస్త్రాలకు ఇంటర్మీడియట్ పుస్తకాలు, కర్బన రసాయన శాస్త్రానికి డిగ్రి స్థాయి వరకు పాఠ్యాంశాలు చదవాలి. ఈ మూడు అంశాల నుంచి దాదాపు సమాన సంఖ్యలో ప్రశ్నలు వస్తుంటాయి.
- **జీవశాస్త్రం:** ఇందులో జంతువుల విసర్జక వ్యవస్థ, కిరణజన్య సంయోగక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

సాంఘిక శాస్త్రం

- ఈ విభాగంలో అధిక ప్రాధాన్యం భూగోళశాస్త్రానికే (35 మార్కులు). కాబట్టి అదనపు సమయం కేటాయించుకోవాలి. అట్లాస్, మ్యాప్ సాయంతో చదివితే గుర్తుంచుకోవడం తేలిక. పౌరశాస్త్రంలో భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ, రాజనీతి సిద్ధాంతాలు, భావనలు, అంతర్జాతీయ సంబంధాలపై దృష్టి కేంద్రీకరించాలి.
- ఆర్థిక శాస్త్రంలో సూక్ష్మ అర్థశాస్త్రం నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. భారత ఆర్థికాభివృద్ధిపై కూడా ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా పంచవర్ష ప్రణాళికలు, పన్నులు, ద్రవ్య విధానం, బ్యాంకింగ్, జనాభా అంశాలపై ప్రశ్నలు రావచ్చు. సంబంధిత వర్తమాన అంశాలను తెలుసుకోవాలి.
- చరిత్రలో సాధారణంగా ఆధునిక యుగం నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తుంటాయి. ముఖ్యంగా సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, ఐరోపా, అమెరికాల్లో అనేక విప్లవాలు, ప్రపంచ యుద్ధాలు, నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితి అంశాలను చదవాలి. భారతదేశ చరిత్రకు సంబంధించి స్వాతంత్ర్య ఉద్యమంలోని వివిధ దశలు, సింధు నాగరికత, బౌద్ధ, జైన మతాలు, మౌర్యులు, గుప్తులు, ఆధునిక దక్షిణ భారతదేశ చరిత్రపై దృష్టి కేంద్రీకరించాలి.

- **ఇంగ్లీష్:** ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి 8, 9, 10, ఇంటర్ తరగతుల్లో చదివిన ఇంగ్లీష్ ఆధారంగా 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ఈ విభాగంలోని టాపిక్‌లు.. i) Language functions ii) Elements of Phonetics iii) Grammar iv) Phrasal Verbs (idioms) v) Writing skills vi) Study skills vii) Reference skills b) Syllabus prescribed for Optional English at B.A. Degree Level (B.A.Special English) / Modern Literature Syllabus in English - 50 Questions (50 marks)

గణితం

- ఇందులో చాలా ముఖ్యమైన పాఠ్యాంశాలు... సమితులు, సంబంధాలు, ప్రమేయాలు, వర్గ సమీకరణాలు, ద్విపద సిద్ధాంతం, ప్రస్తారాలు, సంయోగాలు, మాత్రికలు, త్రికోణమితి, అనుక్రమాలు, శ్రేణులు, అవకలనీయం, సమాకలనం, అవకలన సమీకరణాలు, సమూహాలు, వలయాలు, రుజువర్తనలు తదితరాలు. సూత్రాలను ఒక క్రమపద్ధతిలో రాసుకుని రోజూ పునశ్చరణ చేసుకోవాలి. ప్రతిరోజు అభ్యాసం చేయాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగంలో అభ్యర్థికి బోధనపై ఏ మేరకు అభిరుచి ఉందో తెలుసుకునే విధంగా ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత రంగంపై విద్యార్థుల అవగాహనను పరీక్షించేలా... పిల్లల్లో నేర్చుకోవడంలో వ్యత్యాసాలను గుర్తించడం, కమ్యూనికేషన్ సామర్థ్యం, జనరల్ ఇంటెలిజెన్స్ స్థాయిలను అంచనా వేస్తారు. ఈ విభాగంలో ప్రశ్నలో ఇచ్చిన సందర్భాన్ని విచక్షణతో ఆలోచించి సమయస్ఫూర్తితో సమాధానాలను గుర్తించాలి. మంచి ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలు, తరగతి గదిలో వివిధ సందర్భాల్లో ఉపాధ్యాయులు పాటించాల్సిన ప్రమాణాల ఆధారంగా ఇందులో ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్ - సిలో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టు ప్రకారం డిగ్రీ స్థాయివరకు ప్రశ్నలు ఇస్తారు కాబట్టి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఎడ్‌సెట్ పరీక్షను ఏ సబ్జెక్టులో రాసినప్పటికీ ప్రశ్నపత్రం మాత్రం 8 నుంచి డిగ్రీ చివరి సంవత్సరం పాఠ్యపుస్తకాలను అనుసరించే ఉంటుంది. కాబట్టి ప్రిపరేషన్‌లో గైడ్లకంటే పాఠ్యపుస్తకాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. పాతప్రశ్నపత్రాలను పరిశీలించి సంబంధిత సబ్జెక్టులో ఏయే అంశాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు అనే అంశంపై అవగాహన పెంచుకోవాలి. వీలైనన్ని మోడల్ ప్రశ్నపత్రాలు సాధన చేయాలి.

సీట్ల కేటాయింపు

- ఎడ్‌సెట్‌లో 25 శాతం మార్కులను (38 మార్కులు) కనీస అర్హతగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కుల విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. ప్రతి మెథడాలజీలో 85 శాతం సీట్లను స్థానిక విద్యార్థులతో (లోకల్), 15 శాతం సీట్లను అన్ రిజర్వ్‌డ్ కోటా కింద భర్తీ చేస్తారు.
- తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీలు స్టేట్ వైడ్ యూనివర్సిటీలు. వీటిల్లో 85 శాతం సీట్లను మూడు ప్రాంతాల వారికి కేటాయిస్తారు. మిగతా 15 శాతం ఓపెన్ కోటా కింద ఉంటాయి.
- ఆంధ్రా యూనివర్సిటీ (శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి), ఉస్మానియా యూనివర్సిటీ (నల్లగొండ, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మెదక్), శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీల (నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం) పరిధి ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
- సబ్జెక్ట్‌లోని అడిగే ప్రశ్నల క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది.
- జనరల్ ఇంగ్లీష్‌లో రీడింగ్ కాంప్రెహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, స్పెల్లింగ్, వొకాబ్యులరీ, సినానిమ్స్, యాంటోనిమ్స్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ సెంటెన్సెస్ (సింపుల్, కాంపౌండ్, కాంప్లెక్స్), వాయిసెస్, డైరెక్ట్ స్పీచ్, ఇన్ డైరెక్ట్ స్పీచ్ నేర్చుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో ఎడెసెట్ నిర్వహణ బాధ్యతలను శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ - తిరుపతి పర్యవేక్షిస్తుంది.

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 5, 2018.
- రూ. 500 అపరాధ రుసుంతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2018.
- పరీక్ష తేదీ: ఏప్రిల్ 19, 2018
- పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, విజయవాడ, భీమవరం, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, ఒంగోలు, నంద్యాల, నెల్లూరు, తిరుపతి, విజయనగరం, శ్రీకాకుళం.
- వెబ్‌సైట్: http://sche.ap.gov.in/EDCET

తెలంగాణలో ఎడెసెట్ నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా యూనివర్సిటీ - హైదరాబాద్ పర్యవేక్షిస్తుంది.

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2018.
- రూ. 500 అపరాధ రుసుంతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30, 2018.
- పరీక్ష తేదీ: మే 31, జూన్ 1.
- పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.
- వెబ్‌సైట్: http://edcet.tsche.ac.in/

తెలంగాణలో పోస్ట్‌మెన్ ఉద్యోగాలు

తెలంగాణ పోస్టల్ సర్కిల్ నుంచి మరో నోటిఫికేషన్ వెలువడింది. రాష్ట్రవ్యాప్తంగా పలు పోస్టల్ డివిజన్లు / ఆర్ఎంఎస్ యూనిట్లలో పోస్ట్‌మెన్, మెయిల్ గార్డ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. తాజా ప్రకటన ద్వారా మొత్తం 132 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పదోతరగతి అర్హతతో ప్రభుత్వోద్యోగాన్ని అందుకొనే ఈ అవకాశానికి సంబంధించిన వివరాలు.....

ఖాళీల వివరాలు

అన్ని డివిజన్లలో కలిపి మొత్తం 132 పోస్ట్‌మెన్ ఖాళీలు ఉన్నాయి. జనరల్ వర్గానికి 76, ఎస్సీలకు 14, ఎస్టీలకు 6, ఓబీసీలకు 36 ఖాళీలను కేటాయించారు. హైదరాబాద్ హెడ్‌క్వార్టర్ రీజియన్‌లో 75, హైదరాబాద్ రీజియన్‌లో 57 ఖాళీలు ఉన్నాయి. హైదరాబాద్ రీజియన్‌లో 4 మెయిల్ గార్డ్ ఖాళీలు ఉన్నాయి.

డివిజన్లవారీ పోస్ట్‌మెన్ ఖాళీలు:

	డివిజన్	ఖాళీలు
హైదరాబాద్ హెడ్ క్వార్టర్ రీజియన్	హైదరాబాద్ సిటీ	23
	హైదరాబాద్ సౌత్ ఈస్ట్	30
	సికింద్రాబాద్	15
	సంగారెడ్డి	4
	మెదక్	3
హైదరాబాద్ రీజియన్	అదిలాబాద్	9
	హన్మకొండ	7
	కరీంనగర్	8
	ఖమ్మం	11
	మహబూబ్‌నగర్	1
	నల్గొండ	1
	నిజామాబాద్	5
	పెద్దపల్లి	6
	సూర్యాపేట	4
	వనపర్తి	1
	వరంగల్	4
మొత్తం		132

వయసు

అభ్యర్థుల వయసు దరఖాస్తునాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ / ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ & ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఇస్తారు. మూడేళ్ల సర్వీసు ఉన్న 40 ఏళ్లలోపు ప్రభుత్వోద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.


ఎంపిక

అభ్యర్థులను ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో ఎ, బి, సి అనే మూడు పార్టులు ఉంటాయి. పార్టు - సిలో రెండు ఉపవిభాగాలు ఉంటాయి. పార్టు ఎ, బిలకు ఒక్కోదానికి 25 మార్కులు, పార్టు - సికి 50 (ఒక్కో ఉపవిభాగానికి 25 మార్కులు) మార్కులు కేటాయించారు. 2 గంటల పరీక్ష సమయంలో 100 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకూ 1 మార్కు కేటాయించారు. అన్నీ ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష పదోతరగతి స్థాయిలో ఉంటుంది.

విభాగం	అంశం	మార్కులు	ప్రశ్నలు
పార్టు ఎ	జనరల్ నాలెడ్జ్, రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ	25	25
పార్టు బి	మేథమెటిక్స్	25	25
పార్టు సి			
ఉపవిభాగం 1	ఇంగ్లీష్ లాంగ్వేజ్	25	25
ఉపవిభాగం 2	తెలుగు లాంగ్వేజ్	25	25

ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే

జనరల్ అభ్యర్థులకు పార్టు ఎ, బిలతోపాటు పార్టు సిలోని రెండు ఉపవిభాగాల్లో ఒక్కోదానిలో కనీసం 10 మార్కులు రావాలి. అదే ఓబీసీలకు 9 మార్కులు, ఎస్సీ / ఎస్టీలకు 8 మార్కులు వస్తే చాలు. అంటే పరీక్ష మొత్తమ్మీద జనరల్ అభ్యర్థులకు కనీసం 40 మార్కులు, ఓబీసీలకు 37, ఎస్సీ / ఎస్టీలకు 33 మార్కులు రావాలి. ఈ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రతి పోస్టల్, ఆర్ఎంఎస్ డివిజన్లకు వేర్వేరుగా మెరిట్ లిస్టులను రూపొందిస్తారు. ఈ మెరిట్ లిస్ట్ ఆధారంగానే పోస్టింగ్ ఇస్తారు.



ముఖ్య సమాచారం

- పరీక్ష కేంద్రం: హైదరాబాద్
- వేతనం: నెలకు రూ.21,700తోపాటు ఇతర అలవెన్స్‌లు ఇస్తారు.
- ప్రొబెషన్: రెండేళ్లు
- దరఖాస్తు ఫీజు: రూ.100
- పరీక్ష ఫీజు: రూ.400 (ఎస్సీ / ఎస్టీ / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- ఆన్‌లైన్లో ప్రైమరీ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఏప్రిల్ 21
- పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 25
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 28
- వెబ్‌సైట్: www.telanganapostalcircle.in
  www.indiapost.gov.in

జాబ్ కార్నర్

ప్రాజెక్ట్ ఇంజనీర్లు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, హుగ్లీ డాక్ & పోర్ట్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఉమ్మడి సంస్థ హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: చీఫ్ ప్రాజెక్ట్ ఇంజనీర్, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్
- వయసు: చీఫ్ ఇంజనీర్‌కు 65 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (సివిల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. సీనియర్ ఇంజనీర్ ఉద్యోగాలకు డిప్లొమా (సివిల్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన మేర అనుభవం తప్పనిసరి.
- ఒప్పంద వ్యవధి: రెండేళ్లు
- నెల వేతనం: చీఫ్ ఇంజనీర్లకు మొదటి ఏడాది రూ1,55,000 రెండో ఏడాది రూ.1,60,000 సీనియర్ ఇంజనీర్లకు మొదటి ఏడాది రూ.1,10,000 రెండో ఏడాది రూ.1,13,500 ఇస్తారు. అదనపు పనిగంటల నిమిత్తం రూ.4,500 ఇస్తారు.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ: ఏప్రిల్ 18, 19
- దరఖాస్తు ఫీజు: రూ.200
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 5
- వెబ్‌సైట్: www.cochinshipyard.com

కేటీపీఎస్ హీటెక్కింది

- 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కేటీపీఎస్ (పాల్వంచ)/హైదరాబాద్, మార్చి 23 : భానుడి చండ ప్రచండంగా తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ప్రభావం కేటీపీఎస్ (కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్)లో శుక్రవారం ఏకంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్లాంట్‌లో పనిచేసేందుకు కార్మికులు వెనుకంజ వేశారు. మేనెల చివరలో నమోదయ్యే ఉష్ణోగ్రత మార్చిలోనే నమోదు కావటం పట్ల కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. భద్రాచలంలో పగటి ఉష్ణోగ్రత 40.8 డిగ్రీలుగా నమోదైంది. ఇది సాధారణం కంటే 3.1 డిగ్రీలు ఎక్కువ. నల్లగొండలో 39.8, మహబూబ్‌నగర్‌లో 39.6, రామగుండంలో 39.2 డిగ్రీల మేర పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సోలార్ విద్యుత్తుతో గాలి నుంచి నీటిని తయారు చేసే విధానం

గాలి నుంచి నీరు!

- సఫలత దిశగా పరిశోధన
- హైదరాబాద్ స్టార్టప్ ఉరవు ల్యాబ్స్ ఘనత
- అంతర్జాతీయ పోటీల్లో తుది రౌండ్‌కు ఎంపిక
- అందులో గెలిస్తే రూ.10 కోట్ల ప్రైజ్ మనీ
- మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉందన్న బృందం
- భవిష్యత్తులో మంచినీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమని ప్రకటన

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గాల్లోని తేమను మంచినీరుగా మారిస్తే.. ప్రపంచవ్యాప్తంగా మంచినీటికి కొదవే ఉండదు. మంచి నీటి కోసం యుద్ధాలు చేయాల్సిన అవసరమే రాదు. గాలి నుంచి నీటిని తయారు చేసే ప్రయత్నంలో విజయం దిశగా అడుగులు వేస్తోంది హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ఉరవు ల్యాబ్స్. హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభమైన ఈ స్టార్టప్.. 2017 ఫిబ్రవరిలో తన ప్రయోగాన్ని ప్రారంభించింది. ఎలాంటి విద్యుత్తు అవసరం లేకుండా ఏ ప్రాంతం నుంచైనా గాలిలోని తేమ నుంచి నీటిని తయారు చేసే పరిశోధనకు ఐదుగురు సభ్యుల బృందం శ్రీకారం చుట్టింది. వారిలో స్వప్నిల్ శ్రీవాత్సవ్, అమిత్, భరత్ రెడ్డి, సందీప్, వెంకటేశ్ ప్రధానంగా ఉన్నారు. టాటా గ్రూపు, ఆస్ట్రేలియా ఎయిడ్ సంస్థల సహకారంతో ప్రయోగం కొనసాగించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే గాలి నుంచి నీరు తయారు చేసే పోటీకి ఎంపికై తమ సత్తాను చాటారు. తాము సొంతంగా రూపొందించుకున్న పరిజ్ఞానంతో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వచ్చిన వారితో పోటీ పడి చివరి వరకు నిలిచారు. అమెరికాలో జరుగుతున్న పోటీల్లో ఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల నుంచి 98 బృందాలు పోటీలో పాల్గొనగా.. వాటిలో ఐదు బృందాలు తుది రౌండ్‌కు ఎంపికయ్యాయి. వాటిలోనే హైదరాబాద్‌కు చెందిన ఉరవు ల్యాబ్స్ కూడా ఉంది. ఈ ప్రయోగం ఆ బృందానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెడుతోంది. ఐదుగురు ఫైనలిస్టుల్లో విజేతగా నిలిస్తే రూ.10 కోట్ల వరకు ప్రైజ్ మనీ వచ్చే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రయోగం కోసం డీసీక్యాంట్ అనే పదార్థాన్ని తయారు చేసి, సోలార్ విద్యుత్తు ద్వారానే గాలి నుంచి నీటిని తయారు చేసే విధానాన్ని రూపొందిస్తున్నామని ఉరవు ల్యాబ్స్ సీఈవో స్వప్నిల్ శ్రీవాత్సవ్ తెలిపారు.

మంచినీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం

"శరవేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో మంచినీటి అవసరాలు అత్యంత కీలకం. మంచినీటి కోసం జరుగుతున్న పోరాటాలు, సంఘటనలు, భవిష్యత్తు అవసరాలే మమ్మల్ని ఆ దిశగా ఆలోచింపజేశాయి. గాలిలో ఉండే తేమలో నీరు వాయు రూపంలో ఉంటుందని అందరికీ తెలిసిందే. దాని నుంచి నీటిని తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం" అని బృందంలో ఒకరైన భరత్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఎన్ఐటీ కాలికట్‌లో ఆర్కిటెక్చర్ విద్యను అభ్యసించిన స్వప్నిల్ శ్రీవాత్సవ్ ఆలోచనలకు అనుగుణంగా తామంతా కలిసి ఉరవు ల్యాబ్‌ను ప్రారంభించి పరిశోధనలు చేస్తున్నామని తెలిపారు. తుది రౌండ్‌కు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ ప్రయోగం ఫలించడంతో మొదటి రౌండ్‌లోనూ రూ.32 లక్షల వరకు ప్రైజ్ మనీ వచ్చిందని చెప్పారు. తుది రౌండ్ పూర్తి కావాలంటే మరో రూ.72 లక్షలు అవసరమని, తమ వద్ద 32 లక్షలు ఉన్నాయని, మరిన్ని నిధుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. "మా పరిశోధన అంతిమ లక్ష్యం.. ప్రజలు ఎప్పుడైనా, ఎక్కడైనా గాలి నుంచి నీటిని తయారు చేసుకోవడం. అది కూడా లీటరుకు రూపాయి కంటే తక్కువ ఖర్చుకే" అని భరత్ రెడ్డి తెలిపారు.

ఉడతాభక్తిగా..

గోటి తలంబ్రాలు

రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ



భద్రాచలం: సీతారాముల కల్యాణం కన్నులారా చూస్తేనే తరించినట్టు భావిస్తారు భక్తులు. కొందరు చూడటంతోనే సరిపెట్టుకోరు. ఆ ఆదర్శ దంపతుల కల్యాణానికి ఉడతాభక్తిగా తమ చేత్తో స్వయంగా తలంబ్రాలు తయారు చేసి పంపిస్తారు. మామూలు తలంబ్రాలు కాదు.. గోటితో వడ్లను ఒలిచి చేసే గోటి తలంబ్రాలు. ఒకప్పుడు పదుల సంఖ్యలో మాత్రమే భక్తులు ఇలా గోటి తలంబ్రాలను పంపేవారు. ఇప్పుడు వేలాదిగా భక్తులు గోటి తలంబ్రాలను పంపుతున్నారు.

కోరుకొండ భక్త బృందంతో ప్రారంభం

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో తొలుత గోటితో ఒలిచిన కోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభమైంది. వీటికి ఉడతాభక్తి తలంబ్రాలు అని నామకరణం చేశారు. దశాబ్దం క్రితం ఈ పుణ్యకార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆ సంఘం వారు పదోసారి ఈ ఏడాది తీసుకొస్తున్నారు. క్రమంగా ఈ కార్యక్రమం అందరి దృష్టికి వచ్చి వేల మంది భక్తులు 'మేము సైతం' అంటూ గోటి తలంబ్రాలు చేసి సమర్పించేందుకు పాదయాత్రగా వస్తున్నారు. అమెరికాలో ఉన్న భక్తులు గోటి తలంబ్రాలపై ఆసక్తి చూపడంతో.. ఇక్కడే వాటిని తయారుచేయించి అమెరికాకు పంపి అక్కడ శ్రీరామనామ జపంతో వాటిని మంత్రించి, ఇక్కడకు తెప్పించి వాటిని కూడా భద్రాచల ఆలయంలో సమర్పిస్తున్నారు. దేశవిదేశాల్లో రామతత్వాన్ని ప్రచారం చేయడమే తమ ప్రధాన సంకల్పమని శ్రీకృష్ణ చైతన్య సంఘం ప్రతినిధి కల్యాణం అప్పారావు తెలిపారు.



కాలినడకన ఏపీ నుంచి 6500 మంది భక్తులు

అశ్వారావుపేట: శ్రీ రామ కల్యాణం చూతము పదండి అంటూ వేలాది మంది ఏపీకి చెందిన భక్తులు భద్రాచలానికి వెళుతున్నారు. ఆ భక్తబృందం గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చేరింది. గోటితో వలిచిన తలంబ్రాలు వెంట తీసుకొని కాలినడక బయలుదేరిన ఈ బృందం 25నాటికి భద్రాచలం చేరుతుందని శ్రీ రామసేవా ఆధ్యాత్మిక సెంటర్ నిర్వాహకులు తెలిపారు. గురువారం అశ్వారావుపేటకు చేరిన భక్త బృందంలో సుమారుగా 6500 మంది ఉన్నారు.



ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తెస్తున్న సీఎం(ఫైల్)

కల్యాణ వైభవం ఏది?

- సీతారాముల పట్టువస్త్రాలు, తలంబ్రాలకు నిధుల కరువు
- 23 ఏళ్లుగా రూ.15వేలు మాత్రమే కేటాయింపు
- కొన్నేళ్లుగా అవీలేవు.. దేవస్థానంపైనే భారం

భద్రాచలం, మార్చి 23: ఆలయంలో చుట్టు ప్రకారములు సొంపుగా కట్టించడమే కాదు.. ఆ ఇక్ష్వాకు కులతిలకుడికి, ఆ దేవదేవుడి పరీవారమునకు అలనాడు తానీషా కొలువులోని తహసీల్దారు కంచర్ల గోపన్న చేయించిన ఆభరణాలు అన్నీఇన్నీ కావు! రామచంద్రుడికి కలికితురాయిని పొలుపుగాను.. సీతమ్మకు చింతాకు పతకమును.. లక్ష్మణునకు ముత్యాలపతకమును చేయించి అలంకరిస్తే చూసి భక్తజనం పులకించి పోయారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన భద్రాద్రి క్షేత్రంలో శ్రీ సీతారామ కల్యాణం కోసం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాని పరిస్థితి నెలకొంది. తానీషా ప్రభువు కాలం నుంచే భద్రాద్రి రాముడి కల్యాణానికి సర్కారు తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను పంపడం ఆనవాయితీగా వస్తోంది. భద్రాద్రి రామయ్య కల్యాణం విషయంలో 1995లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టు వస్త్రాల కొనుగోలుకు రూ.10వేలు, ముత్యాల తలంబ్రాల కొనుగోలుకు రూ.5 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేయాలని జీవో జారీ చేసింది. గత 23 ఏళ్లుగా ఈ నిధులను ఏమాత్రం పెంచలేదు. రూ.15వేలు మాత్రమే కేటాయిస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా కొన్నేళ్లుగా సర్కారు నిలిపివేసింది. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ప్రభుత్వం తరపున సమర్పిస్తున్న మాటేగానీ.. ఆ భారం దేవస్థానంపైనే పడుతోంది. తెలంగాణ ప్రభుత్వం స్వామివారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల కొనుగోలుకు రూ.15 వేలు మంజూరు చేస్తూ ఏటా ఉత్తర్వులు అయితే జారీ చేస్తోందని, అయితే, రామయ్య ఖజానాకు మాత్రం ఆ మొత్తం చేరడం లేదని సాక్షాత్తు దేవస్థానం ఉద్యోగ వర్గాలే చెబుతున్నాయి. ట్రెజరీ ద్వారా దేవస్థానం ఖాతాలోకి ఆ మొత్తం జమ అవుతోందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొంటున్నా.. ట్రెజరీలో ఉన్న దేవస్థానం ఈవో ఖాతాలో రూ.15 వేలు జమ కావడం లేదని దేవస్థానం ఉద్యోగ వర్గాలు అంతర్గతంగా అంగీకరిస్తున్నట్టు సమాచారం.

దశాబ్దం గడిచినా

దశ తిరగని 'శాతవాహన'

- మూడున్నరేళ్లుగా ఇన్‌చార్జి వీసీ
- భర్తీకాని 40 ప్రొఫెసర్ పోస్టులు
- నలుగురు జేఏలతో పాలన
- పీసీఐ గుర్తింపులేని ఫార్మసీ కోర్సులు
- ఊసేలేని ఇంజనీరింగ్ కళాశాలలు
- బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులు



కరీంనగర్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం ప్రారంభమైన శాతవాహన యూనివర్సిటీ సమస్యలకు నెలవుగా మారింది. రెగ్యులర్ సిబ్బంది లేక.. తగిన నిధులు లేక కనీస వసతుల కల్పనలోనూ వర్సిటీ ఇక్కట్లు ఎదుర్కొంటోంది. ఈ యూనివర్సిటీలో ఇద్దరు ప్రొఫెసర్లు, 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను మాత్రమే నియమించారు. మరో 9 ప్రొఫెసర్ పోస్టులు, 16 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు, 15 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నా కాంట్రాక్టు సిబ్బందితో విద్యాబోధన చేస్తున్నారు. రిజిస్ట్రార్‌తోపాటు కేవలం నలుగురు జూనియర్ అసిస్టెంట్లే పరిపాలన విభాగాన్ని నడిపిస్తుండడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ యూనివర్సిటీకి అనుబంధంగా 188 డిగ్రీ, పీజీ కళాశాలలున్నాయి. యూనివర్సిటీ ద్వారా 29 పీజీ కోర్సులు, 3 ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఫార్మసీ కోర్సులకు ఫార్మస్యూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) గుర్తింపు లేనందువల్ల ఆ కోర్సును అభ్యసించినవారందరు ఉద్యోగాల కోసం వెళ్లలేక కొట్టుమిట్టాడుతున్నారు. ఫార్మసీ కోర్సుల కోసం 3 ప్రొఫెసర్, 4 అసోసియేటెడ్ ప్రొఫెసర్, 11 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు అందులో ఏ ఒక్క పోస్టును భర్తీ చేయకపోవడంతో 9 మంది కాంట్రాక్టు ప్రొఫెసర్లతో కోర్సును నిర్వహిస్తున్నారు. ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో సహా అందరు కాంట్రాక్టు ఉద్యోగులే కావడం గమనార్హం. 2014 సెప్టెంబరు 27న పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలను నిర్వహించగా కాంట్రాక్టు ప్రొఫెసర్లు తమను రెగ్యులరైజ్ చేయాలని కోర్టుకు వెళ్లడంతో ఫలితాలను నిలిపివేశారు. అప్పటినుంచి భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాల విభజనతో పూర్వపు కరీంనగర్ జిల్లాలో ఉన్న రెండు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒకటి జగిత్యాల జిల్లాకు మరొకటి పెద్దపల్లి జిల్లాకు దక్కాయి. దీనితో కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలే లేకుండా పోయింది. శాతవాహన యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా ఏ చర్యలు తీసుకోవడం లేదు. ఉన్న కోర్సులకే సిబ్బంది లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే కొత్త కోర్సుల ఏర్పాటు సాధ్యం కాదని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. మరోవైపు.. ఇన్ని సమస్యలున్నా ఇప్పటివరకు రెగ్యులర్ వీసీని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో 40 పోస్టుల భర్తీకి ఆదేశాలిస్తూ ప్రస్తుతం కాంట్రాక్టులో పనిచేస్తున్న తమను వాటిల్లో నియమించాలని కాంట్రాక్టు ప్రొఫెసర్లు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు ప్రొఫెసర్ల విషయంలో యూనివర్సిటీ వర్గాలు ఏదో ఒక నిర్ణయం తీసుకోని పక్షంలో ఈ పోస్టులు కూడా ఫార్మసీ పోస్టుల మాదిరిగానే కోర్టు గడప తొక్కి పెండింగ్‌లో పడిపోయే ప్రమాదముంది. వర్సిటీ క్యాంపస్‌లోని మెస్‌ను ప్రైవేట్ కాంట్రాక్టర్లు నిర్వహిస్తుండడంతో ఆహార నాణ్యత విషయంలో సమస్యలు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. వర్సిటీ విస్తరణ పనులు ముందుకు సాగక క్యాంపస్‌లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ అందులో కేవలం 6 కోట్లను మాత్రమే విడుదల చేశారు. ఈ సంవత్సరం వర్సిటీ వర్గాలు రూ. 86 కోట్ల కావాలంటూ ప్రతిపాదనలు పంపించగా కేవలం 20 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు వర్సిటీకి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేస్తేనే శాతవాహన వర్సిటీ అభివృద్ధి బాటపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.





తాగునీటి కోసం బారులు తీరిన గిరిజనులు

మొరాయిస్తున్న

నీటి పథకాలు

గిరిజనులకు రక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు తాగునీటి పథకాలను ప్రారంభించాయి. అయితే ఈ పథకాలు మూణ్ణాళ్ల ముచ్చటగా మారాయి. వేసవి సమీపించినా.. పథకాలు మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. ప్రధానంగా ప్రపంచ బ్యాంకు, ఐటీడీఏ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక, సింగిల్ విలేజ్ స్కీం, గ్రౌండ్ లెవల్ సర్వీస్, రిజర్వాయర్, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ మొదలగు పథకాల కింద కోట్ల రూపాయలను ఖర్చు చేసిన గిరిజనుల దాహం తీరడం లేదు. వందలాది పథకాలు నిరుపయోగంగా మారడంతో నీటి కష్టాలు తప్పడం లేదు.



వ్యాధుల బారిన పడుతున్నాం

వాగు చెలమలే దాహార్తిని తీరుస్తున్నాయి. ఈ నీటిని తాగడం వల్ల కీళ్ల, ఎముకల నొప్పితో బాధపడుతున్నాం. నీటిశుద్ధి యంత్రం ఉన్నా.. ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో రోగాల బారిన పడుతున్నాం. రోజంతా కష్టపడి పనిచేసిన డబ్బంతా వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోంది. కలుషిత నీటిని తాగి గ్రామంలో పది మంది వరకు మూత్రపిండాల వ్యాధుల బారిన పడ్డారు.

– బాదం లస్మన్న, దేగామ, ఆదిలాబాద్



బిందెడు నీటి కోసం పడిగాపులు

బిందెడు నీటి కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఊరందరికీ ఒకే బావి ఆధారం. పొద్దున లేచినప్పటి నుంచి కుటుంబమంతా నీటి కోసమే సమయం కేటాయిస్తున్నాం. ఆ తర్వాతనే వ్యవసాయ పనులకు వెళుతున్నాం. గొడ్డూగోదకు కూడా నీళ్లు లేక అల్లాడుతున్నాం. ప్రస్తుతం ఇలా ఉంటే.. ముమ్మందుకు పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు.

– నైతం లక్ష్మణ్, ఉపసర్పంచ్, ఆదిలాబాద్

చెలమ నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు



ఏజెన్సీల్లో నీటి గోస

పనిచేయని తాగునీటి పథకాలు.. కొన్నేళ్లుగా చెలమ నీరు దిక్కు

- వ్యాధుల బారిన గిరిజనులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆదిలాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం గిరిజనుల గోస అంతా ఇంతా కాదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు అలంకార ప్రాయంగా మారడంతో చెలమనీరే దిక్కైంది. నిద్ర లేచింది మొదలు.. తాగునీటి కోసం కుటుంబం మొత్తం బిందెలు పట్టుకుని బోర్లు, బావులు, చెలమల వద్దకు క్యూలు కడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే ఏప్రిల్, మే నెలల్లోనే ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ, మండలాల్లో ప్రతి ఏడాది వేసవి ముందు నుంచే ఈ సమస్య మొదలవుతోంది. అధికారులకు ఈ విషయం తెలిసినా.. ముందస్తు చర్యలు చేపట్టకపోవడం గిరిజనులకు నీటి కష్టాలు తప్పడం లేదు. వాగులు, ఒర్రెలు, చెలమలలోని కలుషిత నీటినే తాగుతున్నారు. దీంతో అంతుచిక్కని వ్యాధులపాలవుతున్నారు.



సూర్యాపేటలో ఆత్మహత్యాయత్నం చేసిన హెడ్‌కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి

హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- చేయి చేసుకున్న మరో స్టేషన్ ఎస్ఐ
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా జరగని న్యాయం
- మనస్తాపంతో పురుగుల మందు తాగిన దామోదర్‌రెడ్డి?

సూర్యాపేట, మార్చి 23: ఓ ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్.. పోలీస్‌స్టేషన్‌లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సూర్యాపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుందీ ఘటన. హెడ్‌కానిస్టేబుల్ కొరిపెల్లి దామోదర్‌రెడ్డి స్టేషన్‌లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆయన కోసం వచ్చిన స్నేహితుడొకరు స్టేషన్‌లోకి వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఇటీవల చోటుచేసుకున్న ఓ ఘటనతో దామోదర్‌రెడ్డి మనస్తాపానికి గురై.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. కుటుంబ తగాదాలతో దామోదర్‌రెడ్డి కోడలు ఆయనతోపాటు భార్య జ్యోతి, కుమారుడు విక్రమ్‌రెడ్డిపై సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల కేసు పెట్టారు. ఈ కేసు విషయంలో రూరల్ ఎస్ఐ లవకుమార్.. ఈ నెల 14న దామోదర్‌రెడ్డిపై భార్య చేయి చేసుకున్నారు. దీంతో వారు సూర్యాపేట పట్టణ పోలీసులకు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందన లేకపోవడంతో 19న డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి న్యాయం చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకూ తనపై దాడికి పాల్పడిన ఎస్ఐపై చర్యలు చేపట్టకపోవడంతో దామోదర్‌రెడ్డి మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు చెబుతున్నారు.



సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవీందర్‌రెడ్డి తదితరులు

● 25న సకల ఉద్యోగుల మహాసభ: రవీందర్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు యూనివర్సిటీ, వివిధ సంస్థల ఉద్యోగులతో కలిసి ఈనెల 25న సరూర్‌నగర్ స్టేడియంలో సకల ఉద్యోగుల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. టీయూఎన్‌టీఈఏ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ నాన్ టీచింగ్ హోంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

● గడువులోగా 'భగీరథ' పూర్తి కావాలి : కేటీఆర్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ కింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో మిషన్ భగీరథ అర్బన్ కార్యక్రమంపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గడువులోగా పనులు పూర్తి చేసే ఏజెన్సీలకు ప్రోత్సాహకాలు అందిస్తామని, పనులు మందగిస్తే... అందుకు గల కారణాలు, సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. భగీరథ పైప్‌లైన్ వెంట ఫైబర్ డక్ట్ వేయాలని, వర్క్ ఏజెన్సీలతో ప్రతి వారం సమావేశమవ్వాలని ఆదేశించారు.

● 55.12 లక్షల ఖాతాలకే పాస్‌పుస్తకాలు

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్‌పుస్తకాల డేటాను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఈ డేటాతోనే ప్రింటర్లు పాస్‌పుస్తకాలు ముద్రించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 71,93,449 ఖాతాలు ఉండగా వాటిలో క్లియర్ ఖాతాల సంఖ్య 57,75,059. వీటిలో 55,12,746 ఖాతాలకే ఆధార్ కార్డులు ఇచ్చారు. అంతిమంగా 48,44,361 ఖాతాలు పాస్‌పుస్తకాల ముద్రణకు సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు 36,90,300 ఖాతాలకే మొబైల్ నంబర్ అనుసంధానం జరిగింది. చెక్ బుక్కుల ముద్రణ కోసం రెవెన్యూ శాఖ శుక్రవారం వివరాలు పంపించింది.

● కక్షతోనే ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు : చెరుకు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ సభ్యత్వాలను ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేసిందని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఇంటి పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి అయిందని, కార్యాలయాన్ని కేటాయించాలని కేసీఆర్‌ను కోరుతామన్నారు.

● ధనబలంతోనే ఫిరాయింపులు: చాడ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌ఎస్‌లోని ఎమ్మెల్యేల్లో 30శాతం మంది వివిధ పార్టీల నుంచి చేరినవారేనని, ఇలాంటి ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. అధికారం, ధన బలంతోనే టీఆర్‌ఎస్‌లోకి ఫిరాయింపులు జరిగాయని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తాము గెలిచిన పార్టీల పేరుతోనే రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనడం సిగ్గుచేటని విమర్శించారు.

● కౌలు రైతుకూ 'పెట్టుబడి' ఇవ్వండి: జూలకంటి

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అసైన్డ్, అటవీ, కాందిశీకుల, దేవాదాయ, కౌలు భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఓ లేఖ రాశారు. ధనిక, పెద్ద రైతులకు రూ.4 వేల రాయితీ ఇచ్చేందుకు సిద్ధపడిన ప్రభుత్వం.. అప్పు చేసి సాగు చేస్తున్న కౌలు రైతులను విస్మరించడం తగదని పేర్కొన్నారు.

● వెల్‌నెస్ కేంద్రంలో మందులపై అధికారుల ఆరా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వెల్‌నెస్ కేంద్రాల్లో మందుల కొరతపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఈహెచ్‌ఎస్‌కు ఎసరు' అంటూ ప్రచురితమైన కథనంపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. గురువారం ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రానికి అధికారులను పంపి, మందుల కొరతపై ఆరా తీశారు. పరీక్షలు, వెల్‌నెస్ కేంద్రం పనితీరుపై వాకబు చేసినట్టు తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలో మిగిలిన వెల్‌నెస్ కేంద్రాల్లో ఏం జరుగుతుందో కూడా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. అంతే కాకుండా ఈహెచ్‌ఎస్ సీఈవో పద్మను తప్పించిన తరువాత ఓ ప్రత్యేకాధికారిని కూడా నియమించారు.

● దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం పెంపు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను వివాహం చేసుకుంటే ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జగదీశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్యాణలక్ష్మి పథకానికి ప్రభుత్వం తాజాగా రూ.1,00,116కు పెంచిన విషయం తెలిసిందే. ఆ పథకం కింద కూడా దివ్యాంగ ఆడపిల్లలు లబ్ధి పొందే అవకాశం ఉంది. ఈ రెండు ప్రోత్సాహకాల ద్వారా ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్థిక చేయూత అందించినట్లైంది.

● సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తోపాటు ఇతర నిందితులు శుక్రవారం సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరయ్యారు. వాదనల అనంతరం తదుపరి విచారణను న్యాస్థానం ఏప్రిల్ 6కు వాయిదా వేసింది. అలాగే, పెన్నా, ఇందూ పెట్టుబడులకు సంబంధించిన కేసులోనూ నిందితులు కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసు విచారణను కూడా ఏప్రిల్ 6కు వాయిదా వేశారు.

● అరోరా విద్యాసంస్థలో ఐటీ దాడులు

యాదాద్రి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి సమీపంలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఉదయమే కళాశాలకు చేరుకున్న అధికారులు కార్యాలయ రికార్డులు, సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సోదాలు నిర్వహించారు.ఖాతా పుస్తకాలు, బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పరిశీలించారు. రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి.

● రద్దు జీవోలను ఉపసంహరించాలి : జేఏసీ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ కోటాను రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవోలు 21, 22ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో 27వ తేదీ నుంచి మెరుపు సమ్మెకు దిగుతామని ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. డిమాండ్ల సాధనలో భాగంగా తెలంగాణ మెడికల్ జేఏసీగా ఏర్పడిన వైద్య సంఘాలు శుక్రవారం అత్యవసరంగా సమావేశమై ఈ మేరకు ప్రకటించాయి.

● ఎంహెచ్‌ఆర్‌డీ సభ్యుడిగా కడియం రాజు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల విద్య నియంత్రణ కమిటీ (ఎంహెచ్‌ఆర్‌డీ) సభ్యుడిగా కడియం రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల ఉన్నత విద్య కోసం కృషి చేస్తానని తెలిపారు.

● మాకు గది ఇవ్వండి: రైతు సమితుల ఒత్తిళ్లు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లా వ్యవసాయ కార్యాలయంలో మాకూ గదిని కేటాయించండి' అని జిల్లాల రైతు సమితుల నుంచి ఆయా డీఏఓలపై ఒత్తిడి పెరుగుతోంది. ఒకరిపై ఒకరికి పెత్తనం ఉండబోదంటూ మంత్రి పోచారం, కార్పొరేషన్ చైర్మన్ గుత్తా ప్రకటనలు చేస్తున్నా.. అధికారులు, సమితుల మధ్య ఇంకా సర్దుబాటు జరగడం లేదంటున్నారు. మార్గదర్శకాలు ఇంకా విడుదల కాకపోవడంతో సమితుల పట్ల ఎటువంటి ప్రోటోకాల్ అనుసరించాలన్నది స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.



శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రారంభించి పదేళ్లు అయిన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, జీఎంఆర్.

ఎయిర్‌పోర్టుకు పదేళ్లు!



ఘనంగా జీఎంఆర్ దశాబ్ది ఉత్సవాలు.. ఎయిర్‌పోర్టు సిటీకి కేసీఆర్ శంకుస్థాపన

- డ్రైపోర్టు, మల్టీ మోడల్ ట్రాన్సిట్ హబ్ ఇక్కడే
- విమాన ఇంధనంపై వ్యాట్ ఒక శాతమే
- 4650 కోట్లతో విమానాశ్రయానికి మెట్రో: కేటీఆర్
- 2000 కోట్లతో విమానాశ్రయ విస్తరణ

హైదరాబాద్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి బిజినెస్): శంషాబాద్‌లోని జీఎంఆర్ విమానాశ్రయం ఇక నగరానికి గుండెకాయగా అవతరిస్తోంది. విమానాశ్రయం సమీపంలోనే మల్టీ మోడల్ ట్రాన్సిట్ హబ్‌ను, డ్రైపోర్టును నిర్మించనున్నట్లు మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. జీఎంఆర్ విమానాశ్రయం వాణిజ్యపరంగా కార్యకలాపాలు ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అట్టహాసంగా వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం కేసీఆర్ ఎయిర్‌పోర్ట్ సిటీ, దేశంలోనే అతి పెద్దదైన ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. ఇతర ముఖ్యమైన కార్యక్రమాల కారణంగా శంకుస్థాపనలు ముగిసిన వెంటనే సభాస్థలి నుంచి సీఎం నిష్క్రమించారు. అనంతరం పరిశ్రమల మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. పొరుగు రాష్ట్రాలకు పోటీగా తెలంగాణలోనూ విమాన ఇంధనం(ఏటీఎఫ్)పై వ్యాట్‌ను 16 శాతం నుంచి ఒక శాతానికి తగ్గిస్తున్నట్టు తెలిపారు. విమానయాన రంగానికి ప్రోత్సాహం ఇవ్వాలనే లక్ష్యంతో వ్యాట్‌ను ఒక శాతానికి తగ్గిస్తున్నామని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వ్యాట్ తగ్గించాలని చాలాకాలంగా విమానయాన సంస్థలు కోరుతున్నాయని చెప్పారు. తాజా నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందన్నారు. వ్యాట్ తగ్గించడం వల్ల హైదరాబాద్‌కు విమాన రాకపోకలు పెరుగుతాయని, అది విమానయాన రంగం అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటు చేయడంతో పాటు వరంగల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫార్మా సిటీ కోసం జక్రానపల్లిలో విమానాశ్రయాన్ని ప్రతిపాదించినట్టు చెప్పారు. విమానాశ్రయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని 4,560 కోట్ల రూపాయలతో ఎయిర్‌పోర్ట్‌కు మెట్రోను, రోడ్డు రవాణా వ్యవస్థను విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన కొత్త స్మార్ట్ ఎయిర్‌పోర్ట్ సిటీ ప్రపంచ శ్రేణి వసతులతో హైదరాబాద్‌కే తలమానికంగా నిలుస్తుందన్నారు. ఇందులో దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్, ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మించనున్నారని తెలిపారు. ఆదిభట్లలో ఏరోస్పేస్ పార్క్, విమానాశ్రయం సమీపంలో జీఎంఆర్ సొంత ఎంఆర్‌ఓ, ఏరోస్పేస్ పార్క్, కర్ణాటక ఏరోస్పేస్ పార్క్ ఏర్పాటవుతున్నట్టు ఆయన చెప్పారు. దేశంలోనే ప్రయివేటు ప్రభుత్వ భాగస్వామ్య విధానంలో ఏర్పాటైన తొలి విమానాశ్రయం ఇదేనన్నారు. ఎక్కడో రాజాం నుంచి వచ్చి హైదరాబాద్‌లో విమానయాన రంగంలోకి ప్రవేశించి, ఇప్పుడు హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాలు రెండింటినీ విజయవంతంగా నిర్వహిస్తున్న జీఎంఆర్ కృషి అభినందనీయమన్నారు.

» థ్యాంక్స్ టు కేసీఆర్!



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో తాటిచెట్టుపై కేసీఆర్ చిత్రంతో కూడిన జెండా

తాటిచెట్టుపై జెండా ఆవిష్కరణ

పాలకుర్తి : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కల గూడూరులో 80 అడుగుల ఎత్తున్న తాటి చెట్టుపై 'థ్యాంక్స్ టు కేసీఆర్' అని ముద్రించిన భారీ జెండాను ఆవిష్కరించారు. రామగుండం జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గీత కార్మికులు ఈ జెండాను ఎగురవేశారు.

'పన్ను' రద్దుతో 2 లక్షల మందికి లబ్ధి

» సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు: ఎంపీ నర్సయ్యగౌడ్

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చెట్టు పన్ను రద్దుతో 2 లక్షల మంది గీత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీలు గంగాధర్ గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణగౌడ్‌తో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గీత వృత్తిపై వరాల జల్లు కురిపించిన సీఎం కేసీఆర్‌కు కార్మికుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. గీత కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించిందని గుర్తు చేశారు. కాగా, తాటివనాలపై గీత వృత్తిదారులకే పూర్తి హక్కులు కల్పించాలని రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. మగ్దూం భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన వరాలు కేవలం స్వల్పకాలిక ఉపశమనాలేనని వ్యాఖ్యానించారు.

వరంగల్ పర్యటనకు చైనా బృందం ఓకే

- రాష్ట్ర ప్రభుత్వ అధికారుల తీరుతో మొదట అసంతృప్తి
- వారి అసంతృప్తిని ప్రముఖంగా ప్రచురించిన "ఆంధ్రజ్యోతి"
- విషయాన్ని గమనించి ఒప్పించిన అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చైనా పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులతో కూడిన 40 మంది బృందం శనివారం వరంగల్‌లో పర్యటించనుంది. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించేందుకు చైనా ప్రతినిధుల బృందం 3 రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం నగరానికి చేరుకుంది. తొలిరోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశం కావాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవ డంతో చైనా బృందం తీవ్ర నిరుత్సాహానికి గురైంది. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం శనివారం జరగాల్సిన వరంగల్ నగర పర్యటనను రద్దు చేయాలని చైనా బృందం భావించింది. ఈ విషయాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో " సారీ తెలంగాణ" పేరుతో కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ఈ విషయాన్ని గమనించిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇన్వెస్ట్ ఇండియా శాఖ అధికారులు వీరిని శుక్రవారం సంప్రదించారు. వరంగల్ పర్యటనను కొనసాగించాలని కోరడంతో చైనా బృందం అంగీకరించింది. స్మార్ట్ సిటీకి ఎంపికైన వరంగల్ నగరం అభివృద్ధిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ బృందం ప్రధానంగా పరిశీలించనుంది.

కేంద్ర సాహిత్య అకాడమీ.. తెలుగు సలహాదారుడిగా యాకూబ్



ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 23: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రొట్టమాకురేవు గ్రామానికి చెందిన కవి డాక్టర్ షేక్ యాకూబ్ కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాదారుడిగా నియమితులయ్యారు. తెలుగు సాహిత్యంలో పీహెచ్‌డీ చేసిన యాకూబ్ పలు కవితాసంపుటాలు, గ్రంథాలు రచించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ మహిళా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ఆరేళ్లుగా 'కవి సంగమం' అనే కవిత్వ వేదికను నిర్వహిస్తున్నారు. స్వగ్రామం రొట్టమాకురేవులో గ్రంథాలయం నిర్మించారు. ఏటా ముగ్గురు కవులకు 'రొట్టమాకురేవు' పేరుతో కవిత్వ అవార్డులు అందజేస్తున్నారు.

భర్త పేరు.. తండ్రి స్థానంలో!

- బ్రాహ్మణ కుల ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు
- తల్లి పేరులోనూ దొర్లుతున్న పొరపాట్లు
- మీసేవ పేజీలో భర్త పేరుకు ఇవ్వని ఆప్షన్
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న అభ్యర్థులు



భర్త పేరును తండ్రి పేరుగా సూచిస్తున్న ధ్రువీకరణపత్రం

కొమురవెల్లి రూరల్, మార్చి 23: ఉన్నతాధికారులు చేసిన సాంకేతిక తప్పిదం.. ఎంతో మందిని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం చేస్తోంది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా బ్రాహ్మణులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను వర్తింపజేసేందుకు జారీ చేస్తున్న కుల ధ్రువీకరణ పత్రాల్లో తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయి. దరఖాస్తుదారులకు కేవలం తండ్రి పేరు మాత్రమే నమోదు చేసే అవకాశం కల్పించడంతో.. వివాహిత మహిళల భర్త పేరు కూడా తండ్రి పేరుగా నమోదవుతోంది. దీంతో సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఈ ధ్రువీకరణ పత్రాలను అధికారులు అనుమతించడం లేదు. బ్రాహ్మణుల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బ్రాహ్మణులకు విద్య, వైద్యం, వేద ధర్మపరిరక్షణలతోపాటు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుని, స్వయం సమృద్ధి పొందేలా చేయడమే ఈ పరిషత్ ప్రధాన లక్ష్యం. ఇందు కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతి ఏటా రూ.100 కోట్లతో నిధిని సైతం ఏర్పాటు చేసింది. ఈ పథకాల ద్వారా బ్రాహ్మణులు లబ్ధి పొందేందుకుగాను వారికి కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని నిర్ణయించింది. అందరిలాగే వీరికీ మండల స్థాయిలో తహసీల్దార్లు ఈ పత్రాలను అందజేసేలా ఆదేశాలు జారీ చేసింది. వీరికోసం మీసేవలో ప్రత్యేకంగా ఓ పేజీని సైతం ఏర్పాటు చేసింది. అయితే ఈ పేజీలో అభ్యర్థి పేరు తరువాత తల్లిదండ్రుల పేర్లు మాత్రమే నమోదు చేసే అవకాశం కల్పించారు. వివాహిత మహిళలకు ఇతర కులాల మాదిరిగా భర్త పేరును సూచించే కాలమ్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో ధ్రువీకరణ పత్రంలో వివాహిత భర్త పేరు తండ్రి పేరుగా ముద్రితమవుతోంది. తల్లిపేరు స్థానంలో అనవసర అక్షరాలు ముద్రితమవుతున్నాయి. తప్పుల తడకగా ఉండే ఈ ధ్రువీకరణ పత్రాలను పథకాల అమలుకు అధికారులు ఆమోదించడం లేదు. కాగా ఈ పొరపాటును సరి చేయడం తమ పరిధిలో ఉండదని మండల స్థాయి అధికారులు చెబుతున్నారు. మీసేవ పేజీ ప్రోగ్రామింగ్‌లోని సాంకేతిక పొరబాటు వల్ల ఇలా జరుగుతుందని, అక్కడే సరిచేయాల్సి ఉంటుందని అంటున్నారు. అయితే ఈ తప్పిదాలతో తాము సంక్షేమ పథకాలకు దూరం కావాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఛలో అసెంబ్లీ ర్యాలీలో ఎమ్మెల్యేలు లక్ష్మణ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి; బీజేపీ మహిళా నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

అణచివేతలతో ప్రజాగ్రహాన్ని చల్లార్చలేరు

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం: లక్ష్మణ్.. నిరంకుశ పాలన ఎక్కువ రోజులు సాగదు: కిషన్‌రెడ్డి

» బీజేపీ కిసాన్ మోర్చా చలో అసెంబ్లీ ఉద్రిక్తం.. నాయకుల అరెస్టు

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అణచివేతలతో ప్రజాగ్రహాన్ని చల్లార్చలేరని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ హెచ్చరించారు. సీఎం కేసీఆర్ నాలుగేళ్లలో రైతులకు, వ్యవసాయ రంగానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఆరోపించారు. రైతాంగ సమస్యలపై నిరసన తెలిపిన తమను అక్రమంగా అరెస్టు చేసిన టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలని, రైతాంగ సమస్యలు తక్షణం పరిష్కరించాలన్న డిమాండ్‌తో బీజేపీ కిసాన్ మోర్చా చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ కీలక నేతలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, ఎన్.రాంచందర్ రావు, చింతల రాంచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, పుష్పలీల, బద్దం బాల్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, జి.ప్రేమేందర్‌రెడ్డి, జి.మనోహర్‌రెడ్డి, ఆకుల విజయ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి అసెంబ్లీకి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. మోహరించిన పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా తోపులాట జరిగింది. దీంతో లక్ష్మణ్ సహా ఎమ్మెల్యేలను పోలీసులు బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించి అసెంబ్లీకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ బయట నిరసన తెలిపేందుకు, అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం దమన నీతిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. సమస్య పరిష్కారం కాకుండానే రుణమాఫీ ముగిసినట్లు మాట్లాడుతున్నారని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరహక్కుల్ని అణచివేస్తోందని బీజేపీ ఫ్లోర్ లీడర్ కిషన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణను పోలీస్ రాజ్యంగా మార్చారని, నిరంకుశత్వంతో ఎక్కువ రోజులు పాలించలేరని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ దమననీతిని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ నేతలు ప్రకటించారు. మహిళారైతులను రక్తంవచ్చేలా గిచ్చారని, పార్టీ ముఖ్య నాయకులను ఈడ్చుకెళ్లారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది బీజేపీ నేతలను, రైతులను 500 పోలీసు స్టేషన్లలో నిర్బంధించారన్నారు. బీజేపీ అంటే కేసీఆర్ ఎందుకింత వణికిపోతున్నారని ప్రశ్నించారు. లక్ష్మణ్‌ను పోలీసులు అరెస్టు చేసినందుకు నిరసనగా ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు శాసన మండలి నుంచి వాకౌట్ చేశారు.

తండా 'పంచాయతీ' తేలదు

- మునిసిపల్ బిల్లు సాగదు.. ఈ సమావేశాల్లో అనుమానమే
- 27తో బడ్జెట్ సమావేశాలు ఆఖరు.. తండాలపై చేతులెత్తేసిన ఏపీ
- పునరాలోచనలో తెలంగాణ సర్కారు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజన తండాలు, గూడేలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించే విషయమై సందిగ్ధత నెలకొంది. ఉమ్మడి రాష్ట్రంలోని ఈ ఆలోచనను ఆంధ్రప్రదేశ్ సర్కారు విరమించుకుంది. 500 మంది జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా విడదీయడం వల్ల ఆర్థిక, సామాజిక సమస్యలు వస్తాయని, వీటిని ఏర్పాటు చేయడం సాధ్యం కాదని అక్కడి ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఏం చేయబోతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణలో దీనికి సంబంధించిన బిల్లు ఇప్పటి వరకూ సభలో ప్రవేశ పెట్టలేదు. రాష్ట్రంలో 500 జనాభా కలిగిన గిరిజన తండాలు, గూడేలు లేదా వాటి సమూహాలతో ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం హామీనిచ్చింది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును పెడతామని కూడా ప్రకటించింది. పంచాయతీరాజ్ బిల్లుతో పాటు, పలు గ్రామాలను మునిసిపాలిటీలుగా మార్చే మునిసిపల్ బిల్లును కూడా ప్రస్తుత సమావేశాల్లోనే పెట్టాలనుకున్నారు. గురువారం వరకు కూడా ఈ బిల్లులేవీ సభలో ప్రవేశపెట్టలేదు. కనీసం మంత్రిమండలి ఆమోదం కూడా తీసుకోలేదు. ఉన్న రెండు రోజుల వ్యవధిలో ఇవన్నీ జరగడం అనుమానంగా మారింది. తండా పంచాయతీల బిల్లు పెట్టాకే, పంచాయతీరాజ్ బిల్లు, మునిసిపల్ బిల్లు ప్రవేశపెట్టే వీలుందని అంటున్నారు. పంచాయతీల తీర్మానం అవసరం లేకుండా కొత్త పంచాయతీల ఏర్పాటు, మునిసిపాలిటీలలో గ్రామాల విలీనం చేపట్టాలి. ఇవన్నీ ఒక దానితో మరోటి ముడిపడి ఉన్నాయి. 27వ తేదీతో బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. శుక్రవారం, శని, ఆది, మంగళవారాల్లో మాత్రమే సమావేశాలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 4 వేల వరకు పంచాయతీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐదు వేలకు పైగా ప్రతిపాదనలు వచ్చాయి. 1700 పంచాయతీలు ఏర్పాటు చేయవచ్చని నిర్ధారణకు వచ్చారు.

ఎమ్మెల్యేల ప్రతిపాదనలతోనే

కొత్త పంచాయతీలు, తండా పంచాయతీల ఏర్పాటుపై ప్రతిపాదనలను పూర్తిగా ఎమ్మెల్యేల నుంచే స్వీకరించారు. ఎమ్మెల్యేలు తమ ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించగా... తదుపరి వీటిపై పరిశీలన చేయాల్సిందిగా అధికారులకు పంపారు. ఇటీవల జిల్లాల వారీగానూ ఎమ్మెల్యేలతో అధికారులు సమీక్షించారు.

సాధ్యం కాదన్న ఏపీ సర్కారు

తండా పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. 500 జనాభాతో పంచాయతీలు ఏర్పాటు చేస్తే, ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తుతాయని గిరిజన మంత్రి నక్కా ఆనంద్‌బాబు అక్కడి అసెంబ్లీకి చెప్పారు. ఎన్నికల్లో హామీనిచ్చినప్పటికీ విరమించుకుంటున్నామని తెలిపారు. తండా పంచాయతీల ప్రతిపాదన నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. అప్పటి పంచాయతీరాజ్ కమిషనర్ పూనం మాలకొండయ్య అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సమైక్య రాష్ట్రంలో 500 జనాభాకు పైబడిన తండాలు, గూడేలు తెలంగాణలో 1700 ఉన్నట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఎన్నికల హామీని నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. 500కు తక్కువ జనాభా ఉంటే సమూహాలతో పంచాయతీలు ఏర్పాటు చేయాలని భావించింది.

తగ్గిన విదేశీ మారక నిల్వలు

ముంబై : వరుసగా రెండు వారాలపాటు పెరిగిన భారత్ విదేశీ మారక నిల్వలు మార్చి 16తో ముగిసిన వారంలో 15.24 కోట్ల డాలర్లు తగ్గి 42,133.4 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు మాత్రం 1.32 కోట్ల డాలర్లు పెరిగి 2,156.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 41 లక్షల డాలర్లు పెరిగి 153.8 కోట్ల డాలర్లకు చేరాయని భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) తెలిపింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ నిల్వలు కూడా 55 లక్షల డాలర్లు పెరిగి 207.7 కోట్ల డాలర్లకు చేరాయి.

రూ. 2,000 కోట్లతో విస్తరణ

రెండో రన్‌వే పూర్తి స్థాయిలో అభివృద్ధి.. గంటకు 50 విమానాల రాకపోకలకు ఏర్పాట్లు

రెండేళ్లకల్లా 2.6 కోట్ల మంది ప్రయాణికులు : జీఎంఆర్ విమానాశ్రయ సిఇఒ ఎస్‌జికె కిశోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ విమానాశ్రయంలో నానాటికీ పెరుగుతున్న ప్రయాణికుల తాకిడిని తట్టుకునేందుకు ప్రస్తుతం ఉన్న టెర్మినల్ విస్తరణ పనులు రెండు వేల కోట్ల రూపాయలతో చేపడుతున్నట్టు జిఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్‌జికె కిశోర్ తెలిపారు. జిఎంఆర్ విమానాశ్రయం పది సంవత్సరాల వేడుక సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విమానాశ్రయ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ ద్వారా ఏడాదికి 1.8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా విస్తరణ పూర్తయ్యే నాటికి 2.6 కోట్ల మంది రాకపోకలు సాగించే సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులనే ఉపయోగించుకుంటూ వీలైనంత ఎక్కువ మంది రాకపోకలు సాగించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నామమాత్రంగా పని చేస్తున్న రెండో రన్‌వేను పూర్తి స్థాయి రన్‌వేగా మార్చబోతున్నట్టు కిశోర్ చెప్పారు. ప్రస్తుతం విమానాశ్రయం నుంచి గంటకు 26 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రెండో రన్‌వే కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే సరికి గంటకు 50 విమానాలు రాకపోకలు సాగించగలుగుతాయని ఆయన అన్నారు.

ప్రస్తుతం తమ నిపుణుల బృందం ఇదే స్థాయి విమానాశ్రయాలున్న జర్మనీ వంటి దేశాల్లో పర్యటిస్తున్నదని, ఆయా విమానాశ్రయాల్లో వసతులను అధ్యయనం చేస్తున్నదని, వారి నివేదిక ఆధారంగా ఆ విమానాశ్రయాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఇక్కడ ప్రపంచ శ్రేణి వసతుల కల్పనకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. వాస్తవానికి హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా గరిష్ఠంగా నాలుగు కోట్ల మంది రాకపోకలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, ఆ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పుడు 1.6 కోట్ల మంది రాకపోకలు సాగించే వసతులుండగా దాన్ని అధిగమించామని కిశోర్ అన్నారు. విస్తరణ ప్రణాళికలన్నీ రెండేళ్లలో పూర్తవుతాయని ఆయన తెలిపారు. విమాన ప్రయాణికుల్లో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 22 నుంచి 24 శాతం వృద్ధి నమోదవుతుందని భావిస్తున్నామని, వచ్చే ఏడాది అది 20 శాతం వరకు ఉండవచ్చునని ఆయన చెప్పారు. ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదలకు దీటుగా ఎప్పటికప్పుడు అనుమతులు తీసుకుని వేగంగా విస్తరణ కార్యక్రమాలు చేపట్టడం జీఎంఆర్ వ్యూహమన్నారు. మొదటి టెర్మినల్ విస్తరణ పూర్తయిన తర్వాత రెండో టెర్మినల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా చిన్న విమానాలు, ఎటిఆర్‌లు ఎక్కువగా నడుస్తున్నాయని, ఏ శ్రేణి విమానాలు ఎన్ని నడుస్తున్నాయనే అంశాన్ని బట్టి గంటకు ఎన్ని విమానాల రాకపోకలు చేపట్టగలమనేది ఆధారపడి ఉంటుందని కిశోర్ చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయంలో జిఎంఆర్‌కు 63 శాతం వాటాలుండగా తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం వాటా ఉన్నదని, మిగతా వాటాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, మలేసియా ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ బెర్హాద్ చేతిలో ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా జిఎంఆర్ తన వాటాను యథాతథంగా కొనసాగిస్తుందని తెలిపారు.



హైదరాబాద్ విమానాశ్రయ విస్తరణ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్, జిఎం రావు

రెండు వారాల్లో ఎయిరిండియా బిడ్డింగ్

పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే

ఎయిరిండియాలో వాటాల విక్రయానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణలకు రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే చెప్పారు. జిఎంఆర్ విమానాశ్రయం పదేళ్ల వేడుకకు హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బిడ్డర్లకు నికర విలువ ఎంత ఉండాలి, ఇతరత్రా అర్హతలేమిటి అన్నవి నోటిఫికేషన్‌లో ఉంటాయని ఆయన చెప్పారు. ఎయిరిండియాలో వ్యూహాత్మకంగా వాటాలు విక్రయించేందుకు సంబంధించిన విధివిధానాలను మంత్రుల స్థాయి బృందం పరిశీలిస్తున్నదని ఆయన తెలిపారు. 50 వేల కోట్ల రూపాయల రుణభారంలో కుంగిపోయిన ఎయిరిండియాలో వాటాల విక్రయానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సూత్రప్రాయంగా అనుమతి తెలిపిందని ఆయన అన్నారు. అంతకు ముందు సభలో మాట్లాడుతూ దేశంలో విమానయాన రంగం విస్తరణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విమాన ప్రయాణికుల సంఖ్యలో దేశం 20 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన తెలిపారు. మనకు అన్నింటా గట్టి పోటీదారుగా భావించే చైనాలో కూడా ఈ వృద్ధిరేటు 13 శాతానికే పరిమితం అయిందని, వృద్ధిరేటులో మనం ప్రపంచ దేశాలన్నింటితో పోల్చితే అగ్రస్థానంలో ఉన్నామని చౌబే చెప్పారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు దీటుగా ముంబై, ఢిల్లీలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నవీ ముంబైలో 15 వేల కోట్ల రూపాయలు, ఢిల్లీకి సమీపంలోనే ఏర్పాటు చేయతలపెట్టిన రెండో విమానాశ్రయంలో మరో 15 వేల కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేస్తున్నట్టు చెప్పారు.

దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్

హైదరాబాద్ విమానాశ్రయం ఆవరణలో సకల వసతులతో ఎయిర్‌పోర్ట్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ప్రకటించారు. ఈ ఎయిర్‌పోర్ట్ సిటీ పూర్తి స్థాయి కనెక్టివిటీతో అత్యంత ఆధునికంగా ఉంటుందని ఆయన అన్నారు. ఇక్కడ దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ కమ్ ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో 20 వేల మంది కూర్చునే వసతి ఉంటుందని ఆయన చెప్పారు. ఇందులో 1500 గదులతో స్టార్ హోటళ్లు, లక్షన్నర చదరపు అడుగుల విస్తీర్ణంలో వసతులు అందుబాటులో ఉంటాయని రావు తెలిపారు. తెలంగాణను ప్రపంచ పర్యాటకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యంగా మార్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్ భావిస్తున్న దృష్ట్యా రానున్న కాలంలో ఏర్పడే డిమాండుకు ఇది ఆలంబనగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఇది బిజినెస్ పోర్ట్, హెల్త్ పోర్ట్, ఎడ్యుకేషన్ పోర్ట్, ఫన్ పోర్ట్, లాజిస్టిక్ పోర్ట్, ఏరోస్పేస్ పోర్ట్ పేరిట భిన్న విభాగాలతో సర్వసమగ్రంగా తయారవుతుందని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక సహా ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌కు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అంతకు ముందు శంకుస్థాపన చేశారు.

టాటా చేతికి భూషణ్ స్టీల్

డీల్ విలువ రూ.35,000 కోట్లు !

న్యూఢిల్లీ : దివాలా తీసిన భూషణ్ స్టీల్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయనున్నట్లు టాటా స్టీల్ ప్రకటించింది. భూషణ్ స్టీల్ కొనుగోలు కోసం దాఖలు చేసిన బిడ్‌ను కంపెనీ గెలుచుకుందని తెలిపింది. అయితే ఎంత మొత్తానికి ఈ కంపెనీని కొనుగోలు చేయనుందనేది మాత్రం వెల్లడించలేదు. అయితే పరిశ్రమ వర్గాల ప్రకారం డీల్ విలువ దాదాపు 35,000 కోట్ల రూపాయలు ఉండొచ్చని అంచనా. పూర్తిగా నగదు చెల్లించి టాటా స్టీల్ ఈ డీల్‌ను పూర్తి చేయనుంది. భూషణ్ స్టీల్ కొనుగోలుతో టాటా స్టీల్..దేశంలోనే అతిపెద్ద ఉక్కు తయారీదారుగా అవతరించనుంది. ప్రస్తుతం టాటా స్టీల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.3 కోట్ల టన్నులుగా ఉండగా భూషణ్ కొనుగోలుతో అదనంగా 56 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం వచ్చి చేరనుంది. ఈ నెల 22న భూషణ్ స్టీల్ లిమిటెడ్ రుణదాతల కమిటీ.. తాము దాఖలు చేసిన బిడ్ గెలిచినట్లు ప్రకటించిందని టాటా స్టీల్ తెలిపింది. ఎన్‌సిఎల్‌టి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అనుమతులకు లోబడి ఈ కొనుగోలు ఉంటుందని తెలిపింది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ 2016 (ఐబిసి)లోని కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ (సిఐఆర్‌పి) కింద భూషణ్ స్టీల్ కొనుగోలుకు సంబంధించి టాటా స్టీల్ సమర్పించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఆమోదించారని తెలిపింది. 48,100 కోట్ల రూపాయల రుణాలను చెల్లించలేకపోవటంతో బ్యాంకులు భూషణ్ స్టీల్ ఆస్తులను వేలం వేయటంతో జెఎస్‌డబ్ల్యు స్టీల్ సహా కంపెనీకి చెందిన ఉద్యోగులు కొందరు ప్రైవేట్ ఈక్విటీ సంస్థతో కలిసి భూషణ్ స్టీల్ కొనుగోలుకు బిడ్లు దాఖలు చేశాయి.

ఈ ఏడాది 200 నియామకాలు

జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిటైల్, సప్లయ్ చెయిన్ సొల్యూషన్స్‌ను అందిస్తున్న జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్.. 200 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం జెడిఎకు ప్రపంచవ్యాప్తంగా 4,300 మంది ఉద్యోగులుండగా ఒక్క భారత్‌లో 2,100 మంది ఉద్యోగులున్నారని సంస్థ సిఇఒ గిరీష్ రిషి వెల్లడించారు. జెడిఎ సాఫ్ట్‌వేర్‌కు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరుల్లో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్తగా 200 మంది నిపుణులను నియమించుకోనున్నట్టు ఆయన చెప్పారు. సప్లయ్ చెయిన్‌లో ఉపయోగించే ఇంటెలిజెంట్ ఎడ్జ్ టెక్నాలజీలైన మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐఒటి, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్‌లో సామర్థ్యాలను పెంచుకునేందుకు మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)తో సంయుక్తంగా పరిశోధన కార్యకలాపాలను చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారత మార్కెట్లో షాపర్స్ స్టాప్, దాల్మియా సిమెంట్స్, ఆదిత్య బిర్లా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ సహా మరికొన్ని సంస్థలకు సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ 40కి పైగా దేశాల్లో సేవలందిస్తోందని, 2017లో టర్నోవర్ 100 కోట్ల డాలర్లుగా ఉందని రిషి తెలిపారు. సంస్థ ఏటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వస్తోందని చెప్పారు.

టి-స్కేల్‌కు 5 స్టార్టప్‌ల ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిడబ్ల్యుసి, కో క్రియేషన్ కన్సల్టింగ్ భాగస్వామ్యంలో టి-హబ్ నిర్వహించిన టి-స్కేల్ ప్రోగ్రామ్‌కు ఐదు స్టార్టప్ కంపెనీలు ఎంపికయ్యాయి. 70కి పైగా స్టార్టప్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణన్ తెలిపారు. స్టార్టప్‌ల వ్యాపారానికి సంబంధించి 12 సెషన్ల ప్రోగ్రామ్ నిర్వహించిన అనంతరం ఐదు కంపెనీలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. ఎంపిక స్టార్టప్స్‌కు అవసరమైన భాగస్వామ్యాలను కల్పించటంతో పాటు కస్టమర్ అక్విజిషన్ కోసం టి-హబ్, పిడబ్ల్యుసి తోడ్పాటునందించనుందని తెలిపారు. టి-హబ్, పిడబ్ల్యుసి షార్ట్‌లిస్ట్ చేసిన స్టార్టప్‌ల్లో ఇన్‌స్టాగ్రీన్, ఐఒటిఆర్ఎల్, ఫైండ్‌ఫ్యాక్ట్స్, ఇండియాబైజ్, నెబులే ఉన్నాయి.

ఢీ అంటే ఢీ

ప్రపంచ వాణిజ్య మార్కెట్లో దిగ్గజ దేశాలైన అమెరికా, చైనాలు సమర శంఖాన్ని పూరించాయి. ప్రత్యర్థి దేశ ఉత్పత్తులను అడ్డుకునేందుకు సుంకాల గోడలు కడుతున్నాయి. రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య మొదలైన ఈ వాణిజ్య యుద్ధం అన్ని దేశాలను కుదిపేసే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం

చైనా సరుకులపై 6,000 కోట్ల డాలర్ల సుంకాలు

128 అమెరికా వస్తువులపై సుంకం విధింపు



వాషింగ్టన్/బీజింగ్: ప్రపంచ మార్కెట్‌ను వాణిజ్య యుద్ధ మేఘాలు కమ్మేశాయి. అమెరికా, చైనాలు ట్రేడ్ వార్‌ను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా ఉత్పత్తులపై 6,000 కోట్ల డాలర్ల భారీ సుంకాలను విధించారు. తమ మేధోసంపత్తి హక్కులను చైనా దొంగిలిస్తోందన్న నెపంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మేధోసంపత్తి హక్కుల చౌర్యానికి సంబంధించి ఏడు నెలలపాటు దర్యాప్తు జరిపిన యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్).. నివేదికను సమర్పించిన ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అమెరికా కంపెనీల సాంకేతికత వారి స్థానిక సంస్థలకు బదిలీ అయ్యేలా చైనా ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యాలు, ఈక్విటీ వాటాలు, విదేశీ పెట్టుబడులపై నియంత్రణలతోపాటు విదేశీ యాజమాన్యాలపై ఆంక్షలు విధిస్తోందని నివేదికలో పేర్కొంది. "చైనాతో కొన్నేళ్లుగా ఈ సమస్యపై చర్చించినా ఫలితం లేకపోయింది. చైనా అనుచిత, మార్కెట్ వక్రీకరణ వ్యవహర శైలికి బదులిచ్చేందుకు అమెరికా అందుబాటులో ఉన్న సాధనాలన్నింటినీ ఉపయోగించనుంది. చైనా అక్రమ వాణిజ్య విధానాలు కేవలం మాకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా వర్తక భాగస్వాములందరికీ అత్యంత సవాలుగా మారింది" అని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రాబర్ట్ లైట్‌హైజర్ పేర్కొన్నారు.

యుఎస్‌టిఆర్ నివేదిక సమర్పించిన మరుసటినాడే చైనాపై భారీగా సుంకాలు వడ్డిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం. సుంకం విధించబోతున్న చైనా ఉత్పత్తుల జాబితాను 15 రోజుల్లో విడుదల చేయడంతోపాటు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటిఒ) వద్ద చైనా వాణిజ్య విధానాలను సవాలు చేయాలని యుఎస్‌టిఆర్‌ను ట్రంప్ ఆదేశించారు. చైనాతో అమెరికా వాణిజ్య లోటు 50,400 కోట్ల డాలర్ల స్థాయిలో ఉందని ట్రంప్ అన్నారు.

దెబ్బకు దెబ్బ!

ట్రంప్ చర్యలకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించింది. మొత్తం 128 వస్తువులపై 300 కోట్ల డాలర్ల విలువైన సుంకాలను వడ్డించింది. కాకపోతే బిగ్ టికెట్ ఐటమ్స్‌ను మినహాయించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు తెగిపోకుండా ఉండాలంటే అమెరికా వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోమని మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చన్‌యింగ్ అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. చైనా సుంకం విధించిన అమెరికన్ వస్తువుల జాబితాలో పంది మాంసం, పళ్లు, వైన్, సీమ్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, రీసైకిల్డ్ అల్యూమినియం కూడా ఉన్నాయి.

మమ్మల్ని వాడుకోవాలనుకోవద్దు: ట్రంప్

అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికాను వాడుకొని లబ్ధి పొందాలనుకునే రోజులు ముగిశాయని ట్రంప్ అన్నారు. అమెరికాతో వాణిజ్యంలో అనుచిత విధానాలు అవలంబించేవారితోపాటు తమ వాణిజ్య లోటును పెంచుతున్న దేశాలపై చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు.

20 లక్షల ఉద్యోగాలు కోల్పోయాం: వైట్‌హౌజ్

చైనాతో భారీ స్థాయి వాణిజ్య లోటు కారణంగా 20 లక్షల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చిందని వైట్‌హౌజ్ పేర్కొంది. చైనాపై దిగుమతి సుంకాల విధింపును సమర్థించుకుంది.

ఇయు దేశాలపై లోహ సుంకాల రద్దు

యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలతోపాటు వాణిజ్య భాగస్వాములపై గతంలో విధించిన స్టీల్, అల్యూమినియం దిగుమతి సుంకాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించించారు.

అంతర్జాతీయ వాణిజ్యంలో సవాళ్లు: సురేష్ ప్రభు

న్యూఢిల్లీ : అమెరికా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య పెను సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతులు పెరిగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. చైనా సహా అన్ని ప్రధాన వర్తక భాగస్వాములకు వ్యతిరేకంగా అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. చైనా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 6,000 కోట్ల డాలర్ల దిగుమతి సుంకాలను విధించారు. అంతేకాకుండా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న సవాళ్లను సురేష్ ప్రభు ప్రస్తావించారు.

ఆర్థిక వృద్ధికి విఘాతం: రాజన్

అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి పునరుద్ధరణకు విఘాతం కలుగవచ్చని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఇది అంత తేలికగా తీసుకునే పరిణామం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సమయంలో ఏ దేశమైనా వాణిజ్య యుద్ధాలకు దూరంగా ఉండాలన్నారు.

జగడాలు వద్దు: శక్తికాంత దాస్

వాణిజ్య పరంగా ప్రపంచంలోని అగ్రగామి దేశాలైన చైనా-అమెరికా మధ్య మొదలైన జగడాలపై జి-20 సమావేశాల్లో భారత ప్రతినిధి శక్తికాంతదాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అది వారి ఆర్థిక వ్యవస్థకు ఏమేర ప్రయోజనకరమని ఇరు దేశాల ప్రభుత్వాలు విశ్లేషించుకోవాల న్నారు. పరస్పరం చర్చించుకొని వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్ చొరవ చూపాలి: ఫిక్కీ

అమెరికా-చైనాలతో వాణిజ్య యుద్ధం మొదలుకాకుండా చూడటంలో భారత్ కీలకపాత్ర పోషించాలని ఫిక్కీ అభిప్రాయపడింది. లేదంటే ప్రపంచ వాణిజ్య పురోగతి పట్టాలు తప్పవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది.

శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ వర్సిటీ

రాజన్, కార్పొరేట్ దిగ్గజాల నేతృత్వంలో ఏర్పాటు

తొలుత రూ.750 కోట్ల పెట్టుబడులు

ముంబై : భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, కార్పొరేట్ దిగ్గజాలు, ప్రముఖ విద్యావేత్తల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. క్రెయా యూనివర్సిటీ పేరుతో దీన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ విశ్వవిద్యాలయం తొలి దశలో 750 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ చైర్మన్, యూనివర్సిటీ సూపర్‌వైజరీ బోర్డ్ చైర్మన్ ఆర్ శేషసాయి తెలిపారు. దాతృత్వ కార్యకలాపాల్లో భాగంగా కార్పొరేట్లు దీనికి సహకారం అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ యూనివర్సిటీలో మొదటి బ్యాచ్ 2019 జూలైలో ప్రారంభం అవుతుందని, ప్రవేశాలు నవంబరులో ప్రారంభం అవుతాయన్నారు. హాస్టల్‌తో కలిపి ఫీజు 7-8 లక్షల రూపాయలుంటుందని చెప్పారు. తొలుత శ్రీసిటీలోని ఐఎఫ్ఎంఆర్ క్యాంపస్ నుంచి కోర్సుల నిర్వహణ జరుగుతుందని, తర్వాతి కాలంలో యూనివర్సిటీకి మారిపోతుందన్నారు. 200 ఎకరాల ఈ క్యాంపస్ ఏర్పాటవుతుందని, 2020నాటికి ఇది సిద్ధమవుతుందని ఆయన చెప్పారు. లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో నాలుగేళ్ల రెసిడెన్షియల్ అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తామని, బిఎ (హానర్స్), బిఎస్‌ఇ (హానర్స్)కు ఇవి సమానమని తెలిపారు. వీటికి యుజిసి నుంచి అనుమతులు కోరినట్టు శేషసాయి తెలిపారు. మెరిట్ ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా సుందర్ రామస్వామి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మాజీ బ్యాంకర్ ఎన్ వాఘుల్, సభ్యులుగా జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌చైర్మన్ సజ్జన్ జిందాల్, ఎం అండ్ ఎం గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఉన్నారు. రాజన్ క్రెయా గవర్నింగ్ కౌన్సిల్ అడ్వైజర్‌గా ఉన్నారు.

ప్యాకేజింగ్ చట్టానికి సన్నాహాలు

ఐఐపి డైరెక్టర్ ఎన్‌సి సాహ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా ప్యాకేజింగ్ చట్టం తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) డైరెక్టర్ ఎన్‌సి సాహ తెలిపారు. ఆహార ఉత్పత్తుల ప్యాకేజింగ్ భద్రతకు సంబంధించి తాము ప్రత్యేక అధ్యయనాన్ని నిర్వహించామని, ఇందుకు సంబంధించిన వివరాలను భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు సమర్పించామని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టానికి సంబంధించి ముసాయిదాపై అన్ని వర్గాలు అభిప్రాయాలు తెలియజేస్తున్నాయన్నారు. దీనికి ఎస్ఎస్ఎస్ఎఐతోపాటు పార్లమెంట్ ఆమోదం లభిస్తే చట్టంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టం ద్వారా ఉత్పత్తుల వినియోగదారులకు మరింత భద్రత లభిస్తుందన్నారు. 'ప్యాకేజింగ్ ఫర్ న్యూ మిలీనియమ్'పై శుక్రవారంనాడిక్కడ రెండు రోజుల సదస్సు ప్రారంభమైన సందర్భంగా సాహ మాట్లాడారు. ఐఐపి విస్తరణలో భాగంగా బెంగళూరు, గువహతి, కాకినాడ, అహ్మదాబాద్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాకినాడలో సెంటర్ ఏర్పాటు కోసం ఎపి ప్రభుత్వం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చినట్టు సాహ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ నాలుగు ఎకరాల స్థలం ఇచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రం విస్తరణకుగాను ఐదు ఎకరాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. విస్తరణ ద్వారా పిజి డిప్లొమాలో చేరే విద్యార్థుల సంఖ్యను 35 నుంచి 100కు పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.ఇందుకు సంబంధించిన మెమోరాండమ్‌ను ప్రభుత్వాన్ని సమర్పించినట్టు ఐఐపి హైదరాబాద్ మాజీ చైర్మన్ ఎవిపిఎస్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం దేశీయ ప్యాకేజింగ్ మార్కెట్ 2,700 కోట్ల డాలర్లుగా ఉందని, 2020నాటికి 3,200 కోట్ల డాలర్లను తాకే అవకాశం ఉందని సాహ చెప్పారు. ఐఐపి ఆఫర్ చేస్తున్న వివిధ కోర్సులను ఇప్పటికే 5,000 మంది పూర్తి చేశారన్నారు.

తగ్గిన విదేశీ మారక నిల్వలు

ముంబై : వరుసగా రెండు వారాలపాటు పెరిగిన భారత్ విదేశీ మారక నిల్వలు మార్చి 16తో ముగిసిన వారంలో 15.24 కోట్ల డాలర్లు తగ్గి 42,133.4 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు మాత్రం 1.32 కోట్ల డాలర్లు పెరిగి 2,156.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 41 లక్షల డాలర్లు పెరిగి 153.8 కోట్ల డాలర్లకు చేరాయని భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) తెలిపింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ నిల్వలు కూడా 55 లక్షల డాలర్లు పెరిగి 207.7 కోట్ల డాలర్లకు చేరాయి.

రూ. 2,000 కోట్లతో విస్తరణ

రెండో రన్‌వే పూర్తి స్థాయిలో అభివృద్ధి.. గంటకు 50 విమానాల రాకపోకలకు ఏర్పాట్లు

రెండేళ్లకల్లా 2.6 కోట్ల మంది ప్రయాణికులు : జిఎంఆర్ విమానాశ్రయ సిఇఒ ఎస్‌జికె కిశోర్



హైదరాబాద్ విమానాశ్రయ విస్తరణ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్, జిఎం రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ విమానాశ్రయంలో నానాటికీ పెరుగుతున్న ప్రయాణికుల తాకిడిని తట్టుకునేందుకు ప్రస్తుతం ఉన్న టెర్మినల్ విస్తరణ పనులు రెండు వేల కోట్ల రూపాయలతో చేపడుతున్నట్టు జిఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్‌జికె కిశోర్ తెలిపారు. జిఎంఆర్ విమానాశ్రయం పది సంవత్సరాల వేడుక సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విమానాశ్రయ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ ద్వారా ఏడాదికి 1.8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా విస్తరణ పూర్తయ్యే నాటికి 2.6 కోట్ల మంది రాకపోకలు సాగించే సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులనే ఉపయోగించుకుంటూ వీలైనంత ఎక్కువ మంది రాకపోకలు సాగించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నామమాత్రంగా పని చేస్తున్న రెండో రన్‌వేను పూర్తి స్థాయి రన్‌వేగా మార్చబోతున్నట్టు కిశోర్ చెప్పారు. ప్రస్తుతం విమానాశ్రయం నుంచి గంటకు 26 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రెండో రన్‌వే కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే సరికి గంటకు 50 విమానాలు రాకపోకలు సాగించగలుగుతాయని ఆయన అన్నారు.

ప్రస్తుతం తమ నిపుణుల బృందం ఇదే స్థాయి విమానాశ్రయాలున్న జర్మనీ వంటి దేశాల్లో పర్యటిస్తున్నదని, ఆయా విమానాశ్రయాల్లో వసతులను అధ్యయనం చేస్తున్నదని, వారి నివేదిక ఆధారంగా ఆ విమానాశ్రయాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఇక్కడ ప్రపంచ శ్రేణి వసతుల కల్పనకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. వాస్తవానికి హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా గరిష్ఠంగా నాలుగు కోట్ల మంది రాకపోకలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, ఆ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పుడు 1.6 కోట్ల మంది రాకపోకలు సాగించే వసతులుండగా దాన్ని అధిగమించామని కిశోర్ అన్నారు. విస్తరణ ప్రణాళికలన్నీ రెండేళ్లలో పూర్తవుతాయని ఆయన తెలిపారు. విమాన ప్రయాణికుల్లో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 22 నుంచి 24 శాతం వృద్ధి నమోదవుతుందని భావిస్తున్నామని, వచ్చే ఏడాది అది 20 శాతం వరకు ఉండవచ్చునని ఆయన చెప్పారు. ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదలకు దీటుగా ఎప్పటికప్పుడు అనుమతులు తీసుకుని వేగంగా విస్తరణ కార్యక్రమాలు చేపట్టడం జిఎంఆర్ వ్యూహమన్నారు. మొదటి టెర్మినల్ విస్తరణ పూర్తయిన తర్వాత రెండో టెర్మినల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా చిన్న విమానాలు, ఎటిఆర్‌లు ఎక్కువగా నడుస్తున్నాయని, ఏ శ్రేణి విమానాలు ఎన్ని నడుస్తున్నాయనే అంశాన్ని బట్టి గంటకు ఎన్ని విమానాల రాకపోకలు చేపట్టగలమనేది ఆధారపడి ఉంటుందని కిశోర్ చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయంలో జిఎంఆర్‌కు 63 శాతం వాటాలుండగా తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం వాటా ఉన్నదని, మిగతా వాటాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, మలేసియా ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ బెర్హాద్ చేతిలో ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా జిఎంఆర్ తన వాటాను యథాతథంగా కొనసాగిస్తుందని తెలిపారు.

రెండు వారాల్లో ఎయిరిండియా బిడ్డింగ్

పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే

ఎయిరిండియాలో వాటాల విక్రయానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణలకు రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే చెప్పారు. జిఎంఆర్ విమానాశ్రయం పదేళ్ల వేడుకకు హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బిడ్డర్లకు నికర విలువ ఎంత ఉండాలి, ఇతరత్రా అర్హతలేమిటి అన్నవి నోటిఫికేషన్‌లో ఉంటాయని ఆయన చెప్పారు. ఎయిరిండియాలో వ్యూహాత్మకంగా వాటాలు విక్రయించేందుకు సంబంధించిన విధివిధానాలను మంత్రుల స్థాయి బృందం పరిశీలిస్తున్నదని ఆయన తెలిపారు. 50 వేల కోట్ల రూపాయల రుణభారంలో కుంగిపోయిన ఎయిరిండియాలో వాటాల విక్రయానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సూత్రప్రాయంగా అనుమతి తెలిపిందని ఆయన అన్నారు. అంతకు ముందు సభలో మాట్లాడుతూ దేశంలో విమానయాన రంగం విస్తరణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విమాన ప్రయాణికుల సంఖ్యలో దేశం 20 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన తెలిపారు. మనకు అన్నింటా గట్టి పోటాదారుగా భావించే చైనాలో కూడా ఈ వృద్ధిరేటు 13 శాతానికే పరిమితం అయిందని, వృద్ధిరేటులో మనం ప్రపంచ దేశాలన్నింటితో పోల్చితే అగ్రస్థానంలో ఉన్నామని చౌబే చెప్పారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు దీటుగా ముంబై, ఢిల్లీలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నవీ ముంబైలో 15 వేల కోట్ల రూపాయలు, ఢిల్లీకి సమీపంలోనే ఏర్పాటు చేయతలపెట్టిన రెండో విమానాశ్రయంలో మరో 15 వేల కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేస్తున్నట్టు చెప్పారు.

దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్

హైదరాబాద్ విమానాశ్రయం ఆవరణలో సకల వసతులతో ఎయిర్‌పోర్ట్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ప్రకటించారు. ఈ ఎయిర్‌పోర్ట్ సిటీ పూర్తి స్థాయి కనెక్టివిటీతో అత్యంత ఆధునికంగా ఉంటుందని ఆయన అన్నారు. ఇక్కడ దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ కమ్ ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో 20 వేల మంది కూర్చునే వసతి ఉంటుందని ఆయన చెప్పారు. ఇందులో 1500 గదులతో స్టార్ హోటళ్లు, లక్షన్నర చదరపు అడుగుల విస్తీర్ణంలో వసతులు అందుబాటులో ఉంటాయని రావు తెలిపారు. తెలంగాణను ప్రపంచ పర్యాటకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యంగా మార్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్ భావిస్తున్న దృష్ట్యా రానున్న కాలంలో ఏర్పడే డిమాండుకు ఇది ఆలంబనగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఇది బిజినెస్ పోర్ట్, హెల్త్ పోర్ట్, ఎడ్యుకేషన్ పోర్ట్, ఫన్ పోర్ట్, లాజిస్టిక్ పోర్ట్, ఏరోస్పేస్ పోర్ట్ పేరిట భిన్న విభాగాలతో సర్వసమగ్రంగా తయారవుతుందని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక సహా ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌కు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అంతకు ముందు శంకుస్థాపన చేశారు.

టాటా చేతికి భూషణ్ స్టీల్

డీల్ విలువ రూ.35,000 కోట్లు !

న్యూఢిల్లీ : దివాలా తీసిన భూషణ్ స్టీల్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయనున్నట్లు టాటా స్టీల్ ప్రకటించింది. భూషణ్ స్టీల్ కొనుగోలు కోసం దాఖలు చేసిన బిడ్‌ను కంపెనీ గెలుచుకుందని తెలిపింది. అయితే ఎంత మొత్తానికి ఈ కంపెనీని కొనుగోలు చేయనుందనేది మాత్రం వెల్లడించలేదు. అయితే పరిశ్రమ వర్గాల ప్రకారం డీల్ విలువ దాదాపు 35,000 కోట్ల రూపాయలు ఉండొచ్చని అంచనా. పూర్తిగా నగదు చెల్లించి టాటా స్టీల్ ఈ డీల్‌ను పూర్తి చేయనుంది. భూషణ్ స్టీల్ కొనుగోలుతో టాటా స్టీల్..దేశంలోనే అతిపెద్ద ఉక్కు తయారీదారుగా అవతరించనుంది. ప్రస్తుతం టాటా స్టీల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.3 కోట్ల టన్నులుగా ఉండగా భూషణ్ కొనుగోలుతో అదనంగా 56 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం వచ్చి చేరనుంది. ఈ నెల 22న భూషణ్ స్టీల్ లిమిటెడ్ రుణదాతల కమిటీ.. తాము దాఖలు చేసిన బిడ్ గెలిచినట్లు ప్రకటించిందని టాటా స్టీల్ తెలిపింది. ఎన్‌సిఎల్‌టి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అనుమతులకు లోబడి ఈ కొనుగోలు ఉంటుందని తెలిపింది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ 2016 (ఐబిసి)లోని కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ (సిఐఆర్‌పి) కింద భూషణ్ స్టీల్ కొనుగోలుకు సంబంధించి టాటా స్టీల్ సమర్పించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఆమోదించారని తెలిపింది. 48,100 కోట్ల రూపాయల రుణాలను చెల్లించలేకపోవటంతో బ్యాంకులు భూషణ్ స్టీల్ ఆస్తులను వేలం వేయటంతో జెఎస్‌డబ్ల్యు స్టీల్ సహా కంపెనీకి చెందిన ఉద్యోగులు కొందరు ప్రైవేట్ ఈక్విటీ సంస్థతో కలిసి భూషణ్ స్టీల్ కొనుగోలుకు బిడ్లు దాఖలు చేశాయి.

ఈ ఏడాది 200 నియామకాలు

జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిటైల్, సప్లయ్ చెయిన్ సొల్యూషన్స్‌ను అందిస్తున్న జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్.. 200 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం జెడిఎకు ప్రపంచవ్యాప్తంగా 4,300 మంది ఉద్యోగులుండగా ఒక్క భారత్‌లో 2,100 మంది ఉద్యోగులున్నారని సంస్థ సిఇఒ గిరీష్ రిషి వెల్లడించారు. జెడిఎ సాఫ్ట్‌వేర్‌కు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరుల్లో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్తగా 200 మంది నిపుణులను నియమించుకోనున్నట్టు ఆయన చెప్పారు. సప్లయ్ చెయిన్‌లో ఉపయోగించే ఇంటెలిజెంట్ ఎడ్జ్ టెక్నాలజీలైన మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఒటి, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్‌లో సామర్థ్యాలను పెంచుకునేందుకు మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)తో సంయుక్తంగా పరిశోధన కార్యకలాపాలను చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారత మార్కెట్లో షాపర్స్ స్టాప్, దాల్మియా సిమెంట్స్, ఆదిత్య బిర్లా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ సహా మరికొన్ని సంస్థలకు సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ 40కి పైగా దేశాల్లో సేవలందిస్తోందని, 2017లో టర్నోవర్ 100 కోట్ల డాలర్లుగా ఉందని రిషి తెలిపారు. సంస్థ ఏటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వస్తోందని చెప్పారు.

టి-స్కేల్‌కు 5 స్టార్టప్‌ల ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిడబ్ల్యుసి, కో క్రియేషన్ కన్సల్టింగ్ భాగస్వామ్యంలో టి-హబ్ నిర్వహించిన టి-స్కేల్ ప్రోగ్రామ్‌కు ఐదు స్టార్టప్ కంపెనీలు ఎంపికయ్యాయి. 70కి పైగా స్టార్టప్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణన్ తెలిపారు. స్టార్టప్‌ల వ్యాపారానికి సంబంధించి 12 సెషన్ల ప్రోగ్రామ్ నిర్వహించిన అనంతరం ఐదు కంపెనీలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. ఎంపిక స్టార్టప్స్‌కు అవసరమైన భాగస్వామ్యాలను కల్పించటంతో పాటు కస్టమర్ అక్విజిషన్ కోసం టి-హబ్, పిడబ్ల్యుసి తోడ్పాటునందించనుందని తెలిపారు. టి-హబ్, పిడబ్ల్యుసి షార్ట్‌లిస్ట్ చేసిన స్టార్టప్‌ల్లో ఇన్‌స్టాగ్రీన్, ఐఒటిఆర్ఎల్, ఫైండ్‌ఫ్యాక్ష్, ఇండియాబైస్, నెబులే ఉన్నాయి.

ఢీ అంటే ఢీ

చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం

చైనా సరుకులపై 6,000 కోట్ల డాలర్ల సుంకాలు

128 అమెరికా వస్తువులపై సుంకం విధింపు

ప్రపంచ వాణిజ్య మార్కెట్లో దిగ్గజ దేశాలైన అమెరికా, చైనాలు సమర శంఖాన్ని పూరించాయి. ప్రత్యర్థి దేశ ఉత్పత్తులను అడ్డుకునేందుకు సుంకాల గోడలు కడుతున్నాయి. రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య మొదలైన ఈ వాణిజ్య యుద్ధం అన్ని దేశాలను కుదిపేసే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



వాషింగ్టన్/బీజింగ్: ప్రపంచ మార్కెట్‌ను వాణిజ్య యుద్ధ మేఘాలు కమ్మేశాయి. అమెరికా, చైనాలు ట్రేడ్ వార్‌ను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా ఉత్పత్తులపై 6,000 కోట్ల డాలర్ల భారీ సుంకాలను విధించారు. తమ మేధోసంపత్తి హక్కులను చైనా దొంగిలిస్తోందన్న నెపంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మేధోసంపత్తి హక్కుల చౌర్యానికి సంబంధించి ఏడు నెలలపాటు దర్యాప్తు జరిపిన యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్).. నివేదికను సమర్పించిన ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అమెరికా కంపెనీల సాంకేతికత వారి స్థానిక సంస్థలకు బదిలీ అయ్యేలా చైనా ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యాలు, ఈక్విటీ వాటాలు, విదేశీ పెట్టుబడులపై నియంత్రణలతోపాటు విదేశీ యాజమాన్యాలపై ఆంక్షలు విధిస్తోందని నివేదికలో పేర్కొంది. "చైనాతో కొన్నేళ్లుగా ఈ సమస్యపై చర్చించినా ఫలితం లేకపోయింది. చైనా అనుచిత, మార్కెట్ వక్రీకరణ వ్యవహార శైలికి బదులిచ్చేందుకు అమెరికా అందుబాటులో ఉన్న సాధనాలన్నింటినీ ఉపయోగించనుంది. చైనా అక్రమ వాణిజ్య విధానాలు కేవలం మాకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా వర్తక భాగస్వాములందరికీ అత్యంత సవాలుగా మారింది" అని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రాబర్ట్ లైట్‌హైజర్ పేర్కొన్నారు.

యుఎస్‌టిఆర్ నివేదిక సమర్పించిన మరుసటినాడే చైనాపై భారీగా సుంకాలు వడ్డిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం. సుంకం విధించబోతున్న చైనా ఉత్పత్తుల జాబితాను 15 రోజుల్లో విడుదల చేయడంతోపాటు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటిఒ) వద్ద చైనా వాణిజ్య విధానాలను సవాలు చేయాలని యుఎస్‌టిఆర్‌ను ట్రంప్ ఆదేశించారు. చైనాతో అమెరికా వాణిజ్య లోటు 50,400 కోట్ల డాలర్ల స్థాయిలో ఉందని ట్రంప్ అన్నారు.

దెబ్బకు దెబ్బ!

ట్రంప్ చర్యలకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించింది. మొత్తం 128 వస్తువులపై 300 కోట్ల డాలర్ల విలువైన సుంకాలను వడ్డించింది. కాకపోతే బిగ్ టికెట్ ఐటమ్స్‌ను మినహాయించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు తెగిపోకుండా ఉండాలంటే అమెరికా వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోమని మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చన్‌యింగ్ అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. చైనా సుంకం విధించిన అమెరికన్ వస్తువుల జాబితాలో పంది మాంసం, పళ్లు, వైన్, సీమ్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, రీసైకిల్డ్ అల్యూమినియం కూడా ఉన్నాయి.

మమ్మల్ని వాడుకోవాలనుకోవద్దు: ట్రంప్

అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికాను వాడుకొని లబ్ధి పొందాలనుకునే రోజులు ముగిశాయని ట్రంప్ అన్నారు. అమెరికాతో వాణిజ్యంలో అనుచిత విధానాలు అవలంబించేవారితోపాటు తమ వాణిజ్య లోటును పెంచుతున్న దేశాలపై చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు.

20 లక్షల ఉద్యోగాలు కోల్పోయాం: వైట్‌హౌజ్

చైనాతో భారీ స్థాయి వాణిజ్య లోటు కారణంగా 20 లక్షల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చిందని వైట్‌హౌజ్ పేర్కొంది. చైనాపై దిగుమతి సుంకాల విధింపును సమర్థించుకుంది.

ఇయు దేశాలపై లోహ సుంకాల రద్దు

యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలతోపాటు వాణిజ్య భాగస్వాములపై గతంలో విధించిన స్టీల్, అల్యూమినియం దిగుమతి సుంకాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించించారు.

అంతర్జాతీయ వాణిజ్యంలో సవాళ్లు: సురేష్ ప్రభు

న్యూఢిల్లీ : అమెరికా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య పెను సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతులు పెరిగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. చైనా సహా అన్ని ప్రధాన వర్తక భాగస్వాములకు వ్యతిరేకంగా అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. చైనా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 6,000 కోట్ల డాలర్ల దిగుమతి సుంకాలను విధించారు. అంతేకాకుండా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న సవాళ్లను సురేష్ ప్రభు ప్రస్తావించారు.

ఆర్థిక వృద్ధికి విఘాతం: రాజన్

అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి పునరుద్ధరణకు విఘాతం కలుగవచ్చని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఇది అంత తేలికగా తీసుకునే పరిణామం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సమయంలో ఏ దేశమైనా వాణిజ్య యుద్ధాలకు దూరంగా ఉండాలన్నారు.

జగడాలు వద్దు: శక్తికాంత దాస్

వాణిజ్య పరంగా ప్రపంచంలోని అగ్రగామి దేశాలైన చైనా-అమెరికా మధ్య మొదలైన జగడాలపై జి-20 సమావేశాల్లో భారత ప్రతినిధి శక్తికాంతదాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అది వారి ఆర్థిక వ్యవస్థకు ఏమేర ప్రయోజనకరమని ఇరు దేశాల ప్రభుత్వాలు విశ్లేషించుకోవాల న్నారు. పరస్పరం చర్చించుకొని వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్ చొరవ చూపాలి: ఫిక్కీ

అమెరికా-చైనాలతో వాణిజ్య యుద్ధం మొదలుకాకుండా చూడటంలో భారత్ కీలకపాత్ర పోషించాలని ఫిక్కీ అభిప్రాయపడింది. లేదంటే ప్రపంచ వాణిజ్య పురోగతి పట్టాలు తప్పవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది.

శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ వర్సిటీ

రాజన్, కార్పొరేట్ దిగ్గజాల నేతృత్వంలో ఏర్పాటు

తొలుత రూ.750 కోట్ల పెట్టుబడులు

ముంబై : భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, కార్పొరేట్ దిగ్గజాలు, ప్రముఖ విద్యావేత్తల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. క్రెయా యూనివర్సిటీ పేరుతో దీన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ విశ్వవిద్యాలయం తొలి దశలో 750 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఇండస్ఇండ్ బ్యాంక్ చైర్మన్, యూనివర్సిటీ సూపర్‌వైజరీ బోర్డ్ చైర్మన్ ఆర్ శేషసాయి తెలిపారు. దాతృత్వ కార్యకలాపాల్లో భాగంగా కార్పొరేట్లు దీనికి సహకారం అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ యూనివర్సిటీలో మొదటి బ్యాచ్ 2019 జూలైలో ప్రారంభం అవుతుందని, ప్రవేశాలు నవంబరులో ప్రారంభం అవుతాయన్నారు. హాస్టల్‌తో కలిపి ఫీజు 7-8 లక్షల రూపాయలుంటుందని చెప్పారు. తొలుత శ్రీసిటీలోని ఐఎఫ్ఎంఆర్ క్యాంపస్ నుంచి కోర్సుల నిర్వహణ జరుగుతుందని, తర్వాతి కాలంలో యూనివర్సిటీకి మారిపోతుందన్నారు. 200 ఎకరాల ఈ క్యాంపస్ ఏర్పాటవుతుందని, 2020నాటికి ఇది సిద్ధమవుతుందని ఆయన చెప్పారు. లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో నాలుగేళ్ల రెసిడెన్షియల్ అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తామని, బిఎ (హానర్స్), బిఎస్‌ఇ (హానర్స్)కు ఇవి సమానమని తెలిపారు. వీటికి యుజిసి నుంచి అనుమతులు కోరినట్టు శేషసాయి తెలిపారు. మెరిట్ ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సుందర్ రామస్వామి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మాజీ బ్యాంకర్ ఎన్ వాఘుల్, సభ్యులుగా జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌చైర్మన్ సజ్జన్ జిందాల్, ఎం అండ్ ఎం గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఉన్నారు. రాజన్ క్రెయా గవర్నింగ్ కౌన్సిల్ అడ్వైజర్‌గా ఉన్నారు.

ప్యాకేజింగ్ చట్టానికి సన్నాహాలు

ఐఐపి డైరెక్టర్ ఎన్‌సి సాహ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా ప్యాకేజింగ్ చట్టం తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) డైరెక్టర్ ఎన్‌సి సాహ తెలిపారు. ఆహార ఉత్పత్తుల ప్యాకేజింగ్ భద్రతకు సంబంధించి తాము ప్రత్యేక అధ్యయనాన్ని నిర్వహించామని, ఇందుకు సంబంధించిన వివరాలను భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు సమర్పించామని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టానికి సంబంధించి ముసాయిదాపై అన్ని వర్గాలు అభిప్రాయాలు తెలియజేస్తున్నాయన్నారు. దీనికి ఎస్ఎస్ఎస్ఎఐతోపాటు పార్లమెంట్ ఆమోదం లభిస్తే చట్టంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టం ద్వారా ఉత్పత్తుల వినియోగదారులకు మరింత భద్రత లభిస్తుందన్నారు. 'ప్యాకేజింగ్ ఫర్ న్యూ మిలీనియమ్'పై శుక్రవారంనాడిక్కడ రెండు రోజుల సదస్సు ప్రారంభమైన సందర్భంగా సాహ మాట్లాడారు. ఐఐపి విస్తరణలో భాగంగా బెంగళూరు, గువహతి, కాకినాడ, అహ్మదాబాద్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాకినాడలో సెంటర్ ఏర్పాటు కోసం ఎపి ప్రభుత్వం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చినట్టు సాహ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ నాలుగు ఎకరాల స్థలం ఇచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రం విస్తరణకుగాను ఐదు ఎకరాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. విస్తరణ ద్వారా పిజి డిప్లొమాలో చేరే విద్యార్థుల సంఖ్యను 35 నుంచి 100కు పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.ఇందుకు సంబంధించిన మెమోరాండమ్‌ను ప్రభుత్వాన్ని సమర్పించినట్టు ఐఐపి హైదరాబాద్ మాజీ చైర్మన్ ఎవిపిఎస్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం దేశీయ ప్యాకేజింగ్ మార్కెట్ 2,700 కోట్ల డాలర్లుగా ఉందని, 2020నాటికి 3,200 కోట్ల డాలర్లను తాకే అవకాశం ఉందని సాహ చెప్పారు. ఐఐపి ఆఫర్ చేస్తున్న వివిధ కోర్సులను ఇప్పటికే 5,000 మంది పూర్తి చేశారన్నారు.

తీరొక్క రంగుల చేప



దేహం నిండా ముళ్లు.. తీరొక్క రంగులు.. వింత చేప ఇది! సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం రిజర్వాయర్‌లో జాలర్ల వలకు చిక్కింది. రత్నవరం గ్రామానికి చెందిన కాసాని ఉపేందర్‌తోపాటు మరికొందరు శుక్రవారం రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లారు. అక్కడ వారి వలకు ఈ అరుదైన చేప చిక్కింది. ఒంటి నిండా ముళ్లతో.. నలుపు, తెలుపు, గోధుమ తదితర రంగులతో వింతగా ఉండటంతో జాలర్లే ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

- అనంతగిరి

చిమ్మ చీకట్లో సిజేరియన్లు

రాత్రుళ్లు ఇంట్లోనో, ఆఫీసులోనో కరెంటు పోతేనే ఏమీ తోచదు. కరెంటు వచ్చేదాకా అడుగుతీసి అడుగు వేయలేం. అలాంటిది ఓ ఆపరేషన్ థియేటర్‌లో గర్భిణికి పురుడు పోస్తుండగా కరెంటు పోతే? చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఇదే జరిగింది. ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ నిర్వహిస్తుండగా మధ్యలో కరెంట్ పోయింది. దీంతో టార్చిలైట్ల వెలుగుల మధ్యే వారికి శస్త్రచికిత్స పూర్తి చేయాల్సి వచ్చింది. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నా అది చెడిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

-చేర్యాల





తాగునీరే బంగారమాయె!



ఆ తండా వాసులకు తాగునీరే బంగారం! బావులు, బోర్లు లేక పోవడంతో కిలోమీటరు దూరంలో ఉన్న గోదావరి నదే ఆధారం. బిందెలు పట్టుకొని నడిచివెళ్లి తెచ్చుకునేవారు కొందరైతే. ఎడ్లబండ్లు కట్టుకొని డ్రమ్ముల్లో నింపుకొని తెచ్చుకునేవారు ఇంకొందరు. వేసవి వచ్చిందంటే ఆ కష్టాలు రెట్టింపవుతాయి. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని లోయగూడెం తండా వాసుల అవస్థ ఇది. అధికారులు ఇప్పటికైనా తమ తండాలో బోరుబావి వేయించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

- జగిత్యాల (ఆంధ్రజ్యోతి)

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యం

- సీఎండీ శ్రీధర్ ఉత్తర్వులు
- రూ. 8వేల పెన్షన్ కోసం లేఖ
- కొత్త క్వార్టర్ల నిర్మాణానికి చర్యలు
- కారుణ్య నియామకాల కోసం మెడికల్ బోర్డు



హైదరాబాద్/మంచిర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో ఆ సంస్థ సీఎండీ ఎన్. శ్రీధర్ నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు శుక్రవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా మాజీ ఉద్యోగులకు ఇస్తున్న రూ. 350 పెన్షన్‌ను రూ. 8వేలకు పెంచాలని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(ధన్‌బాద్)కు లేఖ రాశారు. కోల్‌బెల్ట్‌లో కొత్తగా 10వేల క్వార్టర్లు నిర్మించనున్నారు. ఇందుకోసం రూ. 100 కోట్లు మంజూరు చేశారు. తొలిదశలో 400 కొత్త క్వార్టర్లు విశాలమైన స్థలంలో నిర్మించనున్నారు. ఇక శ్రీరాంపూర్‌లో కంపెనీల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మంచిర్యాల కలెక్టర్‌తో సీఎండీ చర్చలు జరిపారు. కార్మికులకు నీటి బిల్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి పూర్తిగా మినహాయింపు ఇస్తూ ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక, కారుణ్య నియామకాల కోసం మెడికల్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డు కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు వచ్చేవారం నుంచి క్రమం తప్పకుండా వారం వారం సమావేశమవుతుందని సింగరేణి సీఎండీ తెలిపారు.

ఈ ఊరు నాదే

వెంటనే ఇళ్లు ఖాళీ చేయండి.. 36 కుటుంబాలకు ఓ వ్యక్తి నోటీసు



కంఠం గ్రామంలోని కొత్త కాలనీలో ఏర్పాటు చేసుకున్న ఇళ్లు

- స్థలాలు కొని 35 ఏళ్లుగా అక్కడే నివాసం
- ఎక్కడికి పోయేదంటూ బాధితుల ఆందోళన
- భూ రికార్డుల శుద్ధీకరణలో పొరపాటు?

జైనథ్, మార్చి 23: ఆ గ్రామంలోని 36 కుటుంబాల బతుకులు ఇప్పుడు గాల్లో దీపాల్లా మారాయి! 35 ఏళ్ల క్రితం కొన్న స్థలాలు.. అక్కడ నిర్మించుకున్న ఇళ్లు తమవి కాకుండా పోతాయా? అన్న ఆందోళన వారిలో నెలకొంది. ఇందుకు కారణం.. ఓ వ్యక్తి! "మీరు నివసిస్తున్న స్థలమంతా నాదే. వెంటనే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోండి" అని అతడు గద్దిస్తుండడంతో పాపం వారికి ఎటూ పాలుపోవడం లేదు! ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కంఠం గ్రామంలోని కొత్తకాలనీ వాసులకు వచ్చిపడిన కష్టమిది! గ్రామస్థుల వివరాల ప్రకారం.. 1966లో గ్రామానికి చెందిన బోయర్ మహాదేవ్ దగ్గర అదే గ్రామానికి చెందిన బడాల రాజారెడ్డి అనే వ్యక్తి 7.14 ఎకరాలు (సర్వే నంబరు 5) కొనుగోలు చేశాడు. ఆ మేరకు గ్రామ పెద్దల సమక్షంలో ధ్రువీకరణ పత్రాలు కూడా రాసుకున్నారు. కొన్నాళ్లకు రాజారెడ్డి ఆ పొలాన్ని 36 ప్లాట్లుగా విభజించి అదే గ్రామస్థులకు అమ్ముకున్నాడు. వారు అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే, ఇటీవల భూ రికార్డుల శుద్ధీకరణ/నవీకరణలో 7.14 ఎకరా స్థలం బోయర్ మహాదేవ్ పేరు మీదనే వన్-బీలో చేర్చారు. దీంతో ఆయన కుమారుడు బోయర్ విఠల్ కంఠం గ్రామంలోని కొత్త కాలనీ స్థలం తనదేనని, దాన్ని వెంటనే ఖాళీ చేయాలని ఆదిలాబాద్ ఆర్డీవో సూర్యనారాయణను ఆశ్రయించాడు. దీంతో మార్చి 3న బాధితులకు ఆర్డీవో కార్యాలయం నుంచి పిలుపొచ్చింది. అక్కడ ఆర్డీవో ఎదుట వారు పరిస్థితిని వివరించి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అనంతరం మార్చి 17న 36 మందికి విఠల్.. లాయర్ ద్వారా నోటీసులు పంపాడు. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. 35 ఏళ్లుగా తాము ఇక్కడే ఉంటున్నామని.. ప్రభుత్వం ఇక్కడ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా నిర్మించిందని.. సీసీరోడ్లు కూడా వేశారని వారు చెబుతున్నారు. కొత్త కాలనీ నుంచి తమను ఖాళీ చేయమనడం సరికాదని, దీనిపై జిల్లా కోర్టును ఆశ్రయిస్తామని అంటున్నారు. రికార్డుల తారుమారుకు కారణం గ్రామ వీఆర్వోనేనని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయంలో ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత కాలనీ వాసులతో ఈ శనివారం మరోసారి మాట్లాడనున్నారు.

తాతల నుంచి ఇక్కడే ఉంటున్నాం

"1966లో బడాల రాజారెడ్డి చనిపోయిన తర్వాత ఆయన భార్య బడాల భూదేవి నుంచి 7.14 ఎకరాలు కొన్నట్టుగా మా వద్ద ధ్రువీకరణ పత్రాలున్నాయి. రెవెన్యూ రికార్డుల్లోని వన్-బీలో బోయర్ మహాదేవ్ పేరు రావడంతో వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీవో మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజాలని చూస్తున్నారు. దీనిపై మేం జిల్లా కోర్టును ఆశ్రయిస్తాం"

- బడాల గంగారెడ్డి, గ్రామస్థుడు

వీఆర్వోను సస్పెండ్ చేయాలి

"రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, మాకు నోటీసులు జారీ చేశారు. దీనికంతటికీ కంఠం వీఆర్వోనే కారణం. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలి. లేదంటే జైనథ్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం"

- బడుల సంజీవ్‌రెడ్డి, గ్రామస్థుడు



విద్యార్థినిని బురద నుంచి బయటకు తీస్తున్న రైల్వే కార్మికులు

మృత్యుం'జయ'!

- రైలు నుంచి జారిపడిన బీఈడీ విద్యార్థిని
- అపస్మారకస్థితిలో.. రాత్రంతా బురదగుంటలోనే..
- కీ మన్ గుర్తించడంతో తప్పిన ప్రాణాపాయం

ఆకివీడు, మార్చి 23: అర్ధరాత్రి వేళ ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడిన ఓ విద్యార్థిని దాదాపు 12 గంటలపాటు మృత్యువుతో పోరాడింది. తలకు గాయమవ్వడంతోపాటు.. బురదలో పడిపోయి అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను రైల్వే కీమన్ చూసి రక్షించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు రైల్వే కార్మికులు, రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. భీమవరంలోని శ్రీరామపురానికి చెందిన సందు జయంతి రాజేశ్వరి (21) డీఎన్ఆర్ కళాశాలలో బీఈడీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి కృష్ణా జిల్లా కలిదిండి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లెక్కల మాస్టారుగా పని చేస్తున్నారు. రాజేశ్వరి గురువారం ఉదయం విజయవాడ వెళ్తున్నానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి భీమవరం టౌన్ స్టేషన్‌లో తన బైక్ పార్కు చేసి ఫాస్ట్ పాసింజర్ రైలెక్కి వెళ్లింది. తిరిగి, సాయంత్రం 5.52 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి పూరి-తిరుపతి ట్రైన్‌లో బయలుదేరింది. కొద్దిసేపటికి రైలు గమ్యస్థానానికి చేరుకుంటుందనగా.. రాత్రి 9 గంటల సమయంలో ఆకివీడు గుమ్ములూరు సెంటర్ రైల్వేగేటు సమీపంలోని 90/6 కిలోమీటరు వద్ద కాలుజారి పడిపోయింది. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో.. రైల్వేగేటు సమీపంలో పట్టాలు చూసుకుంటూ వెళ్తున్న కీమన్ గోపాలకృష్ణ.. బురదలో పడి ఉన్న రాజేశ్వరిని చూశాడు. పక్కనే ట్రాక్ పనులు చేస్తున్న రైల్వే కార్మికులను పిలిచి ఆమెను బురదలో నుంచి బయటకు తీసుకొచ్చి నీళ్లతో శుభ్రపరిచి, ఆపై 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది తొలుత భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె వద్ద ఉన్న మోటారు సైకిల్ తాళం, టికెట్లు ఆధారంగా భీమవరం టౌన్ స్టేషన్‌కు వెళ్లి సంప్రదించారు. దీంతో పోలీసులు వీడియో ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తుండగా, కుమార్తె ఎంతకీ రాకపోయేసరికి రాజేశ్వరి తండ్రి అక్కడికి వెళ్లారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కుమార్తెను గుర్తుపటి, అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన జయంతి రాజేశ్వరి కోలుకుంటోందని, ప్రాణాపాయం ఏమీ లేదని రైల్వే జీఆర్పీ ఏఎస్ఐ రమణ తెలిపారు. మానవత్వం చూపిన రైల్వే కార్మికులకు రాజేశ్వరి తల్లిదండ్రులతోపాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

హిజ్రాలకు ఉపాధి కల్పిస్తాం: జైళ్ల శాఖ డీజీ

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : హిజ్రాలకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఐదు పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. వీరికి నెలకు రూ. 14 వేల వేతనం ఇస్తామని ఆయన ప్రకటించారు. హైదరాబాద్‌లోని జైళ్ల శాఖ కేంద్ర కార్యాలయంలో వీకే సింగ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పెట్రోలియం సంస్థల సాయంతో ఈ ఏడాది మొత్తం వంద పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేస్తామని, వీటిలో సుమారు 1000 మంది మాజీ ఖైదీలకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఈనెలలో దేవరకొండ, మిర్యాలగూడ, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, హుజురాబాద్‌లలో పెట్రోల్ బంక్‌లను ప్రారంభిస్తామని చెప్పారు. జైళ్లలో ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడానికి 1000 విలేజ్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి జైలులో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, వాటిని హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తామని తెలిపారు. ప్రజారోగ్యంపై అవగాహన కల్పించడానికి 'స్వచ్ఛ్ గ్రామ్ అభియాన్' అనే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వీకే సింగ్ తెలిపారు.

అక్రమ రవాణా వాహనాల నియంత్రణకు కమిటీలు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమ రవాణా వాహనాలను నియంత్రణకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో కమిటీలను నియమించింది. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీల్లో ఎస్పీ కో-చైర్మన్‌గా, జిల్లా రవాణా అధికారి, టీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్, టీఎస్ఆర్టీసీలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాల నిరోధానికి చర్యలు తీసుకుంటారు. ప్రతిపక్షం రోజులకోసారి ఈ కమిటీ సమావేశమై, రవాణా కమిషనర్‌కు నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది.

రథయాత్రపై వీహెచ్‌పీ అప్పీలు

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీరామ రథయాత్రకు అనుమతి కోసం వీహెచ్‌పీ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీలు చేసింది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థించారు. దీనిపై మంగళవారం విచారణ చేపడతామని ఏసీజే రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల 18న బాసరలో ప్రారంభమైన శ్రీరామ రథయాత్ర ఈనెల 31న తాడ్‌బండ్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద ముగియనున్నది. ఈ యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారంటూ వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు గాల్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ సీతారామమూర్తి రెండ్రోజుల క్రితం విచారించారు. యాత్రకు అనుమతిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదముందని నిఘావర్గాలు హెచ్చరించాయన్న ప్రభుత్వ వాదనను జడ్జి పరిగణనలోకి తీసుకొని ఈ పిటిషన్‌ను గురువారం కొట్టివేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ గాల్‌రెడ్డి ధర్మాసనం ముందు అప్పీలు చేశారు.

యాదవరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న యాదవరెడ్డికి బెయిలిచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. యాదవరెడ్డి బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి శుక్రవారం కొట్టివేశారు. పురుషోత్తంరెడ్డికి చెందిన డబ్బును యాదవరెడ్డి పలు నిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడిగా పెట్టినట్లుగా ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ఏసీబీ న్యాయవాది రవికిరణ్ రావు నివేదించారు. వీరిద్దరి మధ్య సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని, ఈ సమయంలో బెయిల్ మంజూరు చేయరాదని విజ్ఞప్తి చేశారు.

బాలికపై యువకుడి దాడి

- పరిస్థితి విషమం.. సూర్యాపేటలో ఘటన

సూర్యాపేట రూరల్, మార్చి 23: సూర్యాపేటలో బాలికపై దాడి కలకలం సృష్టించింది. తల్లితో కలిసి షాపింగ్‌కు వెళ్లిన బాలికపై ఓ యువకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన బాలిక(17) గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో తల్లితో కలిసి వస్త్ర దుకాణానికి వెళ్లింది. అనంతరం తల్లిని అక్కడే ఉంచి సెల్‌ఫోన్ రీచార్జి కోసమని ఒంటరిగా బయటకు వచ్చింది. కొద్దిసేపటి తర్వాత ఇంటికి ఫోన్ చేసి తనను ఓ యువకుడు తీవ్రంగా కొట్టాడని తెలిపింది. వెంటనే బాలిక తండ్రి, అన్న బైక్‌పై సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. సూర్యాపేట పట్టణానికి సమీపంలో ఉన్న అంజనాపురి కాలనీ సమీపంలో స్పృహ తప్పి కనిపించింది. ఆమెను వెంటనే బైక్‌పై సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు. ఆమె ముఖం, మెడ భాగంలో రాళ్లతో కొట్టిన గాయాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలికను యువకుడు నమ్మించి బైక్‌పై తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు అనుమానిస్తున్నారు. నిందితున్ని గుర్తించారని, అతన్ని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. బాలిక ప్రస్తుతం కోమాలో ఉన్నట్లు బంధువుల సమాచారం. బాలిక మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భిక్షపతి

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముప్పు భిక్షపతి 9వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. సంఘం కో-ఆర్డినేటర్ కె.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన పదవి కాలం రెండేళ్లు. రజక సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని భిక్షపతి అన్నారు.

సిద్దిపేట.. దేశంలోనే నంబర్ 1

- స్వచ్ఛతలో మునిసిపాలిటీకి పురస్కారం
- ఢిల్లీలో అవార్డు స్వీకరించిన కమిషనర్, మెప్మా సభ్యులు
- జాతీయ స్థాయిలో పోటీపడ్డ 196 పట్టణాలు
- ప్రజల సహకారంతోనే సాధ్యం: మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట మునిసిపాలిటీ, మార్చి 23: రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తున్న సిద్దిపేట పట్టణానికి మరో అరుదైన గౌరవం దక్కింది. స్వచ్ఛత ఎక్సలెన్స్‌లో సిద్దిపేట మునిసిపాలిటీ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవ, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణతో ఈ గుర్తింపు సాధ్యమైంది. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన ఓడీఎఫ్ కార్యక్రమం, పబ్లిక్ టాయిలెట్ల ఉపయోగం, చెత్తను సేకరించి తడి పొడిగా వేరు చేయడం వంటి పనులను మెప్మా చేపట్టింది. పట్టణంలోని శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య సభ్యుల కృషికి తోడు ప్రజల సహకారంతో సిద్దిపేటకు ఈ గౌరవం దక్కింది. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ అంత్యోదయ యోజన పేరిట ఇటీవల నామినేషన్లు స్వీకరించారు. జాతీయ స్థాయిలో 196 పట్టణాలు పోటీ పడగా, తెలంగాణ నుంచి ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, సిద్దిపేటలు పోటీ పడ్డాయి. ఇందులో సిద్దిపేటకు దేశంలోనే మొదటి స్థానం దక్కింది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ వర్క్‌షాప్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా సిద్దిపేట మునిసిపల్ కమిషనర్, మెప్మా పీడీ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా అధికారులు, శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్య సభ్యులు కలిసి అవార్డు అందుకున్నారు. దీంతో పాటు ప్రశంసాపత్రం, రూ.1.50 లక్షల నగదు పారితోషికాన్ని అందుకున్నారు. కాగా, ప్రజలందరి సహకారంతోనే సిద్దిపేట మునిసిపాలిటీ స్వచ్ఛత ఎక్సలెన్స్‌లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు. ఓడీఎఫ్, చెత్త సేకరణ- తడి, పొడి చెత్త వేరు చేయడంలో ప్రజలు చూపిన స్ఫూర్తి చాలా గొప్పదని అన్నారు. ఎన్నో అవార్డులు సాధించిన మునిసిపాలిటీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిద్దిపేట మునిసిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులను అభినందించారు. శ్రీ సాయితేజ సమాఖ్య సభ్యుల కృషి అనిర్వచనీయమని కొనియాడారు.




ఢిల్లీలో స్వచ్ఛత ఎక్సలెన్స్ అవార్డు స్వీకరిస్తున్న సిద్దిపేట మునిసిపాలిటీ, మెప్మా అధికారులు, శ్రీసాయితేజ సమాఖ్య సభ్యులు

దేవుడిని పెళ్లాడే శివసత్తులు

- శివుడే సర్వస్వం.. రుద్రాక్షే మంగళసూత్రం
- శ్రీరామనవమి రోజు రాజన్న క్షేత్రంలో ఆచారం

సిరిసిల్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవుడంటే భక్తి సహజం. ఆ శివసత్తుల భక్తి మాత్రం ప్రత్యేకం. భగవంతుడిని పెళ్లాడే స్థాయి వీరభక్తి అది! ఆడామగ తేడా లేకుండా శివుడిని పెళ్లాడేందుకు కొందరు.. తమ పెళ్లిని పునరుద్ధరించుకునేందుకు ఇంకొందరు శివసత్తులు అక్కడికి పోటెత్తుతారు. త్రిశూల గంటలే మంగళవాయిద్యాలవుతాయి.. రుద్రాక్షే మంగళసూత్రమవుతుంది. భక్తులు చల్లే అక్షింతల మధ్య జంగమయ్య వారికి దేవదేవుడితో కల్యాణాన్ని జరిపిస్తాడు! ఈ వింత ఆచారం చూడాలంటే.. శ్రీరామనవమి రోజు వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానానికి వెళ్లాల్సిందే! ఈ పెళ్లిళ్లను జంగాలుగా పరిగణించే వీరశైవులు నిర్వహిస్తారు. ఆడా మగా తేడాలేకుండా శివసత్తులంతా కొత్తచీరలు ధరిస్తారు. నుదుటున రూపాయి సిక్కంత బొట్టు పెట్టుకొని, బాసికాన్ని కట్టుకొని పెళ్లికి సిద్ధమవుతారు. శివసత్తుల కాళ్లకు వీరశైవులు రాగి మట్టెలు తొడిగి.. చేతికి త్రిశూలం, జోలె ఇవ్వడంతో పెళ్లి తంతు మొదలవుతుంది. తలపై జీలకర్ర బెల్లం పెట్టుకొని, రుద్రాక్షను మంగళసూత్రంగా కట్టుకోవడంతో ముగుస్తుంది.



శివపార్వతుల పెళ్లి తంతు (ఫైల్)

పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా..

శివసత్తుల జీవితం దుర్భరంగా ఉంటుంది. ఒకసారి శివసత్తువుగా మారిన తర్వాత ఆ అదిభిక్షువు అడుగుజాడల్లో నడుస్తూ భిక్షాటన చేయాలి! కొందరు తల్లిదండ్రులైతే ముక్కు పచ్చలారని తమ పిల్లలను శివసత్తులుగా మార్చుతున్నారు. పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలను కూడా దేవుడి పేరుతో శివసత్తులుగా వదలి వేస్తున్నారు. ఏళ్ల తరబడి దేవుడి పేరుతో గడిపిన ఆ అమ్మాయిలు.. వయస్సు పైబడ్డాక తమకంటూ ఎవరూ లేక ఆలయం మెట్ల మీదనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. చిన్నారులు, బాలికలు, పెళ్లీడుకొచ్చిన ఆడవాళ్లకు ఇలాంటి పెళ్లిళ్లు నిర్వహించవద్దని చెబుతున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు.

భార్యాపిల్లలు ఉన్నవారు కూడా..

శివసత్తుల్లో దేవుడే లోకంగా బతుకుతున్నవారే కాదు.. పెళ్లిళ్లు చేసుకొని భార్యాబిడ్డలతో సంతోషంగా కుటుంబ జీవనం గడుపుతున్నవారు, ఉద్యోగులూ ఉన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా అనారోగ్యం సోకినప్పుడు త్వరగా కోలుకునేందుకు శివసత్తులుగా మారతామని మొక్కుకుంటారు. ఈ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉన్నా ఇటీవల వీరి సంఖ్య బాగా పెరిగింది.



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

ఖానాపూర్‌లో పది ప్రశ్నపత్రం లీక్

- ఆరుగురు అరెస్టు..
- డీఈవోను సస్పెండ్ చేయాలంటూ జగిత్యాలలో ధర్నా

ఖానాపూర్, జగిత్యాల, మార్చి 23: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో శుక్రవారం పదో తరగతి పరీక్ష పత్రం లీకైంది. ఉదయం పరీక్ష మొదలైన అరగంట తర్వాత 10గంటల ప్రాంతంలో సామాన్య శాస్త్రం పేపర్-1 ప్రశ్నపత్రం వాట్సాప్ ద్వారా లీకైందనే ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో ఊపందుకున్నాయి. స్పందించిన పోలీసులు.. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో దర్జాగా ప్రశ్నపత్రం చూస్తూ సమాధాన పత్రాలను తయారు చేస్తున్నవారిని పట్టుకున్నారు. విచారణలో ఏడుగురు వ్యక్తులకు ఈ ఘటనతో ప్రత్యక్ష సంబంధాలున్నట్టు తేలడంతో కేసు నమోదుచేసి ఆరుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఖానాపూర్ వెంకటేశ్వర జనరల్ స్టోర్ యజమాని రమణ ప్రశాంత్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పీఈటీ సట్ల గంగాధర్, అడ్మినిస్ట్రేటర్ రవి కుమార్, పాఠశాల సామాన్య శాస్త్రం ఉపాధ్యాయుడు ఇప్పసాయన్న, పాఠశాల కరస్పాండెంట్ గాండ్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాజేందర్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. లక్ష్మణచాందకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుద్ద మన్మధ్ రెడ్డి పరారీలో ఉన్నట్టు చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు జగిత్యాల డీఈవో వెంకటేశ్వర్లు అసలు కారణమని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడంతో జగిత్యాల జిల్లాలో పరీక్షల్లో చూచిరాతలు జరుగుతున్నాయని ఆరోపించారు.



ఇపుడిక 'ఆస్ట్రేలియా ఫస్ట్'

పాత విధానం రద్దు.. వీసా రూల్స్ కఠినం చేసిన ఆసీస్.. లక్ష మంది భారతీయులకు దెబ్బ!

మెల్‌బోర్న్, మార్చి 1: అమెరికా బాటలో ఆస్ట్రేలియా కూడా సాగుతోంది. అమెరికా ఫస్ట్ నినాదం స్ఫూర్తిగా- "ఆస్ట్రేలియా ఫస్ట్" నినాదం అందుకుంది. ఇన్నాళ్లూ అమల్లో ఉన్న అత్యంత కీలకమైన వర్క్-టు-వీసా ప్రోగ్రామ్‌ను పూర్తిగా రద్దు చేసింది. దాని స్థానే కఠినమైన నిబంధనలతో కూడిన కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ మార్పుల వల్ల పాత విధానం ద్వారా కొనసాగుతున్న దాదాపు లక్ష మంది భారతీయ ఉద్యోగులకు దెబ్బతగులుతుంది. ఇక నుంచి ఆస్ట్రేలియా ఉద్యోగులకు కోత పెట్టి విదేశీయులను తీసుకోరాదు. స్థానిక మార్కెట్‌లో తగిన ఉద్యోగులు లేరన్న కారణం చేతే విదేశాల నుంచీ తెచ్చుకుంటున్నామని కంపెనీలు నిరూపించాలి. ఆస్ట్రేలియన్ వేతన విధానాల్ని స్థానిక ఉద్యోగులకు వర్తింపజేయాలి. విదేశాల నుంచి తెచ్చుకుంటున్న ఉద్యోగులకు రెండేళ్ల పని అనుభవం, ధారాళంగా ఇంగ్లిషులో మాట్లాడగలిగే నేర్పు తప్పనిసరి. ఆ వ్యక్తి మీద క్రిమినల్ కేసులేవీ ఉండరాదు. విదేశాల నుంచి నైపుణ్యం గల వారిని తీసుకొనే యాజమాన్యాలు తమ కంపెనీల్లోని ఆస్ట్రేలియన్ ఉద్యోగులకు తప్పనిసరిగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న నిబంధనను చేర్చారు. రద్దు చేసిన వీసా వ్యవస్థ పేరు: 457-వీసా ప్రోగ్రామ్. దీని కింద ఏ కంపెనీ అయినా విదేశీ ఉద్యోగులను ఆస్ట్రేలియాకు పంపవచ్చు. నాలుగేళ్లపాటు ఆ ఉద్యోగి అక్కడ పనిచేసే వీలుంటుంది. ఇపుడు మొదట రెండేళ్లకు మాత్రమే ఇచ్చి తర్వాత పొడిగిస్తారు. ఆస్ట్రేలియాలో నైపుణ్యం గల ఉద్యోగులు లేకపోవడం వల్ల అక్కడి ప్రభుత్వం మొదటిసారిగా 1996లోనే దీనిని ప్రవేశపెట్టి 2012లో మరిన్ని వెసులుబాట్లు ఇచ్చింది. కిందటేడది దాదాపు లక్షా 25 వేలకు పైగా విదేశీయులను ఈ ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వీరిలో 80% మందికి పైగా భారతీయులే. అయితే అనేక కంపెనీలు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తూ నైపుణ్యం లేని ఉద్యోగులను సొంత అవసరాల కోసం తెచ్చుకుంటున్నాయని అక్కడి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇమిగ్రేషన్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తేల్చింది. దాంతో ఈ విధానాన్ని రద్దు చేస్తామని గతఏడాది ఆ దేశ ప్రధాని మాల్కం టర్న్‌బుల్ చెప్పారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని కొంతవరకైనా తగ్గించేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. తాజా మార్పుల వల్ల విదేశీయులకు ఉద్యోగాల సంఖ్య 657 నుంచి 200 కు పడిపోయాయి.

రైతులకు ఉత్పాదక వ్యయంపై 50 శాతం కనీస మద్దతు ధర

▸▸ త్వరలో విధివిధానాలు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 23 : రైతులు ఉత్పాదక వ్యయం కన్నా 50% కనీస మద్దతు ధర పొందేలా విధివిధానాలు తెస్తామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ తెలిపారు. రాష్ట్రాలతో చర్చలు జరిపిన అనంతరం నీతి ఆయోగ్ ఈ మేరకు ముసాయిదాను రూపొందించిందని, మరిన్ని చర్చల అనంతరం ముసాయిదాను ఖరారు చేస్తానమి ఆయన చెప్పారు. శుక్రవారం ఫిక్కీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పాదక వ్యయం కన్నా 50% దాటని కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఉన్న నోటిఫైడ్ పంటలను ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందు సమీక్షిస్తామన్నారు. ఎంఎస్‌పీలకు ఉత్పాదక వ్యయం కన్నా 50% ఎక్కువ ధర చెల్లించేలా ఈ ఏడాది బడ్జెట్ లో ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంఎస్‌పీల కంటే ధరలు తగ్గితే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు భారమైనా... రైతుల ప్రయోజనాన్ని కాపాడడమే ప్రధాని మోదీ ఉద్దేశమని తెలిపారు. దీంతో పాటు ఉత్పాదక వ్యయాన్ని తగ్గించేందుకు, పంటలను మార్కెట్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. 2022లోపు రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. హెక్టార్‌కు ప్రస్తుతం మొక్కజొన్న ఉత్పత్తి 2.7 టన్నులు ఉందని, దీన్ని 2022లోపు 45 మిలియన్ టన్నులకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

సోనియాగాంధీకి అస్వస్థత, ఢిల్లీకి తరలింపు

సిమ్లా(హిమాచల్‌ప్రదేశ్), మార్చి 23 : కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. సిమ్లాలో తన కూతురు ప్రియాంకా గాంధీకి చెందిన గృహనిర్మాణ పనులను పరిశీలించేందుకు ఆమె గురువారం ఇక్కడకు వచ్చారు. గురువారం అర్ధరాత్రి ఆమె ఆయాసంతో బాధపడుతుండటంతో ఢిల్లీకి తరలించారని, ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని ఇందిరా గాంధీ వైద్య కళాశాల ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

చంద్రయాన్ 2 వాయిదా: ఇస్రో చైర్మన్ శివన్

చెన్నై, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చంద్రుని పరిశోధనకై ఉద్దేశించిన చంద్రయాన్ 2 ప్రయోగం వాయిదా పడింది. ఏప్రిల్ నెలలో వుంటుందని ముందుగా భావించినా కొన్ని అనివార్య సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ డాక్టర్ కె శివన్ తెలిపారు. చెన్నై ఎయిర్‌పోర్టులో ఆయన విలేకరులతో మాట్లాడతూ, చంద్రయాన్ 2 ప్రయోగానికి ముందు కొన్ని మార్పులును నిపుణులు సూచించారని అందువల్ల ప్రయోగం ఏప్రిల్‌లో వుండదని, అక్టోబర్‌లో వుంటుందని ఆయన తెలిపారు. జాలర్ల కోసం ప్రత్యేకంగా మొబైల్‌యాప్‌ను రూపొందించే పనులు ఈ నెలాఖరులోగా పూర్తవుతాయని, ఏప్రిల్ నుండి ఆ యాప్ వినియోగంలోకి వస్తుందన్నారు.

దేశంలో ప్రప్రథమంగా సంజ్ఞల నిఘంటువు

▸▸ విడుదల చేసిన కేంద్ర మంత్రి థార్‌చంద్ గెహ్లాట్

న్యూఢిల్లీ, మార్చి 23: మూగ, చెవిటి వారికి ఉపయుక్తంగా వుండేలా దేశంలోనే మొట్టమొదటిసారిగా సంజ్ఞల నింఘంటువు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం ఓ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రి థార్‌చంద్ గెహ్లాట్ దీనిని విడుదల చేశారు. దేశంలో సంజ్ఞలను ఉపయోగించే వారి మధ్య సారూపత్యను తీసుకురావటం, మూగ, చెవిటి వారి మధ్య భావప్రసారానికి వున్న అడ్డంకులను తొలగించటమే లక్ష్యంగా భారతీయ సంజ్ఞాభాష పరిశోధన, శిక్షణాలయం దీనిని రూపొందించింది. ఈ నిఘంటువులో 3000 హిందీ, ఆంగ్ల పదాలు, వాటి సంజ్ఞా చిత్రాలను పొందుపరిచారు. సీడీ రూపంలోనూ, పుస్తక రూపంలోనూ లభించే ఈ నిఘంటువు విడుదల సందర్భంగా థార్‌చంద్ గెహ్లాట్ మాట్లాడుతూ, అతి త్వరలోనే మరిన్ని పదాలు నిఘంటువులో చేరతాయని ఆశించారు. దేశంలో ఉన్న మూగ, చెవిటి వారందరికీ ఉపయుక్తమయ్యేలా ఈ నిఘంటువులో 5 భాగాలను పొందుపరిచారు. నిత్య జీవితంలో ఉపయోగించేవి, న్యాయ పరిభాషా పదాలు, విద్య, వైద్య, సాంకేతిక పదాలు దీనిలో వున్నాయి. ఒక్కో విభాగంలో ఆయా పదాలకు అనుబంధంగా సంజ్ఞా దృశ్యాలను పొందుపరిచారు. నిఘంటువును కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో వుంచారు. అవసరమైన వారు ఐఎస్ఎల్ఆర్‌టిసి నుంచి పొందవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు.

పార్లమెంట్‌కు సోమవారం నవమి సెలవు

న్యూఢిల్లీ, మార్చి 23: శ్రీరామ నవమిని పురస్కరించుకుని పార్లమెంట్ ఉభయ సభలకు సోమవారం సెలవు ప్రకటించారు. శుక్రవారం నాడు లోక్‌సభను వాయిదా వేయడానికి ముందు స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడుతూ.. 'పలువురు సభ్యుల కోరిక మేరకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నా. సభ తిరిగి మంగళవారం సమావేశమవుతుంది' అని ప్రకటించారు. అటు రాజ్యసభలో చైర్మన్ వెంకయ్య నాయుడు సభ వాయిదాకు ముందు 'తిరిగి సభ సోమవారం సమావేశమవుతుంది' అని తెలిపారు. ఆ తర్వాత రాజ్యసభ సచివాలయం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. సోమవారం శ్రీరామ నవమి నేపథ్యంలో సెలవు ఉంటుందని పేర్కొంది.

పీజీ మెడికల్ కౌన్సెలింగ్ తేదీ పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 23: నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)లో సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల ప్రవేశానికి.. కౌన్సెలింగ్ దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షను జనవరిలో నిర్వహించగా.. గత నెలలో ఫలితాలు విడుదలయ్యాయి. 'వాస్తవానికి తొలి రౌండ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా.. ఈ గడువును సోమవారానికి (ఈ నెల 26) పొడిగిస్తున్నాం' అని ఆ ప్రకటనలో వివరించింది.

విపక్షాలవన్నీ అబద్ధాలే: మోదీ



న్యూఢిల్లీ, మార్చి 23: ఎన్నికల్లో వరుసగా ఓడిపోయి నిరాశలో పడిపోయిన విపక్షాలు.. ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. శుక్రవారం ఇక్కడ జరిగిన పార్టీ పార్లమెంటరీ సమావేశంలో మాట్లాడిన ఆయన.. నిజాన్ని జనంలోకి తీసుకెళ్లేందుకు టెక్నాలజీని సమర్థంగా వాడుకోవాలని సూచించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు సభను సజావుగా సాగనివ్వడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పేందుకు ఎంపీలందరూ వారి నియోజకవర్గాల్లో పత్రికా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని ప్రాథమిక స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పీఎంయూవై లబ్ధిదారులకు ఊరట

న్యూఢిల్లీ, మార్చి 23: ఎన్నికల సమయంలో కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఊరటనిచ్చింది. ఈ పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందిన మహిళలకు రుణంపై గ్యాస్ స్టవ్, మొదటి రీఫిల్‌ను చమురు సంస్థలు అందజేశాయి. ఒప్పందం ప్రకారం తదుపరి రీఫిల్స్‌లో కేంద్రం ఇచ్చే సబ్సిడీని చమురు సంస్థలు రుణ చెల్లింపుల కింద తీసుకుంటాయి. ఏప్రిల్ 1 నుంచి ఆ తర్వాత తీసుకునే 6 రీఫిల్స్ వరకు రీపేమెంట్ తీసుకోబోమని చమురు సంస్థలు ప్రకటించాయి. కొన్ని నెలల్లో కర్ణాటక ఎన్నికలుండడం..వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో సర్కారు ఒత్తిడితో చమురు సంస్థలు ఈ నిర్ణయాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. 2015 జూన్ నుంచి 3.6 కోట్ల మంది మహిళలు పీఎంయూవై కింద ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు తీసున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆయుష్మాన్ భారత్!



నగదు రహిత వైద్యానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

▸▸ జూలై తర్వాత అమలుకు నిర్ణయం

▸▸ కుటుంబానికి రూ.5 లక్షల వరకు కవరేజీ

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్! బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకం! నిరుపేదకు ఆరోగ్య ధీమా! కుటుంబానికి రూ.5 లక్షల వరకూ కవరేజీ! ఈ ఏడాది జూలై తర్వాత దీనిని అమల్లోకి తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. దేశంలోని 10 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరే ఈ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీని అమలుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్- నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ మిషన్ (ఏబీ-ఎన్‌హెచ్‌ఆర్‌ఎం) కౌన్సిల్‌ను, పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇది ప్రభుత్వ నిధులతో ప్రారంభం కానున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య పథకమని, దేశవ్యాప్తంగా 10 కోట్ల నిరుపేద, బలహీన వర్గాల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఈ పథకం అమలుకు ప్రాథమికంగా రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేబినెట్ నిర్ణయించిందని, అవసరమైతే మరిన్ని కేటాయించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఈ నిధులను అత్యాధునిక యంత్రాల ఏర్పాటు, లబ్ధిదారుల గుర్తింపు, రాష్ట్రాలకు ప్రీమియం చెల్లింపు తదితరాలకు వినియోగిస్తామని చెప్పారు. బీమా మోడల్ తరహాలో పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. 2018- 19; 2019-20 సం వత్సరాలకు కలిపి రూ. 10 వేల కోట్లు కేటాయించామని, ఏడాదికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు. రాబోయే 4 నెలల్లో అన్ని రాష్ట్రాల్లోనూ ఏకకాలంలో పథకాన్ని పట్టాలపైకి ఎక్కించనున్నట్లు తెలిపింది. ఇందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. పథకం అమలు, రాష్ట్రాల బాధ్యతలపై తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో మనోహర్‌తో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఎలా ఉండబోతోందో తెలిపారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఏప్రిల్ 30 నాటికి రాష్ట్రాలకు ఎస్ఈసీసీ డేటా పంపిస్తారు. జూలై 31నాటికి ఆస్పత్రుల ఎంప్యానల్‌మెంట్, ఐటీ సిస్టమ్స్ పరీక్ష పూర్తి చేస్తారు.

ఆరోగ్య బీమాకు ఊపు

ఆయుష్మాన్ భారత్ పథకంతో దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాకు మంచి ఊపు రానుందని క్రిసిల్ స్పష్టం చేసింది. ఇప్పటికే 33 శాతం జనాభాకు ఆరోగ్య బీమా ఉందని, ఇది 50 శాతానికి చేరనుందని తెలిపింది. ఇక, ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే, పేదలకు ఖర్చు తగ్గుతుందని, పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకు రావచ్చని వైద్య రంగ నిపుణులు స్పష్టం చేశారు. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడతాయన్నారు.

క్లెయిమ్ చేసుకునేది ఇలా..

అప్పటికే ఉన్న రోగాలకు కూడా పథకం వర్తిస్తుంది. ఆస్పత్రిలో చేరడానికి ముందు, చేరిన తర్వాత పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చు. అయితే, ఎంపిక చేసిన కొన్ని రోగాలు మాత్రం దీని పరిధిలోకి రా వు. ఇక, రాష్ట్రాల స్థాయిలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఎంప్యానెల్ చేస్తారు. వాటిలో నగదు రహిత వైద్యం అందిస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల ఎంప్యానెల్‌మెంట్‌కు కొన్ని నిబంధనలు విధిస్తారు. దేశవ్యాప్తంగా ఎంప్యానెల్ చేసిన ఏ ఆస్పత్రిలో అయినా లబ్ధిదారులు చేరవచ్చు. నగదు రహిత వైద్యానికి సంబంధించి నీతి ఆయోగ్ నిర్దిష్ట ఐటీ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.

పథకానికి నిధులు ఎలా?

ఈ పథకానికి ఏటా రూ.12 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. దీనిని కేంద్ర, రాష్ట్రాలు ఉమ్మడిగా భరిస్తాయి. కేంద్రం ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఇటీవలి కేంద్ర బడ్జెట్లో 1 శాతం హెల్త్ సెస్‌ను అదనంగా విధించారు. ఆ నిధులను ఈ పథకానికి వినియోగిస్తారు.



అమలు చేసేది ఇలా..

జాతీయ స్థాయిలో ఏబీ-ఎన్‌హెచ్‌ఆర్‌ఎం కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు. అలాగే, రాష్ట్రస్థాయిలో అన్ని రాష్ట్రాలూ స్టేట్ హెల్త్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వివిధ ఆరోగ్య పథకాల అమలుకు ట్రస్టులు ఉన్నాయి. వాటి ద్వారా కూడా ఈ పథకాన్ని అమలు చేసుకోవచ్చు. ఆయా రాష్ట్రాల ఎంపికను బట్టి, ఇన్సూరెన్స్ మో డల్, ట్రస్ట్ మోడల్‌ను అమలు చేస్తారు. ఇందుకు రాష్ట్రాలు ఒక ఎస్క్రో ఖాతాను తెరవాలి. వీటి ద్వారా కేంద్రం నిధులు పంపుతుంది. పథకం అమల్లో రాష్ట్రాలకు పూర్తి వెసులుబాటు కల్పిస్తారు. ఏ చికిత్సకు ఎంత చెల్లించాలనేది కేంద్రమే ఖరారు చేస్తుంది. స్థానిక పరిస్థితులను బట్టి మార్పులు చేసుకోవచ్చు. కేన్సర్ సహా 1,350 ట్రీట్‌మెంట్ ప్యాకేజీలను ఖరారు చేశారు.



పథకం లక్ష్యం

నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలైతే శస్త్ర చికిత్స ఖర్చులు భరించలేక ఆస్తులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. వైద్య ఖర్చులు భరించలేక ఏటా 6 కోట్ల కుటుంబాలు పేదరికంలోకి జారిపోతున్నాయి. వివిధ వర్గాలకు బీమా పథకాలు ఉన్నా.. నిరుపేదలకు అటువంటి అవకాశం లేదు. అందుకే, తీవ్రమైన జబ్బుల బారినపడిన నిరుపేదలు అప్పుల పాలవకుండా చూడటమే ఈ పథకపు లక్ష్యమని కేంద్రం చెబుతోంది. దేశంలో దాదాపు 50% మందికి లబ్ధి చేకూర్చాలని నిర్దేశించుకుంది.

ఎవరికి లబ్ధి!?



దేశవ్యాప్తంగా 10.74కోట్ల కుటుంబాలకు అంటే, దాదాపు 50 కోట్లమంది ప్రజలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నారు. వీరిలో 8.03 కోట్ల కుటుంబాలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవైతే, 2.33 కోట్ల కుటుంబాలు పట్టణ ప్రాంతాల్లోవి. కచ్చా ఇల్లున్న, 16-59 మధ్య పెద్దవాళ్లు లేని కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీలు, భూమిలేని నిరుపేదలు, కూలీలు దీని కిందకు వస్తారు. తాజాగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక కుల గణన ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. కుటుంబంలో ఎంతమంది ఉన్నా పథకం వర్తిస్తుంది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు ఏటా రూ.5 లక్షల మేరకు ఉచిత వైద్యం అందిస్తారు. కుటుంబానికి ప్రీమియం ఎంత ఉంటుందని ఖరారు చేయకపోయినా 1000-1200 ఉండవచ్చని నీతి ఆయోగ్ అంచనా వేస్తోంది. దీనిని ప్రభుత్వమే చెల్లిస్తుంది.

ఈ జాబితాపైనే రగడ!

▸▸ ఏఐసీసీ సభ్యులుగా 53 మంది

▸▸ కోఆప్షన్ సభ్యులు 35 మంది

▸▸ ఆమోదించిన ఎలక్షన్ అథారిటీ

▸▸ బహిర్గతం చేయని అధిష్ఠానం

▸▸ వెల్లడించేందుకు జంకుతున్న రాష్ట్ర నేతలు

▸▸ 'ఆంధ్రజ్యోతి'కి అందిన జాబితా

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా తెలంగాణ నుంచి ఎన్నికైన వారి విషయంలో రగడ కొనసాగుతూనే ఉంది. ఏఐసీసీ ప్లీనరీ సందర్భంగా సభ్యులుగా ఎంపికైన వారికి మాత్రమే ఆ విషయం చేరవేశారు. వారికి అదే హోదాతో కూడిన ఐడీ కార్డులు కూడా జారీ చేశారు. రాష్ట్రానికి చెందిన ఏఐసీసీ సభ్యుల ఎంపిక జాబితాను ఖరారు చేస్తూ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ ముల్లపల్లి రామచంద్రన్ ఈ నెల 14వ తేదీనే సంతకం చేశారు. జాబితాపై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ ఖుంటియా కూడా సంతకం చేశారు. ఏఐసీసీ సభ్యుల జాబితా ప్లీనరీకి వారం పది రోజుల ముందే ఢిల్లీ చేరినట్లు సమాచారం. ఆ తర్వాత దానికి అధికారికంగా ఆమోదం లభించింది. అయితే దీన్ని ఏఐసీసీ బహిర్గతం చేయకుండా, రాష్ట్ర నేతలకు అందించింది. జాబితాను బహిరంగంగా వెల్లడిస్తే అనవసరమైన రగడ చెలరేగుతుందని భావించిన రాష్ట్ర నాయకులు.. దాన్ని రహస్యంగా ఉంచారు. ప్లీనరీకి వచ్చిన సభ్యులకు మాత్రం విషయం తెలియజేసి వారి సంతకాలు తీసుకొని, కార్డులు జారీ చేశారు. ఈ మేరకు ఏఐసీసీ సభ్యులుగా ఎంపికైన కొందరు తమ మిత్రులకు సమాచారం చేరవేయడంతో విషయం బహిర్గతమైంది. ఈ క్రమంలో కొందరి ఎంపిక పట్ల వివాదం చెలరేగడం, అవకాశాలు రాని వారు రగిలిపోతూ అసంతృప్తి వెళ్లగక్కడం తెలిసిందే. మొత్తం వివాదానికి కారణమైన జాబితా 'ఆంధ్రజ్యోతి'కి చిక్కింది. ఏఐసీసీ సభ్యులుగా 53 మంది ఎంపిక కాగా, ఏఐసీసీ కోఆప్షన్ సభ్యులుగా 35 మంది ఎంపికయ్యారు.

ఏఐసీసీ సభ్యులు

1.ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, 2.కుందూరు జానారెడ్డి, 3.మహ్మద్ షబ్బీర్ అలీ, 4.కె.సురేష్ రెడ్డి, 5.మధు యాష్కీ గౌడ్, 6.ఆకుల లలిత, 7.టీ.జీవన్‌రెడ్డి, 8.దుద్దిళ్ల శ్రీధర్ బాబు, 9.పొన్నం ప్రభాకర్, 10.దామోదర్ రాజనర్సింహా, 11.జె.గీతారెడ్డి, 12.వి.సునీతా లక్ష్మారెడ్డి, 13.సర్వే సత్యనారాయణ, 14.పి.సబితా ఇంద్రారెడ్డి, 15.ఎం.కోదండరెడ్డి, 16.దానం నాగేందర్, 17.మర్రి శశిధర్ రెడ్డి, 18.అంజన్‌కుమార్ యాదవ్, 19.ఎస్.జైపాల్ రెడ్డి, 20.మల్లు రవి, 21.జి.చిన్నారెడ్డి, 22.డీకే అరుణ, 23.కోమటిరెడ్డి వెంకటరెడ్డి, 24.ఆర్.జగన్‌లాల్ నాయక్, 25.సర్వోత్తమ్ రెడ్డి, 26.బలరాంనాయక్, 27.దొంతి మాధవరెడ్డి, 28.కొండపల్లి దయాసాగర్ రావు, 29.మల్లు భట్టి విక్రమార్క, 30.పొంగులేటి సుధాకర్ రెడ్డి, 31.సంభాని చంద్రశేఖర్, 32.ఏలేటి మహేశ్వర్ రెడ్డి, 33.కె.ప్రేమ్‌సాగర్ రావు, 34.గండ్రత్ సుజాత, 35.సీహెచ్ వంశీచంద్‌రెడ్డి, 36.ఎస్.ఎ.సంపత్‌కుమార్, 37.జెట్టి కుసుమకుమార్, 38. ఎంఏ ఫయీం, 39.సయ్యద్ అమీర్ జావేద్, 40.విష్ణువర్ధన్ రెడ్డి, 41.టి.సంతోష్ కుమార్, 42.కె.దామోదర్ రెడ్డి, 43.వి.హనుమంతరావు, 44.పొన్నాల లక్ష్మయ్య, 45.ఎంఏ ఖాన్, 46.రేణుకా చౌదరి, 47.రాపోలు ఆనందభాస్కర్, 48.నంది ఎల్లయ్య, 49.నేరెళ్ల శారద, 50.అనిల్ కుమార్ యాదవ్, 51.బల్మూరి వెంకట్‌నర్సింగ్ రావు, 52.సంజీవ రెడ్డి, 53.కనుకుల జనార్దన్ రెడ్డి

కో ఆప్షన్ సభ్యులు వీరే..

1.గూడూరు నారాయణ రెడ్డి, 2.గౌరీశంకర్, 3.కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, 4.నాగయ్య, 5.మాగం రంగా రెడ్డి, 6.పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, 7. పద్మావతి రెడ్డి, 8.హెచ్ వేణుగోపాల్ రావు, 9.బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, 10.ఆరెపల్లి మోహన్, 11.కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, 12.టి.కుమార్‌రావు, 13.గండ్ర వెంకట రమణారెడ్డి, 14.బూడిద బిక్షమయ్యగౌడ్, 15.సీజే శ్రీనివాస్, 16.రేవంత్ రెడ్డి, 17.రామ్మోహన్ రెడ్డి, 18.రాంరెడ్డి దామోదర్ రెడ్డి, 19.వినయ్ కుమార్, 20.నిరంజన్, 21.భూక్యా ఉమామురళీ నాయక్, 22.భార్గవ్ దేశ్‌పాండే, 23.నూతి శ్రీకాంత్‌గౌడ్, 24.బండ కార్తీకారెడ్డి, 25.ఆదం ఉమాదేవి, 26.పాల్వాయి శ్రవంతి రెడ్డి, 27.ప్రియాంక, 28.ప్రసాద్ కుమార్, 29.కొనగాల మహేష్, 30.నరేష్ జాదవ్, 31.పి.లక్ష్మాగౌడ్, 32.సురేష్ కుమార్ షేట్కార్, 33.చిత్తరంజన్ దాస్, 34.ఫక్రుద్దీన్, 35.నర్సాగౌడ్

మార్పులను సమీక్షించాల్సిందే

▸▸ ఎస్సీ, ఎస్టీ చట్టంలో సుప్రీం తీర్పుపై..

కాంగ్రెస్ ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 23: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టంలో కీలక మార్పులు చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీసుకున్న నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఏకాయెకి అరెస్టులు లేకుండా, నిందితులకు వెంటనే బెయిల్ వచ్చేలా చేసిన మార్పులను సమీక్షించి, చట్ట సవరణలు చేపటాలని డిమాండ్ చేసింది.

అది తిరోగమన తీర్పు: సీపీఎం

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టంలో సుప్రీంకోర్టు మార్పులు చేయడాన్ని 'తిరోగమన' తీర్పుగా సీపీఎం పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. శుక్రవారం జరిగిన ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో ఈ తీర్పు వెనక ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వైఫల్యం ఉందని ఆరోపించింది.





ఆస్ట్రేలియాలోని హామెలిన్ సముద్ర తీరం తిమింగలాల కళేబరాలతో నిండిపోయింది. పెర్త్‌కు 315 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ తీరానికి కనీసం 150 తిమింగలాలు కొట్టుకువచ్చాయి. వెంటనే రంగంలోకి దిగిన వన్యప్రాణి సంరక్షణ అధికారులు వాటిలో కొన ఊపిరితో ఉన్న 15 తిమింగలాలను సముద్రంలోనికి విడిచిపెట్టారు. అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరగడం, చాలా వరకు తిమింగలాలు పొడిగా ఉన్న ప్రదేశాలకు కొట్టుకురావడంతో ఎక్కువ వాటిని రక్షించలేకపోయినట్లు అధికారులు తెలిపారు. భారీ సంఖ్యలో తిమింగలాలు మరణించడానికి కారణమేంటనేది ఇంతవరకూ తెలియలేదు. గతంలో 1996లోనూ.. 320 పొడవు రెక్కల పైలెట్ తిమింగలాలు డన్స్‌బొరగ్ తీరానికి కొట్టుకురాగా 20 తిమింగలాలను రక్షించగలిగారు.

'కేంబ్రిడ్జ్ అనలిటికా'కు భారత్ నోటీసులు

▸▸ భారతీయుల డేటా భద్రతపై ఆందోళన

▸▸ నెలాఖరులోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 23: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఫేస్‌బుక్ యూజర్ల డేటాను తస్కరించి.. ట్రంప్‌కు మద్ధతుగా వారిని ప్రభావితం చేసిన 'కేంబ్రిడ్జ్ అనలిటికా'కు భారత ప్రభుత్వం శుక్రవారం నోటీసులు పంపింది. భారత్‌లో ఆ యాప్‌నకు ఎంతమంది క్లైంట్లు ఉన్నారు? భారతీయ ఫేస్‌బుక్ యూజర్ల డేటాను ఈ యాప్ ద్వారా ఇతరులెవరైనా కైవసం చేసుకున్నారా? అనే ప్రశ్నలకు ఈ నెలాఖరులోగా సమాధానాలివ్వాలని సూచించింది. 'ఫేస్‌బుక్ యూజర్ల డేటాను సేకరించేందుకు ఉపయోగించిన విధానం ఏమిటి? భారతీయుల వ్యక్తిగత వివరాల భద్రత, డేటా సెక్యూరిటీకి ఏమైనా నష్టం వాటిల్లిందా?' అనే ప్రశ్నలకు సమాధానాలివ్వాలని ఆదేశించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా.. భారతీయుల డేటాకు ముప్పు వాటిల్లితే 'కఠిన చర్యలు' తీసుకుంటామని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇదివరకే 'కేంబ్రిడ్జ్ అనలిటికా'ను హెచ్చరించారు. గురువారం ఆయన ఐటీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం, డేటా దుర్వినియోగాన్ని నివారించేందుకు దీర్ఘకాలిక పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఉదంతంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తోంది. భారత్‌లో ఆ యాప్ వినియోగంపై బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం ఆరోపణలు చేసుకున్న నేపథ్యంలో.. ఈ తరహా యాప్‌లు 2014 ఎన్నికల్లో ఏమేర ఓటర్లను ప్రభావితం చేశాయనే అంశంపై వచ్చే వారం ఈసీ భేటీ ఉంటుందని అధికారులు తెలిపారు.

బీజేపీ అబద్దాల ఫ్యాక్టరీ: రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బీజేపీపై ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. బీజేపీ అబద్దాల ఫ్యాక్టరీ అని, అవాస్తవాలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఫేస్‌బుక్ డేటా ఉల్లంఘనల వివాదం, భారత రాజకీయాల్లో కేంబ్రిడ్జి అనలిటికా పాత్రకు సంబంధించి కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే రాహుల్ బీజేపీని టార్గెట్ చేశారు. 2012లో కాంగ్రెస్‌ను అణిచివేసేందుకు కేంబ్రిడ్జి అనలిటికాకు చెల్లింపులు ఏ విధంగా జరిగాయనేదానిపై ఓ వైపు కథనాలు సిద్ధమవుతుండగా.. కాంగ్రెస్ కేంబ్రిడ్జితో కలిసి పనిచేసిందని ప్రచారం చేసేలా బీజేపీ ఓ మంత్రిని పురమాయించిందని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

నేడు గంటసేపు లైట్లు ఆపేద్దాం!

▸▸ ప్రజలకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 23 : ఎర్త్ అవర్ సందర్భంగా అందరూ శనివారం గంటసేపు లైట్లు ఆపాలని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మార్చి 24న ఎర్త్ అవర్ సందర్భంగా నేను కూడా నా ఇల్లు, కార్యాలయంలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆపుతాను. మీరు కూడా అదే పని చేయాలి' అని కోరారు.

కర్ణాటక కులాల్లో మతం చిచ్చు!

మతంగా గుర్తింపు కోసం పలు కులాల పట్టు

- మైనారిటీ హోదా వస్తుందేమోనని ఆశ
- లింగాయత్‌లకు సిఫార్సుతో కొత్త తలనొప్పులు
- మహారాష్ట్రలోనూ మతంహోదా డిమాండ్లు

బెంగళూరు/ముంబై, మార్చి 23: కర్ణాటకలో లింగాయత్‌లు, వీరశైవ లింగాయత్‌లకు మతం హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయడం కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. తమకు కూడా మతం హోదా ఇవ్వాలని కర్ణాటకలోని వివిధ కులాలు వరుస కట్టాయి. ప్రత్యేక మతం హోదా లభించడం వల్ల తమకు మైనారిటీల కింద ప్రయోజనాలు దక్కుతాయని పలు కులాలు భావిస్తున్నాయి. ఎన్నికల ముందు సిద్దరామయ్య సర్కారు కందిరీగల తుట్టెను కదిపిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.



తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని కొడవలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ నెరవేరే వరకు పోరాడాలని గురువారం కొడవల సదస్సులో తీర్మానించారు. కొడవలు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ చాలా కాలంగా ఉద్యమిస్తున్నారు. ఇప్పుడు తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని జాతీయ మైనారిటీ కమిషన్‌కు లేఖ రాశారు. వైదిక ఆచారాలకు దూరంగా ఉంటూ ప్రకృతిని మాత్రమే ఆరాధించే వీరు తమది ప్రత్యేక మతమే అంటున్నారు. బహమనీ సుల్తానుల కాలంలో ఏర్పడిన పలు కులాలు కూడా తామది ప్రత్యేక మతమని అంటున్నాయి. చివరకు సీఎం సొంత కులం కురుబ కూడా తమది వేరే మతమని అంటోంది. ప్రస్తుతం హిందూ మతంలోని 37 కులాలు మైనారిటీ హోదా కోసం పోరాడేందుకు సిద్ధమయ్యాయి. వీటికి తోడు మహారాష్ట్రలోని లింగాయత్‌లు కూడా తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. వారిని ప్రత్యేక మతంగా గుర్తించాలని మహారాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయగా, 2014లో కేంద్రం తిరస్కరించింది. 12వ శతాబ్దంలో బసవన్న నేతృత్వంలో వైదిక మత ఆచారాలపై తిరుగుబాటు చేసిన వారి వారసులే లింగాయత్‌లు. వారిని భారత ప్రభుత్వం హిందూమతంలో భాగంగానే గుర్తిస్తోంది. లింగాయత్‌లకు మతం హోదాకోసం ఏప్రిల్ 8న ఔరంగాబాద్‌లో భారీ ర్యాలీకి సిద్ధమవుతున్నారు. లింగాయత్‌లు కర్ణాటకలో 16 శాతం, మహారాష్ట్రలో 6-7 శాతం ఉన్నారు.

ఆప్‌కు లాభం..

20 మంది ఎమ్మెల్యేల అనర్హత కొట్టివేత

- కేంద్రం నోటిఫికేషన్‌ను రద్దు చేసిన హైకోర్టు
- లాభదాయక పదవుల కేసులో తీర్పు
- మళ్లీ విచారించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 23: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ ఊరట.. లాభదాయక పదవులకు సంబంధించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఢిల్లీ హైకోర్టు రద్దు చేసింది. ఈ కేసును మళ్లీ మొదటి నుంచీ విచారించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి ఎన్నికల కమిషన్ సిఫారసులు చట్టాన్ని నీరుగార్చడం, చెడు సంప్రదాయమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం తీవ్రంగా వ్యాఖ్యానించింది. అనర్హత వేటు వేయడానికి ముందు మౌఖిక విచారణ జరపలేదని, ఎమ్మెల్యేల వాదన వినలేదని, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించారని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేల పిటిషన్‌ను తిరిగి ఎన్నికల కమిషన్‌కు పంపించింది. మంత్రులకు పార్లమెంటరీ సెక్రటరీలుగా 20 మంది ఎమ్మెల్యేలను 2015 మార్చిలో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. దాంతో, వారంతా లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారని, ఆర్థిక ప్రయోజనాలు పొందారని, వారి శాసనసభ్యత్వాలను రద్దు చేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. అప్పట్లో రోజువారీగా విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. వారిని పార్లమెంటరీ సెక్రటరీలుగా నియమించడాన్ని 2016 సెప్టెంబరులో తప్పుబట్టింది. అనంతరం 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఎన్నికల కమిషన్ అభిప్రాయాన్ని కోరింది. దాంతో, తాము లాభదాయక పదవులు చేపట్టలేదని ఎమ్మెల్యేలు చెప్పుజాలరని, వారిపై అనర్హత వేటు వేయాలని ఈ ఏడాది జనవరి 19న ఈసీ సిఫారసు చేసింది. దానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. అనర్హతను సవాల్ చేస్తూ మళ్లీ ఆప్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును మళ్లీ ఎన్నికల కమిషన్‌కు అప్పగించాలని, మొదటి నుంచీ విచారణ చేసేలా ఆదేశించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు అప్పట్లో ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఆ 20 నియోజక వర్గాల్లోనూ ఎన్నికల నిర్వహణకు తొందర పడొద్దని, షెడ్యూలు విడుదల చేయడంలో సంయమనం పాటించాలని ఆదేశించింది. ఇదే కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువరించింది. "రాష్ట్రపతికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన అభిప్రాయం చట్టాన్ని నీరుగార్చడమే. సహజ న్యాయ సూత్రాలను పాటించకుండా చెడు సంప్రదాయాన్ని నెలకొల్పడమే. మౌఖిక విచారణ జరపడంలో, ఎమ్మెల్యేల వాదన వినడంలో, కేసు ఉచితానుచితాలను బట్టి సమస్యను పరిష్కరించడంలో విఫలమైంది" అంటూ కేసును తిరిగి ఎన్నికల కమిషన్‌కు అప్పగించింది. కాగా.. తమ పోరాటం కొనసాగిస్తామని ఢిల్లీ పీసీసీ చీఫ్ అజయ్ మాకెన్ స్పష్టం చేశారు. ఆ ఎమ్మెల్యేలు ఆర్థిక ప్రయోజనాలు పొందారని ఉద్ఘాటించారు.



ఆప్ ఎమ్మెల్యేలతో కలిసి విజయ సంకేతం చూపుతున్న కేజ్రీవాల్, సిసోడియా

సత్యమే గెలిచింది: కేజ్రీవాల్

కోర్టు తీర్పు వెలువడిన వెంటనే 'సత్యమే గెలిచింది' అంటూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. "ఎమ్మెల్యేలపై దురుద్దేశపూర్వకంగా అనర్హత వేటు వేశారు. ఢిల్లీ ప్రజలకు హైకోర్టు న్యాయం చేసింది. ఇది వారి విజయం" అంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండడంతో శాసన సభలోనే ఎమ్మెల్యేలు 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. అంతలోనే, ఆ 20 మంది ఎమ్మెల్యేలూ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనవచ్చని స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.



కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్

దక్షిణాది సమరం!

పన్నుల పంపకంలో కేంద్రం వివక్ష

- 2011 లెక్కల ప్రకారం పంపిణీ
- తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు
- గొంతు కలిపిన కర్ణాటక, కేరళ
- దక్షిణాది భేటీకి కేరళ పిలుపు
- సంసిద్ధత వ్యక్తం చేసిన రాష్ట్రాలు

తిరువనంతపురం, మార్చి 23: ఇప్పటిదాకా దక్షిణాదిపై వివక్ష గురించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు మాత్రమే పోరాడుతూ వస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా కేరళ కూడా గొంతు కలుపుతోంది. కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్ దక్షిణాది రాష్ట్రాల ఆదాయాన్ని.. అభివృద్ధి అవసరాల పేరుతో ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇదే అంశంపై ఏప్రిల్ 10న తిరువనంతపురంలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక శాఖ కార్యదర్శులకు లేఖలు రాశానని, అందరూ సమావేశానికి వస్తామని ఫోన్లో చెప్పారన్నారు. రాష్ట్రాలకు నిధుల పంపిణీకి 1971 జనాభా లెక్కలకు బదులు 2011 లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని పదిహేనో ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసినప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు ఆగ్రహంతో ఉన్నాయి. జనాభా నియంత్రణను పాటించి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలకు శాపంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉండటం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో అవి తమ అభ్యంతరాలను గట్టిగానే చెప్పాయి. "కుటుంబ నియంత్రణను సమర్థంగా అమలు చేయడమే మా పాపమా?" అని థామస్ ఇస్సాక్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సును గట్టిగా వ్యతిరేకించాలని ఇప్పటికే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ట్వీట్ చేశారు. సిద్దరామయ్య ట్వీట్ వెలువడిన గంటల్లోనే కేరళ నుంచి సంఘీభావ ప్రకటన వచ్చింది. తొలి నిరసన వ్యక్తం చేసింది మాత్రం ఏపీ సీఎం చంద్రబాబే. కేంద్రం డబ్బులు, రాష్ట్రం డబ్బులు అంటూ ఉండవని, అన్నీ పన్ను చెల్లింపుదారు డబ్బులేనని అన్నారు. దీనికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య మద్దతు పలుకుతూ, "కేంద్రానికి వచ్చే పన్నుల్లో 9.56 శాతం కర్ణాటక నుంచే అందుతున్నాయి. అందులో కేవలం 4.5 శాతమే తిరిగి రాష్ట్రానికి అందుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది" అన్నారు.



ఉగ్రదాడి జరిగిన ట్రెబెస్‌లోని సూపర్ మార్కెట్

ఫ్రాన్స్‌లో మూడు ఉగ్రదాడులు

- చెలరేగిపోయిన ఐఎస్ ఉగ్రవాది
- ముగ్గురు మృతి, పలువురికి గాయాలు
- ముగిసిన ఆపరేషన్, ఉగ్రవాది హతం

ట్రెబెస్ (ఫ్రాన్స్), మార్చి 23: ఇస్లామిక్ స్టేట్)కు చెందిన ఒక ఉగ్రవాది శుక్రవారం ఫ్రాన్స్‌లో టెర్రర్ సృష్టించాడు. మూడు గంటల పాటు కొంత మందిని బందీలుగా ఉంచి, కాల్పులు జరిపాడు. వరుస దాడులు చేసి కనీసం ముగ్గురిని బలిగొన్నాడు. ఫ్రాన్స్‌ను వణికించిన ఈ ఘటనలు దక్షిణ ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. అనంతరం భద్రతా సిబ్బంది కాల్పుల్లో ఆ ఉగ్రవాదిని మరణించాడు. మొరాకో దేశస్థుడిగా అనుమానిస్తున్న ఈ ఉగ్రవాది కార్కసోన్, ట్రెబెస్‌ల వద్ద మూడు వేర్వేరు దాడులకు పాల్పడి ముగ్గురిని చంపి.. పలువురిని గాయపరిచాడు. తొలుత కార్కసోన్ వద్ద ఒక కారును హైజాక్ చేసి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తిని కాల్చి చంపి, డ్రైవర్‌ను గాయపరిచాడు. తర్వాత సమీపంలో తోటి ఉద్యోగులతో కలిసి జాగింగ్ చేస్తున్న ఒక పోలీసుపై కాల్పులు జరిపాడు. వెంటనే ట్రెబెస్ పట్టణానికి వెళ్లి అక్కడ ఉన్న ఒక సూపర్ మార్కెట్లోకి చొరబడ్డాడు. కొంత మందిని బందీలుగా చేసి, వారిలో ఇద్దరిని కాల్చి చంపేశాడు. ఆ సూపర్ మార్కెట్లో ఉగ్రవాది మూడు గంటలకుపైగా ఉండిపోయాడు. కత్తులు, తుపాకి, గ్రెనేడులతో వచ్చిన ఆ ఉగ్రవాది సూపర్ మార్కెట్లోకి వెళ్లేముందు "అల్లాహు అక్బర్" అని గట్టిగా అరిచాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఆ సమయంలో సూపర్‌మార్కెట్లో ఉన్న పది మంది వెనుక ద్వారం గుండా సురక్షితంగా బయటపడ్డారు. ఈ లోగా భద్రతా సిబ్బంది ఆ భవనాన్ని చుట్టుముట్టడంతో ఉగ్రవాది మిగిలిన వారిని విడిచిపెట్టేశాడు. ప్రస్తుతం బ్రస్సెల్స్‌లో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ హుటాహుటిన పారిస్ చేరుకుంటున్నారు. ఇది ఉగ్రవాదుల పనేనని ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్ అన్నారు.

కేసీఆర్ నన్ను మరచిపోయారు

శరద్ యాదవ్

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం నిరాహార దీక్ష చేస్తున్న కేసీఆర్ ప్రాణాలు కాపాడాలని తాను లోక్‌సభలో పోరాడితే.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ తనను ఒక్కసారి కూడా పలుకరించలేదని జనతాదళ్(యూ) నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు శరద్ యాదవ్ అన్నారు. గురువారం నాడు పార్లమెంట్‌లో తనకు ఎదురైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో కేసీఆర్ ప్రాణాలను కాపాడాలని, రాష్ట్రం ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని తాను లోక్‌సభలో వాదించిన తర్వాతే మొత్తం సభ స్పందించిందని, ప్రభుత్వం ఆగమేఘాలపై ప్రకటన చేసిందని శరద్ యాదవ్ గుర్తు చేశారు. అయితే.. సీఎం అయిన తర్వాత కేసీఆర్ తనను కలవలేదని, కానీ ఇప్పుడు ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు మమతా బెనర్జీ వద్దకు వెళ్లారని అన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆయన ఏదైనా చేస్తే అది బీజేపీకి మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు. త్వరలో హైదరాబాద్ వస్తానని శరద్ యాదవ్ చెప్పారు. తనను కూడా స్పీకర్ అన్యాయంగా సభనుంచి సస్పెండ్ చేశారని కోమటిరెడ్డి ఆయనకు చెప్పుకున్నారు. ఆ ఉదంతం గురించి ఆయన ఆసక్తిగా విన్నారు. శరద్ యాదవ్‌ను కూడా రాజ్యసభ సభ్యత్వం నుంచి చైర్మన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా, కోమటి రెడ్డి బ్రదర్స్ లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గేను కూడా కలుసుకుని తమ సస్పెన్షన్ పై లోక్‌సభలో లేవనెత్తాలని కోరారు.

యూపీలో ప్రతీకారం తీర్చుకున్న బీజేపీ

బీఎస్పీ అభ్యర్థిని ఓడించిన కమలం పార్టీ.. చివరి క్షణం దాకా హైడ్రామా

క్రాస్ ఓటింగ్‌తో కౌంటింగ్ 2 గంటలు నిలిపివేత

మిగిలిన 6 రాష్ట్రాల్లో సజావుగా ముగిసిన ఎన్నికలు.. ఎగువ సభకు 59 మంది ఎన్నిక




అరుణ్ జైట్లీ



జీవీఎల్ నరసింహారావు



జయాబచ్చన్



అభిషేక్ సింఘ్వీ

న్యూఢిల్లీ, మార్చి 23: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు ఉత్తరప్రదేశ్‌లో అత్యంత ఉత్కంఠను రేపాయి. ఈ మధ్య జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన పరాభవానికి బీజేపీ ప్రతీకారం తీర్చుకుంది. అనూహ్యంగా తన అభ్యర్థిని దింపి.. బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిని ఓడించింది. బీఎస్పీ ఎమ్మెల్యేకు వల వేసి- క్రాస్ ఓటింగ్ చేయించి- అమిత్‌షా చక్రం తిప్పారు. యూపీలో మొత్తం 10 సీట్లు ఖాళీ అయ్యాయి. వాటికి 11 మంది పోటీపడ్డారు. అసెంబ్లీలో బలాబలాలను బట్టి బీజేపీ మొత్తం పదింటిలో ఎనిమిది సీట్లను సులువుగా కైవసం చేసుకుంది. గెలిచిన ప్రముఖుల్లో అరుణ్ జైట్లీ, జీవీఎల్ నరసింహారావు, వికాస్ తోమర్, అశోక్ బాజపేయి, ఎస్‌డీ రాజ్‌భర్, అనిల్ జైన్, కాంతా కర్దమ్, హెచ్‌ఎస్ యాదవ్ అనాయాసంగా గెలిచారు. ఇక సమాజ్‌వాదీ పార్టీ నుంచి జయా బచ్చన్ గెలుపు కూడా ఇబ్బంది లేకుండానే ముగిసింది. బీజేపీకి చెందిన అనిల్ అగర్వాల్‌కు, బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేడ్కర్‌కు నువ్వా నేనా అన్నట్లు పోటీ ఏర్పడింది. బీఎస్పీకి 18 సీట్లున్నాయి. ఎస్పీతో కలుపుకొంటే ఈ స్థానాన్ని వశం చేసుకోనేదే..! కానీ బీజేపీ ఒక బీఎస్పీ ఎమ్మెల్యేకు వల వేసింది. అనిల్ కుమార్ సింగ్ అనే ఆ శాసనసభ్యుడు బీజేపీకి ఓటేశాడు. దీనికి తోడు సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే నితిన్ అగర్వాల్ కూడా బీజేపీకే ఓటేశాడు. మరో రెండు చిన్న పార్టీలు- అప్నా దళ్ (9), సుహేల్‌దేవ్ బహుజన్ భారతీయ పార్టీ (4)లు బీజేపీకి జైకొట్టారు. దీంతో అంతిమంగా బీజేపీ విజయఢంకా మోగించింది. పార్టీల ఏజెంట్లకు తమ ఓట్లను చూపించనందున ఈ రెండు ఓట్లు చెల్లవని ప్రకటించాలంటూ బీఎస్పీ-ఎస్పీలు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఓట్ల లెక్కింపును నిలిపివేశారు. చివరకు సీసీటీవీ ఫుటేజీ చూశాక ఏ అవకతవకలూ జరగలేదని నిర్ధారించి రాత్రి 8 గంటలకు కౌంటింగ్‌ను తిరిగి మొదలెట్టారు. రాజ్యసభ మొత్తం బలం 245. 16 రాష్ట్రాల్లో 59 సీట్లు వచ్చే నెల ప్రథమార్థంలో ఖాళీ అవుతున్నాయి. వీటిలో 33 సీట్లు ఏకగ్రీవమయ్యాయి. ఆరు రాష్ట్రాల్లోని 25 స్థానాలకు శుక్రవారం ఓటింగ్ జరిగింది. వీటిలో బెంగాల్‌లోని ఐదు స్థానాలకు ఆరుగురు పోటీ పడ్డారు. గెలవబోమని తెలిసినా సీపీఎం నుంచి రాబిన్ దేవ్ రంగంలోకి దిగారు -ఓడిపోయారు. బీజేపీ ఈ ఎన్నికల ద్వారా రాజ్యసభలో అత్యధిక స్థానాలున్న పార్టీగా అవతరించింది.

రాజ్యసభ సీట్లు.. ఎవరికి ఎన్ని?

	పార్టీ	పోటీ లేకుండా గెలిచిన ఎంపీలు	పోటీ చేసి గెలిచిన ఎంపీలు	మొత్తం
1	బీజేపీ	16	12	28
2	కాంగ్రెస్	5	5	10
3	టీఎంసీ	0	4	4
4	బీజేడీ	3	-	3
5	టీఆర్ఎస్	0	3	3
6	టీడీపీ	2	-	2
7	ఆర్జేడీ	2	-	2
8	జేడీయూ	2	-	2
9	ఎస్పీ	-	1	1
10	వైఎస్ఆర్‌సీపీ	1	-	1
11	ఎన్‌సీపీ	1	-	1
12	శివసేన	1	-	1
13	లెఫ్ట్	-	1	1
	మొత్తం	33	26	59

లోకాయుక్తలను నియమించరేం?

- తెలంగాణ సహా 12 రాష్ట్రాలకు సుప్రీం ప్రశ్న



న్యూఢిల్లీ, మార్చి 23: లోకాయుక్త, ఉపలోకాయుక్తలను ఎందుకు నియమించట్లేదో చెప్పాల్సిందిగా సుప్రీంకోర్టు 12 రాష్ట్రాలను ప్రశ్నించింది. ఏళ్లు గడుస్తున్నా ఈ పదవులను భర్తీ చేయకపోవడం వెనుక కారణాల్ని చెప్పాలని, ఎప్పటిలోగా నియమిస్తారో 2 వారాల్లోగా వెల్లడించాలని జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ భానుమతిలతో కూడిన ధర్మాసనం కోరింది. 2014 నుంచి తెలంగాణ సహా చాలా రాష్ట్రాలు లోకాయుక్తను నియమించలేదని ప్రజాహిత దావా వేసిన బీజేపీ నేత అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ చెప్పారు. త్రిపుర, తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మేఘాలయ, మణిపూర్, మిజోరం, ఢిల్లీ, పాండిచ్చేరి, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు పంపింది. కాగా, సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే మరోసారి నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. కేంద్రం లోక్‌పాల్ చట్టాన్ని అమలు చేసేవరకు దీక్షను కొనసాగిస్తానని తేల్చిచెప్పారు.

కిచిడీలా పెన్షన్ విధానాలు

న్యూఢిల్లీ, మార్చి 23: పెన్షన్ విధానాలు కిచిడీలా తయారయ్యాయని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పదవీ విరమణ అనంతరం అందే ప్రయోజనాల కోసం వయోధికులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొంది. తాను పదవీవిరమణ పొంది 27ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పెన్షన్ మొత్తం అందడంలేదంటూ ఓ రైల్వే రిటైర్డ్ ఉద్యోగి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తా ధర్మాసనం విచారణ జరిపి పైవిధంగా స్పందించింది. పదవీ విరమణ అనంతరం వయోధికుల జీవితం సాఫీగా సాగేందుకు ఉపయోగపడాల్సిన పెన్షన్ విధి విధానాలు కిచిడీలా తయారయ్యాయని పేర్కొంది. పెన్షన్ విధానాలు, ప్రయోజనాల క్రమబద్ధీకరణకు ఓ చట్టాన్ని రూపొందించాలని సూచించింది.

తత్కాల్ పాస్‌పోర్ట్‌కు ఆధార్ అక్కర్లేదు

న్యూఢిల్లీ, మార్చి 23: తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ తప్పనిసరి కాదు. ఇప్పటికే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యవహారాల బెంచ్ స్పష్టం చేయగా.. తాజాగా శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పునరుద్ఘాటించింది. బృందా గ్రోవర్ అనే న్యాయవాది తాను బంగ్లాదేశ్‌లో జరగనున్న కాన్ఫరెన్స్‌కు హాజరవ్వాల్సి ఉందని.. 'తత్కాల్'లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నానని బెంచ్‌కి తెలిపారు. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో తన దరఖాస్తును తిరస్కరించారని వివరించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం తన వద్దనున్న కేసులో తుది తీర్పు వెలువరించే వరకు.. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మినహా.. మిగతావాటికి ఆధార్ తప్పనిసరి చేయకూడదని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ధనుష్‌కు ఊరట

చెన్నై, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి కోర్టును మోసం చేశారంటూ ప్రముఖ తమిళ నటుడు ధనుష్‌పై దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. మదురై జిల్లా మేలూరుకు చెందిన కదిరేశన్ దంపతులు.. ధనుష్ తన కుమారుడని, వృద్ధాప్యంలో ఉన్న తమకు జీవనాధారం చూపాలంటూ మేలూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన న్యాయస్థానం విచారణకు నేరుగా హాజరుకావాలని ధనుష్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై స్టే విధించాలని, కేసును రద్దు చేయాలని ధనుష్ గత ఏడాది మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధనుష్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో.. ధనుష్ తన జనన, విద్యార్హత పత్రాలు నకిలీవి తయారు చేయించి న్యాయస్థానాన్ని మోసగించారని ఆరోపిస్తూ కదిరేశన్ హైకోర్టు మదురైబెంచ్‌లో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని శుక్రవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ రాజమాణిక్యం.. దానిని తోసిపుచ్చారు.

మొండి రోగాలకు సంగీతంతో విరుగుడు?

ట్రిపుల్ ఐటీలో అధ్యయనాలు.. ఈనెల 24, 25వ తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

చిన్నా పెద్దా తేడా లేకుండా.. అప్పుడే పుట్టిన పసిపాప నుంచి మరణశయ్యపై ఉన్న వారి దాకా అందరినీ కదిలించేది సంగీతమొక్కటే. పశుపక్షాదులను కూడా కదిలిస్తుందంటారు. శారీరక, మానసిక రుగ్మతలను కూడా తగ్గించే శక్తి సంగీతానికి ఉందని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మరి నిజంగానే సంగీతానికి అంతటి శక్తి ఉందా? మానసిక రుగ్మతలే కాకుండా.. పార్కిన్‌సన్స్, అల్జీమర్స్ వంటి జన్యుసంబంధిత వ్యాధులకు కూడా సంగీతంతో ఉపశమనం కలుగుతుందా? సంగీతం మన నాడీ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? వంటి విషయాలను అధ్యయనం చేసేందుకు, చర్చించేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలో శని, ఆదివారాల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. అల్జీమర్స్ వ్యాధిగ్రస్తుల్లో కనిపించే ప్రధాన లక్షణం డెమిన్షియా (మతిమరపు). ఈ వ్యాధి వచ్చిన వారు నెమ్మనెమ్మదిగా తమ జీవితంలో జరిగిన సంఘటలన్నింటినీ మర్చిపోతూ ఉంటారు. కానీ వారు మర్చిపోనిది సంగీత మొక్కటే అంటున్నారు శాస్త్రవేత్తలు. కొందరికి పక్షవాతం వచ్చి మాట పడిపోతుంది. కానీ వారిలో సంగీత జ్ఞానము ఉన్నవారు.. శిక్షణ పొందినవారు పాటలు పాడగలుగుతారని అంటున్నారు. "సంగీతం మన నాడీవ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయంలో పాశ్చాత్యదేశాల్లో అనేక పరిశోధనలు జరిగాయి. జరుగుతున్నాయి. మన దేశంలో పరిశోధనలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి" అని ట్రిపుల్ ఐటీ మ్యూజికాలజీ ప్రొఫెసర్ వినూ అల్లూరి వెల్లడించారు. గత ఏడాది నుంచి ట్రిపుల్ ఐటీలో సంగీతానికి మన నాడీ వ్యవస్థకు.. మన మానసిక స్థితికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకోవటానికి అనేక అధ్యయనాలు ప్రారంభించారు. ఈ సంస్థలో ఉన్న సెంటర్ ఫర్ విజువల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో వినూ, ఆమె బృందం పరిశోధనలు చేస్తున్నారు. "ట్రిపుల్ ఐటీలో ఇప్పటి దాకా మేము



మూడు అధ్యయనాలు చేశాం. అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాం. వివిధ దేశాల నుంచి శాస్త్రవేత్తలు, సంగీత కళాకారులు, డాక్టర్లు దీనికి హాజరవుతారు" అని ఆమె అంటున్నారు. "సంగీతం ఒత్తిడిని తగ్గిస్తుందనే విషయం మనకు కొన్ని వేల ఏళ్లుగా తెలుసు. కానీ సంగీతానికి.. శారీరక ఆరోగ్యానికి ఉన్న సంబంధాన్ని శాస్త్రీయంగా ఇప్పటి దాకా పూర్తిగా తెలుసుకోలేపోయాం. ఉదాహరణకు తాజాగా పార్కిన్‌సన్స్ వ్యాధిగ్రస్తులపై చేసిన అధ్యయనంలో సంగీతం వినటం వల్ల వారిలో ఒత్తిడి గణనీయంగా తగ్గిందని తేలింది" అని ఆమె చెబుతున్నారు. ఫిన్‌లాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు 13 ప్రశ్నలతో ఒక ప్రశ్నావళిని తయారుచేశారు. ఈ ప్రశ్నలకు సమాధానాలను విశ్లేషిస్తే ఒక వ్యక్తి డిప్రషన్‌లో ఉన్నాడా? లేదా? అనే విషయాలను నిర్ధారించవచ్చు. ఈ ప్రశ్నావళిని వినూ, ఆమె బృందం మన భారతీయ నేపథ్యానికి తగినట్లుగా తయారుచేశారు. దీని ద్వారా కొత్త విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

- స్పెషల్ డెస్క్

మ్యూజిక్ ఫిలాయా

సంగీతం మన రుగ్మతలను ఎలా నయం చేస్తుందనే విషయంపై ఆలీవర్ శాక్స్ అనే మానసిక శాస్త్రవేత్త పరిశోధనలు చేశారు. పార్కిన్‌సన్స్ వంటి రుగ్మతలు ఉన్నవారికి సంగీతం సహకరిస్తుందని తేల్చారు. ఆయన రాసిన మ్యూజిక్ ఫిలాయా అనే పుస్తకం ప్రపంచంలో ఒక సంచలనాన్ని రేకెత్తించింది. సంగీతం వల్ల లాభాలపై చర్చను లేవనెత్తింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


CONGRATULATIONS
KARAN CONCEPTS / SOCIAL MEDIA CAMPAIGN / 9966 767 899
గౌ॥ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారి ఆశీస్సులతో
రాజ్యసభ అభ్యర్థిగా గెలుపొందిన
తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి
జోగినపల్లి సంతోష్‌కుమార్ గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు
మర్రి జనార్ధన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే

నవమి నైవేద్యాలు...

శ్రీరామ నవమిని ప్రజలంతా ఎంతో భక్తి శ్రద్ధలతో చేసుకుంటారు. సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. రామునికి ఎంతో ప్రీతిపాత్రమైన పానకం, వడపప్పు, సెనగ గుగ్గిళ్లు, చలిమిడి, క్యారెట్ కోశాంబరి నైవేద్యంగా సమర్పిస్తారు.

పానకం:

కావలసినవి: బెల్లం - నాలుగు టేబుల్ స్పూన్లు (తరుగు), నీళ్లు- రెండు కప్పులు, శొంఠి, యాలకులపొడి- కొద్దిగా, మిరియాలు (కచ్చాపచ్చాగా చేసి)- కొన్ని.

తయారీ: నీళ్లల్లో బెల్లం వేసి గరిటెతో కలిపి కరిగించాలి. ఆ నీళ్లను వడకట్టి, అందులో యాలకుల పొడి, శొంఠి, మిరియాల పొడి వేసి కలిపితే పానకం రెడీ.





పచ్చి చలిమిడి

కావలసినవి: బెల్లం తరుగు- అర కప్పు, బియ్యప్పిండి- కప్పు, నీళ్లు- కొద్దిగా.

తయారీ: బియ్యప్పిండిలో బెల్లం వేసి బాగా కలపాలి. తరువాత తగినన్ని నీళ్లు చల్లుతూ ముద్దలా చేస్తే పచ్చి చలిమిడి సిద్ధం. ఎండుద్రాక్ష, జీడిపప్పులను కూడా చలిమిడిలో వేయొచ్చు.

సెనగ గుగ్గిళ్లు

కావలసినవి: సెనగలు- ఒక కప్పు, కరివేపాకులు - కొన్ని, పసుపు- చిటికెడు, ఆవాలు, జీలకర్ర- ఒక్కొక్కటి పావు టీస్పూను చొప్పున, పచ్చి కొబ్బరి తురుము- ఒక టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి- ఒకటి (సన్నగా తరిగి), ఇంగువ- చిటికెడు, నూనె- సరిపడా.

తయారీ: సెనగలను రాత్రంతా నీళ్లల్లో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం కుక్కర్‌లో వేసి, అందులో పావుకప్పు నీళ్లు, ఉప్పు, పసుపు కలపాలి. స్టవ్ సిమ్‌లో ఉంచి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. ఉడికిన సెనగలను కుక్కర్‌లోంచి తీసి పక్కన ఉంచాలి. ఒక పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్రలు వేగించాలి. తర్వాత కరివేపాకు, ఇంగువ, ఎండు మిర్చి వేయాలి. పచ్చికొబ్బరి తురుమువేసి కలపాలి. చివరిగా ఉడికించిన సెనగలను వేసి కలపాలి.




వడపప్పు

కావలసినవి: పెసరపప్పు- పావుకప్పు

తయారీ: రెండు గంటల పాటు నీళ్లల్లో పెసరపప్పు నానబెట్టాలి. తర్వాత నానిన పప్పును గిన్నెలోకి తీయాలి. కావాలనుకుంటే పచ్చిమామిడి ముక్కలు, పచ్చిమిర్చి, కొద్దిగా ఉప్పు కూడా కలపొచ్చు.





క్యారెట్ కోశాంబరి:

కావలసినవి: క్యారెట్ తరుగు- ఒక కప్పు, పెసరపప్పు- మూడు టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ- ఒకటి, ఉప్పు- కొద్దిగా. తాలింపుకు నూనె- ఒక టీస్పూను, ఆవాలు- ముప్పావు టీస్పూను, పచ్చిమిర్చి- ఒకటి (తరిగి), ఇంగువ- చిటికెడు.

తయారీ: పెసరపప్పును నీళ్లలో గంటసేపు నానబెట్టాలి. ఒక గిన్నెలో క్యారెట్ తరుగు, నానబెట్టిన పెసరపప్పు వేసి, నిమ్మకాయ రసం పిండి కలపాలి. సిద్ధం చేసుకున్న తాలింపులో కొద్దిగా ఉప్పు కలపాలి.



గుడ్‌ఫుడ్



బెల్లంతో బరువు తగ్గుతారు...

బెల్లం అనగానే నోరూరుతుంది. నాలుక తీయదనపు అనుభూతితో నిండిపోతుంది. ఇక బెల్లం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ ఎక్కువే. చర్మం, శిరోజాల అందచందాలను బెల్లం ఇనుమడింపచేస్తుంది. శరీర బరువును సైతం తగ్గిస్తుంది! ఇలా బెల్లంతో ఎన్నో లాభాలున్నాయి. అవేమిటంటే...

- బెల్లం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది.
- తీపి తినాలన్న ఆరాటం తగ్గుతుంది.
- పాలల్లో బెల్లం తరుగును వేసి తాగితే ఎముకలు దృఢంగా ఉంటాయి.
- కీళ్లు, ఆర్థ్రరైటిస్ లాంటి ఎముకల బాధలు పోతాయి.
- బెల్లం తింటే బరువు తగ్గుతారు. ఇందులో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది.
- పొటాషియం శరీరంలోని ఎలక్ట్రొలైట్స్‌ను సమతులం చేస్తుంది. కండరాలను పెంచడమేగాక పటిష్టం చేస్తుంది.
- జీవక్రియ సరిగా అయ్యేట్టు సహాయపడుతుంది.
- శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అంతేకాదు రక్తంలోని హిమోగ్లోబిన్ ప్రమాణాన్ని పెంచుతుంది.
- ఐరన్, ఫొలేట్‌లు బెల్లంలో బాగా ఉండడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. ఎర్రరక్త కణాలు కూడా సాధారణ ప్రమాణంలో కొనసాగుతాయి.
- బెల్లం వాడకం వల్ల శరీరంలోని ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయి.
- వైద్యుల సలహా మేరకు గర్భిణులు బెల్లం తింటే ఎంతో మంచిది. ఈ టైములో ఆడవాళ్ళు ఎదుర్కొనే రక్తహీనత, ఐరన్ లేమి సమస్యలు బెల్లం తినడం వల్ల తగ్గుతాయి.
- శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచే విటమిన్లు, మినరల్స్ కూడా ఇందులో ఉన్నాయి.
- మెరిసే చర్మం కావాలనుకునేవాళ్లు నిత్యం కొద్దిగా బెల్లం తినాలి.
- మొటిమలు, మచ్చలు రాకుండా... చర్మం మృదువుగా ఉండేలా చేస్తుంది.
- చర్మం ముడతలు పడడాన్ని తగ్గిస్తుంది. చర్మం మీద మచ్చలను పోగొడుతుంది.
- డార్క్ స్పాట్స్‌ను నిరోధిస్తుంది.
- బెల్లంలోని ఐరన్... శిరోజాలు పటిష్టంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.
- వెంట్రుకలు కూడా బాగా పెరుగుతాయి.
- వెయిట్ లాస్ డైట్‌లో బెల్లం ఎంతో ముఖ్యమైంది.
- జలుబు, దగ్గు, తలనొప్పులకు బెల్లం బాగా పనిచేస్తుంది. గొంతుమంటను తగ్గిస్తుంది.
- బెల్లంలో కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగా తింటే మంచిది. అతిగా తింటే శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. బ్లడ్ షుగర్ ప్రమాణాల్లో తేడాలు తలెత్తుతాయి.
- రక్తపోటు, గుండెజబ్బుల రిస్కు తగ్గిస్తుంది.
- కాలేయం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.
- రోజూ కొద్దిగా బెల్లం తినడం వల్ల శ్వాసకోశ సంబంధమైన అస్తమా, బ్రాంకైటిస్ వంటివి తగ్గుతాయి.

కిచెన్‌వేర్

ఫుడ్ అండ్ మసాలా జార్

ఇక్కడ కనిపిస్తున్న కిచెన్ ప్రోడక్ట్ 'సిక్స్ సెట్ యాక్రలిక్ స్పైస్ సీజనింగ్ ఫుడ్ అండ్ మసాలా జార్'. ఈ జార్‌లో ఆరు మసాలా ఐటమ్స్‌ను ఆరు సెక్షన్లలో భద్రపరచుకోవచ్చు. ఇది కలర్‌ఫుల్ స్పైస్ జార్ కావడంతో చూడడానికి ఎంతో అందంగా కూడా కనపడుతుంది. వంటిట్లో మసాలాల స్టోరేజీకి ఎంతో అనుకూలంగా ఉంటుంది. చిన్నదిగా ఉండి స్పేస్ తక్కువగా ఆక్రమిస్తుంది. పైగా రకరకాల రంగులతో ఈ జార్ ట్రాన్స్‌పరెంట్‌గా ఉండడం వల్ల ఏ మసాలా ఎందులో ఉందో సులభంగా తెలిసిపోతుంది. ఈ సిక్స్ సెట్ జార్ డిజైన్ వివిధ రంగుల్లో ఆకట్టుకునేలా ఉంటుంది. మన్నికైన, పర్యావరణహితమైన ప్లాసిక్‌ని ఈ జార్ తయారీకి ఉపయోగించారు. దీని ఖరీదు: 400/- రూపాయలు.



వంటిల్లు

'శ్రీరామ... నీ నామమెంత రుచిరా..' అని భక్తిపారవశ్యంతో పాడుకోవడమే కాదు... శ్రీరామ నవమికి పసందైన వంటకాలు చేసుకుని... వాటిని ఆరగిస్తూ 'శ్రీరామ... ఎంతో రుచిరా!' అనొచ్చు. నవమి పర్వదినాన... వెరైటీ వంటకాల్ని చేసుకోండి. వాటిని ఆస్వాదిస్తూ తినేయండి...



కీరదోస పచ్చడి



కావలసినవి: కీర దోస -200 గ్రాములు (తొక్క తీసి, తరిగి), పచ్చిమిర్చి- నాలుగు (సన్నగా తరిగి), నూనె- ఒక టీస్పూను, ఆవాలు- పావు టీస్పూను, చింతపండు గుజ్జు- ఒక టీస్పూను, జీలకర్ర- అర టీస్పూను, ఉప్పు- తగినంత.

తయారీ:

- పాన్‌లో నూనె వేడెక్కాక కీర దోస ముక్కలు వేసి రెండు నిమిషాలు వేగించాలి.
- వేగిన ముక్కల్ని పక్కకు తీసి ఆవాలు, జీలకర్రను వేగించాలి.
- ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, చింతపండు గుజ్జు కూడా వేసి కలపాలి.
- వేడి చల్లారాక ఈ ముక్కల్ని బ్లెండర్‌లో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- అందులో కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. ఈ పచ్చడిని వేడి వేడి అన్నంలో లేదా చపాతీలతో తింటే బాగుంటుంది.

రవ్వ కేసరి

కావలసినవి: బొంబాయిరవ్వ- ఒక కప్పు, చక్కెర- ముప్పావు కప్పు, జీడిపప్పు, ఎండుద్రాక్షలు- ఒక టేబుల్‌స్పూను, నెయ్యి- అరకప్పు, యాలకులపొడి- కొద్దిగా, నీళ్లు- నాలుగు కప్పులు.

తయారీ:

- జీడిపప్పు, ఎండుద్రాక్షలు నెయ్యిలో వేగించాలి.
- వెడల్పాటి కడాయి తీసుకుని బొంబాయిరవ్వను సువాసన వచ్చేదాకా నెయ్యిలో వేగించాలి.
- వేగించిన రవ్వలో యాలకులపొడి వేసి బాగా కలపాలి.
- ఒక గిన్నెలో నీళ్లు పోసి అవి ఉడుకుపట్టాక, వేగించిన రవ్వను కొద్ది కొద్దిగా పోస్తూ ఉండకట్టకుండా మధ్య మధ్యలో గరిటెతో కలపాలి.
- వేగించిన జీడిపప్పులు ఎండుద్రాక్షలను ఇందులో వేయాలి.
- పంచదారను కూడా ఉడుకుతున్న బొంబాయిరవ్వలో కలపాలి. మిశ్రమం కొద్దిగా జారుగా అవుతుంది. కంగారుపడనవసరం లేదు. దీంట్లో కాస్త నెయ్యి వేయాలి.
- మూత పెట్టి రెండు మూడు నిమిషాలు స్టవ్ మీద ఉడికిస్తే కమ్మటి రవ్వకేసరి తినేయొచ్చు

శ్రీరామ.. ఎంతో రుచిరా!

పరుప్పు వడ

కావలసినవి: మినపప్పు- ఒక కప్పు, ఉల్లిపాయ తరుగు -ముప్పావు కప్పు, అల్లం- చిన్నముక్క, పచ్చిమిర్చి- రెండు, ఇంగువ- చిటికెడు, కరివేపాకు-కొద్దిగా, కొత్తిమీర-గుప్పెడు, నూనె- వేపుడుకు తగినంత, ఉప్పు- రుచికిసరిపడా.

తయారీ:

- మినపప్పు బాగా కడిగి రెండు గంటలు నీళ్లల్లో నానబెట్టాలి.
- పప్పు నానిన తర్వాత నీటిని వడకట్టాలి.
- నానిన మినపప్పు నుంచి కొద్దిగా పప్పు విడిగా తీసి అందులో ఉప్పు వేసి బ్లెండర్‌లో కొన్ని సెకన్లు తిప్పాలి. గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని నీళ్లు చిలకరించాలి.
- కచ్చాపచ్చాగా నలిగిన పిండిని ఒక పాత్రలోకి తీయాలి.
- మిగిలిన మినపప్పును మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఈ రెంటిని ఒక గిన్నెలో వేసి బాగా కలపాలి.
- ఇలా చేయడం వల్ల వడలు కరకరలాడతాయి.
- ఈ పిండిలో సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగు, అల్లం, పచ్చిమిర్చి తరుగు, ఇంగువ, కరివేపాకు, కొత్తిమీర వేసి బాగా కలపాలి.
- సన్నని మంటపై కడాయి పెట్టి నూనె పోసి బాగా వేడిచేయాలి.
- పిండిని కొద్దిగా తీసుకుని చేతిపై వడలా చేసి వేడెక్కిన నూనెలో వేయాలి. ఇలా పిండి మొత్తాన్ని వడలుగా చేసి కరకరలాడేట్టు వేగించాలి. వీటిని కొబ్బరి, పల్లీ, టొమాటో చట్నీలతో తింటే ఇంకా రుచిగా ఉంటాయి.



మెంతి పులావ్



కావలసినవి: బియ్యం- 200 గ్రాములు, మెంతి కూర -200 గ్రాములు, నెయ్యి- రెండు టేబుల్‌స్పూన్లు, జీలకర్ర- అర టీస్పూను, లవంగాలు- ఐదు, నల్ల మిరియాలు-పది, యాలకులు-రెండు, దాల్చినచెక్క పొడి- కొద్దిగా, పచ్చిమిర్చి- రెండు, అల్లం-వెల్లుల్లి పేస్టు- ఒక టేబుల్‌స్పూను, పచ్చి బఠానీ గింజలు- అర కప్పు, క్యాప్సికం- ఒకటి (సన్నగా తరిగి), ఉప్పు- రుచికి సరిపడా.

తయారీ:

- బియ్యాన్ని అరగంట నీళ్లల్లో నానబెట్టాలి.
- కుక్కర్‌లో నెయ్యి వేడిచేయాలి.
- అందులో జీలకర్ర, నల్లమిరియాలు, యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క పొడి వేసి వేగించాలి.
- ఒక నిమిషం అవి వేగాక పచ్చిమిర్చి, బఠానీగింజలు, క్యాప్సికం ముక్కలు, అల్లంవెల్లుల్లి పేస్టు వేయాలి.
- ఇవి ఉడికిన తర్వాత మెంతి కూర వేసి వేగించాలి.
- అందులో బియ్యం, ఉప్పు, నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చే దాకా ఉడికించాలి.
- కాసేపైన తర్వాత కుక్కర్ మూత తీస్తే ఘుమఘుమలాడే మెంతి పులావ్ రెడీ.

మ్యాంగో రసగుల్లా

కావలసినవి: పనీర్-రెండుకప్పులు, మైదా- ఒక కప్పు, చక్కెర- ఒక కప్పు, మామిడిపండు గుజ్జు- ఒక కప్పు, పాలు- అరకప్పు, మ్యాంగో ఎసెన్స్- అర టీస్పూను, యాలకుల పొడి- అర టీస్పూను, పిస్తా పప్పులు- ఎనిమిది (సన్నగా తరిగి), కుంకుమపువ్వు - కొద్దిగా.

తయారీ:

- పనీర్, మామిడిపండు గుజ్జు, మైదాలను మెత్తగా పిండిముద్దలా చేయాలి.
- ఈ పిండిని చిన్న ఉండలుగా చేయాలి.
- ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి వేడిచేయాలి.
- అందులో చక్కెర, యాలకులపొడి వేయాలి.
- అది తీగ పాకంలా అయ్యేవరకూ స్టవ్‌మీద ఉంచి గరిటెతో కలుపుతుండాలి.
- తయారైన పాకం మీద ఏర్పడిన పొరను గరిటెతో మెల్లగా తీసేయాలి.
- ఇందులో చేసి పెట్టుకున్న ఉండల్ని వేసి మూత పెట్టి సన్నటి మంటపై ఉడికించాలి.
- మధ్య మధ్యలో మూత తీసి ఉండలు విరిగిపోకుండా ఉన్నాయా.. లేదా అనేది చూడాలి.
- తర్వాత మ్యాంగో ఎసెన్స్ వేసి స్టవ్ ఆపేయాలి.
- రసగుల్లాలు చల్లారిన తర్వాత వాటిపై పిస్తా పలుకులు, కుంకుమపువ్వు చల్లాలి.
- వీటిని ఫ్రిజ్‌లో పెట్టి తింటే చల్లచల్లగా, తియ్యతియ్యగా ఉండి వేసవి వేడి నుంచి సేద తీరుస్తాయి.



ఆంధ్రజ్యోతి నవ్య | లిటిల్స్ ప్లస్



పిల్లలూ... 'కింగ్ కాంగ్' సినిమా చూశారా? అందులో గొరిల్లా హీరోయిన్‌ను ఇష్టపడుతుంది. ఒక గొరిల్లా మనిషిని ఇష్టపడటం ఎలా సాధ్యం? అని అనిపించవచ్చు. కానీ చాలా అంశాల్లో ఏప్స్‌కీ, మనుషులకీ పోలికలు ఉంటాయి. జంతువుల్లో తెలివైనవి కూడా అవే. గొరిల్లా, ఒరాంగుటాన్, చింపాజీ, బొనబోస్, గిబ్బన్స్....ఇవన్నీ ఏప్స్ కేటగిరీ కిందకే వస్తాయి. మరి ఏప్స్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందామా!

ఏప్స్.. అచ్చం మనలాగే!

- మానవుల్లో మాదిరిగా వీటిలో కూడా ఎ, బి, ఎబి, రక్తవర్గాలున్నాయి.
- వీటి డీఎన్ఎ 98 శాతం మానవులను పోలి ఉంటుంది. అందుకే అవి కూడా జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటి జబ్బుల బారినపడుతుంటాయి.
- మనుషుల్లో ఉండే విధంగా ఏప్స్‌లోనూ ఫింగర్ ప్రింట్స్ ఉంటాయి.
- సాధారణంగా వీటి చేతులు, కాళ్లకన్నా పొడవుంటాయి.
- ప్రతిరోజూ 40 పౌండ్ల ఆహారాన్ని జీర్ణించుకుంటాయి. ఇవి పండ్లు, మొక్కలను ఆహారంగా తీసుకుంటాయి.
- గొరిల్లాలు, చింపాజీలు తల్లిపై ఎక్కువ కాలం ఆధారపడతాయి.
- గొరిల్లాలో గర్భధారణ కాలం తొమ్మిదినెలలు ఉంటుంది. మూడు నుంచి నాలుగు పౌండ్ల బరువున్న శిశువులకు జన్మనిస్తాయి.
- జంతువుల్లో ఎక్కువ బాల్యం ఒరాంగుటాన్‌లో ఉంటుంది. ఆరేళ్ల వరకు బేబీ ఒరాంగుటాన్ తల్లి సంరక్షణలోనే ఉంటుంది.
- మనుషుల్లో మాదిరిగా ఏప్స్‌లోనూ అభివృద్ధి చెందిన మెదడు ఉంటుంది. టీవీ చూడటాన్ని, ఆటలు ఆడటాన్ని ఏప్స్ ఇష్టపడతాయి.
- ఏప్స్‌లో అతి చిన్నది గిబ్బన్. పెద్దది గొరిల్లా.



ఐది విన్నారా?

టిర్‌హేనియన్ సముద్రం!

టిర్‌హేనియన్ సముద్రం మెడిటేరియన్ సముద్రంలో భాగం. ఇటలీ, ఫ్రాన్స్ దేశాలు ఈ సముద్రంతో తీరప్రాంతం కలిగి ఉన్నాయి. కోర్సికా, సర్డినియా, సిసిలీ ద్వీపకల్పాలకు మధ్యన, లిగురియన్, లోనియన్ సముద్రాలతో అనుసంధానమై ఉంటుంది. ఎల్బా, ఇషోలీ ద్వీపకల్పాలు ఇందులో ఉన్నాయి. దీని లోతు 12 వేల అడుగులు.

షుగర్ క్యాండీ తయారీ!

కావలసిన వస్తువులు:
టూత్‌పిక్
క్లాత్ క్లిప్
మంచి నీళ్లు - 1 కప్పు
పంచదార- 3 కప్పులు
పొడవైన గాజు సీసా

ప్రయోగం చేసే విధానం!


- కడాయిలో నీళ్లు పోసి పొయ్యిమీద మరగబెట్టాలి.
- మరిగిన నీళ్లలో కొంచెం కొంచెం పంచదార పోస్తూ పూర్తిగా కరిగేలా తిప్పాలి.
- ద్రావణాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి.
- తరువాత జాగ్రత్తగా సీసాలో పోయాలి.
- టూత్‌పిక్‌ను క్లాత్‌క్లిప్ మధ్యలో ఉంచి సీసా మూతి పై భాగంలో ఉంచాలి. టూత్‌పిక్ కింది భాగం సీసాలో అడుగు భాగానికి కొంచెం పైకి ఉండేలా వేలాడుతూ ఉండాలి.
- ఈ సీసాను జాగ్రత్తగా భద్రపరచాలి. 3 నుంచి 7 రోజుల్లో షుగర్ క్యాండీ తయారవుతుంది.



కిడ్ సైంటిస్ట్

అందమైన లోకం.. అల్లకల్లోలం!

చదవండి



రెండో ప్రపంచ యుద్ధ మేఘాలు కమ్ముకున్న సమయం అది. దక్షిణ ఫ్రాన్స్‌లో మారుమూల ఊరు. ప్రకృతికి నిలయమైన ఆ ప్రదేశంలో ఓ పిల్లాడు ఉండేవాడు. ఆటిజమ్ డిజార్డర్‌తో బాధపడేవాడు. ఏదీ సరిగ్గా అర్థం చేసుకోలేడు. ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేడు కూడా. ఎంతో అల్లారుముద్దుగా పెరుగుతున్న ఆ పిల్లాడికి చుట్టూ ఉండే ప్రకృతి ఉంటే చాలా ఇష్టం. జంతువులు, పక్షులను ఎంతో ప్రేమిస్తాడు. వాటికి ఏం జరిగినా తట్టుకోలేడు. ముఖ్యంగా తన ఇంటికి సమీపంలోని సరస్సులో వాలే ఫ్లెమింగోలంటే మరీనూ! అతని కళ్ల ముందు ప్రపంచం ఒక్కసారిగా ముక్కలవుతుంది. అదీ జర్మనీ సైనికుల వల్ల. వాళ్లుండే పట్టణాన్ని ధ్వంసం చేస్తారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే 'ఫ్లెమింగో బోయ్' పుస్తకం ఇతివృత్తం. మైఖేల్ మోర్పుర్గో రచించిన ఈ నవల ఇటీవలే మార్కెట్లోకి విడుదలైంది. ముఖ్యంగా పిల్లల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. మనుషులకూ, జంతువులకూ ఉండే అనుబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు మైఖేల్.

పటంలో గుర్తించండి?

ఈ పటంలో నంబర్ల స్థానంలో ఉన్న ప్రసిద్ధ కోటలను గుర్తించండి?



టీచర్: బంటీ! హోటల్ స్పెల్లింగ్ రాయమంటే HOEL మాత్రమే రాశావు. T ఏమైంది?
బంటి : తాగేశాను టీచర్.
టీచర్: !!!



వెంగళప్ప: ఈ డాక్టర్ గతంలో హోటల్‌లో పనిచేసి ఉంటాడని నా నమ్మకం రా!
వీరేశం : అంత కరెక్ట్‌గా ఎలా చెప్పగలవు?
వెంగళప్ప: ఇందాక ఇంజెక్షన్ చేశాక డబ్బులు లేవంటే క్లినిక్‌లో టవల్స్ ఉతికించాడు.
వీరేశం : !!!

క్విజ్

మతం, వాటిని స్థాపించిన వ్యక్తులను జతచేయండి

1) బౌద్ధమతం	ఎ) అక్బర్
2) అద్వైత సిద్ధాంతం	బి) రామానుజాచార్యులు
3) విశిష్టాద్వైత సిద్ధాంతం	సి) శంకరాచార్యులు
4) మొదటి సిక్కు గురువు	డి) పార్శ్వనాథుడు
5) దీన్-ఇ-ఇలాహి	ఇ) గౌతమబుద్ధుడు
6) జైనమతం	ఎఫ్) గురునానక్




సరైన నీడను గుర్తించండి



సమాధానాలు

పేపర్ కళ

బబ్లీ బన్నీ!




స్టెప్ 1: ఎ4 కాగితాన్ని బొమ్మలో చూపించిన విధంగా మడవండి. మళ్లీ అన్‌ఫోల్డ్ చేయండి.
స్టెప్ 2: స్టెప్ 1నే రిపీట్ చేయండి. అయితే సారి వేరే వైపు ఇలా చేయాలి. మళ్లీ మడతలు తీసేయండి.
స్టెప్ 3: కాగితాన్ని ఈ సారి సగానికి మడవండి, మళ్లీ అన్‌ఫోల్డ్ చేయండి.
స్టెప్ 4: త్రిభుజాకారం వచ్చేలా కాగితాన్ని చిత్రంలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి. అప్పుడు మీకు త్రిభుజాకారంలోకి కాగితం మారతుంది.
స్టెప్ 5: మళ్లీ డైమండ్ ఆకారంలోకి మారేలా అడుగు ఉన్న కాగితాన్ని పైకి మడవండి. (చిత్రంలో చూడండి)
స్టెప్ 6: డైమండ్ షేప్ కుడి, ఎడమభాగాలను మరొక్కసారి మడవండి.
స్టెప్ 7: కాగితాన్ని రివర్స్ చేసి మిగిలి ఉన్న కుడి ఎడమ భాగాలను లోపలికి ఫోల్డ్ చేయండి (బొమ్మలో చూడండి)
స్టెప్ 8: కాగితాన్ని ఫ్లిప్ చేయండి.
స్టెప్ 9: మళ్లీ డైమండ్ ఆకారంలోకి మరేలా కాగితాన్ని ఫ్లిప్ చేయండి.
స్టెప్ 10: మరొక్కసారి కాగితాన్ని ఫ్లిప్ చేయండి. కుడివైపు భాగాన్ని వెనుకవైపునకు మడవండి.
స్టెప్ 11: చిత్రంలో చూపించిన విధంగా మడవండి.
స్టెప్ 12: మళ్లీ కాగితాన్ని ఫ్లిప్ చేసి, కుడివైపునకు మడవండి (చిత్రంలో చూడండి)
స్టెప్ 13: ఎడమవైపు భాగాన్ని కుడివైపునకు తిప్పండి
స్టెప్ 14: ఎడమవైపు భాగాన్ని మధ్యలోకి మడవండి
స్టెప్ 15: మళ్లీ ఎడమవైపు భాగాన్ని వెనుకవైపునకు తిప్పండి (చిత్రంలో చూడండి)
స్టెప్ 16: చిత్రంలో చూపించిన విధంగా రెండు కాగితం చివరి భాగాలను విడదీయండి
స్టెప్ 17: చిత్రంలో చూపించిన విధంగా మడవండి
స్టెప్ 18: అప్పుడు సూది ఉన్న వైపు రంధ్రం ఏర్పడుతుంది. దాంట్లో గాలి ఊదండి. అప్పుడు కుందేలు తల ఆకారంలోకి వస్తుంది.
స్టెప్ 19: అందంగా కళ్లు, ముక్కు, నోరు గీయండి. అంతే కుందేలు రెడీ!



కొమడో డ్రాగన్స్ ఒక నిమిషం కన్నా తక్కువ సమయంలో 5 పౌండ్ల మాంసం తినేస్తాయి. ఎక్కువగా తీసుకున్న ఫ్యాట్‌ను అవి తోకలో నిలువ చేసుకుంటాయి.

ఔనా



ఎరుపు చుక్కలకు తగలకుండా.. దారి కనుక్కోండి



ద్వంద్వ సాక్ష్యం

నీతికథ

ఒక గ్రామపెద్ద గుర్రాన్ని కొత్వాలు దొంగిలించి, చాలా పొడుగుగా ఉండే దాని తోక కత్తిరించి పొట్టిచేసి తన ఇంటి పెరట్లో కట్టేసుకున్నాడు. గుర్రం ఎక్కడిదని చూసినవాళ్లు అడిగితే దూర గ్రామం నుంచి కొనితెచ్చానన్నాడు.

కొత్వాలు ఇంటికి వెళ్లిన గ్రామపెద్ద, తన గుర్రాన్ని చూసి గుర్తించి, న్యాయాధికారి వద్ద కొత్వాలు మీద ఫిర్యాదు చేశాడు. "మీ గుర్రాన్ని గుర్తించ



గలవారెవరైనా ఉన్నారా?" అని న్యాయాధికారి అడిగితే, గ్రామపెద్ద తన గుర్రాన్ని ఊరి దుకాణదారు బాగా తెలుసన్నాడు.

న్యాయాధికారి దుకాణదారుడను పిలిపించి "నీకు గ్రామపెద్ద గారి గుర్రం బాగా తెలుసా" అన్నాడు.

వెంటనే కొత్వాలు, "గ్రామపెద్ద గారి గుర్రం తోక చాలా పొడుగని దుకాణదారుకు మాత్రం తెలియదా?" అన్నాడు.

దుకాణదారుడు చిక్కుల్లో పడ్డాడు. అతను గుర్రం చుట్టూ ఒకసారి తిరిగి వచ్చి, "అయ్యా ఈ గుర్రాన్ని ముందు నుంచి చూస్తే గ్రామపెద్దగారిదిలాగుంది. వెనుక నుంచి చూస్తే మరి కొత్వాలుగారిదిలాగుంది," అన్నాడు.

అందరూ గొల్లున నవ్వారు. న్యాయాధికారి ఆ గుర్రం గ్రామపెద్దదేనని తీర్పు చెప్పాడు.

(చందమామ సౌజన్యంతో)

జాతీయ పుష్పం

తామర మన జాతీయ పుష్పం. దీని శాస్త్రీయ నామం నెలుంబో న్యూసిఫెరా గెయార్టిన్. బురద గుంటల్లో పెరిగినా అందంగా వికసిస్తుంది. పవిత్రత, సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.



విభిన్నం



నవ్య సకల

బైబిల్... క్రైస్తవుల పవిత్ర గ్రంథం. దీనికి శాశ్వత రూపం కల్పించాలన్నది వరంగల్‌లోని రిటైర్డ్ ఉద్యోగి **వడ్డేపల్లి గోపాల్** సంకల్పం. అనుకున్నదే తడవుగా ఆ ఆలోచనలకు ఆయన రూపం ఇచ్చారు. ఎప్పటికీ చెరిగిపోని విధంగా ఇత్తడి రేకులపై బైబిల్‌ను నిక్షిప్తం చేస్తున్నారు. దాని ప్రత్యేకతేంటో గోపాల్ మాటల్లోనే...

బైబిల్ గోపాల్!

సరిగ్గా పన్నెండేళ్ల కిందట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేశాను. ఉద్యోగ బాధ్యతల్లో ఇన్ని రోజులూ తీరిక లేకుండా గడిపిన నాకు ఒక్కసారిగా ఖాళీ దొరికే సరికి ఏంచేయాలో తోచలేదు. పలుమార్లు బైబిల్ చదివాను. అప్పుడే ఒక ఆలోచన వచ్చింది. ఈ పవిత్ర గ్రంథాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకొనేలా రూపొందిస్తే ఎలా ఉంటుందని! అలా 2010 అక్టోబర్‌లో తొలిసారిగా ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్‌పై బైబిల్ రాయడం మొదలుపెట్టాను. అలా రాసే సరికి మొత్తం 1,029 పేజీలు వచ్చింది. ఈ పుస్తకం బరువు 20 కిలోలు. మొదలు పెట్టిన ఏడాదిన్నరకు... అంటే 2012 జూన్‌లో పుస్తకం పూర్తయింది. ఆ పుస్తకంలో క్రీస్తు మాటలను ఎరుపు రంగులో, కీర్తనలను ఆకుపచ్చ రంగులో, వివరణలను నీలి రంగుతో రాశాను. కానీ నాకు అంతటితో తృప్తి అనిపించలేదు. అందుకే ఆ తరువాత 26 మంది రచయితలు రాసిన 626 క్రీస్తు కీర్తనలతో 'క్రైస్తవ కీర్తనలు' అనే గ్రంథం రాశాను.

విభిన్నం... శాశ్వతం...

వరంగల్‌లోని రంగంపేటలో నేను ఉంటున్నా. 1982లో వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరాను. రచయితగా, గాయకుడిగా, శిల్పిగా, చిత్రకారుడిగా విభిన్న కళల్లో నాకు ప్రవేశం ఉంది. అవన్నీ ఎప్పుడో అప్పుడు నా ప్రయాణంలో ఉపయోగపడుతూనే ఉంటాయి. బైబిల్ రాస్తున్న తరుణంలో ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా పవిత్ర గ్రంథాన్ని విభిన్నంగా అందించాలనుకున్నాను. అది ఎలాంటి వాతావరణం, పరిస్థితుల్లోనైనా చెక్కుచెదరకుండా ఉండాలనేది నా అభిలాష. అందుకే కలకాలం ఉండేలా ఇత్తడిని ఎంచుకున్నా. గత ఏడాది జూన్‌లో బాల్‌పాయింట్ పెన్నుతో ఇత్తడి రేకులపై బైబిల్ రాయడం మొదలుపెట్టాను. ఇప్పటి వరకు 266 పేజీలు అయ్యాయి. మరో 800 పేజీలు రాయాల్సి ఉంది. మొత్తం 1,062 పేజీల్లో ఇత్తడి బైబిల్ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాను. ఇది సుమారు 45 కిలోల బరువుంటుంది. నా శ్రమ మాట అటుంచితే, ఒక్క ఇత్తడికి రూ.60 వేలు ఖర్చయింది.

దైవ భక్తే నడిపిస్తోంది...

ఇలా చేతి రాతలో బైబిల్ రాయడం ఎందుకని కొందరు అడిగారు. దానికి నా జవాబు ఒక్కటే... క్రీస్తు ప్రేరణతోనే క్రైస్తవ సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో బైబిల్‌ను చేతి రాతతో రాస్తున్నా. గతంలో 'సంఖ్యల




ప్రాధాన్యం, యేసేబు కథతో కలవరం, నయమాను కుష్ఠు రోగి, ప్రార్థన, కృప' పుస్తకాలను రాశాను. దైవ భక్తే నన్నిలా నడిపిస్తోంది. భగవంతుడి కృప ఉంటే... మరిన్ని రూపాల్లో బైబిల్‌ను లిఖించేందుకు ప్రయత్నించాలన్నది నా ఉద్దేశం. ఈ బైబిల్‌ను చదవాలనుకొనేవారు ఎవరైనా సరే... రంగంపేటలో నా ఇంటికి రావచ్చు. వివరాలకు నా సెల్ నెంబర్ 94910 65030.

● **కక్కెర్ల అనిల్‌కుమార్‌గౌడ్,** వరంగల్ రూరల్
ఫొటోలు: సంపెట సుధాకర్‌గౌడ్

వైరల్


ఇంకో గంటలో పరీక్ష.... మెదడును తినేసే ఒత్తిడి.. రేపు ఏంటి? అనే ఆందోళన? ఒకవేళ పరీక్ష పాసైతే... ! ఫర్లేదు. కానీ పాసైనా, మంచి మార్కులు రాకపోతే? అసలు ఏకంగా ఫెయిలైపోతే? బుర్ర హీటెక్కిపోయింది అతనికి. అందుకే ప్రశ్నించాలనుకున్నాడు. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు.... ర్యాంకుల వెంట పరుగులెత్తే ఈ విద్యావిధానాన్ని ప్రశ్నించాడు. తక్షణ మార్పు వస్తుందనుకోవడం అత్యాశే. కానీ కనీసం తన బాధను వెళ్లగక్కాలనుకున్నాడు. దీని కోసం సోషల్ మీడియాను వేదికగా చేసుకొన్నాడు. ముంబయికి చెందిన విద్యార్థి చేసిన ఆ ఫేస్‌బుక్ పోస్ట్ ఇలా సాగింది...

"'త్రీ-ఇడియట్స్' సినిమా చూశాక ఈ కాలేజీల వైఖరిలో మార్పు వస్తుందని ఆశించాను. కానీ నాదంతా వట్టి భ్రమేనని అర్థం కావడానికి ఎంతో కాలం పట్టలేదు. ఇంకా మా (విద్యార్థుల) పరిస్థితి ఇంకా 'ప్రెషర్ కుక్కర్'లానే ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఒక పిల్లాడికి బ్యాట్‌మ్యాన్ కామిక్ బుక్ చదవమని చెబితే హ్యాపీగా తిరగేస్తాడు. కానీ దాని మీద పరీక్ష పెడితే మాత్రం ఆ కామిక్ బుక్ మీదే అతనికి ద్వేషం పుడుతుంది. పరీక్షలు, ర్యాంకులు ఎందుకు? మమ్మల్ని ఇంకా కుంగదీయడానికా? నేను సింగర్, డాన్సర్, ఫిలిం డైరెక్టర్ కావాలనుకుంటే నాకివి ఏ విధంగా పనికివస్తాయి? అసలు మేం నేర్చుకొనే పైథాగరస్ సిద్ధాంతం జీవితంలో ఏ సందర్భంలోనైనా ఉపయోగపడుతుందా? అసలు సైడ్స్ ఆఫ్ స్క్వేర్‌ను బలవంతంగా నేర్చుకోవాల్సిన అవసరం మాకేంటి? ఏమో మీరు అనుకున్న దారిలో కాకపోవచ్చు, మీరు ఊహించని రీతిలో మేం మంచి పేరు తెచ్చుకోవచ్చేమో! మమ్మల్నిలా వదిలేయండి. అయినా, నాకు గంటలో పరీక్ష మొదలవుతుంది. నేను వెళ్లాలి" అంటూ ముగించాడు ఆ విద్యార్థి. దీనికి కామెంట్లు పోటెత్తాయి. "మా తరం దీని గురించి చేసేదేం లేదు. ఇంక అంతా మీ యువతరం చేతుల్లోనే ఉంది" అని ఒకరు స్పందించారు. మరొకరైతే- "ఈ పరిస్థితి ప్రతి భారతీయ విద్యార్థి ఎదుర్కొనేదే" అంటూ కామెంట్ చేశారు. మొత్తానికి పరీక్షలు, మార్కుల వేటలో ఒత్తిడి పెంచుతోన్న ప్రస్తుత విద్యావ్యవస్థపై ఈ పోస్ట్ మరోసారి చాలా అంశాలను చర్చకు తెచ్చింది.





నడుము నొప్పికి నల్లతుమ్మ



- ఎండిన నల్ల తుమ్మ కాయలు, బెరడు, బంక ఈ మూడింటినీ సమంగా కలిపి చూర్ణం చేసుకుని, ఒక స్పూను మోతాదులో రోజూ రెండు పూటలా తీసుకుంటూ ఉంటే, నడుము నొప్పి తగ్గుతుంది. నడుముకు శక్తి, బలమూ కలుగుతాయి.
- పూటకు పావు కప్పు లేత నల్ల తుమ్మ ఆకుల రసాన్ని మూడు పూటలా సేవిస్తే, బహిష్టు సమయంలో వచ్చే రక్తస్రావం ఆగిపోతుంది.
- చెట్టు బెరడు కషాయాన్ని పుక్కిలించినా, లేదా ఈ చెట్టు నుంచి తీసిన చిన్న బంక ముక్కను నోట్లో ఉంచుకున్నా, నోటిలోని అల్సర్లు మానిపోతాయి.
- అర తులం బంక చూర్ణాన్ని అరకప్పు ఆవు పాలలో కలిపి రెండు పూటలా తీసుకుంటే, విరిగిన ఎముకలు త్వరగా అతుకుతాయి. నల్ల తుమ్మ చెట్టు కాయల చూర్ణం తీసుకున్నా ఇదే ప్రయోజనం కలుగుతుంది.
- గింజ పట్టని, లేత కాయలను నీడన ఎండించి చూర్ణం చేసుకోవాలి. ఆ చూర్ణానికి సమానంగా ఖండశర్కర పొడి కలిపి, పూటకు రెండు స్పూన్ల చొప్పున నీటితో సేవిస్తూ ఉంటే పలుచబడిన వీర్యం చిక్కబడుతుంది.

డైలీ సుడోకు - 139

	9	2		1			4	
7				2	5	3	9	6
		3	8				2	
6	4	9				5	8	
8	5						3	2
	3	1				4	7	9
	8				9	2		
3	7	6	2	5				4
	2			3		7	6	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 138 సమాధానం

9	4	8	7	2	5	3	6	1
7	3	6	9	1	8	4	5	2
2	5	1	3	4	6	8	9	7
3	9	2	5	7	4	6	1	8
1	8	4	2	6	3	9	7	5
6	7	5	8	9	1	2	3	4
8	2	7	1	3	9	5	4	6
4	1	9	6	5	2	7	8	3
5	6	3	4	8	7	1	2	9

ఏం ఉన్నావమ్మా?

ఎంతోమంది యువకుల కలల రాణి తమన్నా! అందానికి ఆధార్ కార్డులా... కేరాఫ్ అడ్రస్సులా... ప్రతి సినిమాలోనూ తళ తళ తెల్లగా మెరిసే మిల్కీ బ్యూటీని తమిళ సినిమా 'కన్నే కలైమానే'లో చూసినోళ్ళంతా 'ప్రియతమా... ఏం ఉన్నావమ్మా?' అంటున్నారు. అందులో వ్యంగ్యమూ... వింత అర్థమూ... రెండూ ఉన్నాయి. కావాలంటే ఒక్కసారి ఇన్‌సెట్ ఫొటో చూడండి! ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటిస్తున్న 'కన్నే కలైమానే' ఫస్ట్‌లుక్ అది! 'వాట్ ఎ ఫర్‌ఫెక్ట్ వే టు స్టార్ట్ మై డే' అని సోషల్ మీడియాలో తమన్నా పోస్ట్ చేశారు. డీ-గ్లామర్ లుక్‌లో ఆమెను చూసి ప్రేక్షకులు ఒకింత షాకయ్యారు. ఇదేమీ తొలిసారి కాదు... తమన్నా డీ-గ్లామర్ లుక్‌లో నటించడం! ప్రభుదేవా సరసన నటించిన 'అభినేత్రి'లో ఇంచుమించు ఇటువంటి లుక్‌లోనే కనిపించారు. విజయ్ సేతుపతి హీరోగా నటించిన తమిళ సినిమా 'ధర్మదురై'లోనూ ఇంతే. చీరకట్టులో మేకప్ లేకుండా కనిపించారు. ఇప్పుడీ 'కన్నే కలైమానే'! తెలుగులో ఎక్కువగా గ్లామర్ పాత్రల్లో కనిపించే తమన్నా... తమిళంలో మాత్రం ఇందుకు భిన్నమైన పాత్రలు చేస్తున్నారు.


తమన్నా



'ట్యాక్సీవాలా' ఫస్ట్ గేర్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ట్యాక్సీవాలా'. ప్రియాంక జవాల్కర్, మాళవిక నాయర్ కథానాయికలు. రాహుల్ సాంకృత్యాన్ దర్శకుడు. యు.వి క్రియేషన్స్, జీఏ2 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. శుక్రవారం 'ట్యాక్సీవాలా ఫస్ట్ గేర్' పేరుతో ఓ వీడియోను విడుదల చేశారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాను వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. త్వరలో టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

నా ఆరేళ్ల వయసులో రేప్ చేశాడు


డైసీ ఇరానీ

అనేక హిందీ, తమిళ సినిమాల్లో బాల నటిగా నటించిన డైసీ ఇరానీ తన బాల్యంలో ఎదురైన లైంగిక వేధింపులను వెల్లడించారు. ఆరేళ్ల వయసులో ఓ సినిమా షూటింగ్ కోసం మద్రాస్ వెళ్లినప్పుడు..తనకు సంరక్షకుడుగా ఉన్న వ్యక్తే తనను రేప్ చేశాడని ఆమె తెలిపారు. 'అప్పుడు నాకు ఆరేళ్లు. హమ్ పాంచీ ఏక్ దాల్ సినిమా షూటింగ్ కోసం ఓ సంరక్షకుడితో కలిసి మద్రాస్ వెళ్లాను. హోటల్ గదిలో అతను నన్ను బెల్టుతో కొట్టాడు. నన్ను రేప్ చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పుడు నేను అనుభవించిన బాధ ఇంకా గుర్తుంది' అని 60ఏళ్ల డైసీ ఇరానీ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'ఆ వ్యక్తి ఇప్పుడు లేడు. చనిపోయాడు. అతని పేరు నవాజ్. అప్పట్లో ప్రముఖ గాయకుడైన జోహ్రాభాయ్ అంబాలేవాలీకి బంధువు. ఔట్‌డోర్ షూటింగ్‌లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు నాకు గార్డియన్‌గా నవాజ్‌ను మా అమ్మ నియమించింది' అని డైసీ ఇరానీ గుర్తుచేసుకున్నారు. 'మా అమ్మ నన్ను హీరోయిన్ చేయాలనుకుంది. నన్ను స్టార్‌గా చూడాలనుకుంది.అప్పుడు నాకు 15 ఏళ్లు. నాకు చీరకట్టి, ఛాతి భాగంలో ప్యాడింగ్‌లు పెట్టి.. ఓ నిర్మాత దగ్గర వదిలిపెట్టి వెళ్లిపోయింది. సోఫాలో నా పక్కన కూర్చొన్న ఆ నిర్మాత, నన్ను తడమటం మొదలెట్టాడు. అతని బుద్ధి నాకు అర్థమైంది. వెంటనే ఆ స్పాంజ్‌లను అతని చేతిలో పెట్టాను. దీంతో అతను భయపడిపోయాడు. నన్ను నేను కాపాడుకోవడానికి అప్పుడు అంతకంటే నాకేం తోచలేదు' అని కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న వేధింపులను డైసీ ఇరానీ వివరించారు.


అల్లు అర్జున్

సారీ... లేట్ అయింది!

- దేవిశ్రీ ప్రసాద్

"సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్‌దే ఇప్పుడు హవా. లేటెస్ట్‌గా ఏది ట్రెండింగ్‌లో ఉంటే, అందులో తన హవాను చూపించడం అల్లు అర్జున్ ప్రత్యేకత. ఆ మధ్య ఆయన ఇన్‌స్టాలో దేవిశ్రీ ప్రసాద్ గురించి ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. దేవిశ్రీప్రసాద్ ఫొటోను పోస్ట్ చేసి 'ఏం వాయిస్తున్నావన్నది కాదు (వాయిద్యాల కూర్పు కాదు), ఏం వినిపిస్తున్నావన్నదే సంగీతం" అని రాశారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం విన్నాక ఈ వాక్యాన్ని తాను సృష్టించినట్టు కూడా అందులో తెలిపారు. ఈ ఫొటోను తాజాగా దేవిశ్రీ చూసి స్పందించారు. లవ్లీ పోస్ట్ పెట్టినందుకు అల్లు అర్జున్‌కి థాంక్స్ చెప్పారు. బన్నీ పెట్టిన పోస్ట్‌ను కాస్త ఆలస్యంగా చూసినందుకు క్షమాపణలు చెప్పారు. 'హా స్వీట్ ఆఫ్ యు బన్నీ భాయ్' అని కూడా అందులో రాశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పాటలన్నీ ప్రేక్షకాదరణ పొందినవే కావడం విశేషం.


మేలో ముహూర్తం!

ప్రతి సినిమాలోనూ పాత్రకు తగ్గట్టు కొత్తగా కనిపించాలని ప్రయత్నించే హీరోల్లో మంచు మనోజ్ ఒకరు. త్వరలో ప్రారంభం కానున్న కొత్త సినిమాలో సరికొత్తగా కనిపించడానికి ప్రస్తుతం ఆయన కసరత్తులు చేస్తున్నారు. 'ఒక్కడు మిగిలాడు' తర్వాత చిన్న విరామం తీసుకున్న ఈ యువ హీరో, ఇప్పుడు కొత్త సినిమా కథా చర్చల్లో ఉన్నారు. చందూ అనే యువకుణ్ణి దర్శకుడిగా పరిచయం చేస్తూ, మనోజ్ హీరోగా నటించబోయే ఈ సినిమా మే నెలలో ప్రారంభం కానుందని తెలుస్తోంది. పూజా కార్యక్రమాలతో పాటు రెగ్యులర్ షూటింగ్ కూడా అదే నెలలో ప్రారంభించాలని అనుకుంటున్నారట! 'ఒక్కడు మిగిలాడు'లో కెప్టెన్ పాత్ర కోసం బరువు పెరిగిన మనోజ్, ఈలోపు కొత్త మేకోవర్‌లోకి వచ్చేస్తారట!


మంచు మనోజ్

ఆలియాభట్‌కు గాయాలు...

బాలీవుడ్ బ్యూటీ ఆలియాభట్‌కు గాయాలయ్యాయి. తాజాగా ఆమె అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ సరసన 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నటిస్తోంది. నలభై రోజుల క్రితం బల్గేరియాలో చిత్రీకరణ ప్రారంభమైంది. అక్కడ సినిమాకు అత్యంత కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెకిస్తున్నారు. ఓ స్టంట్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో అలియా భుజానికి, మణికట్టుకి గాయమైందట. అయినప్పటపికీ అలియా కట్టు కట్టుకుని షూటింగ్‌కి వచ్చిందట. భుజానికి బలమైన గాయం కావడంతో వైద్యులు నాలుగు వారాలు బెడ్‌రెస్ట్ తీసుకోమన్నారని చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. తనకెంతో ఇష్టమైన బల్గేరియాలో షూటింగ్ అనగానే ఎగిరి గంతేసింది ఆలియా. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో బయలుదేరినప్పటి నుంచీ బల్గేరియా చేరుకునే వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేసిన విషయం తెలిసిందే. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.


ఆలియాభట్

జీనత్ అమన్ ఆరోపణ... అరెస్టు


జీనత్ అమన్

సినీ తారలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయి. బాలీవుడ్ నాటితరం నటి జీనత్ అమన్ చేసిన ఫిర్యాదుతో సర్ఫరాజ్ అలియాస్ అమన్ ఖన్నా అనే వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఆస్తి ఒప్పందానికి సంబంధించి రూ.15.40 కోట్లు మోసం చేయడమే కాకుండా, తనపై అత్యాచారం చేశాడని సర్ఫరాజ్‌పై ఆమె ఆరోపించారు. 'జీనత్ అమన్ గురువారం రాత్రి జుహూ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టాం. కేసును క్రైం బ్రాంచ్‌కు అప్పగించాం. దర్యాప్తు కొనసాగుతుంది' అని డీసీపీ క్రైం నిసార్ తంబోలి తెలిపారు. తన వెంటపడి వేధిస్తున్నాడంటూ ఈ ఏడాది జనవరిలో కూడా జీనత్ సర్ఫరాజ్‌పై ఓ కేసు పెట్టారు. ఆ కేసులో అరెస్టైన ఆయన నెలరోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. తాజాగా జీనత్ సర్ఫరాజ్‌పై రేప్, చీటింగ్ ఆరోపణలు చేశారు.

'ప్రశ్నిస్తా'రట!



"'ప్రశ్నిస్తా' అనే పదంలోనే ఎన్నెన్నో అర్థాలున్నాయి. మా సినిమాలో ఎవరు ఎవరిని ప్రశ్నిస్తారు? ఏమని ప్రశ్నిస్తారు? అసలు ప్రశ్నించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? వంటి అంశాలు కీలకం" అని అంటున్నారు రాజా వన్నెంరెడ్డి. ఆయన దర్శకత్వం వహిస్తోన్న 'ప్రశ్నిస్తా' ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి 'జెమిని' కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. బాబి క్లాప్‌కొట్టారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత సత్యారెడ్డి మాట్లాడుతూ "మా అబ్బాయిని హీరోగా పెట్టి చేస్తున్న చిత్రమిది. కమర్షియల్ హంగులన్నీ ఉంటాయి. సందేశం ఉంటుంది. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. ఒక పది రోజులు గ్యాప్ తర్వాత మరో షెడ్యూల్ చేస్తాం. ఆ తర్వాత ఫారిన్‌లో ఔట్‌డోర్‌లో చిత్రీకరిస్తాం" అని అన్నారు. ఐదు పాటలుంటాయని సంగీత దర్శకుడు ప్రేమ్ తెలిపారు. మంచి పాత్రల్లో నటిస్తున్నట్టు హీరో మనీష్‌బాబు, నాయిక అక్షిత తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: బి.శేషుబాబు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సతీష్ రెడ్డి, సహ నిర్మాతలు: కె.నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి.

వినోదం అప్పుడు.. ఇప్పుడు!


సుజన్, తనిష్క్

సుజన్, తనిష్క్ జంటగా యు.కె. ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న 'అప్పుడు-ఇప్పుడు' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. చలపతి పువ్వుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఉషారాణి కనుమూరి, విజయరామకృష్ణంరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఇటీవల విడుదల చేశారు. ఫీల్‌గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. శివాజీరాజా, పేరుపురెడ్డి శ్రీనివాస్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కల్యాణ్ సమి, సంగీతం: పద్మానావ్ భరద్వాజ్.

దెయ్యంగా భూమిక?



రీ ఎంట్రీలోనూ భూమికకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. కథానాయికగా అగ్రహీరోలు అందరి సరసనా ఆడిపాడిన నటి భూమిక. యోగా గురువు భరత్ ఠాకూర్‌ని వివాహం చేసుకుని, ఓ బిడ్డకు తల్లయ్యాక కొన్నాళ్లు తెలుగు తెరకు దూరమయ్యారు. గతేడాది నాని నటించిన 'ఎంసీఏ'తో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చారు భూమిక. ఆ సినిమాలో ఆమెకు చాలా మంచి పేరు వచ్చింది. "భరత్‌ఠాకూర్ నాకు అన్నవుతారో లేదో తెలియదు కానీ, భూమిక మాత్రం వదిన అవుతుంది" అని నాని కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ సినిమా తర్వాత భూమిక ఇప్పుడు మరో సినిమాకు సంతకం చేశారు. కన్నడ నుంచి తెలుగులోకి రీమేక్ అవుతోన్న 'యూటర్న్'లో ఆమె దెయ్యం పాత్రను అంగీకరించినట్టు సమాచారం. సమంత కీలక పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. కన్నడ దర్శకుడు పవన్‌కుమార్ తెలుగులోనూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.